సింధు నాగరికత

సి.వి.

Bharat P.
21st Jan'2011

సింధు నాగరికత

సి. వి.

ప్రగతి సాహితి సమితి

విజయవాడ

ప్రథమ ముద్రణ
1982 జనవరి

కవర్ పేజీ :
శ్రీ సారథి, విజయవాడ-4

బైండింగ్ :
శ్రీ దీనదయాళు బైండింగ్ వర్క్స్,
విజయవాడ-2.

ముద్రణ :
నవోదయ ఆర్ట్ ప్రింటర్స్
పూర్ణానందం పేట, విజయవాడ-3.

దేశ చరిత్రలు

ఏ దేశ చరిత్ర చూచినా
ఏమున్నది గర్వ కారణం ?
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం.

నైలునదీ నాగరికతలో
సామాన్యుని జీవన వెట్టిది ?
తాజమహల్ నిర్మాణానికి
రాళ్ళెత్తిన కూలీ లెవ్వరు ?

సామ్రాజ్యపు దండయాత్రలో
సామాన్యుల సాహస వెట్టిది ?
ప్రభువెక్కిన పల్లకి కాదోయ్
అది మోసిన బోయీ లెవ్వరు ?

తక్షశిలా, పాటలిపుత్రం,
మధ్యధరా సముద్రతీరం,
హరప్పా–మొహెంజొదారో
క్రో–మాన్యోన్ గుహా ముఖాల్లో

చారిత్రక విభాత సంధ్యల
మానవకథ వికాస వెట్టిది ?
ఏ దేశం ఏ కాలంలో
సాధించిన దే పరమార్థం ?

ఇతిహాసపు చీకటికోణం
అట్టడుగున పడి కాన్పించని
కథలన్నీ కావాలిప్పుడు ;
దాచేస్తే దాగని సత్యం.

(మహాకవి శ్రీశ్రీ – మహాప్రస్థానం)

విషయ సూచిక

ముందు మాట	5
1. సింధు నాగరికత	13
2. ఈజిప్టు నాగరికత	42
3. మెసపొటేమియా నాగరికత	67
4. ఇష్టార్ దేవత	90
5. ఊర్వశి	101
6. సింధు - ఈజిప్టు - మెసపొటేమియా నాగరికతలు	119
7. ఆర్య - ద్రావిడ మతాల కలయిక	125
8. భారతీయ జీవితంపై సింధు నాగరికత ప్రభావం	133

ముందు మాట

"ఏ యుద్ధం ఎందుకు జరిగెనో ?
ఏ రాజ్యం ఎన్నాళ్ళుందో ?
తారీఖులు దస్తావేజులు
ఇవి కావోయ్ చరిత్ర కర్థం."
"ఈ రాణీ ప్రేమ పురాణం
ఆ ముట్టడికైన ఖర్చులూ
మతలబులూ కైఫీయతులూ
ఇవి కావోయ్ చరిత్రసారం."

(మహాకవి శ్రీశ్రీ - మహాప్రస్థానం)

భారతీయ చరిత్రకారులు మనప్రజల వాస్తవమైన చరిత్రను నిర్మించడానికీ, చరిత్ర కందని కాలం నించి మన ప్రజల పురోగమన ప్రవాహాన్ని ఊహించడానికీ చేసిన ప్రయత్నాలు, నేటివరకూ మన చరిత్రను గందరగోళపరిచి గజిబిజి చేశాయి. అసంఖ్యాకమైన రాజుల- రాణుల - వారి జనన మరణాల- వారి ఆశ దురాశల- వారి జయాపజయాల ఎడారిలో, ఈ చరిత్ర పండితులు దారి తప్పిపోయారు.

1

చరిత్రను శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించే విధానం ఏది ? మార్క్స్-ఎంగెల్స్‌లు సామాజిక అభివృద్ధి క్రమాన్ని, శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించి, చారిత్రక పరిణామ సూత్రాల్ని కనిపెట్టారు. గతితార్కిక భౌతికవాద సూత్రాలు ఆధారంగా, మానవ చరిత్రను వివరించారు. అదే చారిత్రక భౌతికవాదం.

ఈ చారిత్రక భౌతికవాదం ప్రకారం - సామాజిక పరిణామమూ, మానవుని జీవిత పరిస్థితులూ, ఆయా వ్యక్తుల యొక్క మంచి చెడు అభిప్రాయాల మీద గానీ,

వీరులూ అవతార పురుషులూ యిత్యాది వారి మీద గానీ ఆధారపడి వుండేవి కావు. భౌగోళిక పరిసరాల మీద గానీ, భగవదేచ్ఛ మీద గానీ ఆధారపడి వుండేవి గావు. చరిత్ర గమనం, శాశ్వతంగా యిలా నడవాలని నిర్ణయింపబడిన నడక వంటిదీ గాదు.

భౌతిక ప్రకృతి నించి పరిణామసిద్ధంగా వొచ్చినవాడు - మానవుడు ఆతడు తన బతుకు దెరువు కోసమూ, తిండి బట్ట యిల్లూ మొదలైన వాటి కోసమూ ప్రకృతిపై పోరాడాలి. అదే ఆతని ప్రాథమికమైన కృషి. ఈ కృషిలో ఆతడు ఉపయోగించే పరికరాలూ, ఆతడు అభివృద్ధిజేసే ఉత్పత్తి సాధనాలూ, ఆతని ఆస్తిత్వాన్ని ప్రధానంగా నిర్ణయిస్తాయి.

మానవుడు సామాజిక వ్యక్తిగా జన్మించాడు. ఆతనికీ తోటిమానవులకీ మధ్య వుండే సంబంధాలు, ప్రధానంగా ఉత్పత్తి శక్తులపై ఆధారపడి వుంటాయి. ఇవే-ఉత్పత్తి సంబంధాలు.

వొక దశ లోని ఉత్పత్తి సంబంధాలకీ సమాజానికీ, మరొక దశ లోని ఉత్పత్తి సంబంధాలకీ సమాజానికీ గల భేదం గూడా, ఉత్పత్తి విధానాన్ని బట్టే ఏర్పడుతుంది. అంతేగాదు ; సమాజం యొక్క రాజకీయ సాంఘిక నైతిక తాత్విక సాంస్కృతిక కళావిషయక సిద్ధాంత రూపాలన్నీ, ఉత్పత్తి విధానాన్ని బట్టే వుంటాయి. వొకసారి పుట్టిన తర్వాత, వీటికి మూలమైన ఉత్పత్తి శక్తులపై, యీ రూపాలు తప్పక పనిచేస్తాయి. వీటికి వొక స్వతంత్రమైన పాత్రా, విలువ గూడా వున్నాయి.

ఆదిమ కమ్యూనిస్టు వ్యవస్థ, బానిస వ్యవస్థ, సోషలిస్టు వ్యవస్థ - యివి-అయిదూ మానవ చరిత్ర చూచిన ప్రధానమైన ఉత్పత్తి సంబంధాల దశలు. మానవుడు జీవితంలో ఆలోచనలో, వొక దశ నించి దాని అనంతర దశయైన మరో ఉన్నత దశకు పరిణామం చెందాడు ; పురోగమించాడు.

"ఆదిమ కమ్యూనిస్టు సమాజంలో, వర్గ విభజన లేదు. ప్రైవేటు ఆస్తి లేదు. వర్గకలహాలు లేవు. ధనిక-దరిద్ర వ్యత్యాసాలు లేవు. రాజులు లేరు. రాజ్యాంగ యంత్రమూ లేదు. తెగలకూ తెగలకూ మధ్య, పరస్పర యుద్ధాలు మాత్రముండేవి. ఉత్పత్తి పరికరాలు వృద్ధి చెందడంతో, సొంత ఆస్తి - వర్గ విభజనా అమల్లోకి వొచ్చాయి. నాటి నించి జరిగిన చరిత్ర అంతా-వర్గ కలహాల చరిత్రయే. ఈ వర్గకలహ చరిత్రా క్రమంలోనే, బానిస సమాజమూ, ఫ్యూడల్ సమాజమూ, పెట్టుబడిదారీ సమాజమూ, సోషలిస్టు సమాజమూ అమల్లోకి వొచ్చాయి."

(డాంగే - భారతదేశం - పేజి 29-31)

ఉత్పత్తి పరికరాలు వృద్ధిచెందడంచేత, శ్రమవిభజన అవసరమైంది. దానివల్ల పైపేటు ఆస్తి, దానితోపాటు వర్గ విభజనా అమల్లో కొచ్చాయి. పీడకులు తమ వర్గ ప్రయోజనాల్ని కాపాడుకొనేందుకూ, పీడితుల్ని నిష్కరమైన నిరంకుశాధికారంతో అణిచివేసేందుకూ తేబడిన సాధనమే – వర్గ రాజ్యాంగయంత్రం (Class State). స్థూలంగా యిదీ– మార్క్సిజం ప్రతిపాదించే చారిత్రక భౌతికవాదం. మార్క్సియన్ చారిత్రక భౌతికవాదం మూసలో మన చరిత్రను కరగబోసి, యురపియన్ సాంఘిక వ్యవస్థ యొక్క ప్రతిరూపంగా– కార్బన్ కాపీగా– తయారుచేయడం మన ఉద్దేశం కాదు ; కాకూడదు.

మార్క్సియన్ గతితర్కం ప్రతిపాదించే వర్గ విశ్లేషణను (Class analysis) ఆధారం జేసకొని, మానవ సమాజ పరిణామ క్రమాన్ని పరిశీలిస్తే, శాస్త్రీయ దృక్పథంతో చారిత్రక సత్యాల్ని వెలికి తీయవచ్చుననే ఉద్దేశంతోనే, మనం చారిత్రక భౌతికవాదంపై ఆధారపడుతున్నాం. అంతేగాని, యితరులు భావిస్తున్నట్లు, మత దురహంకారులు ఆరోపిస్తున్నట్లు, యిందులో భారతీయమూ – అభారతీయమూ– దేశీయమూ– విదేశీయమూ– అనే దానికి స్థానమే లేదు.

సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకుడూ పండితుడైన శ్రీ ఆర్. యస్. శర్మ రాసిన "Ancient India" గ్రంధంపై వ్యాఖ్యానిస్తో, "బ్రిటిష్‌వారు వదిలిపోగానే, ఈ దేశాన్ని రష్యన్ సామ్రాజ్యవాదానికి బానిసను చేయాలని తలపెట్టిన చరిత్రహీనులు, వివిధ సామాజిక జీవితరంగాలను ఆక్రమించేసుకొని, వాటి సన్నిటినీ తమ మత మౌఢ్యంతో నింపాలనే ప్రయత్నం జేశారు" అని 1978 జులై 28 నాటి జాగృతి పత్రిక రాసింది. నరనరానా మత మౌఢ్యం జీర్ణించిన ఇలాంటి మతిమాలిన కూతలకీ రాతలకీ జవాబు చెప్పడం, వీటికి విలువ నివ్వడమే కాగలదు.

2

మన హైస్కూళ్లు – కాలేజి – యూనివర్సిటీల్లో చరిత్రను బోధించే ఉపాధ్యాయులు, విద్యార్థులకు విచిత్రమూ హాస్యాస్పదమూ అవాస్తవికమూ అర్థరహితమైన పద్ధతిలో చరిత్రను బోధిస్తుంటారు. మహాత్మ్యుల – వీర పురుషుల – రాజుల– చక్రవర్తుల– వారి సేనానుల– కార్యకలాపాలే, దేశ చరిత్ర అనే అర్థమొచ్చేట్లు వీరు

చరిత్రను బోధిస్తోంటారు. అదే పద్ధతిలో నేటికీ చరిత్ర రచన జరుగుతోంది. శాస్త్రీయ సోషలిజం ప్రతిపాదించే వర్గదృక్పథం లోపించినందువల్లనే, ఈ సంకుచిత దృష్టి, ఈ తప్పుడు అవగాహన కలగడానికి దోహతిస్తోంది. అంచేత, చరిత్ర రచనకీ చరిత్ర అధ్యయనానికీ శాస్త్రీయ దృక్పథం ఎంతో అవసరం.

బూర్జువా చరిత్రకారులచే ఒకనాడు మహావీరులుగా పరిగణింపబడ్డ - సీజర్-నెపోలియన్లూ, సముద్రగుప్తుడూ-శ్రీకృష్ణదేవరాయలూ-వర్గదృష్టితో చూస్తే, మానవ స్వాతంత్ర్యాన్ని కబళించేందుకు సిద్ధపడ్డ నరహంతకులుగా - పచ్చి దురాక్రమణ దార్లుగా - మనకు కన్పిస్తారు. అలాగే మన్యం ప్రజల దృష్టిలో, సీతారామరాజు మహావీరుడు ; విప్లవనాయకుడు. కాని బ్రిటిష్ సామ్రాజ్యవాద చరిత్రకారుల కథనం ప్రకారం, ఆతడు బందిపోటు- గజదొంగ ! అలాగే భగత్ సింగ్- రాజ్‌గురు- మన దృష్టిలో మాతృదేశ స్వాతంత్ర్య సముపార్జన కోసం, ఆంగ్ల సామ్రాజ్య వాదులతో పోరాడి, ప్రాణాల్ని తృణప్రాయంగా బలిపెట్టిన నిష్కలంక దేశభక్తులు. వీరాగ్రగణ్యులు. కాని బ్రిటిష్‌వారి దృష్టిలో, వారు శాంతి భద్రతల్ని సర్వనాశనం జేసేందుకుపక్రమించిన పచ్చి గూండాలు - రౌడీలు - సంఘ వ్యతిరేక శక్తులు. ఎన్నో లక్షల రూపాయలు వెచ్చించి, మరెన్నో లక్షల మంది శిల్పులూ కార్మికులూ పాల్గొనగా, ఎన్నో ఏళ్ళ పాటు, తన భార్య-ముంటాజ్ బేగం-స్మృత చిహ్నంగా - టాజ్ మహల్‌ను నిర్మించిన షాజహాన్ చక్రవర్తి, బూర్జువా చరిత్రకారుల దృష్టిలో అద్వితీయమైన శిల్ప నిర్మాత-కళాపోషకుడు! అయితే ఆతడు మన దృష్టిలో, 20 ఏళ్ళ పాటు మొగల్ సామ్రాజ్యం లోని అశేష ప్రజల్ని కరువు కాటకాలకీ, ఆకలి చావులకీ, అకాల మరణాలకీ గురిజేసిన సజీవ పిశాచం! అంచేత, చరిత్రనీ చారిత్రక సంఘటనల్నీ వాస్తవ దృష్టితో, వర్గ దృక్పథంతో పరిశీలించి అధ్యయనం జేసి అవగాహన చేసుకొన్నప్పుడు, మనకు కొత్త సత్యాలు కన్పించి, కొత్త కాంతులు వెదజల్లబడ్డం జరుగుతుంది.

ఈ విధమైన శాస్త్రీయ దృష్టితో చరిత్ర రచన చేయడం, దాదాపు పాతికేళ్ళ క్రితమే మన దేశంలో ప్రారంభమైంది. ఈ రకమైన చరిత్ర రచనకు నాంది పల్కిన వాడు-శ్రీ డాంగే. శ్రీయుతులు కొశాంబి, ఆర్. యస్. శర్మ, నూరుల్ హసన్, రోమిలా థాపర్ లాంటివారు ఈ కృషిని అత్యంత జయప్రదంగా కొనసాగిస్తోన్నారు. అలాగే ఆంధ్రదేశంలో 1953లో "ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర" రాసిన శ్రీ ఏటుకూరి బలరామమూర్తి, ఈమధ్యనే "ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి" అనే

పేరిట ఆంగ్లంలో ఒక అమూల్యమైన గ్రంధాన్ని రచించిన శ్రీ కంభంపాటి సత్య నారాయణ, ఈ శాస్త్రీయ ధోరణిలో, చరిత్ర రచనకి ఉపక్రమించడం ముదావహం. "ఆంధ్రుల సాంఘిక చరిత్ర"ను రచించిన శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారు వర్గ దృక్పధంతో గాకపోయినా, ఎన్నో ఏళ్ళు శ్రమించి ఆంధ్రుల సాంఘిక రాజకీయ ఆర్థిక నైతిక జీవితానికి చెందిన అమూల్యమైన సమాచారం సేకరించి, అత్యంత ప్రతిభావంతంగా ఆంధ్రుల చరిత్రకి ఆద్దంపట్టారని అనడం ఏమాత్రం అతిశయోక్తి గాదు.

ఏ కాలంలో ఏ సమాజం ఎటువంటి ఆర్థిక వ్యవస్థను కలిగి వుండేది? ఆ చారిత్రక దశకి చెందిన సంఘంలో, జీవన పరిస్థితులు ఏ విధంగా వుండేవి? ఏ దోపిడీ వ్యవస్థకి నాటి సామాన్యుడు బలి అయ్యాడు? శాస్త్రీయమైన ఈనూత్న దృక్పధంతో నూత్నమైన భాష్యం చెబుతూ, చరిత్రను పునర్ నిర్మించాలి. చరిత్ర రచన జరగాలి. శాస్త్రీయ దృష్టితో చరిత్ర పునర్ నిర్మింపబడవలసిన సమయం నేడు ఆసన్నమైంది. ఈ మహోన్నత ఆశయం నేరవేరడమనేది– మన యువ చరిత్రకారులపై, పరిశోధనా రీతులపై ప్రధానంగా ఆధారపడివుంది.

నాల్గు కాళ్ళ జంతువు, రెండు కాళ్ళ మానవుడుగా పరిణామం జెందడానికి ఎన్నో లక్షల సంవత్సరాలు పట్టింది. మానవ చరిత్ర అనేక వేల సంవత్సరాల క్రితం ప్రారంభమైంది. ఆనాడు భూమిపై నగరాలు లేవు. గ్రామాలు లేవు. పశు పెంపకం లేదు. వ్యవసాయం లేదు. నాగరికత లేదు. సంస్కృతి లేదు. చరిత్రకి పూర్వమున్న ఆదిమ మానవులు, చిన్నచిన్న ముఠాలుగా తండాలుగా అడవుల వెంట, కొండకోనల వెంట తిరుగుతుండేవారు. వారికి తింటానికి కూడూ, ఉంటానికి గూడూ లేవు. చలిబాధ నించి తప్పించుకొనేందుకు జంతుచర్మాలు మాత్రం కప్పుకొనే వారు. వారి చేతుల్లో కర్రలూ రాళ్ళూ తప్ప మరేవీ వుండేవి గావు. ఈ ఆదిమ మానవుల శ్రమశక్తి, భూమండలాన్ని ఏవిధంగా మార్చివేసిందో, వారి జీవితవిధానం క్రమేణా ఏవిధంగా పరిణామం చెందుతూ వొచ్చిందో, ఆ జీవనవిధానం నేటి దశకి ఏవిధంగా జేరిందో, యిత్యాది వివరాల్ని శాస్త్రీయ పద్ధతిలో చరిత్ర వివరిస్తుంది.

చరిత్ర– రాజుల చక్రవర్తుల దండయాత్రల జాబితాగాదు. రకరకాల రాణుల, రాజులయొక్క ఉంపుడుకత్తెల ప్రేమపురాణాల్ని వివరించే గాథా కాదు. చరిత్ర– ఊహాగానమూ కాదు. అది – తరతరాల మానవాళి జీవితానికి చెందిన శాస్త్రం.

ప్రాచీనకాలం నాటి ప్రజల జీవిత విధానాల్ని గూర్చి, చరిత్రకారులూ శాస్త్రవేత్తలూ శోధించి సాధించిన సత్యమే–మానవచరిత్ర. ఈ చరిత్ర– దరిద్రుల్ని ధనికులు ఏ విధంగా యుగయుగాలుగా కాల్చుక తిన్నారో వివరిస్తుంది.

అయితే, పది లక్షల ఏళ్ళ క్రితం ప్రారంభమైన మానవకథ గూర్చి, చరిత్రకారుల కేవిధంగా తెలుస్తుంది? చరిత్ర పేరిట వీరు చెప్పేది, కట్టుకథ పుక్కిటి పురాణం ఊహాగానమేనని, కొందరు తిక్కశంకరయ్యలు బుకాయించవొచ్చు. కాని అత్యంత ప్రాచీన కాలంలో సంభవించిన ఘటనలు గూర్చి తెలుసుకోవడానికి, మనకు కొన్ని పద్ధతులూ, కొన్ని ఆధారాలూ వున్నాయి. ఎన్నో లక్షల ఏళ్ళ క్రితం జీవించిన ఆదిమ మానవులు, తాము చేసి, ఉపయోగించిన ఎన్నో వస్తువుల్ని వారు విడిచి వెళ్ళారు. వీటినే పురాతత్వ శాస్త్రవేత్తలు "భౌతిక అవశేషాలు" అని పిలుస్తారు. ఆదిమ మానవులు, తమ వారి శవాలతోపాటు, తాము వాడిన వివిధ వస్తువుల్ని సైతం సమాధుల్లో పాతిపెట్టారు. (తమిళనాడు లోని ఆదిచ్చవల్లూర్ యిత్యాది స్థలాల్లో అత్యంత ప్రాచీన మానవుల సమాధులున్నాయి.) ఈ ఆదిమ మానవులు జీవించిన ప్రదేశాన్ని కనుగొన్న శాస్త్రవేత్తలు, ఆయా స్థలాల్లో తవ్వకాలు సాగించి పరిశోధనలు జేస్తారు. భూమిలోంచి బయటికి తీసిన ఈ వస్తువుల్ని పరిశీలించడం ద్వారా, ఆయా ప్రదేశాల్లోని ప్రజలు ఏవిధంగా జీవించారు – వారు ఏఏ వృత్తుల్ని చేపట్టారు – ఏఏ వస్తువుల్ని చేయగలిగారు– యిత్యాది అంశాల్ని శాస్త్రవేత్తలు నిర్ణయిస్తారు. ప్రాచీనకాలంలో చేయబడిన ఈ వస్తువుల్ని, అనంతరకాలంలో చేయబడిన వస్తువులతో పోల్చి చూచి, కాలం గడిచేకొద్దీ ఈ ప్రాచీన మానవుల జీవితవిధానం, ఏరకంగా మార్పుచెందుతూ వొచ్చిందో సోదాహరణంగా వివరిస్తారు. అంచేత, ఆదిమ మానవులచే ఉత్పత్తి చేయబడ్డ వస్తుసామగ్రిని, "భౌతిక అవశేషాలు" అని పురాతత్వ శాస్త్రవేత్తలు పిలిచారు. ఈ అవశేషాల్ని చరిత్ర అధ్యయనంకోసం, మ్యూజియమ్స్‌లో చాలా జాగ్రత్తగా భద్రపరుస్తారు. ఈ భౌతిక అవశేషాల్ని ప్రాతిపదికగా తీసుకొని, ప్రాచీన మానవుల జీవితాన్ని గూర్చి అధ్యయనం జేసే శాస్త్రాన్ని, పురాతత్వ శాస్త్రమని పిలుస్తారు.

దాదాపు 5500 సంవత్సరాల క్రితం, వివిధదేశాల్లో జీవించిన విభిన్నప్రజలు, లిపి సంకేతాల్ని కనుగొని రాయడం నేర్చుకొన్నారు. ఆనాటి వారు సమకాలీన సంఘటనల్నీ, తమకాలం నాటి వారినీ గూర్చి వర్ణించారు. లిపి లేని వారికన్న, లిపి సంకేతాలున్న వారే అసాధారణమైన సమాచారం అందజేశారు. వీటిని పురాతత్వ

శాస్త్రవేత్తలు, రాతపూర్వకమైన అవశేషాలు- అని పిలిచారు. ఈ విధంగా అత్యంత ప్రాచీన కాలానికి చెందిన వివిధ వస్తుసామగ్రిని ఆధారం జేసుకొని, శాస్త్రీయ ప్రాతిపదికపై నిర్మించే శాస్త్రమే- చరిత్ర.

3

శ్రీ డాంగే ఆదిమ కమ్యూనిజాన్ని, సింధు నాగరికతకి చెందిన ప్రజలతో ప్రారంభించక, అనంతరదశకి జెందిన వైదికార్యులతో ప్రారంభించాడు. వాస్తవానికి భారత చరిత్రలో ఆదిమ గణసమాజ వ్యవస్థ, సింధుప్రజలతో ప్రారంభం గావాలి గాని, వారి తర్వాత ఇండియాకి వలస వచ్చిన వైదికార్యులతో ప్రారంభం కారాదు. అయితే శ్రీ డాంగే యీ విషయం గూర్చి యిలా అన్నాడు :

"వైదిక సాహిత్యంలో మనకు కన్పించేవారు. ఆర్యజాతి అని పిలువబడుతున్న ఒక ప్రత్యేకజాతికి చెందిన వారేనా ? వారు ఇతర ప్రజలపై దండెత్తితుండే వారా ? అయితే ఆ ఇతర ప్రజలెవ్వరు ?"

"బయటనుంచి వచ్చిన ఆర్యులు భారతదేశ మంతటా అప్పటివరకూ నివసిస్తున్న ద్రావిడులపై దండెత్తి, ఓడించి, దక్షిణాదికి తరిమికొట్టారని యురపియన్ చరిత్రకారులు అంటారు. ఈ విషయం అంత తేలికగా తేల్చదగినది కాదని నేను అనుకొంటున్నాను. "విదేశ ఆర్యులు" రాకపూర్వం, భారతదేశాన్నంతటినీ ద్రావిడులు ఆక్రమించుకొని వున్నారా అనే సమస్య మనకింకా తేలనేలేదు. మొహంజదారో-హరప్పా నాగరికత, ద్రావిడులకు చెందినదేనా ? ఆర్యులు దండెత్తివచ్చి, ఆ నాగరికతను నాశనం చేశారని చెప్పగలమా ? యిత్యాది ప్రశ్నలకు నేటికీ సరియైన సమాధానం దొరకడం లేదు."

"ద్రావిడులకు పూర్వం ముండా-మన్‌ఖ్మేర్ ప్రజలు నివసిస్తుండేవారనీ, తర్వాత ద్రావిడులు వచ్చి, వారిని తూర్పు దిక్కుకు తరిమివేశారనీ చెప్పబడుతోంది. నామటుకు నాకు, యీ విషయాలపై యిప్పటివరకూ ఎలాంటి నిర్దిష్టమైన అభిప్రాయాలు ఏర్పడలేదు," అని శ్రీ డాంగే అన్నారు. (భారతదేశం- ఆదిమ కమ్యూనిజం నుండి బానిస సమాజం వరకు- మూడవ ముద్రణకు పీఠిక -పేజి-9నుండి 10.)

భారతదేశం లోనికి ఆర్యులు ప్రవేశించక పూర్వం, ఇక్కడ వున్న ప్రజ లెవ్వరు? సింధు నాగరికతను సృష్టించినవారు ద్రావిడులేనా? ఇత్యాది మౌలికమైన ప్రశ్నల్ని ఈరచనలో చర్చించడానికి ప్రయత్నించాను.

ఆర్యుల రాకతోనే భారతదేశ చరిత్ర ప్రారంభమైంది - అనే గుడ్డి నమ్మకం చరిత్రకారుల్లో ఒకప్పుడు వుండేది. కాని 1922లో మొహెంజొదారో - హరప్పా - శిధిలాలు బయటపడ్డంతో, ఈ అంధవిశ్వాసం పటాపంచలైంది. మధ్యాసియా నించి ఆర్యుల రాకకి రెండువేల సంవత్సరాలకి పూర్వమే - అంటే - నేటికి - అయిదువేల సంవత్సరాల క్రితమే - సింధులోయలో మహోన్నతమైన నాగరికత వెలసి విలసిల్లిం దనే చారిత్రక సత్యాన్ని అంతా అంగీకరించారు.

మానవ చరిత్రలో అత్యంత ప్రాచీనమైన నాగరికతలు నాలుగున్నాయి. 1. ఈజిప్ట్ నాగరికత. 2. చైనా (హోవాంగ్‌హోనా లోయ) నాగరికత. 3. మెసపొటేమియా నాగరికత. 4. సింధు నాగరికత. మన చరిత్రలో అత్యంత ప్రాచీనమూ, వర్తమాన భారతీయ నాగరికతకు మూలమైన సింధు నాగరికతను, శాస్త్రీయ దృక్ప థంతో వివరించే ఈ గ్రంధాన్ని ఆంధ్ర పాఠకులు ఆదరిస్తారని విశ్వసిస్తోన్నాను.

10-10-78

సి. వి.

1. సింధు నాగరికత

మానవ నాగరికతా వికాసానికి, నదీ లోయలు ఎంతగానో దోహదంజేశాయి. ఈ సూత్రీకరణకు సింధులోయ, ఏమాత్రం మినహాయింపుగాదు. సింధురాష్ట్రంలోని మొహెంజొదారో, పంజాబ్‌లోని హరప్పావద్ద, క్రీ. శ. 1922లో, భారత చరిత్రకి చెందిన అత్యంత ప్రాచీనమైన శిధిలాలు బయల్పడ్డాయి. గత 50 సంవత్సరాలుగా జరుగుతోన్న పరిశోధనల ఫలితంగా, ఈ నాగరికత సింధులోయకు మాత్రమే పరిమితం గాదనీ, ఉత్తరప్రదేశ్‌లోని రూపర్‌నించి అరేబియా సముద్ర తీరానున్న సుత్కాజందోర్ వరకూ, తూర్పున యమునానదీ ప్రాంతంలోని ఉఛ్‌లిన దాకా, దక్షిణాన గుజరాత్‌లోని లోధాల్ రంగపూర్ వరకూ వున్న సువిశాల ప్రదేశమంతా ఈ నాగరికత విస్తరించినట్లు తెలుస్తోంది. అంచేత దీనికి మూల భారతీయ నాగరికత అని చరిత్రకారులు నామకరణం జేశారు.

నగర నిర్మాణం

ఈ ప్రాచీన శిధిలాల్ని పరిశీలిస్తే, సింధు నాగరికత మౌలికంగా అర్బన్ (పట్టణ) నాగరికతయని స్పష్టంగా తెలుస్తుంది. మొహెంజొదారో – హరప్పాలు, సింధుప్రజల నగర నిర్మాణ నైపుణ్యాన్ని, భవన నిర్మాణ కౌశల్యాన్ని చెప్పక చెపుతున్నాయి. మొహెంజొదారో అంటే – మృతులదిబ్బ – అని అర్థం. ఇక్కడ ఒకదానిపై ఒకటిగా ఏడు నగరాలు బయల్పడ్డాయి. మొహెంజొదారో కన్న హరప్పా పెద్దనగరం. ఈ రెండు నగరాల మధ్యనున్న దూరం – 350 మైళ్ళు. ఈ నగరాల్లో

రెండు ప్రధాన భాగాలు, మెరక ప్రాంతంలో కోట, పల్లపు ప్రాంతంలో పౌర నివాసాలూ కన్పిస్తాయి. ప్రధాన భవనాలన్నీ కోటలోని ఆవరణలోనే వున్నాయి. కోట గోడను పచ్చి ఇటుకలతో కట్టి, పైన పండు ఇటుకలతో తాపడం చేశారు. ప్రభుత్వ భవనాలూ, ప్రధాన కట్టడాలూ, కోటలోనే ఎత్తయిన వేదికపై నిర్మించారు. నగరం ప్రణాళికాబద్ధంగా నిర్మించబడింది. ప్రధాన వీధులు ఉత్తర దక్షిణాలుగా, ఉపవీధులు తూర్పు పడమరలుగా బారులుతీరి, నగరాన్ని దీర్ఘచతురస్రాకారపు బ్లాకుల్లా విభజిస్తున్నట్లు కన్పిస్తాయి. వీధులు 2.7 నుండి 10.2 మీటర్ల వెడల్పునవుండి, బాటసారులూ బళ్ళూ ఏకకాలంలో పోయేందుకు వీలుగా వున్నాయి. రాత్రిళ్ళు వీధుల్లో దీపాలు వెలిగించిన దాఖలాలు కన్పిస్తోన్నాయి.

వీధివీధికీ మధ్య భూగర్భంలో ఇటికలతోకట్టిన మురుగునీటి కాలవలున్నాయి. ఇళ్ళలోంచి మురుగునీరు, మట్టిగొట్టాల ద్వారా కాలవల్లోకి ప్రవహించేది. కాలవను శుభ్రం జేయడానికి మనిషి దూరగల కన్నాలుండేవి. కాలవలన్నీ చేరి, నగరానికి బయట నదిలో కలిసేవి. ఇలాంటి పటిష్టమైన మురుగునీటి పారుదల సౌకర్యాలు క్రీ. పూ. నాటి ఈజిప్ట్ - మెసపొటేమియా నాగరికతలకు చెందిన ఏ ప్రాచీన నగరంలో సైతం కన్పించలేదని పురాతత్వవేత్తలు ఖండితంగా చెప్పారు.

"ప్లానుప్రకారం చక్కగా తీర్చిదిద్దబడిన విశాలమైన వీధులూ, పరిశుభ్రంగా వుంచేందుకు వీలైన మురుగునీటి కాల్వలూ, సమర్థతతో అమలుజేయబడ్డ మునిసిపల్ పాలన ఉనికిని ధృవపరుస్తున్నవి. రాజవీధుల్నీ, సందుగొందుల్నీ, సూటిగా నిర్మాణం చేయడాని కవసరమైన టౌన్ ప్లానింగ్‌ను ఖచ్చితంగా అమలుజరిపే శక్తి, నాటి పురపాలక సంఘాలకి వున్నట్లు కన్పిస్తోంది. సింధు వరదల వల్ల నగరాలు దెబ్బతిన్నప్పుడు, పునర్నిర్మాణం సాగించడాని కవసరమైన అధికారం సైతం ఈ సంఘాలకున్నట్లు విదితమవుతోంది" అని గోర్డన్ చైల్డ్ రాశాడు.

భవన నిర్మాణం

మొహెంజొదారో - హరప్పాలలో దుర్గ ప్రాకారాలు బయటపడడం వల్ల ఆనాటికి దుర్గనిర్మాణం ఉన్నట్లు తెలుస్తోంది. విశాలమైన వీధులకి రెండువేపులా ఇళ్ళూ దుకాణాలూ వున్నాయి. సింధు వరదల భయంవల్ల, ఇళ్ళను మట్టివేదికలపై నిర్మించారు. సంపన్నుల గృహాలు విశాలంగా వుండగా, సామాన్యుల కొంపలు బాలా

చిన్నవిగా వున్నాయి. కాల్చిన ఇటికలతోనే ఇళ్ళు కట్టారు. బ్లేఖను సైతం చొప్పించ డా కి వీల్లేని విధంగా, గోడల్లోని ఇటికలు వొకదాని కొకటి అతికించబడ్డాయి. కిటికీలు చాలా తక్కువ. వున్నవియైనా గోడల్లో చాలా ఎత్తున అమర్చారు. పై అంతస్తు నించి నిటిపారుదల కోసం, గోడల్లో నిలువుగా గొట్టాలు పెట్టారు. భవనాలు - మండువా లోగిళ్ళలా వుండి మధ్యన ఖాళీస్థలమూ, దానిచుట్టూ అయిదారు గదులూ వున్నాయి. కాల్చిన ఇటికలతో కట్టబడిన నాటి భవనాల్లో, విశాలమైన వరండా, వంటగది, స్నానాలగది, మురుగునీరు పోయేందుకు వీలుగా గొట్టాలున్న యిళ్ళలో నాటి సంపన్నులు జీవించారు. ప్రతి యింట్లో మంచినీటి బావి వుంది.

స్నానఘట్టం

మొహెంజొదారోలో బ్రహ్మాండమైన స్నానఘట్టం బయటపడింది. ఈ స్నానవాటిక అత్యంత క్లిష్టమైన నిర్మాణం. దీని పొడవు-39 అడుగులు; వెడల్పు-23 అడుగులు; లోతు - 8 అడుగులు. ఈ కోనేరులో దిగడానికి మెట్లున్నాయి. దీనికి ప్రక్కన గోడలూ, కట్టుదిట్టంగా నిర్మించబడ్డ అడుగుభాగమూ వున్నాయి. కోనేటిలోంచి నిలవనీరు పోవడానికీ, కొత్తనీరు రావడానికీ మార్గాలున్నాయి. ఈ స్నానఘట్టం చుట్టూ వరండాలూ, వాటి నానుకొని స్నానాలగదులూ వున్నాయి.

ఈ కోనేరులో ఉత్తర దక్షిణ దిక్కుల్లో మెట్లవరసలూ, నైరుతీ మూలన తూమూ, కోనేరు చుట్టూ రెండంతస్తుల వసారా, వసారా వెనక గదులూ, ప్రతి గది లోంచి పైకి పోవడానికి మెట్లూ, మరోగదిలో బావీ వున్నాయి. ఈ బావినుండి కోనేరులోకి నీటిని పంపేవారు. వేడినీటిని పంపేందుకు గూడా తగిన ఏర్పాట్లు వున్నట్లు తెలుస్తుంది. ఈ బ్రహ్మాండమైన స్నానఘట్ట నిర్మాణం, సింధు ప్రజల నిర్మాణ దక్షతకి పతాక సంకేతంగా పురాతత్వవేత్తలు పేర్కొన్నారు.

ధాన్యాగారం

ఈ స్నానఘట్టానికి సమీపంగా వొక ధాన్యాగారముంది. దీని పొడవు 150 అడుగులు; వెడల్పు 80 అడుగులు. దీనిలో ధాన్యపు కొట్లున్నాయి. ధాన్యం దించ డానికీ, ఎత్తడానికీ వీలుగా, గాలీ వెల్తురూ వొచ్చేట్లు ఈ విశాలమైన ధాన్యాగారం నిర్మించబడింది. దీని నానుకునే, పెద్ద స్తంభాల మంటపం సైతం బయల్పడింది.

ఈవిధంగానే హరప్పాలో బయల్పడిన ధాన్యాగారం గూడా చాలా విశిష్టమైన నిర్మాణం. ఆరు చావడులు గల రెండు వరసలుగా ఇది నిర్మింపబడింది.

మొహెంజోదారో-హరప్పాలలో బయల్పడిన పెద్దపెద్ద భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలో లేదా ప్రార్థనా మందిరాలో అయివుంటాయని పురాతత్వవేత్తలు భావించారు. శాస్త్రరీత్యా నిర్మించబడ్డ స్నానఘట్టాలూ, కట్టడాలూ, ప్రభుత్వ భవనాలూ, పురమందిరాలూ, నాటి ఉత్తమ వాస్తు శిల్ప కౌశల్యాన్ని వేనోళ్ళ చాటుతోన్నవి. సింధు నాగరికత శిధిలాల తవ్వకాలకి సారధ్యం వహించి, ఆ నాగరికతని అధ్యయనం జేసిన సుప్రసిద్ధ పురాతత్వవేత్త- సర్ జాన్ మార్షల్- ఈ విధంగా రాశాడు- "చరిత్రను మనం పరిశోధించి చూచినంతవరకూ, ఈజిప్ట్ - మెసపొటేమియాల్లో గానీ, పశ్చిమాసియాలోని మరేప్రాంతంలో గానీ, మొహెంజొదారో ప్రజలు కట్టిన విశాలమైన ఇళ్ళు, స్నానఘట్టాల్లాంటి కట్టడాలు, మరెక్కడా కానరావు. ఆ దేశాల్లో దేవుళ్ళకి గుళ్ళు, రాజులకి ప్రాసాదాలూ గోరీలూ (పిరమిడ్స్) నిర్మించడానికి చాలా మేధో బలం వినియోగించి ఎంతోడబ్బు ఖర్చుజేశారు. అయితే, సాధారణ ప్రజలకి మాత్రం మట్టికొంపలే మిగిలాయి. కాని, సింధు నాగరికతలో అది తారుమారైంది. పౌరులకోసం మొహెంజొదారోలో నిర్మింపబడ్డ స్నానాలగదులూ, మురుగు సీటి పారుదల కట్టడాలవంటివి (డ్రెయినేజి) ఎంతగా గాలించినా ఎక్కడా కన్పించవు." పౌరుల కోసం నిర్మింపబడ్డాయని, మార్షల్ చెబుతోన్న ఈ స్నానఘట్టాలూ, ఈ విశాలమైన భవనాలూ, సంపన్నవర్గాల కోసమేగాని, పేద ప్రజలకు మాత్రం గాదని మనం గుర్తుంచుకోవాలి. అగ్గిపెట్టెల్లాంటి కొంపల్లోనే సామాన్యులు జీవించారని మనం యింతకి పూర్వమే చూశాం!

నాటి పల్లెల్లోని ఇళ్ళు పూర్తిగా మట్టితో కట్టినందువల్ల, నామరూపాల్లేకండా నశించిపోయాయి. అయితే, సింధునదికీ, కీర్తార్ పర్వతాలకీ మధ్యగల ప్రాంతంలో, నాటి పల్లెల పునాదులు కన్పిస్తాయి. ఈ పల్లెల్లో వ్యవసాయం భారీయెత్తున సాగేది.

ఉత్పత్తి విధానం

మెసపొటేమియా ప్రజలు అమలుజేసిన కాలువనీటి సాగును (కెనాల్ ఇరిగేషన్) సింధుప్రజలు అనుసరించలేదు. సింధునది వరదల ద్వారా వొచ్చే ఒండ్రు

మట్టి వున్న భూముల్లోనే వీరు వ్యవసాయం జేశారు. ఈ వరదనీటి సాగుకు (ఫ్లడ్ ఇరిగేషన్) భూమిని లోతుగా దున్నవలసిన ఆవసరంలేదు. ఆయినా ఫలసాయం మాత్రం బ్రహ్మాండంగా వుండేది. కాలవలు నిర్మించడం ద్వారా గాక వరదనీటికి ఆనకట్టలు కట్టి, వీరు వ్యవసాయం జేసేవారు. కోతల సమయంలో లభించే ఆదనపు ధాన్యం (సర్‌ప్లస్ గ్రెయిన్) నావల ద్వారా మొహెంజొదారో - హరప్పాలకు పంపబడి, అక్కడి దాన్యాగారాల్లో నిల్వచేయబడేది. ఈ అదనపు ధాన్యం నిల్వలు, ఈ నాగరికత ప్రారంభం నుండి, దాని విధ్వంసం వరకూ వొకే స్థాయిలో వున్నట్లు కన్పిస్తోన్నవని డి. డి. కొశాంబీ అభిప్రాయం వెలిబుచ్చాడు.

సంపన్నవర్గాల జీవితం

ఎంబ్రాయిడరీ వున్న ఉత్తరీయాల్ని సంపన్నులూ మతగురువులూ ధరించినట్లు కన్పిస్తోంది. పురుషులు ఉన్ని, నూలు ధోవతులూ, ఉత్తరీయాలూ ధరించారు. శిరోజాలంకరణలో స్త్రీ పురుషుల తీరు, భిన్న భిన్నంగా వున్నట్లు గోచరిస్తోంది. కొందరు పురుషులు మీసం తీసి, గడ్డం మాత్రం పెంచేవారు. మరికొందరు పొడుగాటి వెంట్రుకలు పెంచి, వాటిని ముడిగా వేసుకొనేవారు. ఉన్నతవర్గాల స్త్రీలు విసనకర్ర ఆకారంలో తమ శిరోజాలంకరణ చేసుకొనేవారు; జడలూ ముడులూ వేసుకొనేవారు.

స్త్రీ పురుషులు ఉభయులూ, వెండి బంగారం రాగి దంతంతో జేసిన ఆభరణాలు ధరించారు. నెక్లెస్‌లు ఉంగరాలు చెవిపోగులు గాజులు మురుగుల్ని స్త్రీ–పురుషులు ధరించారు. వీటితోపాటు స్త్రీలు కాళ్ళకి గొలుసులూ కడియాలూ వేసు కొన్నారు. ఈ ఆభరణాల్లో భిన్నభిన్నమైన రీతులు గోచరించి, అవి అసమానమైన సౌందర్యాన్ని విరజిమ్మాయి. వెండి బంగారం రాగితో తయారుజేసిన తలపట్టాలను పురుషులు ధరించారు. సౌందర్య పోషణ కోసం హరప్పా స్త్రీలు తీసుకొన్న శ్రద్ధ, సింధు శిధిలాల్లో లభించిన ముస్తాబు బరిణెలవల్ల ద్యోతక మవుతుంది. ఈ బరిణెల్ని దంతం లోహం రాయి మట్టితో తయారుజేశారు. మొహెంజొదారో స్త్రీలు–కాటుక, మైపూతలతో అందంగా ముస్తాబు జేసుకొనేవారు. స్త్రీల పెదవులకు రంగువేసే పరికరాలు చన్హుదారోలో దొరికాయి. అలంకరణ కవసరమైన మేజాలూ, కంచు అద్దాలూ, దంతం దువ్వెనలూ లభించాయి.

సామాన్యప్రజల జీవితం

పేదప్రజలు నూలు గుడ్డలే వాడారు. కేన్వాస్‌లాంటి ముతక దుస్తుల్ని సైతం వీరు ధరించినట్లు కన్పిస్తోంది. స్త్రీలు పొట్టిలంగాలు ధరించారు. సామాన్య ప్రజలు, నడుంకింది భాగందాకా దుస్తులు ధరించి, నడుము పైభాగమంతా అర్థ దిగంబరంగా వుండేవారు. (అజంతా చిత్రాల్లోని సేవకురాళ్ళ వలె) పేదప్రజలు మట్టి రాగితో జేసిన నగలు పెట్టుకొన్నారు. సంపన్నులు రత్నాలు వినియోగించగా, సామాన్యులు రాళ్ళు వాడారు.

హరప్పా నగరంలో కూలీల (బానిసల?) యిళ్ళ వరసలు బయల్పడ్డాయి. ప్రతి యింట్లో రెండే రెండు గదులున్నాయి. ముందు గదిలో స్నానానికి ఇటిక వేదికా, నీటి గొట్టాలూ వున్నాయి. వెనక గది చాలా చిన్నది. కూలీల ఇళ్ళన్నిటికీ కలిపి వొకే వొక బావి వుంది.

సింధు ప్రజలు గోధుమ బార్లీ వరి ఖర్జూరం కూరగాయలు పళ్ళు పాలు అనేక రకాల మాంసాలూ, చేపలూ గుడ్లూ వాడారు. గొర్రెలు బర్రెలు ఎద్దులు గాడిదలు ఏనుగులు ఒంటెలు యిత్యాది జంతువుల్ని మచ్చికజేసి వారు పెంచారు. గంగిరెద్దు లాంటి ఎద్దు, సింధు ముద్రికలపై తరుచుగా కన్పిస్తుంది. ఎనుబోతు ఖడ్గమృగం పెద్దపులి కోతి కుక్క పిల్లి ఎలుగుబంటు దేగ ముంగిస ఉడత చిలక నెమలి కోడి వగైరాలు మట్టితో చేసిన ఆటవస్తువులపై మనకు కన్పిస్తాయి. నాటి వారు రాకపోకలకి సాధారణంగా ఎడ్లబండినే వుపయోగించారు.

గృహ సామగ్రి

కుమ్మరి సారెపై చేయబడ్డ అనేకరకాల పాత్రల్ని సింధుప్రజలు అధికంగా వినియోగించారు. మట్టి, రాయి, దంతం, లోహాలతో తయారుజేసిన రకరకాల పాత్రల్ని వారు గృహసామగ్రిగావాడారు. అతిథుల కోసం ప్రత్యేకించిన గదుల్లో, కుర్చీలు, మంచాలు, చిన్నబల్లలు వుంచేవారు. దారు శయ్యలు (Wooden Beds) రెల్లు చాపలు, రాగి లేక మట్టి దీపం సెమ్మెలూ వారు ఉపయోగించారు. సింధు శిధిలాల్లో ఎక్కడా ఇనుప సామగ్రి లభించలేదు. రాగిసూదులు, రాగి-కంచుతో చేసిన గొడ్డలి, రంపం కొడవలి చేపముల్లు వాడారు. పసిపాపలకి అన్నంపెట్టే చిన్న చిన్న గిన్నెలు గూడా వీరు వుపయోగించారు.

వినోదాలు

బంతులు ఈలలు గిలకలు అవయవాల్ని వివిధభంగిమల్లో కదిలించే మృగాల బొమ్మల్ని, పిల్లలు ఆడుకోడానికి తయారుజేశారు.

చదరంగం వేట ఎద్దుల పోట్లాట కోడిపందేలు పక్షుల పెంపకం నాట్యం సంగీతం, నాటి సంపన్న వర్గాల ప్రధాన వినోదాలు. రాతితో తయారుజేసిన కొన్ని వందల పాచికలు, సింధు శిధిలాల్లో దొరికాయి. మట్టిపలకలపై కన్పించిన రకరకాల కుక్కల్ని బట్టి, వేటకుక్కల్ని వేటలో ఉపయోగించినట్లు తెలుస్తోంది. వర్తమాన భారతీయ లలితకళల్లో కన్పించే, మృదంగ వీణా వాయిద్యాలు, సింధు నాగరికత లోంచి ప్రభవించాయంటే, ఏమాత్రం అతిశయోక్తి గాదు: ఒక వ్యక్తి మెడనించి వేలాడుతోన్న డోలు లాంటి వాయిద్యమూ, ఆధునిక మృదంగమూ, నాడు ఉనికిలో వున్నట్లు సింధు శిధిలాల్లో లభించిన మట్టి పలకల ద్వారా తెలుస్తోంది. నేటి వీణకి సరిపోలిన మూల వాయిద్యం – ముతకరకం తీగల వాయిద్యం – ఒకటి ఈ సింధు శిధిలాల్లో లభించింది.

యుద్ధ సాధనాలు

రాగి– కంచుతో తయారుజేసిన గండ్రగొడ్డళ్ళు బాకులు బల్లేలు కత్తులు కటారుల్ని వారు యుద్ధ సాధనాలుగా వినియోగించారు. రాగితో తయారుజేసిన పల్చని కవచాలు, కొన్ని రాతి గదలు, విల్లంబులూ వారు వాడినట్లు కన్పిస్తోంది. సింధు శిధిలాల్లో ఖడ్గం కన్పించకపోవడం, చాలా ప్రధాన విషయంగా పురాతత్వవేత్తలు పరిగణించారు. అలాగే శిరస్త్రాణాలు, తత్సంబంధమైన రక్షణ సామగ్రీ, ఇక్కడ కన్పించకపోవడం చాలా విచిత్రమని ప్రొఫెసర్ కొశాంబి వ్యాఖ్యానించాడు.

శిల్ప చిత్ర కళారీతులు

హరప్పా వొద్ద లభించిన కొన్ని రాతి బొమ్మలు, గ్రీకు శిల్పాల అసాధారణ సౌందర్యాన్ని జ్ఞప్తికి తెస్తాయి. నివాస గృహాలూ, పురమందిరాలపై ఏ విధమైన అలంకరణ కన్పించదు. కాని, మట్టి పలకలూ కుండలపై వున్న చిత్రాలూ, జేగురు మట్టి బొమ్మలూ తాయిత్తులపై ముచ్చటగొలుపు వారి చిత్రకళా నైపుణ్యం కన్పిస్తుంది. పద్మాసనంలో వున్న వొక దేవతాశిల్పం, యోగముద్రలో వున్న వొక

పురుషవిగ్రహం, యిందుకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. హరప్పాలో లభించిన రెండు విగ్రహాల్ని బట్టి, అవయవాల్ని విపులీకరించి బిగించేపద్ధతి, నాటి శిల్పులకు తెలిసినట్లు మనం గమనించవచ్చు. "సింధు నాగరికతలో, మతానికీ చిత్ర కళకీ వొక ప్రత్యేకమైన విశిష్టత వుంది. సమకాలీన దేశాల చిత్రకళల్లో ఈ పోలికలు కన్పించవు. ముఖ్యంగా, పింగాణీ పొట్టేళ్ళు కుక్కలూ యిత్యాది జంతువుల్ని చేయడం గానీ, ముద్రికలపై చక్కని నగిషీపని చేయడంగానీ, ఇతర దేశాల్లో కన్పించదు. పొట్టి కొమ్ములూ, ఎత్తయిన మూపురమున్న ఎద్దుల్ని చెక్కిన ముద్రికలు, ప్రత్యేకంగా పేర్కొనదగినవి. చెక్కడపు పనీ, చిత్రకళా కన్పిస్తాయి" అని సర్ జాన్ మార్షల్ వ్యాఖ్యానించాడు.



మొహెంజొదారో ఎద్దు ముద్ర

వర్తక వాణిజ్యాలు

బరువుల్ని తూయడానికి తాసులూ, తూకపురాళ్ళూ, దశాంశ పద్ధతిలో కొలతల్ని సింధుప్రజలు వుపయోగించారు. ఆఫ్ఘనిస్థాన్, బెలూచిస్థాన్, పెర్షియా, మధ్యాసియా, మెసపొటేమియా, ఈజిప్ట్ యిత్యాది దేశాలతో సింధు ప్రాంతానికి వ్యాపార సంబంధాలున్నాయి. సముద్రమార్గం ద్వారా వ్యాపారం జరిగేది. సింధు ప్రజలు గొప్ప సముద్రవర్తకులని, దొరికిన ముద్రికల ద్వారా తెలుస్తోంది. వారికి వడకటం నేయటం తెలుసు. చేతిపనుల్లో వారు అనన్య సామాన్యమైన నైపుణ్యం ప్రదర్శించారు.

"సింధు నగరాల్లో తయారైన వస్తువులు, టైగ్రిస్-యూఫ్రటిస్ నదీ తీరాల్లోని పట్టణాల దాకా వెళ్ళాయి. అలాగే కొన్ని సుమేరియా కళాఖండాల్నీ, మెసపొటేమియా అలంకార సామగ్రినీ చూచి, సింధుప్రజలు వాటిని అనుకరించారు. ముడిసరుకులూ విలాససామగ్రికి మాత్రమే నాటి వాణిజ్యం పరిమితం గాలేదు. అరేబియా

సముద్రం రేవులద్వారా, రెగ్యులర్‌గా దిగుమతి జేయబడ్డ చేపలు, మొహెంజొదారో ప్రజల ఆహార నిల్వల్ని అభివృద్ధి జేశాయి."

"సింధు నగరాల్లోని వృత్తిపనివారు, మార్కెట్ కోసమే వస్తుసామగ్రి ఉత్పత్తి జేసినట్లు కన్పిస్తోంది. ఈ సరుకుల క్రయ విక్రయాల కొరకు, వారు ఏ రకమైన నాణేల్ని వుపయోగించారో తెలియడంలేదు. ప్రైవేట్ వ్యక్తులకు, నాటి విశాలమైన భవనాల ప్రక్కనే వున్న గిడ్డంగులను బట్టి, అవి వ్యాపారస్తుల గృహాలుగా మనం గుర్తించచ్చు. వాటి సంఖ్య- సైజును బట్టి, నాడు శక్తివంతమూ సుసంపన్నమైన వ్యాపారవర్గం ఉనికిలో వున్నట్లు తెలుస్తోంది." (What happened in history? గోర్డన్ చైల్డ్- పేజి-113.)

"సింధు ప్రాంతానికీ మెసపొటేమియాకీ మధ్యజరిగే వ్యాపారానికి, పెర్షియన్ సింధుశాఖలోని "బ్రహ్మన్" ద్వీపం గొప్ప వర్తక కేంద్రంగా వుండేది. మెసపొటేమియన్ పురాణాల్లో వర్ణింపబడిన "తిల్మాన్"యే ఈ బ్రహ్మన్ ద్వీపం." (కొశాంబి_Myth and Reality_ పేజి 59)

"ఆలిక్ తిల్మాన్" అనే పేరుగల వర్తకులు, ఈ వాణిజ్యాన్ని కొనసాగించినట్లు, మెసపొటేమియన్ మట్టి పలకల ద్వారా తెలుస్తోంది. సింధు నగరాల్లోనూ, మెసపొటేమియాలోనూ లభించిన గుండ్రపు ముద్రికలు (రౌండ్ సీల్స్) ఈ బ్రహ్మన్ ద్వీపంలోనే అంకురించాయి."

"సింధు ప్రాంతం, మెసపొటేమియన్లచే "మెలుహ్హా" అనే పేరుతో పిలువబడినట్లు తెలుస్తోంది. క్రీ. పూ. 1750 తర్వాత, మెసపొటేమియా గ్రంధాల్లో ఈ మెలుహ్హా గురించి ప్రస్తావించడం ఆగిపోయింది. అంటే, దండయాత్రల వల్ల ఈ ఉభయ ప్రాంతాల మధ్యనున్న వ్యాపార సంబంధాలకి అంతరాయం కలిగివుంటుంది." (పై గ్రంధం_పేజి_59_ కొశాంబి)

రాగితోపాటు నెమళ్ళు, దంతం, దంతపు వస్తువులు పేలు దువ్వుకొనే దంతం దువ్వెనలు కోతులు రత్నాలు (మీన నేత్రాలు) నూలు వస్త్రాల్ని సింధుప్రజలు మెసపొటేమియాకి ఎగుమతి జేసేవారు. వీటికి బదులు, వెండి తదితర సామగ్రిని వారు దిగుమతి జేసుకొనేవారు. ఈ ఉభయ దేశాల మధ్య రాకపోకలకి సముద్రమే మార్గం. తుఫాన్ లాంటి విపత్తులు సంభవించినప్పుడు, నావలోనివారు సమీపాన

వున్న రేవును గుర్తించడానికి వొక కాకినీ, వాసయోగ్యమైన భూమి వున్నదో లేదో తెలుసుకోవడానికి వొక పెంపుడు పావురాన్ని పంపేవారు. బాబెరుకు (బాబిలన్‌కు) సముద్రయానం జేయడానికి సిద్ధపడ్డ నాటి భారతీయ వర్తకులు, కాకిని "దిక్సూచి"గా వినియోగించినట్లు, వొక బౌద్ధ జాతకకథ ద్వారా మనకు తెలుస్తోంది. గుజరాత్‌లోని లోథాల్ వద్ద బయల్పడ్డ నౌకాశ్రయం ద్వారా, నాడు విదేశ వాణిజ్యం జరిగినట్లు భావిస్తోన్నారు.

మతం

సింధు శిధిలాల్లో లభించిన ముద్రికలూ ప్రతిమలూ, వారి మతం గూర్చి తెలియజేస్తోవ్నాయి. విసనకర్ర ఆకారంలోవున్న శిరోవేష్టనం, పొట్టిలంగా ధరించిన




అమ్మతల్లి

మహామాత- అమ్మతల్లి సింధుప్రజల ప్రధాన స్త్రీదైవంగా పరిగణింపబడినట్లు తెలుస్తోంది. ఈ మహామాతయే అనంతర హిందూ మతంలో ఆదిశక్తి-మహాదేవిగా రూపొంది వుంటుంది. మన దేశంలోని వివిధ ప్రాంతాల్లో, ఈమె వివిధ రూపాల్లో నేటికీ పూజింపబడుతోంది. సాత్వికంగా వుండే ఉమరూపం నుండి, మానవ కపాల హారంతో వున్న మహోగ్రదిక్త కాళీ రూపంవరకూ ఈ ఆదిదేవి భిన్నభిన్నంగా గోచరిస్తుంది. అత్యంత ప్రాచీనకాలం నుండి- మాతృస్వామిక సమాజదశ నుండి - ఈ మహాదేవి ఆరాధన ఉనికిలో వున్నట్లు చారిత్రక సాక్ష్యాలున్నాయి.

సింధు సమాజంలోని సంపన్నవర్గాలకి చెందినవారు, సంతాన-సౌభాగ్యాలకి అధిదేవతగా (The goddess of Fertility and Corn) ఈమెను పూజించారు. అంతేగాక, కామదేవతగా సైతం ఈమెను పరిగణించి, భక్తిశ్రద్ధలతో ఆరాధించి నందువల్ల, అనంతర హిందూమతంలోని రతీదేవికి, ఈమె మూలరూపమై వుండాలి. ఈ కామదేవతకి చెందిన ప్రతిమలు, పెర్షియా మెసపొటేమియా గ్రీస్ క్రీట్ దేశాల్లోనూ, దక్షిణభారతంలోనూ కన్పించాయి.

మూడు మొహాల దేవుడు

చేతిలో త్రిశూలం ధరించి, చుట్టూ ఏనుగ పెద్దపులి దున్నపోతు ఖడ్గమృగం వుండగా, దున్నపోతు కొమ్ములున్న శిరోవేష్టనం (Head dress), మూడు ముఖాలు కలిగియుండి, యోగ ముద్రాంకితుడై సింహాసనంపై కూర్చున్న పశుపతి, ప్రముఖమైన పురుష దైవంగా కన్పిస్తోన్నాడు. ఈ పురుష దైవమే అనంతర హిందూమతంలోని శివుని యొక్క-మూల రూపమని (Proto-type of Siva) పురాతత్వవేత్తలు పరిగణిస్తోన్నారు. సింధుప్రజల దైవ గణంలో, అత్యున్నత దైవాలుగా ఆరాధింపబడిన ఈ మహామాత - పశుపతులు, అనంతర కాలంలో పార్వతీ - పరమేశ్వరులుగా మారివుంటారు. ఈ మూడు ముఖాల పశుపతియే, తర్వాత కాలంలో త్రిమూర్తులుగా పరిణామం చెందివుంటాడు.



మూడు మొహాల దేవుడు

లింగపూజ

లింగ రూపమైన శిలలు, యోని (పానవట్టం) రూపమైన చక్రం, యిక్కడ లభించాయి. హరప్పాలో శివలింగాన్ని పోలిన రాళ్ళు ఎన్నో దొరికినందువల్ల, సింధుప్రజలు లింగమతస్థులని ఖచ్చితంగా భావించవలసి వస్తోంది. ఆర్యులు తమ

రుగ్వేదంలో, సింధుప్రజల్ని శిశ్న (శిశన-లింగ) దేవులని ఈసడిస్తూ రాసిన విషయం, ప్రత్యేకంగా యిక్కడ గమనార్హం. "లింగ పూజకుల" ప్రస్తావన రుగ్వేదంలో వుంది. రుగ్వేద రుషియైన వసిష్టుడు, అనార్యులను "శిశ్న దేవులు" అని పిలిచాడు: "మా శిశ్నదేవా అపిగుర్ ఋతంనః" అని అన్నాడు. అంటే– శిశ్నపూజకులు మా యజ్ఞంలో జోక్యం కలిగించుకొనకుందురుగాక. (రుగ్వేదం–7–21–5) శిశ్నదేవులనగా లింగపూజకులు అని అరం.

సామాన్యప్రజలు, రావి–వేప–చెట్లనీ, వనదేవతల్నీ, సర్పాల్నీ పూజించారు. జాతరల్లో "అమ్మతల్లి"ని ధూప దీపాలతో ఆరాధించి, మేకలు ఎద్దులు దున్నపోతులు కొన్ని సందర్భాల్లో మనుషుల్ని సైతం బలియిస్తుండే వారనేందుకు సాక్ష్యంగా, కొన్ని ముద్రికలు దొరికాయి. అశ్వత్థ వృక్షం (రాగిచెట్టు) కొమ్మల మధ్య శక్తిని నిలిపి, ఆమెకు భక్తుడు బలి యివ్వడానికి మేకను తెస్తున్నప్పుడు, ఆ దృశ్యాన్ని చూస్తున్నవారిని చిత్రించిన వొక మట్టిపలక హరప్పాలో లభించింది. అలాగే, కొమ్ములాంటి త్రిశూలాన్ని చేతబట్టుకొన్న దేవత, విరబోసుకొన్న జుట్టుతో, పూర్తి నగ్నంగా చెట్టుకొమ్మల మధ్య నిల్చున్నట్లున్న ప్రతిమ గూడా ఇక్కడ లభించింది. దీన్నిబట్టి ఆనాడు శక్తిపూజ–కొలుపులూ జోరుగా సాగేవని తెలుస్తోంది.



హరప్పా ముద్రికపై బలి సమర్పణ

మహావాత ఉత్సవం

మొహెంజొదారోలో పురమందిరం లేదా ప్రార్థనా మందిరం వున్న ఆవరణలోనే, బ్రహ్మాండమైన స్నానఘట్టం నిర్మింపబడిందని మనం చూశాం. ప్రతియింట్లో బావులూ స్నానాలగదులూ వుండగా, ప్రక్కనే సింధునది ప్రవహిస్తోండగా, ఈ "స్నానఘట్టం" యొక్క అవసరమేమిటి అనేప్రశ్న సహజంగానే తలయెత్తుతుంది. సింధుప్రజలు జరుపుకొన్న దేవతా ఉత్సవానికీ, ఈ స్నానఘట్టానికీ, గాఢమైన సంబంధముందని, సుప్రసిద్ధ మార్క్సిస్టు చరిత్రకారుడైన ప్రొఫెసర్ కొశాంబి అభిప్రాయం వెలిబుచ్చాడు. (కల్చర్ అండ్ సివిలిజేషన్ ఇన్ ఏన్షియంట్ ఇండియా)

ప్రాచీనకాలం నించీ, మనదేశంలో దేవాలయం ప్రక్కనే తామరకొలను (చెరువు) నిర్మించేవారనీ, మెట్టుదిగి ఈ కొలనులో శుద్ధిజేసుకొన్న తర్వాత, దైవ దర్శనం జేసుకొనేవారనే విషయం మనకు తెలిసిందే. శుద్ధిస్నానాల కోసమేగాక, ఈ విధమైన పుష్కర తీర్థాలు, పట్టాభిషేక సమయంలో రాజులచే శుద్ధిస్నానం చేయించ డానికి సైతం వినియోగింపబడేవి. మొహెంజొదారో స్నానవాటికలో కన్పించిన మెట్లు, నేటి కాశీలోని హరిశ్చంద్ర ఘాట్ యత్యాది ఘాట్స్‌ను జ్ఞాపకానికి తెస్తాయి. అంచేత ఈ స్నానఘట్టం, అనంతర హిందూమతంలో ఉనికిలో కొచ్చిన పుష్కర తీర్థాలకీ, తీర్థస్నానాలకీ, గుడిప్రక్కనే నిర్మింపబడ్డ తామరకొలనులకీ మూలరూపంగా (proto_type) మనం భావించవొచ్చు. అంతేగాదు : ఈ పుష్కర తీర్థాలకీ, ఆదిమ సంభోగ కర్మకాండకీ (Fertility rites) గూడా సంబంధముంది. ఇందుకోసం మనం హిందూ పురాణాల లోతు పాతుల్లోకి వెళ్ళాలి. ఈ తామరకొలనులు, జలదేవతలకీ అప్సరాంగనలకీ ఆటపట్టులుగా స్థావరాలుగా వుండేవనీ, సంగీత నృత్యాల్లో అందె వేసిన చేతుల్లాంటి ఈ అపురూప సౌందర్యవతులు, వీరుల్ని ఆకర్షించి, వారితో సంభోగించి, చివరికి వారిని నాశనం జేసేవారనీ మనం పురాణాలో చదివాం. రంభ ఊర్వశి మేనక తిలోత్తమ ఘృతాచి లాంటి దేవవేశ్యలు వుండేవారనీ, మేనకా-విశ్వామిత్రుల సంగమం ద్వారా శకుంతల ; ఊర్వశీ- వరుణుల సంభోగం ద్వారా వశిష్ఠ అగస్త్యులూ జన్మించారని మనం చూశాం. వరూధిని - మాయాప్రవరుల సంగమం ద్వారా మనువు జన్మించాడనీ, ఇట్టి అమాంబాపతు వ్యక్తులే పురాతన భారతీయ రాజవంశాలకి మూలపురుషుల్లా పరిగణింపబడ్డారనీ మనం పురాణాల ద్వారా తెలుసుకొన్నాం. ఈ అప్సరసలు-దేవవేశ్యలు- ఎవర్నీ పెళ్ళాడి ఎవరితోనూ శాశ్వతంగా సైవాహికజీవితం గడపలేరు. తాత్కాలికంగా వొకణ్ణి రుచిచూసి, వెంటనే వొక బిడ్డను కని చక్కాపోవడమే వీరి లక్షణం.

ఈ ప్రధాన అంశాల్ని మనం దృష్టిలో వుంచుకొంటే, మొహెంజొదారో స్నానఘట్టం అంతరార్థం మనకు సులభంగానే అర్థమవుతుంది. "నాటి పురుషులు ఈ స్నానఘట్టం లోని పవిత్రజలాల్లో స్నానం చేయడంతో పాటు, ఈ ఘట్టం చుట్టూ నిర్మింపబడ్డ గదుల్లో, మహామాతయొక్క స్త్రీప్రతినిధులైన దేవదాసీలతో సంభోగించే వారు." (కొశాంబి- కల్చర్ అండ్ సివిలిజేషన్ ఇన్ ఏన్షియంట్ ఇండియా- పేజి-88) నాటి దేవతా మహోత్సవంలో ఈ సంభోగ కార్యక్రమాన్ని, అత్యంత భక్తిశ్రద్ధల్తో వారు విధిగా జరిపేవారు. ఇందుకు సాక్ష్యం నాటి మెసపొటేమియన్

నాగరికతలో మనకు లభిస్తుంది. సుమేర్, బాబిలన్ యిత్యాది నగరాల్లో వున్న ఇస్తార్ దేవత ఆలయాల్లో, ఈ రకమైన ఆచారమే నాడు వుండేది. అక్కడ సంపన్న కుటుంబాలకి చెందిన యువతులు, ఇస్తార్ దేవత పూజలో భాగంగా, తమ వొద్దకి వొచ్చిన విటులతో సంభోగించి, తద్వారా లభించిన కానుకల్ని దేవికి సమర్పించేవారు.


అంచేత, మెసపొటేమియన్ దేవాలయానికి, సింధు ప్రతిరూపమే-మొహంజొదారోలోని ఈ ప్రార్థనామందిరం (సిటాడెల్ మౌండ్) అని అనడం చారిత్రక సత్యం. తలను పూర్తిగా కప్పివేసి శిరోవేష్టనంతో వున్న స్త్రీల భయంకరమైన చిత్రాలు, ఈ పూజకి తార్కాణాలు. ఈరూపాల్తో వున్న మట్టిముద్రికలు, మొహెంజొదారో శిధిలాల్లోనే గాక, హరప్పా నాగరికతకు పూర్వమున్న కొన్ని గ్రామాల్లో సైతం దొరికాయి. నీగ్రాయిడ్ జాతికి చెందిన వొక నాట్యకత్తె నగ్న విగ్రహం, మొహెంజొదారోలో లభించింది. ఈ నాట్యకత్తె లాంటిది నేటి ఇండియాలోని ఏ ఆటవిక గ్రామంలో నైనా కన్పిస్తుంది.

మృత సంస్కారం

మొహెంజొదారోలో ప్రత్యేకమైన స్మశానవాటిక ఏదీ కన్పించలేదు. ఈ కాలంలో రకరకాల మృత సంస్కారాలున్నట్లు తెలుస్తోంది. గృహసామగ్రి, కానుకలతో పాటు శవాల్ని పూడ్చిపెట్టేవారు. మృత కళేబరాల్ని అడివి జంతువులకూ ఆకాశపక్షులకూ వేసి, మిగిలిన అస్థికల్ని భూమిలో పాతిపెట్టేవారు. మూతవున్న పేటికలో (పెట్టె) శవాన్నిపెట్టి, వస్తువులూ కానుకలుంచి, ఇళ్ళదగ్గర గానీ ఇంటి ఆవరణలో గానీ పూడ్చిపెట్టేవారు. నది ఒడ్డుపై మృతుల్ని దహనం జేసిన తర్వాత, మిగిలిన బూడిద అస్థికల్ని ఏరి, అనంతరం కర్మకాండ జరిపినట్లు గూడా తెలుస్తోంది. అంచేత నాడు ఖననమూ దహనమూ వున్నట్లు మనం గ్రహించాలి.

సింధులిపి

ఈ నాగరికతకి చెందిన అత్యంత ఆకర్షణీయమైన లక్షణం - సింధుప్రజల చిత్రలిపి. ఈ లిపివున్న ముద్రికలు, సింధు శిధిలాల్లో కొన్నివేలు దొరికాయి. అక్షరాలకి సంకేతంగా రకరకాల చిత్రాల్ని, వారు ముద్రికలపై చెక్కారు. కుండలు, తాగే కప్పులు మట్టిగాజులు బంగారు నగలు దంతం పెన్సిళ్ళు వగైరాలపై ఈ లిపి సంకేతాలు చెక్కబడ్డాయి. వీటిలో కొన్ని, చేప పక్షి మనిషి రూపాల్లో వున్నవి.



ఇవి మొదట చిత్రాలుగా వుండి, క్రమేణా గుర్తులుగా స్థిరపడ్డవి. ఇది-కుడి నించి ఎడమకి రాయబడిన సర్పలేఖనం. (ఉర్దూ రాసినట్లు.) ఈ లిపిలోని విశిష్టగుణం-దీనిలోని స్పష్టతయే. సింధులిపికీ సుమేరియన్ లిపికీ ఖచ్చితమైన సంబంధముంది. కొన్ని సందర్భాల్లో, ఈ లిపికీ, ఈజిప్ట్ - చైనా లిపులకీ మధ్య సంబంధముందని పండితులు నిరూపించారు. సింధు లిపిలోని భాష, ద్రావిడమని ఫాదర్ హేరాస్ వంటి సుప్రసిద్ధ విద్వాంసుడు అభిప్రాయం వెలిబుచ్చాడు. ఇలాంటి పోలిక లెన్ని వున్నా, ఈ లిపి భారత భూభాగంపై వృద్ధి జెందిందనే విషయం మాత్రం సత్యదూరం గాదు.

ఇంతవరకూ 400 సంకేతాల్ని మాత్రమే గుర్తించ గలిగారు. ఈ లిపిని పూర్తిగా చదివి అర్థం జేసుకొన్నప్పుడే, సింధు నాగరికత యొక్క స్వరూప స్వభావాల్ని, అనేకమైన మౌలిక అంశాల్ని, మనం సమగ్రంగా అవగాహన చేసుకోవడానికి వీలు కలుగుతుంది. ఇది జరిగిననాడు, ఈ నాగరికత యొక్క విశ్వరూప సందర్శనం మనకు లభించి, ప్రాచీన భారత చరిత్రపై వినూత్నకాంతులు విరజిమ్మడానికి అవకాశం లభిస్తుంది. ఇది - భవిష్యత్ పురాతత్వ శాస్త్రవేత్తలపై వున్న బృహత్తర కర్తవ్యం.

సింధు లిపి - వేద సంస్కృత భాషకి దగ్గరగా వుందని, బెంగుళూరు పురాతత్వ శాస్త్రవేత్తయైన యస్. ఆర్. రావు అభిప్రాయపడ్డాడు. ఈ లిపి ద్రావిడ భాషకి చెందిందని సోవియట్ పండితుడైన డాక్టర్ గురోవ్ వెలిబుచ్చిన అభిప్రాయాన్ని శ్రీ రావు తిరస్కరించాడు: మొట్టమొదటిసారిగా కంప్యూటర్‌ను వినియోగించిన సోవియట్ పండితుల బృందం, ఈ లిపి నిర్మాణం (Structure) ద్రావిడ భాషకి చెందిందని అభిప్రాయ పడ్డారు. ఈ సోవియట్ పండితుల సిద్ధాంతాన్ని, మరి కొంత ముందుకు తీసుకవెళ్తే, సింధువాసులు ద్రావిడులనీ, ఆర్యులచే వీరు తరిమివేయబడినారనే విషయం అంగీకరించడమవుతుందనీ, ఈ విధమైన సిద్ధాంతంలో రాజకీయ దురుద్దేశాలున్నాయనీ, శ్రీ రావుగారు బాధపడుతోన్నారు: ఏది ఏమైనా సింధు లిపి బ్రాహ్మీ లిపికి దగ్గరగా వుందని ఈయన చెప్పదలచుకొన్నాడు. కనీసం చారిత్రక సత్యాల నిరూపణలోనైనా, ఆర్యజాతి దురహంకారానికి ఏమాత్రం తావీయరాదనే విషయాన్ని, రాగద్వేషాలకి దూరంగా వుండే ప్రతి చరిత్ర విద్యార్థీ, దృష్టిలో వుంచుకోవాలి. సింధు లిపి మూల-ద్రావిడానికి చెందిందని, రెవరెండ్ హెన్రీ హేరాస్ అభిప్రాయ పడ్డాడు.

సింధు నాగరికత విస్తరణ

ఇటికరాళ్ళ వ్యాపారస్తుల, రైల్వే కంట్రాక్టర్ల చేతిలోపడ్డ హరప్పానగరం, అమూల్యమైన వస్తుసామగ్రిని కోల్పోయింది. మొహెంజొదారో వలె హరప్పా గూడా యధాతధంగా వుండివుంటే, సింధు నాగరికతకి చెందిన సమాచారాన్ని అందించే బంగారుగనిలా వుండి, ఈ నాగరికత స్వరూప స్వభావాల్ని మరింత సమగ్రంగా మనం అవగాహన జేనుకోవడానికి దోహదం జేసేది. యావత్ ఉత్తర భారతాన్ని కలుపుకొని, దక్షిణాన తమిళనాడులోని కోర్‌కై వరకూ ఈ నాగరికత వ్యాప్తి చెందివుండాలని, దీక్షిత్ అభిప్రాయ పడ్డాడు. చరిత్ర గర్భంలో దాగియున్న ఈ సత్యాన్ని, భవిష్యత్ పురాతత్వ శాస్త్రవేత్తలు వెలికితీస్తారని ఆశిద్దాం!

సింధు నాగరికత కాలం

ఈ నాగరికతా కాలం, క్రీ. పూ. 2800 నుండి క్రీ. పూ. 2500 వరకూ నని ఫేబ్రీ అభిప్రాయపడ్డాడు. క్రీ. పూ. 2300 నుండి క్రీ. పూ. 1500 వరకూ ఈ నాగరికత వుందని మోర్టిమర్ వీలర్ అన్నాడు. అంచే-సింధు నాగరికత అంతమూ, ఆర్యుల రాకా వొకే కాలమవుతోంది. "క్రీ. పూ. 3000 నుండి క్రీ. పూ. 2000 సంవత్సరాల మధ్యకాలంలో, ఈ నాగరికత ఉనికిలో వుంది. క్రీ. పూ. 1750లో, ఈ నాగరికత అంతరించింది." (పై గ్రంధం- పేజి-55-కొశాంబి)

కార్బన్-14 అనే శాస్త్రీయ కాలనిర్ణయ పద్ధతి ప్రకారం, ఈ నాగరికత క్రీ.పూ. 2600లో ప్రారంభమై, క్రీ. పూ. 1800లో అంతరించిందని కొందరు శాస్త్రవేత్తలు తేల్చారు. ఈ తవ్వకాల్లో లభించిన ఏడు అంతస్తుల్లో రెండు నగరాలు బయల్పడినందువల్ల, అంతస్తు అంతస్తుకీ మధ్య, 500 ఏళ్ళ కాలవ్యవధి వున్నట్లు శాస్త్రవేత్తలు నిర్ణయించారు. అన్నిటికన్న పై నున్న అంతస్తుకు చెందిన నాగరికత, క్రీ. శ. 1వ శతాబ్దానికి చెందింది. అంచేత, మొదటి అంతస్తు, క్రీ. పూ. 3000 సంవత్సరాలకి చెందివుండాలి. ఈవిధమైన కాలనిర్ణయం మెసపొటేమియా లోని "ఉర్" మొదలైన ప్రదేశాల్లో లభించిన సింధు ముద్రికల వల్ల బలపడుతోంది. అంచేత, ఈ నాగరికత క్రీ. పూ. 2800 నుండి క్రీ.పూ. 2200వరకూ మహోన్నత స్థితిలో వుండివుండవచ్చునని మరి కొంతమంది చరిత్రకారుల భావం.

29

సింధు నాగరికత నిర్మాత లెవ్వారు ?

ఈ నాగరికత సృష్టికర్త లెవ్వరు ? సింధు నాగరికత భారతదేశంలోనే వెలసి విలసిల్లిందనీ, ఇది దేశీయమైనదేననీ (ఇండిజెనస్) దీని తల్లి వేళ్ళు దక్షిణ భారత సంస్కృతిలో నేటికీ కన్పిస్తాయనీ, అనేకమంది చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. దక్షిణ భారతంలోని ద్రావిడ ప్రజలకీ, సింధు ప్రజలకీ మధ్య, మౌలికమైన పోలికలున్నాయని చాలామంది పండితుల అభిప్రాయం. అంతేగాదు -ఇది నిర్ద్వంద్వంగా ద్రావిడ నాగరికతయని చెప్పడానికి ఎన్నో ఆధారాలు గూడా లభించాయి.

ఈ నాగరికతకి చెందిన ప్రజలు, బెలూచిస్తాన్ నుంచి సింధు ప్రాంతానికి వొచ్చివుంటారని, దీక్షిత్, నీలకంఠశాస్త్రి వంటి పండితులు భావిస్తోన్నారు. సారవంతమైన సింధుమైదానం వారిని ఆకర్షించి వుండవచ్చునని వీరు తలుస్తున్నారు. వీరు- మెసపొటేమియాకి చెందిన సుమేరియన్లేనని మరికొందరు భావించగా, అత్యధిక సంఖ్యాకులైన చరిత్రకారులు, ఈప్రజలు ద్రావిడులని ఘంటాపథంగా చెబుతున్నారు.

బెలూచిస్తాన్‌లోని "బ్రాహూ" ప్రజలచే నేటికీ ద్రావిడభాష మాట్లాడబడుతున్నందున, సింధుప్రజలు ద్రావిడులనియే భావింపబడుతోంది. ఎఁచేతనంటే, వొకానొక నిర్దిష్ట చారిత్రకదశలో, ద్రావిడులు సింధు పంజాబ్ బెలూచిస్తాన్‌లతో పాటు యావత్ భారతమంతా వ్యాపించి, మెసపొటేమియాకు వలసపోయారు. అక్కాడ్‌లో (మెసపొటేమియా) భారతీయ నమూనాలో నిర్మింపబడిన గృహాలు (బహుశా వర్తకులవి) వున్నట్లు ఆధారాలు గూడా లభించాయి.

సింధు నగరాల్లో, నీగ్రిటో ఆస్ట్రిలాయిడ్ ఆల్పనాయిడ్ మెడిటరేనియన్ జాతులకు చెందిన మానవ అస్థిపంజరాలు బయల్పడ్డాయి. మొహెంజొదారో- హరప్పాలు, సుప్రసిద్ధ వాణిజ్యకేంద్రాలు గాబట్టి, నేటి బొంబాయి కలకత్తా వంటి కాస్మోపాలిటన్ సిటీలు కాబట్టి, ఆసియాలోని విభిన్న జాతులు అక్కడ కలవడానికి ఎక్కువ అవకాశముంది. అంతేగాదు- ఈ అస్థిపంజరాల్లో అధికభాగం, మెడిటరేనియన్- అంటే- ద్రావిడజాతికి చెందినవని అనేకమంది చరిత్రకారులు స్పష్టంగా చెప్పారు. అంచేత, సింధు నాగరికతా నిర్మాతలు ఆర్యేతరులనీ, ప్రధానంగా ద్రావిడు

లని చెప్పడమే భారతచరిత్ర గతికి అనుగుణమైందనీ, సుప్రసిద్ధ చరిత్రకారుడు ఆర్. సి. మజుందార్ అభిప్రాయపడ్డాడు.

సింధు నాగరికత : ద్రావిడులు

వాస్తవానికి భారత నాగరికత ద్రావిడులతోనే ప్రారంభమైందనీ, భారత సుసంస్కృతీ సభ్యతలకు పునాదిరాళ్ళు వేసిన ఘనులు ద్రావిడులేననీ అనడం, ఏమాత్రం చారిత్రక అసత్యం గాదు. సింధు నాగరికతా నిర్మాణంలో ద్రావిడులు మహోజ్వలమైన పాత్ర నిర్వహించినట్లు ఆ శిధిలాల్లో దొరికిన అనేకానేక సాక్ష్యాల వల్ల నిరూపితమైంది. ఆర్యులచే ఓడింపబడి, వారికి చాకిరీ చేయడానికి యిష్టంలేని ద్రావిడులు, దక్షిణ భారతానికి వొచ్చి స్థిరపడ్డారని చరిత్రకారులంతా అంగీకరించారు. "సంగం" యుగానికి జెందిన ప్రాచీన తమిళ సారస్వతం, నాటి ద్రావిడులు మహా నగరాల్ని, బ్రహ్మాండమైన నౌకాశ్రయాల్ని నిర్మించారని వర్ణించింది. దీన్నిబట్టి, సింధు నాగరికతనాటి మహోన్నత నిర్మాణ సాంప్రదాయాల్నే, దక్షిణ భారతంలోని ద్రావిడులు కొనసాగించారని, ఆర్. సి. మజుందార్ ఖచ్చితంగా చెప్పాడు.

సింధుప్రజల వేషధారణలో కన్పించే, ధోవతీ, ఉత్తరీయం, ద్రావిడ సాంప్రదాయానికి చెందిందే. ద్రావిడుల ప్రధాన దైవం - శివుడు. సింధుప్రజల ప్రధాన పురుషదైవం - త్రిశూలధారియైన పశుపతి. సింధు నాగరికతా కాలంలో లింగపూజ (శిశన పూజ) వుందని మనం చూశాం. లింగపూజకులను, రుగ్వేద ఆర్యులు "శిశ్న దేవులు" అని ఈసడించారు. ద్రావిడులు, లింగరూపంలో శివుణ్ణి పూజించడం నేటికీ మనం చూస్తోనే వున్నాం. సింధు తవ్వకాల్లో లింగరూపమైన శిలలూ, యోని రూపమైన చక్రాలూ లభించాయి. ఇవే అనంతరకాలంలో, లింగాకారమూ పానవట్టంగా (పార్వతి యోని) శైవులచే పూజింపబడ్డాయి.

ద్రావిడులు తమ దేవుళ్ళకు కోయిలలు నిర్మించారు. "కో" అంటే దేవుడు; "ఇల్" అంటే ఇల్లు. (దేవుని ఇల్లు)) ఇంద్ర అగ్ని వరుణ మిత్ర సూర్య యిత్యాది ప్రకృతి శక్తుల్ని పూజించిన రుగ్వేద ఆర్యులకు దేవాలయ నిర్మాణమే తెలియదు. ఈ నిర్మాణ సాంప్రదాయం మొట్టమొదట మెసపొటేమియాలో అంకురించింది. సింధుప్రజల పూజావిధానంలో కన్పించే ధూప దీపాలూ, గీతా వాయిద్యాలూ ద్రావిడ సాంప్రదాయంలో సైతం కొనసాగింపబడ్డవి. పూజానంతరం, దేవుడికి

నైవేద్యం పెట్టి ప్రసాదం ఆరగించే ఆచారం సైతం ద్రావిడులదే. ద్రావిడ ఆలయాల్లో దేవదాసీలున్నారు. మెసపొటేమియాలో గూడా దేవదాసీలున్నారు. అయితే ఆనాడు వారు వొక కులంగా మాత్రం లేరు.

సింధు సమాజం : వర్గాలు

సింధు సాంఘిక వ్యవస్థలో విభిన్న వర్గాలకి చెందిన వారుండేవారు. పాలకులు పూజారులు యోగులు వ్యాపారులు ప్రభుత్వోద్యోగు లుండేవారు. నగరాల్లో వృత్తి పనివారూ బానిసలూ, పల్లెల్లో పేదరైతులూ కూలీలూ వుండేవారు. పురోహిత వర్గానికి జెందిన వైద్యులూ జ్యోతిష్కులూ వున్నట్లుగూడా కన్పిస్తోంది. జనాభాలో అత్యధికభాగం, వివిధమైన చేతివృత్తులకు చెందినవారే. ఈ వ్యవస్థలో వ్యాపారస్తులు ప్రముఖమైన పాత్ర నిర్వహించారు. వ్యాపార వర్గాల సంపద, పలుకుబడి, అసాధారణంగా వుండేది. (ఆర్యులు వీరిని "పణులు" అని పిలిచారు.)

మొత్తం భూమి, గుడికీ దాని పూజారివర్గానికీ చెంది, దేవాలయ యాజమాన్యం కిందవుండేది. పాలికాపుల నించి స్వీకరించబడిన ధాన్యం, సామాజిక అవసరాల నిమిత్తం పూజారివర్గంచే పంపకం జేయబడేది. నిరంకుశాధికారం చలాయించిన మతగురువులు, ఈ వ్యవస్థలో ప్రజల మానసిక జీవితాన్ని సైతం శాసించివుంటారు. దేవాలయానికే ధాన్యాగారాలు చెందివుండేవి. ధాన్యపుకొట్ల ప్రక్కనే వున్న చిన్న కొంపల్లో నివసించిన బానిసలు, ధాన్యం దంచి భ్రంజేసి నిలవజేసేవారు. మెసపొటేమియాలో "ఖల్లు" అనే పేరిట పిలవబడ్డ దేవాలయ బానిసల్లాంటివారే, సింధు వ్యవస్థలో సైతం వుండివుండాలి. ఉత్పత్తి క్రమంలో దేవాలయం ఏమేరకు పాల్గొన్నదో తెలియదుగాని, పాల్గొనడం మాత్రం జరిగివుంటుందని శ్రీ కొశాంబి అభిప్రాయపడ్డాడు. ఎంచేతనంటే, సింధు నాగరికతతో గాఢసంబంధమున్న ఈజిప్ట్-మెసపొటేమియాల్లో, దేవాలయ పూజారివర్గం నిర్వహించినపాత్ర అనన్యసామాన్యమైందనే విషయం నిర్వివాదం.

రాజ్యాంగయంత్రం - ప్రభుత్వ స్వరూపం

మొహంజొదారో-హరప్పా వంటి నగరాలున్నవంటే, అక్కడ భూభాగమూ, ఆ భూభాగంలో ఉత్పత్తిజేయబడే ఆహార నిల్వలూ వున్నాయని మనం సహజంగానే

భావించాలి. సర్వసాధారణంగా ఈ నగరాలే ప్రభుత్వ కేంద్రాలు. నగరాలు ఉనికిలో వున్నవంటే, రాజ్యాంగయంత్రం సైతం అమల్లోవుండి తీరాలి. అశేషమైన ప్రజానీకం అదనపు ఆహారాన్ని పండిస్తోండగా, కొద్దిమంది సోంబేర్లు అప్పనంగా భోంచేసే వర్గవ్యవస్థ సైతం అమల్లోవుందని భావించడానికి అవకాశముంది. వర్గభేదాలూ శ్రమవిభజనా లేకండా సింధు నగరాలున్నాయని మనం భావించలేము గదా? వర్తక వాణిజ్యాల్లో కోట్లకి పడగలెత్తిన కొద్దిమంది కుబేరులు దోపిడీవర్గంగా తయారై, అసంఖ్యాక ప్రజలపై అధికారం చలాయించిన నిరంకుశరాజ్యం (కమర్షియల్ ఆలిగార్కీ) అమల్లో వుండివుండాలి. ఈ వ్యాపారవర్గానికి, నాటి పూజారివర్గం అండదండలు గూడా దండిగా అందివుండాలి.

"బూర్జువా ప్రజాస్వామ్య సమాజంలోని నగరంగా, మొహెంజొదారో గోచరిస్తుంది" అని రాహుల్ సాంకృత్యాయన్ వ్యాఖ్యానించాడు. (ఋగ్వేద ఆర్యులు-పేజి 40) రాహుల్‌జీ ప్రకారం, ఆనాడు బూర్జువా డెమోక్రసీ అమల్లోవుందని మనం భావించాలా? సింధు నగరాల్లో ఎక్కడా రాజప్రాసాదాలూ, రాణ్మందిరాలూ, ఈజిప్ట్ చక్రవర్తులకి నిర్మించిన బ్రహ్మాండమైన పిరమిడ్స్ (గోరీలు) లాంటివి కన్పించక పోవడం చేత, "దైవాంశ సంభూతు"లైన రాజులు యిక్కడ పాలించలేదనీ, రాచరికం ఈ ప్రాంతంలో అమల్లోలేదనీ, మనం భావించాలా? శ్రీ కొశాంబి ఊహించినట్లు, ప్రభుత్వయంత్రాంగం గాక, మత ప్రభావమే ఈ వ్యవస్థలో బలంగా పనిజేసిందని మనం ఊహించాలా? బడిలోని పిల్లల్లా యిక్కడి కష్టజీవులు, బల ప్రయోగం లేకుండానే యథాలాపంగా పనిజేశారని మనం భావించాలా? (చూడు-కొశాంబి- కల్చర్ అండ్ సివిలిజేషన్ ఇన్ ఏన్షియెంట్ ఇండియా-పేజి 70.)

క్రీ. పూ. నాలుగువేల సంవత్సరాల ప్రాంతంలో, సింధులోయలో ఆదిమ గణసమాజం అంతరించి, దాని స్థానంలో బానిస సమాజం తలయెత్తివుండాలి. బానిస సమాజం స్థాపించబడిందంటే, రాజ్యాంగయంత్రం సహజంగానే అమల్లోకి వచ్చి తీరాలి. రాజ్యాంగయంత్రం లేకుండా-రాచరికాధికారం, సైన్యం, ప్రభుత్వోద్యోగులు, కోర్టులు, జైళ్ళు లేకుండా- బానిస యజమానులు బానిసల్ని అణగదొక్కి వుంచడం అసాధ్యం. సింధు శిధిలాల్లో బయల్పడిన కమ్మరం కొలిమిలూ, వడ్లుదంపే రోళ్ళూ, ధాన్యపు కొట్లూ, కూలీల యిళ్ళూ నాటి బానిస వ్యవస్థకి ఎదురులేని నిదర్శనాలు!


పాలక - పాలితులు

మొహెంజొదారో - హరప్పాలు వొకే రాజ్యానికి చెందిన జంట రాజధానీ నగరాలై వుండాలి. రెండు చేతుల్తో గడించే వ్యాపారవర్గం, ఈ నగరాల్లో వుండేది. వీరి సంపదకి ప్రధానమార్గం, లాభసాటియైన విదేశ వాణిజ్యంలా కన్పిస్తోంది. రాజ-పురోహితుడు గానీ (King -Priest) పురోహిత-రాజుగానీ (Priest-King) ఈ రాజ్యాన్ని పాలించి వుండాలి.

ధనవంతుల మేడలూ, వ్యత్తిపనివారూ దుకాణదార్లాంటి సామాన్యుల గుడిసెలూ, నగర సరిహద్దుల్లోపలే ప్రక్క-ప్రక్కనే వున్నాయి. "నగరం మధ్య భాగంలో వున్న భవనాల్లో, పాలకులూ మతగురువులూ వర్తకులూ ఉన్నతశ్రేణికి జెందిన వ్యత్తిపనివారూ వుండేవారు. గుడిసెల్లో జీవించిన పేదప్రజలు, నగరానికి బయట వుండేవారు. ప్రభుత్వానికి చెందిన బ్రహ్మాండమైన ధాన్యాగారాలు నింపడం, పాలకవర్గాలకి అవసరమైన చాకిరీ చేయడం, ఈ కూలీల వ్యత్తిగా వుండేది. ఆటవిక తెగలకి చెంది, యింకా హీనవృత్తులు చేసే ప్రజలు, నగరానికి మరింత దూరంగా వున్నప్రాంతంలో జీవించారు."(Society and History-Amita Ray-page 129)

క్రీ. పూ. 5వేల సంవత్సరాలనాడు పశ్చిమాసియా దేశాల్లోవున్న రాజుల్లాంటి పాలకుడు (రాజ-పురోహితుడు) సింధు రాజ్యానికి మూలస్తంభంగా వుండివుండాలి. అత్యంత ఆశ్చర్యకరమైన విషయమేమంటే, మొహెంజొదారో-హరప్పా నగరాల్లో, రాజప్రాసాదమని పిలవడానికి వీలైన ఏ భవనమూ కన్పించలేదు. శ్రీమంతుల భవనాలకి ప్రక్కనే దుర్గప్రాకారం లాంటిది కన్పించినా, యిది- మిగతా ప్రాంతాన్నంతటినీ డామినేట్ చేసే విధంగా మాత్రం లేదు. అంచేత, సమకాలీన పశ్చిమాసియా దేశాల్లోని రాజులు చలాయించిన నిరంకుశాధికారాన్ని, సింధు రాజు చలాయించి వుండడనీ, ఆతనియొక్క భౌతిక-ఆధ్యాత్మిక-అధికారం, ప్రజా జీవితంపై అత్యల్ప ప్రభావాన్ని మాత్రమే కలిగివుండేదనీ, శ్రీ అమితా రే వ్యాఖ్యానించాడు. ఈకారణం వల్లనే, విశిష్టమైన రాజప్రాసాదం లాంటిది, ఈ రెండు నగరాల్లో కన్పించలేదని శ్రీ రే అభిప్రాయపడ్డాడు. బంగారం, వెండి, రకరకాల అమూల్య రత్నాల రూపంలో అతులితమైన సంపద కేంద్రీకరణ ఈ ఉభయ నగరాల్లో కన్పించినా, ఈజిప్ట్‌లోని రాజప్రాసాదాల్లాంటి భవన నిర్మాణానికి గానీ, మెసపొటేమియా లోని జిగ్గురాత్

దేవాలయాల్లాంటి ఆలయనిర్మాణానికిగానీ, ఈసంపదను వినియోగించినట్లు కన్పించదు. (సొసైటి అండ్ హిస్టరి-పేజి 130)



మతగురువు

మొహెంజొదారోలో లభించిన - గడ్డం వున్న ఈ మతగురువు చిత్రం, చారిత్రకంగా అత్యంత ప్రధానమైంది. ఈ బొమ్మలు-మెసపొటేమియా లోని మత గురువులైన "షామాన్స్" చిత్రాలుగా గుర్తించబడ్డాయి. ఎంబ్రాయిడరీ చేయబడిన

ఉత్తరీయం ధరించిన యీ మతగురువు, ఖచ్చితంగా సుమేరియన్ ఆరిజిన్‌కి చెందిన వాడని చరిత్రకారులు నిర్ణయించారు. యీతని గడ్డమూ, గొరిగిన పై పెదవీ, శిరో ముండనమూ, (doing of the hair) యివన్నీ సుమేరియన్ మతగురువుల వేష ధారణకి చెందినవేనని చరిత్రకారులు చెప్పారు. ఈతడు కప్పుకొన్న వస్త్రంపై పవిత్రమైన trefoils (త్రికోణాకారం గల గుర్తులు) వుండడం ప్రత్యేకంగా గమ నార్హం. నేటి బ్రాహ్మణ పురోహితులూ, నాటి బౌద్ధ భిక్షువులూ ఎడమ భుజంపై వేసుకొనే అంగవస్త్రం లాంటి దాన్ని, ఈ మతగురువు ధరించడం పాఠకులు ప్రత్యే కంగా గమనించాలి. అలాగే, నొసటిపై లిపి సంకేతంతో వున్న బిళ్ళను గూడా పాఠకులు గమనించాలి.

అర్బన్-గ్రామీణ-సంస్కృతుల కలయిక

చిత్ర విచిత్రంగా నగిషీ చేయబడిన మట్టిపాత్రలూ, ముద్రికలూ, గడ్డమున్న మతగురువులూ, నాట్యం జేసే హరప్పా పురుషుడూ యిత్యాదులు, పాలకవర్గాల సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. మట్టితో చేసిన స్త్రీల నగ్న విగ్రహాలూ, రకరకాల జంతువుల బొమ్మలూ, మొహెంజొదారో నాట్యకత్తె నగ్న విగ్రహమూ యిత్యా దులు, దేశీయమైన (indigenous) గ్రామీణ-ఆటవిక సంస్కృతిని ప్రతిబింబిస్తాయి.

సింధు నాగరికతకీ, మెసపొటేమియా నాగరికతకీ ఖచ్చితమైన సంబంధ మున్నదనే విషయం నిర్వివాదమైనా, మెసపొటేమియన్ సంస్కృతి మొత్తంగా-యధాతధంగా- ఇండియాలో విస్తరించిందని భావించగూడదు. ఎందుకంటే, గ్రామీణ దశకి వెళ్ళినప్పుడు, దేశీయమైన ప్రభావం కొట్టవచ్చినట్లు స్పష్టంగా కన్పిస్తుంది.

స్త్రీల మట్టి బొమ్మలూ, జంతువుల చిత్రాలూ, మొహెంజొదారో నాట్యకత్తె విగ్రహం ద్వారా ప్రతిబింబింపబడిన సింధుప్రజా జీవితం, క్రీస్తు శకం కొన్ని శతా బ్దాల తర్వాత గూడా, యధావిధిగా వుండి వుండాలి. ఎందుకంటే, ఈ శిధిలాల్లో లభించిన అనేకమైన స్త్రీల బొమ్మలు, అత్యంత ప్రాచీనకాలం నించి ఉనికిలోవున్న అమ్మతల్లి కి అవశేషాలుగా వుండి, ఈనాటికీ ఇండియాలో వివిధ రూపాల్లో దర్శన మిస్తోన్నాయి.

అంచేత, "ఈ గడ్డపైనే వృద్ధిజెందిన దేశీయమైన ఆటవిక - గ్రామీణ సంస్కృతిని, ఈ అర్బన్ (పట్టణ) నాగరికత తనలో యిముడ్చుకొన్నది." (సొసైటి అండ్ హిస్టరి-పేజి 118)

విధ్వంసానికి కారణాలు

ఈ నాగరికత అంతరించడానికి చరిత్రకారులు రకరకాల కారణాలు చెబుతున్నారు.

1. సింధునది వరదలు.
2. హఠాత్తుగా సంభవించిన ఉపద్రవం.
3. సాంప్రదాయ ప్రియత్వం.
4. ఆర్యుల దండయాత్రలు.

సింధునది వరదలే, ఈ నాగరికత నాశనం కావడానికి ప్రధాన కారణమని కొందరు వాదించారు. అత్యంత ప్రమాదకరమైన వరదలకు సింధునది ఆటపట్టు. వీటివల్ల గ్రామాలకు గ్రామాలూ, నగరాలకీ నగరాలూ కొట్టుకపోయి, ఈ నాగరికత అంతమై వుండవచ్చు. లేదా-సింధుప్రాంత వాతావరణంలో వొచ్చిన మార్పులవల్ల, క్రమేణా పంట భూములపై ఇసకమేటలు ఏర్పడి వుండవచ్చుననీ, మరికొందరు భావించారు. దాదాపు ఐదుసార్లు, మొహెంజొదారో సింధువరదలకు గురిజేయబడింది. కాని,ప్రతిసారీ ఆ నగరం శిధిలాలపై నించి తిరిగి లేచింది: ఉపద్రవకరమైన సింధు వరదలు, వందల ఏళ్ళ పాటు ఈ ప్రాంతంపై దాడి జేశాయని విజ్ఞాన శాస్త్రవేత్తలు ధృవీకరించారు. అయితే, పదిమీటర్లఎత్తు, 20 మీటర్ల వెడల్పూ వున్న పెద్ద రాతి ఆనకట్ట,యిటీవలనే యిక్కడ కనుగొనబడింది. ప్రకృతి వైపరీత్యాలకి వ్యతిరేకంగా నాటి సింధుప్రజలు సాగించిన నిరంతర పోరాటానికి, ఈ ఆనకట్ట ఎదురులేని చిహ్నం.

దుర్గ ప్రాకారాలూ, నగర రక్షణకి చెందిన ఏర్పాట్లూ, చాలా పేలవంగా వున్నాయనీ, ఎంతో బలహీనమైన ప్రభుత్వ యంత్రాంగం అమల్లో వున్నట్లు కన్పించదనీ, మొహెంజొదారోలో నాసిరకం బల్లేలు బయల్పడ్డాయనీ, ఖడ్గాలు అసలే కన్పించలేదనీ కొందరు చరిత్ర పండితులు చెప్పారు. "ఈ నాగరికత అంతం హఠాత్తుగా సంభవించింది. మొహెంజొదారోకి నిప్పు పెట్టబడింది. ఆ నగర పౌరులు ముక్కలకింద నరకబడ్డారు. చిత్రవధ తర్వాత జరిగిన ఆక్రమణ చాలా స్వల్పమైంది," అని కొశాంబి అన్నాడు. (కల్చర్ అండ్ సివిలిజేషన్ గ్రంధం-పేజి-55)

సింధుప్రజల్లోని సాంప్రదాయ ప్రియత్వం, ప్రగతి నిరోధకంగా తయారై ఈ నాగరికత స్వభావసిద్ధంగానే క్షీణించిందని సుప్రసిద్ధ పురాతత్వ శాస్త్రవేత్తయైన

స్టువర్ట్ పిగట్ అభిప్రాయపడ్డాడు. ఈ జంట నగరాలు ఆది నించి అంతందాకా, ఏ మార్పూ లేకండా వున్నాయనీ, పాత్ర సామగ్రీ, పరికరాల నమూనాలూ, ముద్రికలూ వొకే రకంగా వున్నాయనీ, లిపి సైతం మారలేదనీ, నగర నిర్మాణ నమూనాలు సైతం మార్పూ చేర్పూ లేకండా మిగిలిపోయాయనీ ప్రొఫెసర్ కొశాంబీ వ్యాఖ్యానించాడు. ఈ నాగరికతకి సమకాలికమైన ఈజిప్ట్‌లో, డజన్ రాజవంశాలు మారగా, మెసపొటేమియాలో సామ్రాజ్యాలు స్థాపింపబడి కూలిపోగా, ప్రతి మెసపొటేమియన్ నగరరాజ్యం తీవ్రమైన మార్పులకు లోనుకాగా, సింధు సాంఘిక వ్యవస్థ మాత్రం, ఎదుగూ బొదుగూ లేకండా పూర్తిగా ఘనీభవించిందనీ, యీ ప్రగతిశీల రాహిత్యమే యీ నాగరికత పతనానికి దారితీసిన కారణాల్లో ప్రముఖమైందని ప్రొఫెసర్ కొశాంబీ అన్నాడు. (పై గ్రంధం-పేజి 63)

ఆర్యులే ఈ నాగరికతను ధ్వంసం చేశారు

ఆర్య దండయాత్రల ఫలితంగా, ఈ నాగరికత ధ్వంసమైందని అత్యధిక సంఖ్యాకులైన చరిత్రకారులు చెబుతున్నారు. వర్తక వాణిజ్యాలకే పరిమితమైన నాటి సింధునగరవాసులు, ఆర్యదండయాత్రల తాకిడికి, సహజంగానే తట్టుకోలేక పోయారు. సింధు శిధిలాల్లో బయల్పడిన స్త్రీల-పసిబిడ్డల-మృత కళేబరాలు, ముక్క-ముక్కల కింద నరకబడినట్లు కన్పించాయి.

రుగ్వేద ఆర్యుల ప్రధానదైవమైన ఇంద్రునికి- "పురందరుడు" (పురాలు నిర్మాలించినవాడు) అనే బిరుదు వుందనీ, అంచేత అతడు నిర్మాలించిన పురాలు, మొహెంజోదారో-హరప్పాలు కావచ్చుననీ వీరు దాఖలాలు చూపిస్తున్నారు. అంతే గాదు-"హరియూపియ" వొద్ద, వృచీవంతుల్ని ఆర్యులు ఓడించినట్లు వర్ణించబడింది. కాబట్టి, ఈ హరియూపియాయే హరప్పా యని వీరు వాదిస్తోన్నారు. దీనితోబాటు, బ్రాహ్మణాలలో "వినష్టగ్రామము" అనే అర్థాన్నిచ్చే అర్మ అర్మక అనే పదాలు, అతి తరుచుగా కన్పిస్తోన్నవి గాబట్టి, సింధు నగరాల్ని ఆర్యులే నాశనం జేశారనే వాదాన్ని మరింతగా బలపరుస్తోన్నాయి. రుగ్వేదం ఆరవ మండలంలో, ఇంద్రుడు

నిర్మాలించినట్లు వర్ణించబడ్డ "దస్యు" నగరం- "హరియూపియ"- హరప్పాయే కావొచ్చుననీ; రుగ్వేదం వొకటో మండలంలో అగ్నిచే ధ్వంసమైనట్లు పేర్కొన బడిన "నార్మని" - మొహెంజొదారో కావచ్చుననీ చరిత్ర పరిశోధకులు గట్టిగా భావిస్తున్నారు.

ఇంద్ర - వృత్ర యుద్ధం

రుగ్వేదంలో ఇంద్ర-వృత్ర (వృత్రాసురుడు) యుద్ధ రూపంలో, ఈ భయంకర సంఘర్షణ గూర్చి మనకు ఛాయామాత్రంగా తెలుస్తుంది. దీనినే ఇంద్ర-శంబర యుద్ధంతో కలిపివేశారు. భరతులూ యిత్యాది ఆర్యగణాలతో కలిసి, దివోదాసు కిరాత శంబరునితో నలభై సంవత్సరాలు భయంకరమైన యుద్ధం జేసి విజయం సాధించాడు. "40 ఏళ్ళకు పైగా శంబరుని తోనూ, ఆతని సహచరుల తోనూ ఆర్యులు యుద్ధం జేశారు. దీనినే రుగ్వేదంలో "దస్యుహత్య" అని పేర్కొన్నారు. రుగ్వేదంలో శంబరుని యుద్ధాన్ని గూర్చి అధికంగా చెప్పబడింది. ఇది- ఇంద్ర పూజకులకూ, లింగ పూజకులకూ మధ్య జరిగిన యుద్ధం. దీనిలో చివరికి దస్యులు పూర్తిగా ఓడిపోయారు." (రాహుల్- రుగ్వేద ఆర్యులు-పేజి 106)

వరదలు రాబోయేముందు నదులకూ ఏర్లకూ అడ్డుకట్టలు కట్టి, ద్రావిడ-ఆదిమజాతులకి చెందినవారు (అసురులు) కాలవలు పాలించేవారు. అలా తడిచిన నేలపై విత్తనాలుచల్లి వ్యవసాయం జేసేవారు. అసుర జీవనాధారమైన ఈ ఏరువాకల వల్ల, అప్పుడప్పుడు ఆర్య గోగణానికి చెందిన పచ్చికబీళ్ళు మునిగిపోయేవి. తత్ఫలితంగా ఆలమందలకి గ్రాసం లేక చిక్కిశల్యమయ్యేవి. తద్వారా వైదికార్యుల మనుగడకే ఘోరమైన ప్రమాదం వాటిల్లేది. అంచేతనే, ఈ ఉభయుల మనుగడకి మూలమైన ఏరువాకల వొద్ద ఘర్షణ పుట్టి, యుద్ధాల దాకా వెళ్ళేది. ఈ యుద్ధాలే- కిరాత నాయకుడైన వృత్రునికీ, ఆర్య నాయకుడైన ఇంద్రునికీ మధ్య జరిగిన యుద్ధాలుగా రుగ్వేదంలో వర్ణించబడ్డాయి.

"నల్లగా పాములా మెలికలు తిరిగి, ఏటి కడ్డంగా వృత్రుడు పడుకొన్నాడు. ఆతడు ఈవిధంగా జలాల్ని బంధించడం వల్ల, గడ్డి భూములన్నీ మునిగిపోయి పశుగణానికి ప్రమాదం ఏర్పడింది. కాబట్టి ఓ ఇంద్రా- ఆ వృత్రుణ్ణి సంహరించి మాకు

అన్నపుష్టి కలిగించు'' అని అర్థమొచ్చే రుక్కులు మనకు రుగ్వేదమంతా కన్పిస్తాయి. ఈ ఇంద్ర-వృత్ర యుద్ధాలు, అసుర సమాజ అస్థిరత్వానికి మూలమైన వారి పురాలను సమూల విధ్వంసం జేసేంతవరకూ జరిగాయి. నాటి సమస్త ఆర్యగణాలూ తమ బలాన్ని సంఘటిత పరచుకొని, ఈ పురాల్ని సర్వ నాశనం జేసివేశాయి. నాటి నించే ఇంద్రునికి ''పురహంత'' ''పురంధర'' అనే బిరుదులు వొచ్చాయి.

అంచేత, సింధు నాగరికతను ధ్వంసం జేసింది- సెంట్రల్ ఏషియా నించి వొచ్చిన ఆర్యులే. వారి ప్రధమ గ్రంధమైన రుగ్వేదమే, ఈ నాగరికత విధ్వంసానికి చెందిన వివరాల్ని సాధికారికంగా యివ్వగల ప్రమాణ గ్రంధం. రుగ్వేదంలో తమ శత్రువులైన దస్యులను, కృష్ణ వర్ణులనీ (నల్లని రంగు గలవారు) అనాసులనీ, మృధ్రవచనులనీ (అబద్ధా లాడేవారు) అవ్రతులనీ, శిశ్న దేవులనీ (లింగపూజకులు) ఆర్యులు తిట్టిన తిట్లు, పూర్తిగా సింధు ప్రజలైన ద్రావిడ-ఆదిమజాతులకు వర్తిస్తాయనడంలో ఆవగింజంత సందేహం వుండనవసరం లేదు. ఈ వర్ణనల వల్ల, రంగు-శరీర నిర్మాణం, భాష, మతం యిత్యాది విషయాల్లో, ఆర్యులూ ద్రావిడులూ భిన్నమైన వారని నిరూపించడానికి, రుగ్వేదమే మనకు పరమ ప్రమాణమైన గ్రంధం:

''వాస్తవానికి- సింధు నాగరికతను ఆర్యులు ధ్వంసంజేసి, సమాజ చక్రాన్ని వెనక్కి తిప్పటానికి యత్నించారు.'' (రాహుల్ సాంకృత్యాయన్-రుగ్వేద ఆర్యులు- పేజి-40)

''సప్తసింధు ప్రాంతంలో ఆర్యులు కాలుపెట్టడం, శాంతియుతంగా జరగలేదు. తమకన్న అధికులైన నాగరికులతోనూ, నాగరికులు గాబట్టి తమకన్న మృదు స్వభావం గల వారితోనూ, క్రీ. పూ. 1500 ప్రాంతంలో ఆర్యులు భయంకరమైన యుద్ధం జేశారు. ఈ భీకర హత్యాకాండకి జెందిన అవశేషాలు హరప్పాలో దొరికాయి. మోర్టిమర్ వీలర్- తన ''ఇండస్ వ్యాలీ సివిలిజేషన్'' అనే గ్రంధంలో ఈ విషయాన్నే రాశాడు.'' (రుగ్వేద ఆర్యులు- పేజి-39.)

విదేశీయులైన ఆర్యులు దేశదిమ్మరులు. విజేతలైన ఆర్యులు పశుపాలకులు. పశుపాలకులైన ఆర్యులకు నగరాల ఉపయోగం ఏమాత్రం లేదు. అంచేత వాటిని సహజంగానే వారు నాశనం జేశారు. ఆ నగరాల పరిసరాల్ని, పొలాల్ని, పచ్చిక బయళ్ళుగా మార్చివేశారు. గుర్రాలూ గోవుల్నే అమూల్యంగా భావించి, వాటికొరకే

తమ దేవతల్ని భక్తి శ్రద్ధల్తో స్తుతించిన ఆర్యులు, సహజంగానే నగరాల్ని నాశనం జేశారు.

ఆర్యులు తమవెంట తెచ్చుకొన్న దేశదిమ్మరి జీవితాన్ని స్థాపించుకున్నారు. చెంఘిజ్‌ఖాన్ మంగోలుల వలె, ఆర్యులు నగరజీవితాన్నీ నాగరిక జీవితాన్నీ ఏవగించుకొనేవారు. మానవ చరిత్రలో మహోజ్వల స్థాన మాక్రమించి, భారతీయ సంస్కృతికి నాంది పల్కిన సింధు నాగరికతను ధ్వంసం జేసిన ఆర్యులు, ఇండియాకి గుర్రం తప్ప మరే వస్తువునూ యివ్వలేకపోయారు. "మొహెంజొదారో-హరప్పా యిత్యాది ఎన్నో నగరాల్ని ధ్వంసం జేసిన తర్వాత, సప్తసింధులో గెల్చుకొన్న భూమిని, పశుపాలకులైన ఆర్యగణాలు తపులో తాము పంచుకొని, దాన్ని గోచర భూమిగా (పచ్చికబయలు) మార్చివేశారు. ఎన్నో నగరాలు నిర్మానుష్యమై పాడుపడిపోయాయి. గ్రామాల్లోని అనేకమంది తూర్పు దక్షిణాలకి పారిపోయారు. మిగిలిన వారిని ఆర్యులు తమ దాసులూ సేవకులుగా జేసుకున్నారు. మొహెంజొదారో ప్రాంతాన్ని అనామకమైన ఏ ఆర్యగణమో పాలించివుంటుంది. అంచేతనే, దాని పేరు రుగ్వేదంలో రాలేదు." (రుగ్వేద ఆర్యులు - పేజి-42.) కాబట్టి, పశుపాలకులైన ఆర్యులే, పాశవిక ప్రవృత్తితో ఈ నాగరికతను దుంపనాశనం జేశారు.

సింధు నాగరికత విధ్వంసం :

వర్ణవ్యవస్థకి బీజం

సింధు నాగరికత ధ్వంసం చేయబడిన తర్వాత, ఆ ప్రాంతంలో వున్న ప్రజలు ఏమయ్యారు? ద్రావిడ - ఆదిమవాసులపై విజయం గడించిన ఆర్యులు, వారిని యుద్ధఖైదీలుగా పట్టుకొని దాసులుగా చేశారు.

పశుపాలన మినహా వ్యవసాయం తెలియని ఆర్యులకి, ఈ అనార్య దాసుల శ్రమతో అవసరం లేదు. అలాంటప్పుడు ఈ దాసుల్ని ఏంచేయాలి? ఈ ప్రశ్నకి జవాబుగా వొచ్చిందే పురుషమేధం-లేక నరమేధం. మనిషిని దేవతలకు యజ్ఞబలిగా అర్పించడమే- నరమేధం. ఈ విధంగా అవతరించిందే - పురుషమేధం. అయితే, అనార్య దాసుల్ని యజ్ఞ పశువులుగా హత్యచేయడం కన్న వారిని ఉత్పత్తిక్రమంలో బానిసలనుగా వినియోగిస్తే, ఎంతో లాభదాయకంగా వుంటుందని గ్రహించిన తర్వాత,

ఈ నరమేధాలు అంతరించాయి. తత్ఫలితంగా "బానిసకు ప్రాణం వొచ్చింది ; బానిస యజమానికి లాభం కలిగింది." (డాంగే-భారతదేశం) తద్వారా వైదికార్య సమాజంలో కొత్త ఉత్పత్తి శక్తులూ, కొత్త ఉత్పత్తి సంబంధాలు తలెత్తడానికి వీలు కల్గింది. ఈ సాంఘిక పరిణామ క్రమంలో తలయెత్తినదే-వర్ణవ్యవస్థ. విజేతలు పరాజితుల పట్ల ప్రవర్తించినట్లే, ఆర్యులు ఈ ద్రావిడ-ఆదిమవాసుల పట్ల వ్యవహరించారు. ఆర్యులు వారికి దస్యులనీ దాసులనీ పేర్లు బెట్టి, వర్ణవ్యవస్థలో వారిని శూద్రులుగా మార్చివేశారు.

సింధు నాగరికతకి సమకాలీనమైన ఈజిప్ట్ - మెసపొటేమియా- నాగరికతల స్వరూప స్వభావాల్ని ప్రస్తుతం పరిశీలిద్దాం.

2. ఈజిప్ట్ నాగరికత

(క్రీ. పూ. 5000 - క్రీ. పూ. 525)

భౌగోళికంగా ఈజిప్ట్‌ను డెల్టా ప్రాంతం-లోయ ప్రాంతంగా విభజించవొచ్చు. క్రీ. పూ. నాలుగువేల సంవత్సరాల నాటికి, ఈజిప్ట్‌లో మొట్టమొదటగా బానిస యజమానుల రాజ్యాలు అవతరించాయి. ఆనాడు దాదాపు నలభై రాజ్యాలు ఉనికిలో వున్నాయి.

బానిస యజమానులు తమ పొరుగునవున్న రాజ్యాల్లోని బానిసల్ని, పశు సంపదల్ని స్వాధీనం జేసుకోవడానికి నిరంతరం ప్రయత్నించేవారు. ఇందుకోసం ఈజిప్ట్‌లోని రాజ్యాలు, తరచు యుద్ధాల్లో మునిగితేలు తుండేవి. ఓడిపోయిన రాజు యొక్క భూభాగాల్ని సంపదల్ని, గెలిచిన రాజు తన భూభాగంలో కలిపివేసు కొంటుండేవాడు. ఈ పరిణామక్రమంలో, ఈజిప్ట్‌లో నైలునది లోయలో వొక రాజ్యమూ, నైలు డెల్టా ప్రాంతంలో మరొక రాజ్యమూ - రెండు పెద్ద రాజ్యాలు ఆవిర్భవించాయి. క్రీ. పూ. నాలుగువేల సంవత్సరాల అంతానికి, ఉత్తర ఈజిప్ట్‌కి చెందిన మినీజ్ రాజు, నైలునది డెల్టా ప్రాంతాన్ని స్వాయత్తం జేసుకొన్న ఫలితంగా, క్రీ. పూ. 3000 లో ఈజిప్ట్ సామ్రాజ్యం స్థాపించబడింది. నైలునది లోయ నుండి మెడిటరేనియన్ సముద్రం వరకూ వ్యాపించిన ఈ సువిశాలమైన సామ్రాజ్యానికి, మెంఫిస్ రాజధానిగా వుండేది. ప్రాచీన ఈజిప్ట్ రాజుల్ని, ఫేరోలు అని పిలిచేవారు.

ఈజిప్ట్ ఫేరోలు

ప్రాచీన ఈజిప్ట్‌లో రాజును - దేవుని ప్రతినిధిగా, దైవాంశ సంభూతునిగా పరిగణించారు. అతడు సూర్యుని రూపమైన "రా" దేవుని కుమారుడుగా భావించి, "ఫేరో" అని పిలిచేవారు. ఫేరో అనే శబ్దం, "పెర్-ఒ" అనే ఇజిప్షియన్ పదాల నించి జనించింది. ఫేరో-అంటే-రాజప్రాసాదం అని అర్థం. దేవుని ఆదేశరూపమైన పురాతన న్యాయ విధులకు కట్టుబడి, రాజు దేశాన్ని పాలిస్తాడని నాటివారు విశ్వసించే వారు. న్యాయ చట్టాల్ని, సాంఘిక కట్టుబాట్లనీ, దేవుని శాసనాలుగా భావించేవారు. సామాన్య ప్రజలే గాక, భూస్వాములు (Nobles) సైతం నాటి ఫేరోలకి సాష్టాంగ దండప్రణామం గావించి, వారి అడుగుజాడల్ని సైతం ముద్దుపెట్టుకొనేవారు. ఫేరో తన చెప్పుల జతలో వొకదాన్ని ఎవరైనా ముద్దు పెట్టుకోవడానికి అనుమతిస్తే, అది-అత్యంత గౌరవప్రదమైనదిగా భావించబడేది ! ఫేరో పదవి - వంశపారంపర్యమైనది. రాజ్యాన్ని 42 నోమ్స్‌గా (జిల్లాలుగా) విభజించి, ప్రతి నోమ్‌కు వొక నోమార్క్-ను నియమించేవారు.

సాంఘిక జీవితం : వర్గ విభజన

ప్రాచీన ఇజిప్షియన్ సమాజంలో, భయంకరమైన ఆర్థిక వ్యత్యాసాలుండేవి. అయినా నిర్ణీతమైన కులాలు మాత్రం లేనేలేవు. ధనికులు అతులిత భోగలాలస సంపదల్తో కులుకుతుంటే, పేదలు అత్యంత నికృష్టమైన జీవితం గడిపేవారు. ప్రత్యేకంగా-నాటి సమాజంలో ఉనికిలో వున్న బానిసత్వాన్ని వర్ణించేందుకి భాష చాలదు. నాటి సాంఘిక వ్యవస్థలో, రాజకుటుంబంలోని స్త్రీలు ప్రధాన స్థాన మలంకరించారు. వారు సింహాసనం అధిష్ఠించడానికి సైతం అర్హులు. రాజవంశస్తుల రక్తం "కలుషితం" గాకుండా రక్షించే ఉద్దేశంతో, ఫేరో తన సోదరినే వివాహ మాడేవాడు. ఈ అన్నా-చెల్లెళ్ళ పెళ్ళి, సామాన్య ప్రజల్లో గూడా వుండేది. నాటి సాంఘిక వ్యవస్థలో ఎవ్వరూ వొక్క- భార్యను మించి, వివాహమాడ గూడదు.

పరిపాలనా విధానం

ప్రాచీన ఈజిప్టులో పరిపాలనా విధానం ఈ క్రింది విధంగా వుండేది : ఫేరో చేతిలో యావత్ అధికారమూ కేంద్రీకృతమై వుండేది. ఈతడు Priest-King ; లేదా King-Priest. శిస్తు వసూలు -వ్యవసాయం - సైనిక వ్యవహారాలు - అని

మూడు ప్రధాన విభాగాలుగా పరిపాలన విభజింపబడి వుండేది. ఈ మూడు విభాగాలకూ, ముగ్గురు ప్రధాన అధికారుల్ని (Chiefs) ఫేరో నియమించేవాడు. వీరంతా ప్రభువర్గాలకి చెందినవారు. శిస్తు వసూళ్ళకీ, వ్యవసాయ పనులకీ, బాధ్యులైన ప్రధాన అధికారుల కింద, వేలాదివేల ఉద్యోగులు (లేఖకులు - ప్రాయసగాళ్ళు- Officials) పనిచేసేవారు. ఈ ఉద్యోగుల పర్యవేక్షణలో అనేక వేలమంది గార్డులూ, ఓవర్‌సీర్లూ, జైలు గార్డులూ పనిచేసేవారు. వీరేగాక, సైనిక వ్యవహారాల శాఖాధిపతి కింద (The House of Weapons) మిలిటరీ కమాండర్లూ యుద్ధవీరులూ వుండేవారు. (Ancient History-Korovkin _ Page-38.)

వొక్కొక్క రైతుకు ఎంత భూమీ పశువులూ వున్నవో, అతని తోటలో ఎన్ని ఫలవృక్షాలూ ద్రాక్షతీగ లున్నవో, ప్రభుత్వోద్యోగులు లెక్కలు రాసేవారు. వీరు (ఇండియాలోని కరణాల వలె) రాసిన లెక్కల ప్రాతిపదికగా, రైతులు శిస్తులు చెల్లించేవారు.




ప్రాచీన ఈజిప్టులో శిస్తు వసూలు

చంకలో దుడ్డుకర్రలు పెట్టుకొన్న ఓవర్‌సీర్లు, శిస్తు చెల్లించని రైతుల్ని ఆఫీషియల్స్ (లేఖకులు) వొద్దకి లాక్కుపోతున్నారు. వొక్కొక్క రైతు, ఎంత బాకీ పడ్డాడో ఈ ఆఫీషియల్స్ లెక్కలు రాసుకుంటున్నారు.

రైతులు వస్తురూపంలో శిస్తు కట్టేవారు. దేశం మొత్తంలో, ఫేరోకి చెందిన బ్రహ్మాండమైన ధాన్యాగారా లుండేవి. శిస్తు చెల్లించడానికి రైతులు తెచ్చిన వస్తువులూ, ధాన్యమూ, వీటిలో నింపబడేవి. శిస్తు చెల్లించడంతో పాటు, ఫేరో శాసించిన రకరకాల పనుల్ని (వెట్టి చాకిరి) సైతం, ఎంతకాలం అవసరమైతే అంతకాలమూ రైతులు చేసి తీరాలి. తరచుగా వీరు కాలవలూ ఆనకట్టలూ నిర్మించేవారు. వాటిని రిపేరు జేసేవారు.

రాజద్రోహాల్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టు

ైెతులూ బానిసలూ రాజాధికారానికి గులాములుగా ఫండేందుకు, అత్యంత దారుణమైన శిక్షల్తో బానిస యజమానులు వారిని భీతిగొల్పేవారు. "రాజుకి వ్యతిరేకంగా కుట్ర పన్నినవాణ్ణి పూర్తిగా అంతం జేయాలి. వాని బంధుమిత్రుల్ని సైతం మట్టుబెట్టి, వాణ్ణి చరిత్ర నించి తుడిచిపెట్టి, ప్రజలు వాణ్ణి మరిచిపోయేట్లు చేయాలి" అని, వొక ఫేరో తన కుమారునికి సూచన లిచ్చాడు: "మనకు అత్యంత ప్రమాదకరమైన శత్రువులు–పేదలే"నని ఆ రాజు తన కొడుకును హెచ్చరించాడు: (Our most dangerous enemies are poor) "పేదలు మీరంతే హడిలి చచ్చేట్లు ప్రవర్తించండి" అని, రాజు తన ఉద్యోగులకీ, మిలిటరీ కమాండర్లకీ ఆజ్ఞ లిచ్చాడు.



రుణగ్రస్తుల్ని దుడ్డుకర్రల్తో చావబాదడం

'నేరస్తుల్ని' దుడ్డుకర్రల్తో చావబాది, జైళ్ళలో కుక్కేవారు. వారి ముక్కూ చెవులూ నిర్దాక్షిణ్యంగా కోసిపేసేవారు. "భయోత్పాతంతో ఆ మూకల్ని హడలగొట్టాను. ఖైదీని జుట్టుపట్టి కిందకి ఈడ్చిపేశాను. తిరగబడ్డవాడు తన తప్పులు ఒప్పుకొనేట్లు వాడి ఎముకలు విరిచిపేశాను" అని వొక అఫీషియల్ తాను జరిపిన కిరాతకకాండను గూర్చి గర్వంగా గొప్పలు చెప్పుకొన్నాడు. అంటే, తిరగబడినవాణ్ణి ఆనాడు భీకరమైన చిత్రహింసలకి గురిజేసేవారన్న మాట.

దోపిడీ సొమ్ములో పాలకవర్గాలకి వాటాలు

ైెతులూ బానిసల పట్ల యింత అమానుషంగా ప్రవర్తించిన నాటి ఫేరోలు, తమ సైనికాధిపతులకీ యితర రాజోద్యోగులకీ అమూల్యమైన కానుకలు ప్రసాదించేవారు: భూమీ–బానిసలూ–పశువులతో వారిని "సత్కరించే"వారు: "నీ సామంతుల్ని బాగా లాలించు; నీ వీరుల్ని ఉన్నత పదవులకి ప్రమోట్ చెయ్యి; వారికి భూమినీ పశుసంపదనీ యివ్వు" అని వొక ఫేరో తన కుమారునికి రాశాడు. ప్రతి

దండయాత్ర తర్వాత, ఫేరో తన యుద్ధవీరులకీ, మిలిటరీ కమాండర్లకీ భూమినీ బానిసల్నీ బంగారాన్నీ బహూకరించేవాడు. తత్ఫలితంగా ఈ సేనాధిపతులు తెగబలిసిన బానిసయజమానుల్లా తయారయ్యారు.

వేలాదివేల అఫీషియల్స్, యుద్ధవీరులూ, గార్డుల అండదండల్తో పరిపాలించబడ్డ ప్రాచీన ఈజిప్టు రాజ్యం రైతులూ బానిసలూ వ్యత్తిపనివారికి వ్యతిరేకంగా బానిసయజమానుల- పూజారివర్గాల అధికారాన్నీ, వారి ప్రయోజనాల్నీ అనుక్షణమూ కాచి కాపాడింది.

వ్యవసాయ-వాణిజ్యాలు

ప్రాచీన ఈజిప్టులోని ఆర్థిక వ్యవస్థ, ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి వుండేది. లక్షలాది రైతులూ బానిసలూ వేలసంవత్సరాల పర్యంతం, రాత్రింబగళ్ళూ శ్రమించిన ఫలితంగా నైలునదీ లోయ, కనకరాసుల్ని పండించే సస్యశ్యామల భరితమైన సుక్షేత్రంగా మారిపోయింది. రోగాలకి నిలయమైన చిత్తడి నేలలూ, వన్యమృగాలకి కేంద్రమైన కీకారణ్యాలూ, క్రీ.పూ. 2 వేల ఏళ్ళనాటికి పూర్తిగా అదృశ్యమయ్యాయి. వాటి స్థానంలో, పాము మెలికల్లా వంకర టింకరగా ప్రవహించే కాలవలు దేశమంతా వెలిశాయి. పెరటిదొడ్లలో కూరగాయలూ, పొలాల్లో గోధుమ-బార్లి-పళ్ళు- పత్తి పుష్కలంగా పండేవి.

క్రీ.పూ. 2000 తర్వాత, క్రీట్, ఫినీషియా, సిరియా, పాలస్తీనా దేశాల్తో ఈజిప్టు వ్యాపారం వృద్ధిచెందింది. వస్త్రాలు, అద్దాలు, మట్టిపాత్రలు తయారుచేయడం, నౌకా నిర్మాణం, నాటి ప్రధాన పరిశ్రమలు. లెక్కలు రాసి రసీదులు యివ్వడం ద్వారా, నాటివారు వర్తక వాణిజ్యాలు కొనసాగించారు.

చేతివృత్తులు

క్రీ. పూ. రెండువేల సంవత్సరాల నాటికి, ఈజిప్టు ప్రజలు చేతివృత్తుల్లో చెప్పుకోదగినంత ప్రగతిని సాధించారు. తగరంతో రాగిని కలపడం ద్వారా, వారు కంచును తయారుజేయ గలిగారు. ఈ కంచుతో పనిముట్లనూ ఆయుధాల్నీ ఉత్పత్తి జేశారు. కంచు పనిముట్లూ, కంచు వస్తువులూ సామాన్య ప్రజలకు పూర్తిగా దూరమై, సంపన్న వర్గాలకి మాత్రమే పరిమిత మయ్యాయి. రకరకాల రంగులు వేసిన గాజు సామగ్రిని ఉత్పత్తిజేసి, వీరు పొరుగుదేశాలకి వాటిని సరఫరా జేసేవారు. వ్యవసాయమూ, చేతివృత్తులూ, నిర్మాణ పద్ధతులూ, వివిధ శాస్త్రాల అభివృద్ధికి ఎంతగానో దోహదం జేశాయి.

శాస్త్రాభివృద్ధి

నాటి ఇజిప్షియనులు ఖగోళ-గణిత శాస్త్రాల్లో గణనీయమైన ప్రావీణ్యం గడించారు. నైలునది వరదలకి చెందిన అంశాల్ని అధ్యయనం చేయడానికీ, కాలవలూ వంతెనల వంటి నీటిపారుదల సౌకర్యాలు కల్పించడానికీ, రాజులకి పిరమిడ్లూ, దేవుళ్ళకి గుళ్ళూ కట్టడానికీ, ఈ శాస్త్రాల్ని వినియోగించారు. అంకగణితాన్ని (ఆర్థమెటిక్) రేఖా గణితాన్ని (జామెట్రి) వృద్ధిజేసిన వీరు, వైద్యశాస్త్రంలో నైతం మంచి ప్రగతిని సాధించారు. నాటి ఈజిప్టులో నేత్ర-దంత-ఉదర-వ్యాధుల్ని నయం చేయడానికీ, శస్త్ర చికిత్సకీ ప్రత్యేకమైన నిపుణులుండేవారు. ఆనాటి శాస్త్రవేత్తలు, వొక పంచాంగాన్ని (కేలెండర్‌ను) తయారుజేసి, సంవత్సరాన్ని 12 నెలలూ, 365 రోజులుగా విభజించారు.

హైయిరోగ్లిఫిక్ లిపి

వీరి లిపిని హైయిరోగ్లిఫిక్ లిపి అని పిలుస్తారు. ప్రథమ దశలో వీరు, విషయాల్నీ సంఘటనల్నీ చిత్రాల ద్వారా తెలియజేసేవారు. క్రమేణా వొక ప్రత్యేకమైన పదాన్ని తెలియజేయడానికి, వొక సంజ్ఞను వాడ నారంభించారు. ఉదాహరణకి – "నీరు" అనే పదాన్ని రాయడానికి, అలల యొక్క చిత్రాన్ని గీసేవారు. "పది లక్షలు" అనే పదాన్ని రాయడానికి; అంత పెద్దసంఖ్య పట్ల రెండు చేతులెత్తి ఆశ్చర్యాన్ని వ్యక్తంజేస్తున్న వొక చిన్నమనిషి బొమ్మను గీసేవారు.


యుద్ధ వీరుడు


కొట్టుట


నడచుట


సూర్యుడు


అరచుట

రానురాను ఈ రాతపద్ధతిలో, చిత్ర సంజ్ఞలూ అక్షరసంజ్ఞలూ వర్ణమాల విధానాలూ మిళితమయ్యాయి. చిత్రాల రూపంలో వున్న ఈ సంజ్ఞల్నే (సంకేతాలు) "హైయిరోగ్లిఫ్స్" అని పిలుస్తారు. ఈ రకమైన సంకేతాలు కొన్ని వేల వరకూ, ప్రాచీన ఈజిప్టు యొక్క వ్రాతపూర్వకమైన భాషలో (written Language) వున్నాయి. కాని 750 సంకేతాలు


ఆటు


పోటు

ప్రాచీన ఈజిప్ట్ లిపి

మాత్రమే దైనందిన వ్యవహారంలో వుండేవి. నాటివారు ఈ లిపిని పేపిరస్‌పై (రెల్లుగడ్డి) రాసేవారు.



రాతి పలకలపై చెక్కబడిన హైయిరోగ్లిఫిక్ రాతలు

ఈ విధంగా రాతపూర్వకమైన భాష, ప్రాచీన ఇజిప్షియనుల విజ్ఞానాన్ని భద్రపరచి, భవిష్యత్ తరాలకీ విభిన్న జాతులకీ, అది అందేందుకు ఎంతగానో దోహదం జేసింది. మత విషయాలూ, దేవుళ్ళ పుట్టుపూర్వోత్తరాలకి అధికతర ప్రాధాన్య మిచ్చిన ప్రాచీన ఈజిప్టు సాహిత్యంలో, జానపద సాహిత్యం సైతం బాగా అభివృద్ధి చెందింది.

శ్రామిక ప్రజల జీవన పరిస్థితులు

ప్రాచీన ఈజిప్టు రచయితలు తమ గ్రంథాల్లో నాటి రైతుల జీవన పరిస్థితుల్ని గూర్చి వివరంగానే రాశారు. పొద్దు పొడిచిన దగ్గరనుండి అర్ధరాత్రి వరకూ, వీరు అడ్డమైన చాకిరీ జేసేవారు. రాత్రికి వొచ్చి యింత కునుకు తీసిన తక్షణం, తిరిగి పొలాలకి వారు గొడ్లలా తోలుకవెళ్ళబడేవారు.

పంట బాగా పండక, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను కట్టలేని స్థితిలో, ఈ రైతులు కోతల కాలంలో యమయాతన లనుభవించేవారు. "ఆ దశలో రైతు నెత్తిన పిడుగు పడేది: ప్రభుత్వాధికారి ఆతని పొలంలో కొచ్చి, మొత్తం పంటను లెక్క గట్టేవాడు. దుడ్డుకర్రలూ తాటిమొద్దుల్ని చేతబట్టుకొన్న రక్షకభటులు (గార్డులు) ప్రభుత్వాధికారి వెంట వొచ్చి, "మా ధాన్యం మా కివ్వు" అని రైతు నడిగేవారు. గింజ కూడా లేని ఆ స్థితిలో, రైతును గొడ్డును బాదినట్లు బాదేవారు. రైతునూ, ఆతని భార్యా బిడ్డల్ని గొలుసుల్తో కట్టివేసేవారు." (కొరోవ్‌కిన్–ఏన్షియెంట్ హిస్టరి)

వృత్తిపనివారు

ప్రాచీన ఈజిప్టులో వృత్తి పనివారి (Artisans) జీవితం, రైతుల జీవితం కన్న ఏమాత్రం భిన్నంగా వుండేదిగాదు. క్రీ. పూ. రెండువేల ఏళ్ళ నాటికి,

ఈజిప్ట్‌లో అనేకమంది వృత్తిపనివారుండే వారు. కమ్మరులూ, కుమ్మరులూ, నేతపని వారూ యిత్యాది కష్టజీవులు నివసించే గుడిసెలతో, నాటి ఇజిప్షియన్ నగరాల్లోని వీధులు కిటకిట లాడుతుండేవి. ఈ గుడిసెల్లో జీవిస్తో, తయారుజేసిన రకరకాల సరుకుల్ని యిక్కడే అమ్ముతుండేవారు. ఫారోలకీ, పురోహితులకీ, ప్రభువర్గాలకీ చెందిన కార్ఖానాల్లో మరికొందరు పనిజేసేవారు. ఓవర్‌సీర్లు కిరాతకమైన పర్యవేక్షణలో, అందమైన రాళ్ళతో పాత్ర సామగ్రినీ, దంతమూ నల్లకర్రతో ఫర్నీచర్‌నీ, బంగారు ఆభరణాల్నీ, సుందరమైన వస్తువుల్నీ, ధనిక యజమానుల కోసం వారు తయారుజేసేవారు.

నాటి ఇజిప్షియన్ రచయితలు, ఈ కష్టజీవుల దుర్భరమైన జీవనపరిస్థితుల్ని ఈ విధంగా వివరించారు: "రైతు కన్న వడ్రంగి విపరీతంగా అలిసిపోయేవాడు. చేతులకున్న శక్తి కన్న ఎక్కువగా ఈ వడ్రంగి పనిజేసేవాడు. రాత్రిపూట దీపం పెట్టుకొని గూడా ఈతడు శ్రమించేవాడు." "మగ్గం వొద్ద నడుం వొంచుకొని, దుమ్మునంతా పీల్చుతో, రోజంతా నేతపనివాడు రెక్కలు ముక్కలు జేసుకొనేవాడు. బయటికి వెళ్ళడానికి, తన ఆహారాన్ని (లంచంగా) యిచ్చి, ఆతని పర్మిషన్ తీసుకొని మరీ వెళ్ళేవాడు! అత్యంత వైభవోపేతమైన రాజప్రాసాదాలూ, దేవాలయాలూ నిర్మించే శిల్పికి, కడుపునిండా తినడానికి తిండి సైతం వుండేదిగాదు! ఆతడు ధరించిన వస్త్రాలు - ముక్కముక్కల కింద చిరిగిన చింపిరి పేలికలు మాత్రమే! ఇహ చెప్పులు కుట్టేవాని జీవితం, భాషకీ మానవ వూహకీ సైతం అందని అత్యంత కిరాతకంగా వుండేది. ఆతడు ఎప్పుడూ అడుక్కు తింటుండేవాడు. ఆకలి మంటకి తట్టుకోలేక, తోళ్ళను నములుతుండేవాడు!"

బానిసలు

రైతులూ వృత్తిపనివారూ యింత హృదయవిదారకమైన జీవితం గడుపు తోంటే, గోరుచుట్టుపై రోకటి పోటన్నట్లు, అప్పు చెల్లించలేని స్థితిలో బానిసలుగా చేయబడే భీతి వారిని అనుక్షణమూ వెంటాడుతుండేది.

మొట్టమొదట యుద్ధఖైదీలు మాత్రమే బానిసలుగా చేయబడేవారు. కాని అనంతర దశలో, అప్పు చెల్లించలేని నిరుపేదలు సైతం బానిసల్లా మార్చబడ్డారు. దుర్భరమైన దారిద్ర్యంలో, ఆకలిమంటలతో అల్లాడిపోయిన స్థితిలో, యిన్ని గింజలు అప్పివ్వమని ధనికుల్ని పేదలు అర్థించేవారు. తమ భార్యా బిడ్డల్ని పోషించుకోవ

డానికి, కోతల కాలం తర్వాత గూడా ఈ కష్టజీవులకి ఏమీ మిగిలేది గాదు. వొక్కో సారి విత్తనాటే కాలంలో, వారి వొద్ద ధాన్యం గింజ సైతం వుండేదిగాదు. అట్టి భయానక పరిస్థితుల్లో, సైం ప్రకారం పేదవాడు అప్పు చెల్లించకపోతే, రుణదాత రాజోద్యోగికి ఫిర్యాదుచేసి, రుణగ్రస్తుని బానిసగా అమ్మివేసేవాడు. తెగల పెద్దలకు (Elders) చెందిన క్షేత్రాల్ని, బానిసలు సాగుజేసేవారు. వీరే పటకాలవలు తవ్వి, ఆనకట్టలు నిర్మించేవారు. యజమానుల పశువుల మందల్ని కాసేవారు. బానిస యజమాని వీరిని కొట్టవచ్చు; గొడ్లలా అమ్మివేయవొచ్చు; అమాంతం చంపివేయవొచ్చు; అడిగే నాధుడెవడూ లేడు!

బానిసల తిరుగుబాట్లు

ఫారోల్ని, వారి దేవుళ్ళనీ ధిక్కరించినవారికి, ఫారోలు అత్యంత కిరాతకమైన శిక్షలు విధించినా, ఈజిప్టు పీడిత ప్రజలు పీడకవర్గాలకి వ్యతిరేకంగా భీకరమైన పోరాటాలు జేశారు. దుర్భరమైన వారి జీవన పరిస్థితుల మూలంగా, బానిస యజమానులపై వారు నిప్పులు కక్కేంత ఆగ్రహం ప్రదర్శించారు.

అప్పుడప్పుడూ ఈ శ్రామికప్రజలు సాయుధులై తిరుగుబాట్లు చేసేవారు. గ్రామసీమల్లో రైతులూ, నగరాల్లో వృత్తిపనివారూ తిరగబడగా, వీరితోపాటు బానిసలు గూడా చేయి కలిపేవారు. ఈ తిరుగుబాటుదార్లు రాజధానిని జయప్రదంగా ముట్టడించి, కిరాతకులైన రాజోద్యోగుల్ని బానిసయజమానుల్ని నిర్దాక్షిణ్యంగా శిక్షించి, వారి సంపదల్ని స్వాధీనపర్చుకొనేవారు. అయితే వీరు బానిస వ్యవస్థను మాత్రం నిర్మూలించలేదు. బానిస వ్యవస్థ కన్న అభ్యుదయకరమైన మరో నూత్న సాంఘిక వ్యవస్థగూర్చి, వీరికి తెలియకపోవడమే యిందుకు కారణం. ఈ తిరుగుబాట్ల తర్వాత, బానిసయజమానులు తమ సైన్యాల్ని తిరిగి సమీకరించుకొని, వీటిని అణచివేసి, ఫారోల అధికారాన్ని పునఃప్రతిష్ఠించారు.

క్రీ.పూ. 1750 నాటి తిరుగుబాటు

ఈజిప్టు దోపిడీగాళ్ళ పునాదుల్ని కూకటివేళ్ళతో సైతం కూల్చివేసిన బ్రహ్మాండమైన తిరుగుబాటు క్రీ.పూ. 1750లో జరిగింది. ఈ తిరుగుబాటుకు చెందిన వివరాల్ని, ప్రాచీన ఈజిప్టు రాతప్రతి వొకటి రికార్డు జేసింది. దానిలో యిలావుంది: "మన "రా" దేవుని ద్వారా స్థాపించబడిన రాజాధికారానికి వ్యతిరేకంగా ప్రజలు

తిరగబడ్డారు. గంట సేపట్లో రాజధానీ నగరం ధ్వంసం జేయబడింది. పేదలు రాజును బంధీగా జేశారు. దేశంలోని ప్రముఖులు తప్పించుక పారిపోవడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వోద్యోగులు హత్య జేయబడ్డారు. పన్నుల రెజిస్టర్లు ధ్వంసం చేయబడ్డాయి.

పేదప్రజలు రాజప్రాసాదంలో ప్రవేశించారు. పట్టుబట్టలు ధరించినవారిని, పేదలు దుడ్డుకర్రల్తో బాదుతోన్నారు. అమూల్యమైన వస్త్రాలు నిన్నటిదాకా ధరించిన వారు, యిప్పుడు చింపిరి పేలికలు కట్టుకున్నారు. ధనికులంతా దరిద్రులై పోయారు. ఎద్దుల జత సైతం లేని నిర్భాగ్యులు, నేడు పశువుల మందల యజమానులయ్యారు. నిన్నటి దాకా గింజ లడుక్కొన్నవారు, నేడు మిగతావారికి వాటిని యిస్తోన్నారు. బానిసలు-బానిసయజమాను లయ్యారు. అయ్యో-నా హృదయం ముక్కలై పోతోంది. ఈ బాధల వల్ల నేనెంతగానో పరితపిస్తున్నాను !''

మతం

ప్రకృతిలో జరిగే సంఘటనలూ, నాటి ఆదిమజీవిత విధానమూ, వక్రీకరించబడిన పద్ధతిలో ఈజిప్టు ప్రజల మతవిశ్వాసాల్లో ప్రతిబింబించాయి. పిట్టల్ని కొట్టి, జంతువుల్ని చంపుతూ, వేటయే ప్రధానవృత్తిగా వున్న నాటిదశలో, దేవుళ్ళు-మృగాలూ పక్షులుగా వుంటారని వారు ఊహించారు. చెడ్డ దేవుళ్ళు క్రూరమృగాల్లా వుంటారని వారు భావించారు. అనంతర దశలో, జంతువుల-పక్షుల-తలల్తో వుండే మనుషుల్లా, ఈ చెడ్డ దేవుళ్ళు (evil gods) వుంటారని వారు తలచారు.

''రా'' దేవుడు

ఈజిప్టు ప్రజలు 'అమ్మతల్లి'ని పూజించారు. భూమిని-వారు పురుషదేవునిగా భావించారు. ఈ పురుషుని వీపుపై చెట్లు చేములు పెరుగుతాయనీ, పశువులు తిరుగుతాయనీ, వారు నమ్మేవారు. అమ్మతల్లి కడుపులో గ్రహాలూ నక్షత్రాలూ పొదగబడి వున్నాయనీ, ఈ తల్లి ప్రతిరోజూ వొక కుమారుని కంటుందనీ, ఆతడి పేరు ''రా'' అనీ, వారు విశ్వసించారు.

వ్యవసాయం వృద్ధిజెందడంతో, వేడికి మూలాధారమైన శక్తిగా, సూర్యుని వారు పూజించ నారంభించారు. మొక్కలు పెరగడానికి సూర్యరశ్మి ఎంతో అవసరం.











ప్రాచీన ఈజిప్టు దేవుళ్లు


సూర్యదేవుని వారు "రా" (Ra) అనే పేరుతో పిలిచారు. సూర్యోదయమూ, సూర్యాస్తమయమూ, ఎలా జరుగుతున్నవో అర్థం జేసుకోలేని నాటి వారు, ప్రతిరోజూ వొక బంగారు బోటులో తూర్పునుండి పడమరకు ఆకాశం మీదగా సూర్య "భగవానుడు" ప్రయాణిస్తాడనీ, సాయంత్ర మవగానే ఎడారిలో అస్తమిస్తాడనీ భావించేవారు. (ఏడు గుర్రాల రథంపై సూర్యదేవుడు ఆఘమేఘాలపై ప్రయాణిస్తాడని ప్రాచీన హిందువులు విశ్వసించిన విషయం మసందరికీ తెలిసిందే.)

రాజ్యం (State) అవతరణతో, ఈ మతవిశ్వాసం రాజకీయ వ్యవహారాల్లోకి సైతం ప్రవేశించింది. ఈ సూర్య భగవానుని, దేవుళ్ళకి దేవుడుగా పూజించి, ఈజిప్టు రాజులైన ఫేరోలపై సైతం అధికారం చలాయించే ఆదిదేవునిగా వారు భావించారు. ప్రాచీన ఈజిప్టులో, మతం ప్రధాన స్థాన మాక్రమించింది. దేవుణ్ణి సర్వాధికారిగా, రాజును దైవాంశసంభూతునిగా పరిగణించిన నాటి ఇజిప్షియన్ రాజ్యాంగానికి మతమే - మౌలికమైన ప్రాతిపదిక.

నైలునది దేవుడు

నైలునది వరదలు సైతం వారి మతంలో ప్రతిబింబించాయి. వరదలు ఎలా వొస్తాయో నాటి ప్రజలకి తెలియదు. నైలునది దేవుడు వొక గుహలో కూర్చుని, బ్రహ్మాండమైన కూజాతో నీరు పోస్తున్నాడని వారు ఊహించారు: ఈ దేవుడు నైలునదిలో పోసే నీటిపైనే వారి యావత్ జీవితమూ ఆధారపడి వుంది. నది మట్టం బాగా పెరగకపోతే, వారి పొలాలు పండక, బీళ్ళుగా మారిపోతాయి. అప్పుడు భయంకరమైన కరువు కాటకాలు దేశంలో తాండవిస్తాయి. అంచేతనే, సూర్యదేవుణ్ణి ఎలా కొలిచేవారో, అంతటి భక్తిశ్రద్ధల తోనూ నైలుదేవుణ్ణి సైతం పూజించేవారు. తమ పొలాల దగ్గరకి నైలుదేవుడు రావాలని వారు ప్రార్థించేవారు. నైలునదికి వరదలు ప్రారంభమైనప్పుడు, పట్టరాని సంబరంతో వారు పండగ జేసుకొనే

వారు. పస్తులనించి వారిని రక్షించి, వారి మొర ఆలకించినందుకు, నాటి ప్రజలు నైలుదేవుణ్ణి వేనోళ్ళపొగిడి, పదాలూ గీతాల్తో కీర్తించేవారు. (గంగా సింధు యమునా సరస్వతి కృష్ణ గోదావరి యిత్యాది నదుల్ని ప్రాచీన హిందువులు నదీమతల్లులుగా-దేవతలుగా-భావించి పూజించడం గమనార్హం.)



పాప పుణ్యాలపై జడ్జిమెంట్ యిస్తున్న ఓసిరిస్

ఓసిరిస్ దేవుడు సింహాసనంపై కూర్చుని వున్నాడు. ఫేరోలు ధరించే కిరీటాన్ని తన శిరస్సుపై ధరించాడు. రాజాధికారానికి చిహ్నాలైన రాజదండాన్నీ, కొరడానీ తన రెండు చేతుల్తో పట్టుకొన్నాడు. పక్షుల-జంతువుల-తలలు గల్గిన యితర దేవుళ్ళు, మరణించిన వ్యక్తియొక్క గుండెని త్రాసులో తూస్తున్నారు. సింహం ఆకారమూ, మొసలి తలా గలిగిన వొకభూతం, త్రాసువద్ద కూర్చునివుంది. నరకంలోని రాజుకి ఖచ్చితమైన ప్రతిబింబంగా, పరలోకంలోని దేవుణ్ణి, మత గురువులు సృష్టించారనేందుకు, ఈ ఓసిరిస్ జడ్జిమెంట్ ఎదురులేని నిదర్శనం:

ఓసిరిస్

ఈజిప్ట్‌లో ఎండాకాలం చంద్ర నిప్పులు చెరిగేది. ఎడారుల నుండి భయంకరమైన ఇసక తుఫాన్లు వొచ్చి, జనులూ జంతువులూ మలమల మాడిపోయేవారు. మొక్కలన్నీ ఎండిపోయి, యావత్ ప్రకృతీ అమాంతం మరణించినట్లు గోచరించేది. గ్రీష్మరుతువు పోగానే, చల్లని గాలి వీచి, మరణించిన ప్రకృతి పునర్జీవం పొంది నట్లుగా కన్పించేది. ప్రకృతికి చెందిన ఈ సంఘటన, ("ఓసిరిస్" అనే దేవుని సృష్టించడానికి దోహదం జేసింది: ఈతడు ప్రకృతికి చెందిన దేవుడు. (The god of Nature) మెసపొటేమియన్ పురాణాల్లోని "తామూజ్", ఈజిప్టులో ఓసిరిస్‌గా,


ఇండియాలో వసంతుడుగా (మన్మధుడుగా) అవతరించాడు) ఈజిప్ట్ పురాణ గాధ ప్రకారం, వేడిగాలికి చెందిన "సెట్" అనే దేవుడు, ఈజిప్ట్ ఎడారుల నుండి 50 మంది సేవకుల్తో వొచ్చి, పంటల దేవుడైన ఓసిరిస్‌ను చంపేవాడనీ, కాని ప్రకృతి వలె ఓసిరిస్ సైతం తిరిగి జీవం పొందేవాడనీ, నాటి ప్రజలు విశ్వసించేవారు.

ఈ విధంగా పునర్ జీవం పొందిన ఓసిరిస్, మృతుల లోకానికి (Land of the Dead) రాజుగా–న్యాయమూర్తిగా–వ్యవహరించేవాడనివారు భావించేవారు. మరణించిన వారి పుణ్య పాపాలపై ఈతడు తీర్పు చెప్పేవాడు. వొక వ్యక్తి తన జీవిత కాలంలో దేవుళ్ళ ఆజ్ఞల్ని వ్యతిరేకించకపోతే, అతని హృదయం బరువు – తక్కువగా వుంటుందనీ, వ్యతిరేకించిన వాడి గుండె బరువు–ఎక్కువగా వుంటుందనీ వారు నమ్మేవారు; తన రాజ్యంలో పుణ్యాత్ములు మాత్రమే వుంటానికి ఓసిరిస్ అనుమతించేవాడు. ఈ దేవుని రాజ్యంలో పుష్కలంగా నీరూ, మనుషులంత ఎత్తున పెరిగిన గోధుమ మొక్కలూ వుండేవని నాటి ఇజిప్షియన్లు నమ్మేవారు. (హిందువుల స్వర్గంలో కామధేనువూ, కల్పవృక్షమూ, అమృతమూ, రంభా ఊర్వశీ మేనకలూ, సమస్త సౌఖ్యాలూ వుంటాయి) పాపుల్ని ఓసిరిస్ అత్యంత కఠినంగా శిక్షించేవాడు. భయంకరమైన వొక భూతం, పాపుల్ని అమాంతం మింగివేస్తుందని వారు విశ్వసించేవారు. (హిందువుల నరకంలో యముడూ, చిత్రగుప్తుడూ, సలసల కాగే నూనెలో వేయించడమూ, బాగా కాల్చి వాతలు పెట్టడమూ, కూడు లేకుండా ఎండగట్టడమూ, యిత్యాదులన్నీ వున్నాయి)

దేవాలయాలు

ప్రతి దేవాలయం ముందుభాగాన ఎంతో ఎత్తయిన రెండు గోపురాలు (towers)వుండేవి. ఈగోపురాలమధ్యగావున్నయిరుకైనద్వారంగుండా సరాసరి లోపలికి వెళ్ళితే, ఎత్తయిన స్తంభాలపై నిల్చిన వొక బ్రహ్మాండమైన హాలు వుండేది. స్తంభాలూ గోడలపై ఇజిప్షియన్ దేవుళ్ళ-ఫేరోల–చిత్రాలు గీయబడి వుండేవి. ఫేరోల బొమ్మలు చాలా పెద్దవిగా కన్పించగా, వారి ముందున్న సామాన్య ప్రజల బొమ్మలు మాత్రం అత్యంత స్వల్పంగా కన్పించేవి:

జంతువుల శిరస్సులున్న దేవుళ్ళ బ్రహ్మాండమైన చిత్రాల ముందూ, శత్రువుల్ని హతమార్చుతోన్న ఫేరోల వీరోచిత చిత్రాల ముందూ, సామాన్య ప్రజలు



ప్రాచీన ఈజిప్టు దేవాలయం

బలమైన రాతి స్తంభాలపై కప్పు నిలిచివుండేది. మధ్యలో వున్న స్తంభాల ఎత్తు-24 మీటర్లు. ఈ స్తంభం మీద దాదాపు పందమంది మనుషులు నిలబడగలరు. కప్పు కింద భాగానవున్న కిటికీల వరస గుండా కాంతి లోపలికిప్రవేశించేది. స్తంభాలూ గోడలపై రకరకాల చిత్రాల్ని వేసిన విషయం ప్రత్యేకంగా గమనార్హం.

అల్పులుగా తమనుగూర్చి తాము భావించుకొనేవారు. దేవాలయంలోని ప్రతిఅంశమూ వారి హృదయాల్లో భీతినిసృష్టించి, దేవుళ్ళ-ఫేరోల-శక్తిలో విశ్వాసం కలుగజేసేది.

దేవుళ్ళ విగ్రహాలను కర్రతో తయారుజేసేవారు. వాటి ఎత్తు-ఒకటిన్నర అడుగులనుండి ఆరు అడుగుల దాకా వుండేది. ఈ విగ్రహాల్ని వెండి బంగారం ఆభరణాల్తో అలంకరించేవారు. విగ్రహాల హస్తాల్లో కాకి-వెదురు కర్రముక్కలుండేవి; విగ్రహాల శిరస్సులపై, నిప్పు కోడిరెక్కలతోనో, పొటేలు కొమ్ములతోనో చేసిన కిరీటాలుండేవి. ప్రతి గుడిలోనూ ధాన్యం-నూనె-మద్యం-తేనె-వుంచేవారు. దేవాలయాల చేతుల్లో బ్రహ్మాండమైన జాగీర్లు వుండేవి.

పూజారులు

ప్రాచీన ఈజిప్ట్‌లోని పూజారులు, ఫేరోలకన్న అధికమైన అధికారం చలాయించారు. వీరి అభీష్టానికి వ్యతిరేకంగా రాజులు ప్రవర్తించినప్పుడు, రాజులకి వ్యతిరేకంగా ఈ పూజారులు తిరుగుబాట్లు గూడా నిర్వహించేవారు: ఈ పూజారి వర్గంలో వివిధ శ్రేణులకు చెందినవారుండేవారు. పవిత్ర మత గ్రంథాల్ని వల్లించేవారు-"ఖెర్ హెబ్" అనీ, దేవుళ్ళకి బలి సమర్పణ జేసేవారు-"వాబ్" అనీ పిలవబడ్డారు.

ఉదయాన్నే గుడిని తెరచి, పూజా విధులు నిర్వర్తించేందుకు, ఆనాడు ఉప పూజారులు గూడా వుండేవారు. వీరందరిపై ప్రతి దేవాలయానికి వొక్కో ప్రధాన పూజారి వుండేవాడు. పూజారి వృత్తి-వంశపారంపర్యంగా సంక్రమించేది. దైవాంశ సంభూతులుగా (Divine fathers) పరిగణింపబడిన ఈ పూజారులకి అసాధారణమైన హక్కులు దత్తం చేయబడ్డాయి. వీరు దేవాలయ ఆదాయంపై జీవించేవారు. తెల్లని దుస్తులు ధరించిన వీరు, గుండు నున్నగా గొరిగించుకొనేవారు. మాంత్రిక - వైద్య-విద్యల్లో వీరికి మహత్తరమైన శక్తియుక్తులుండేవని నాటి ప్రజలూ రాజులూ విశ్వసించేవారు.

ప్రాతఃకాలానే దేవుణ్ణి మేల్కొల్పడం, పట్టుబట్టల్తో వాణ్ణి సింగారించడం, పూజ తర్వాత నైవేద్యం పెట్టడం, రాత్రికి పవళింపు సేవ జేసి దేవుణ్ణి బజ్జో పెట్టడం-యివే-నాటి ఇజిప్షియన్ పూజారులు దేవాలయాల్లో నిర్వర్తించిన వివిధ విధులు. సరీగ్గా ఇదే కర్మకాండను, హిందూ దేవాలయాల్లోని బ్రాహ్మణ పూజారులు సైతం నిర్వర్తించడం ప్రధానంగా గమనార్హం:

పురోహితులే బానిస యజమానులు

రాజ్యం అవతరించక పూర్వమే, తాము సృష్టించిన దేవుళ్ళకి ప్రాచీన ఇజిప్షియనులు ఇళ్ళు కట్టడం ప్రారంభించారు. మట్టితో కట్టిన ఈ చిన్న ఇళ్ళలో, విగ్రహాల్ని పెట్టేవారు. ఈ ఇళ్లే తర్వాత గుళ్ళుగా మారాయి: బానిస యజమానులరాజ్యం ఉనికిలోకి వొచ్చిన తర్వాత, రాతి బండల్తో బ్రహ్మాండమైన దేవాలయాలు నిర్మించారు. ప్రతి గుడిలోనూ దేవుని సేవకుల పేరిట పురోహితులుండేవారు. గర్భగుడిలోకి పురోహితులు మాత్రమే ప్రవేశించేందుకి అవకాశముండేది. దేవుళ్ళతో ఈ పూజారులు డైరెక్టుగా మాట్లాడగలరనీ, దేవుని ఆజ్ఞల్ని వీరు ప్రజలకి అందజేయగల



ఇజిప్షియన్ పూజారియైన నియాజి, ఆతని భార్యా, వృక్షదేవత నుండి ఆహారపానీయాల్ని స్వీకరిస్తున్నారు.
చెట్టు కింద వారి ఆత్మలు-పక్షుల ఆకారాల్లో కన్పిస్తున్నాయి. (కెస్నర్ మ్యూజియం- హానోవర్)

రనీ, ప్రజల కోరికల్ని దేవుళ్ళకి సరాసరి నివేదించగలరనీ, నాటి అమాయక ప్రజల్ని ఈ కంతిరి గాడిదకొడుకులు పూ ర్తిగా నమ్మించారు.

దేవునిదయ సంపాయించేందుకు సమాజంలోని వివిధవర్గాల ప్రజలు, రకరకాల కట్న కానుకలు సమర్పించేవారు. చిన్న చిన్న సంచుల్తో ధాన్యాన్ని, వస్త్రాల్ని, రై తులు గుళ్ళకి తీసుకవొచ్చేవారు. బానిస యజమానులు పశువుల్ని, పెండి బంగా రాల్ని ఈ దేవాలయాలకి యిచ్చేవారు. ఫేరోలు - భూమినీ బానిసల్ని యుద్ధానంతరం కొల్లగొట్టుకవొచ్చిన ధన కనక రత్నరాసుల్ని, ఈ గుళ్ళకి అర్పించేవారు. ఈ యావత్ సంపదలూ పూజారివర్గం హస్తాల్లో కేంద్రీకృతమయ్యేవి. తత్ఫలితంగా, ఈ పూజారులు సమ స్త సంపదల్తో తెగబలిసి, బానిస యజమానుల్లా తయారయ్యారు.

తిరుగుబాట్లను నీరుగార్చిన దైవభీతి

దారుణమైన వర్గ దోపిడీకి సంరక్షకులుగా మారిన నాటి ఈజిప్ట్ ఫేరోల నిరం కుశాధికారాన్ని కాపాడేందుకు, ఈ పూజారులు చేయవొలసినదంతా చేశారు. ఇందు కోసం, దేవుళ్ళంటే నాటి ప్రజలకున్న భీతిని వారు భేషుగ్గా వుపయోగించుకొన్నారు। ఫేరోలు - "దయగల్గిన" దేవుళ్ళు అనీ, అంచేత వారి ఆజ్ఞల్ని తూచా తప్పకుండా శిరసా వహించాలనీ, నాటి పూజారులు బోధించారు। రాజాజ్ఞను తిరస్కరిస్తే, దేవుని ఆజ్ఞను ధిక్కరించినట్లేననీ, అట్టివారు నరకానికి తప్పక వెళ్తారనీ, దేవుని ఆజ్ఞలు పాటించినవారినే దేవుడు ప్రేమిస్తాడనీ, అతని ఆజ్ఞలు నిరాకరించినవారిని దేవుడు ద్వేషిస్తాడనీ, ఈ పూజారులు బూటకపు ప్రచారం జేశారు। ప్రాచీన ఈజిప్ట్‌లో పీడిత ప్రజలకి వ్యతిరేకంగా, పీడకుల అధికారాన్ని సమర్థించేందుకు మాత్రమే మతం దోహదం జేసింది. దేవుళ్ళు ఆగ్రహిస్తారనే భీతియే, పరమ దుర్మార్గులకి వ్యతి రేకంగా సామాన్య ప్రజలు తిరగబడకుండా అడ్డగించింది।

ప్రాచీన ఈజిప్ట్‌లో ఆత్మభావం

మరణానంతరం సై తం ఆత్మ వుంటుందని ప్రాచీన ఇజిప్షియనులు నమ్మే వారు. శరీరం గాయపడితే, ఆత్మగూడా గాయపడుతుందనీ, వారు భావించేవారు. మర ణించినవారి ఆత్మ, మరల దేహంలో ప్రవేశిస్తుందనే విశ్వాసంతో, మృతదేహాల్ని "మమ్మీ"లుగా మార్చి, పిరమిడ్స్‌లో భద్రపరిచేవారు.

ప్రతి శిశువుతో పాటు కంటికి కన్పించని "క"అనే కవలగూడా పుడుతుందనీ, ఇది వున్నంతకాలం వ్యక్తి జీవిస్తాడనీ, నాటి వారు నమ్మేవారు. "క"కు చావులేదు. మరణించిన వ్యక్తితో కలిసి పరలోకంలో జీవించేందుకి ఇది-సిద్ధంగా వుంటుంది. దేహానికి "క" వున్నట్లే, ఆత్మకి "బ" వుంటుంది. ఈ "బ"కి, చనిపోయినవ్యక్తి మొహమూ, పక్షి ఆకారమూ వుంటాయనీ, ఇది వ్యక్తియొక్క గుండెలోగానీ, కడుపులో గానీ వుంటుందనీ మరణానంతరం ఇది ఎగిరిపోతుందనీ, వారు విశ్వసించే వారు. ఆత్మ దుష్టశక్తిగా మారితే, రాత్రివేళ సమాధిలో వుంటుందనీ తలచేవారు. అంచేతనే, శవాల్ని పిరమిడ్స్‌లో భద్రపరిచే సాంప్రదాయం ఈజిప్టుల్లో తలెత్తింది.

మమ్మీలు

మృతదేహాన్ని పరిరక్షించి వుంచితే చనిపోయిన వ్యక్తి యొక్క ఆత్మ, తిరిగి ఆతని శరీరంలో ప్రవేశిస్తుందని నాటి వారు నమ్మేవారు. ఈ విశ్వాసంతో మృతదేహాన్ని మమ్మీగా మార్చి, పిరమిడ్‌లో భద్రపరిచేవారు. శవాన్ని మమ్మీగా మార్చడానికి 70 రోజులు పడుతుంది. ఈ విధంగా "మమ్మీఫై" చేయడం నాటి ధనికసయజమానులకు మాత్రమే సాధ్యమయ్యేది.

("మమ్మీ" అంటే భద్రపరచిన శవం - అని అర్థం. శవాల్ని భద్రపరిచే పద్ధతిని "మమ్మీఫై" చేయడం అని అంటారు. "మమ్మీ" పదం- "మమియా" అనే పార్శీ శబ్దం నించి పుట్టింది. మైనం పూసి భద్రపరిచిన శవం-అని దీని అర్థం.) ప్రారంభదశలో శవాలకు మైనం పూసి భద్రపరిచేవారు. అనంతర దశలో శవం కుళ్ళిపోకుండా వుండేందుకు, దేహంలో నుండి మెదడునూ పేగులనూ తీసివేసి, వొక లాంటి ఉప్పు ద్రావణంతో శుభ్రపరచి, రసాయనిక ద్రవ్యాలతో భద్రపరచడం తెలుసుకొన్నారు. అయితే నాటివారువాడిన రసాయనిక ద్రవ్యాలేమిటో పరిశోధకుల కందలేదు.

పిరమిడ్స్

ప్రాచీన ఇజిప్షియనులు మృతదేహాన్ని మమ్మీఫై చేసి, సమాధిలో భద్రపరిచే వారు. ఫేరో మృతదేహాన్ని ఈవిధంగా సమాధిలో భద్రపర్చడం వొల్ల, దేశానికి శ్రేయస్సు కలుగుతుందని నాటి పురోహితులు ప్రచారం జేశారు. సామాన్యవ్యక్తులు గాక, "దేవుళ్ళా" దైవాంశసంభూతులు మాత్రమే ఈ పిరమిడ్స్‌లో పాతిపెట్ట

బడ్తారని నాటి ప్రజల్లో ఈ పూజారులే బాకా వాయించారు. ఈజిప్టు పాలకుల శవాల్ని భద్రపర్చేందుకే, ప్రపంచ ప్రఖ్యాతమైన ఈ పిరమిడ్స్ నిర్మించారు. గైజా లోని ఖూఫూ చక్రవర్తి పిరమిడ్ నిర్మించడానికి, లక్షమంది బానిసలు 20 సంవత్సరాల పాటు అహోరాత్రాలూ శ్రమించారు. దీని నిర్మాణానికి 23 లక్షల రాతిబండలు వినియోగించారు: ప్రతి రాతిబండ బరువు- రెండున్నర టన్నులు: ఈ పిరమిడ్ ఎత్తు- 480 అడుగులు. 75 నుంచి 90 అడుగుల ఎత్తున వున్న ఫేరోల శిలాప్రతిమలను వారు మలిచారు. కార్నక్-లక్సర్ వొద్ద బ్రహ్మాండమైన దేవాలయాల్ని వీరు నిర్మించారు. పిరమిడ్ల నిర్మాణం - నాటి ఇజిప్షియన్ వాస్తు-గణిత శాస్త్రపేత్తల ప్రతిభకి ఎదురులేని నిదర్శనం. పిరమిడ్లూ-దేవాలయాల వంటి భారీ నిర్మాణ కార్యక్రమాల్ని ప్రభుత్వమే స్వయంగా నిర్వహించేది. నైలునది ఎడమ ఒడ్డున నేటికీ మనం వీటిని చూడవొచ్చు. నున్నగా పాలిష్‌జేసిన రాతిబండల్తో నిర్మింపబడిన ఈ పిరమిడ్స్, ఆకాశంలోకి చొచ్చుకొనిపోయే పెద్దపెద్ద కొండల్లా కన్పిస్తాయి. వీటితోపాటు ఫేరోల బ్రహ్మాండమైన శిలావిగ్రహాల్ని, నైలునది తీరం పొడవునా శిల్పులు చెక్కారు. 20 మీటర్ల ఎత్తున వున్న ఈ విగ్రహాలు, నదిలో ప్రయాణం జేసే వారికి ఎంతో దూరాన్నించి సైతం కన్పించేవి.

క్రీ.పూ. 2600లో ఈజిప్టు ఫేరోయైన ఛియోప్స్ కోసం, బ్రహ్మాండమైన పిరమిడ్ నిర్మించారు. దీని ఎత్తు-150 మీటర్లు. దీని పునాది చుట్టూ వున్న దూరం-దాదాపు 1 కిలోమీటరు. ప్రాచీన గ్రీకు చరిత్రకారుడైన హెరొడోటస్, ఈ పిరమిడ్ నిర్మాణానికి చెందిన వివరాల్ని యిచ్చాడు. ఛియోప్స్ సింహాసనం అధిష్ఠించిన తక్షణమే, తనకోసం ఈ పిరమిడ్ నిర్మించాలని ఆజ్ఞలుజారీజేశాడు. దేశంలోని అన్ని భాగాల నుండి, రైతుల్ని బానిసల్ని ఈ సమాధి నిర్మించే ప్రదేశానికి గొల్లమందల్లా అధికారులు తోలుకొచ్చారు. ఈ పిరమిడ్ నిర్మాణంలో పదిలక్షలమంది అహోరాత్రాలూ పాల్గొన్నారు: పర్వతాల వొద్ద రెండున్నర టన్నుల బరువు గల పెద్దపెద్ద రాతిబండల్ని చెక్కి, వాటిని బోట్ల ద్వారా మోసుకొచ్చారు. రాజాధికారులు కొరడాలూ బెత్తాలతో బాది, బానిసలచే అత్యంత త్వరితంగా పని చేయించారు. ఈ విధంగా ముప్ఫయ్ సంవత్సరాల పాటు, ఈ సమాధిని నిర్మించారు. మానవమాత్రులకి సాధ్యంగాని అత్యంత కష్టభూయిష్టమైన శ్రమ వొల్ల, ఆకలి దప్పికల వొల్ల, కొరడా దెబ్బల వొల్ల, వేలాది కష్టజీవులు కుక్కచావు చచ్చారు.

పిరమిడ్ అంతర్గత స్వరూపం

ప్రతి పిరమిడ్ లోపల వొక చిన్న గది వుండేది. ఫేరోల మమ్మీలు భద్ర పరచిన సమాధి పెట్టెలు, ఈ గదుల్లో పెట్టబడి వుండేవి. కొన్ని సందర్భాల్లో ఈ సమాధిలో ఎన్నో గదులు గూడా వుండేవి. పుష్కలంగా గోధుమ పండిన పొలాలూ, రాత్రింబగళ్ళూ శ్రమించే కూలీలున్న కార్ఖానాలూ, ఆ గదుల గోడలపై చిత్రించ బడేవి. చెక్క లేదా మట్టితో చేసిన, వంటగాళ్ళ- సారాబట్టీల- రకరకాల పరిచారకుల బొమ్మలు ఈ సమాధుల్లో పెట్టేవారు. గోడలపై చిత్రించబడిన ఈ రకరకాల చిత్రాలు, వాస్తవమైనవిగా మారిపోతాయనీ, ఈ బానిసల బొమ్మలన్నీ నిజమైన బానిస్లగా మారిపోయి, బానిసయజమానికి సేవ జేస్తారనీ, నాటి వారు నమ్మేవారు! అంటే-నాటి సంపన్నవర్గాలు చచ్చిన తర్వాత గూడా బానిసయజమానుల్లాగానే వుండి, బానిసలచే చాకిరీ జేయించుకోవాలని ఉబలాట పడేవారన్నమాట! చచ్చిన తర్వాత గూడా, యీ రాచ పీనుగులకి తోడు పీనుగలు కావాలన్న మాట! ఈ రకమైన ఇజిప్షియన్ సాంప్రదాయం నుండే, మన తెలుగు సామెత పుట్టిందా-అనే విషయాన్ని చరిత్ర పరిశోధకులు లోతుగా పరిశోధించాలి.

రైతుల-బానిసల పూడ్చివేత

సంపన్న వర్గాల శవాల్ని యింత వైభవోపేతంగా పూడ్చివేయగా, సామాన్య ప్రజల శవాల్ని మరోవిధంగా పూడ్చివేసేవారు. పుట్టిన దగ్గిర నించి చచ్చేంత దాకా, పాలక-పాలితుల జీవితాలకి చెందిన ప్రతీ అంశంలో భయంకరమైన వ్యత్యాసాలు ప్రాచీన కాలం నించీ కన్పిస్తోనే వున్నాయి. అత్యంత నగ్నంగా కన్పించే యీ వ్యత్యాసాల్నీ, యీ వర్గభేదాల్నీ, బుద్ధిహీనులు మాత్రమే తిరస్కరిస్తారు!

ప్రాచీన ఈజిప్టులో రైతులు యీ విధంగా పూడ్చిపెట్టబడేవారు: చెక్కతో చేసిన ఆ వ్యక్తి ఆకారాన్ని, శవంతో పాటు పూడ్చిపెట్టేవారు. ఈ చెక్కబొమ్మలే-మమ్మీలకి బదులుగా పెట్టబడిన బొమ్మలు! శవం ప్రక్కన ఆహారమున్న వొక కుండను గూడా పెట్టేవారు.

బానిసలకి సమాధులే లేవు! సామూహికమైన వొక గోతిలో (common pit) వారందరినీ మూకుమ్మడిగా పాతిపెట్టేవారు! బానిసయజమానుల రాజ్యం అవత

రించాక, సామాన్య ప్రజల పరిస్థితి ఎంతటి నిక్కృష్టంగా వుండేదో, పురాతత్వ శాస్త్ర వేత్తలచే కనుగొనబడిన ప్రాచీన ఈజిప్ట్ స్మశానాలే - ఎదురులేని నిదర్శనాలు!

ఫేరోల సమాధులు శపిస్తాయా ?

ఈజిప్ట్‌లోని "తుతేన్‌ఖామెన్" ఫేరో సమాధి, శపిస్తుందనే మూఢనమ్మకం వొకటి వుండేది. ఫేరోల శవాల్ని ప్రత్యేక రసాయనాల్లో వుంచి, వస్త్రం చుట్టి, పేటికలో అమర్చి సమాధుల్లో భద్రపరిచేవారు. బ్రిటిష్ చరిత్ర పండితుడైన లార్డ్ కెర్నార్వాన్ నాయకత్వాన 1923లో ఈ సమాధిని తెరిచారు. ఈ సంఘటన జరిగిన కొద్ది మాసాలకే, కెర్నార్వాన్ తీవ్రమైన అస్వస్థతకు గురియై మరణించాడు. దీనితో సమాధిలోని ఫేరో, ఆయన్ని శపించాడనీ, ఈ సమాధివైపు ఎవరు కన్నెత్తిచూసినా వారు మరణిస్తారనే అంధవిశ్వాసం బలపడింది. 1923లో ప్రప్రథమంగా ఈ సమాధిని తెరిచినప్పుడు, సమాధి తలుపులపై వొక శాసనం కన్పించింది. "ఫేరో మమ్మీని తాకిన వారికి మృత్యువు తధ్యం అనీ," "ఫేరో సమాధిని భగ్నం జేసేవారు శాప గ్రస్తులవుతారు" అనీ, ఆ శాసనంపై రాయబడివుంది. అయితే, ఈజిప్ట్ నేషనల్ మ్యూజియం డైరెక్టర్ అయిన జనరల్ గమాల్ మెరెజ్ మాత్రం, ఈ అంధవిశ్వాసాన్ని పూర్తిగా తోసిపుచ్చాడు.

ఈ సమాధిని చూసినవారు, తీవ్రమైన అస్వస్థతకు గురికావడానికీ, లేదా మరణించడానికీ, సైంటిస్టులు మూడు కారణాల్ని చెప్పారు. 1. రాతితో నిర్మించిన ఈ సమాధులు, రోగకారకాలైన సూక్ష్మజీవులు ఏపుగా పెరగడానికి అనువైన ప్రదేశాలు. అంచేత, కొన్నివేల ఏళ్ళదాకా, యివి తమ విషపూరిత ప్రభావాన్ని ప్రసరిస్తాయి. కాబట్టి, అత్యంత ప్రాచీనమైన ఈ సమాధుల వద్దకి వొచ్చిన వారికి, ఈ విషప్రభావం సోకవచ్చు. అంచేత కొందరు మరణించి వుండవచ్చు. 2. పిరమిడ్స్ యొక్క గోడలు, వాతావరణ వైపరీత్యాలవల్ల నాశనమవకుండా వుండడానికి, ఆర్సినిక్ వంటి విషపూరిత రసాయనాల్ని నాటివారు పూతగా పెట్టివుంటారు. ఈ విషాలు చర్మానికి సోకినప్పుడు, ప్రాణాంతకమైన ఫలితాలు కలుగుతాయి. 3. ఈ ప్రాచీన కట్టడాలకు వినియోగించిన రాళ్ళలో, యురేనియం వంటి రేడియో ధార్మిక మూలపదార్థం వుండివుండాలి. ఈ సమాధుల్ని దొంగల బారినించి రక్షించేందుకు, వీటిని ఉపయోగించివుంటారు. అంచేత, ఈ రాళ్ళు కొన్నివేల ఏళ్ళ దాకా అత్యంత ప్రమాదకరమైన ప్రభావాన్ని ప్రసరించే అవకాశముంది.


సైనిక బలగం

క్రీ.పూ. రెండువేల ఏళ్ళనాటికి, ఈజిప్ట్ జనాభా బాగా వృద్ధి చెందింది. చేతి వృత్తులు గూడా అపూర్వమైన ప్రగతిని సాధించాయి. తత్ఫలితంగా తమ సైనిక బలగాన్ని బాగా అభివృద్ధి జేసుకొని, పొరుగు రాజ్యాలపై దండెత్తడానికి నాటి ఫేరో లకి మంచి అవకాశం లభించింది. మొదట్లో ఫేరోలకి ప్రత్యేకమైన సైన్యముండక పోయినా, అనంతర దశలో ప్రత్యేకమైన సైన్యాన్ని ఏర్పాటు జేసుకొని, రాజ్య విస్తరణకి పూనుకొని నియంతల్లా- పరమ కిరాతకుల్లా వ్యవహరించారు. నాటి ఫేరో తన జ్యేష్ఠపుత్రుణ్ణి సర్వసేనానిగా నియమించాడు.


ప్రాచీన ఇజిప్షియన్ సైన్యంలో, పదాతి దళాలు ప్రధాన స్థానమాక్రమించాయి. అత్యంత దౌర్జన్యంగా మిలిటరీ సర్వీసులోకి గెంటపడ్డ సామాన్య రైతులే, ఈ పదాతిదళాల్లో అధికాధికంగా వుండేవారు. నాటి సైన్యానికి రథాలుగూడా వుండేవి. గుర్రాలు పూన్చిన రెండుచక్రాల రథాలపై, వొకరో యిద్దరో విలుకాళ్ళు నిలబడి యుద్ధంజేసేవారు. పరాయి దేశాలకి జెందిన కిరాయి సైనికుల్ని సైతం, ఫేరోలు తమ సైన్యంలో నియమించేవారు. ఈ కిరాయి సైనికులు అడవి మృగాలకన్న అత్యంత కిరాతకంగా, ఇజిప్షియన్ రైతులూ బానిసలపట్ల ప్రవర్తించేవారు. పొరుగు దేశాలపై ఫేరోలు యుద్ధం జేసే సమయంలో, వీరు విశ్వాసఘాతకుల్లా వ్యవహరించి, శత్రురాజులు అధికవేతనం యివ్వడానికి సిద్ధమైతే, శత్రువుల వైపుకి అమాంతం తిరిగిపోయేవారు.

విదేశాలపై దండయాత్రలు

క్రీ. పూ. 1500 సంవత్సరంలో, యీజిప్టు సైన్యాలు పాలస్తినా - సిరియా దేశాలపై ఫేరో నాయకత్వం కింద దండెత్తాయి. మహావీరుడైన మూడవ టట్‌మోసిస్, బంగారుపూత పూయబడ్డ రథంపై అధిరోహించి, ధనుర్బాణాలు చేత బట్టి స్వయంగా యుద్ధరంగానికొచ్చి పోరాడాడు. పాలస్తినా - సిరియా దేశాల సైనికులు, యీ దండయాత్రకి వ్యతిరేకంగా భీకరమైన పోరాటం సాగించి, చివరికి ఓడిపోయారు. పరాజయం తర్వాత, టట్‌మోసిస్ ఆజ్ఞల ప్రకారం వారి గ్రామాలూ నగరాలూ నిర్దాక్షిణ్యంగా ధ్వంసం గావించబడ్డాయి. వారి తోటలూ పొలాల్ని యీజిప్ట్ సైనికులు సమూల విధ్వంసం గావించి, సామాన్య ప్రజల్ని బానిసలుగా మార్చివేశారు. టట్‌మోసిస్ చేసిన అనేకయుద్ధాల ఫలితంగా, మెడిటరేనియన్ సముద్రతీర ప్రాంతమంతా జయించబడి, యూఫ్రటిస్ నదీతీరం వరకూ, యీజిప్టు సామ్రాజ్యం వ్యాపించింది.



ప్రాచీన యీజిప్టుకి చెందిన యీ రాతి పలకపై, హైయిరోగ్లిఫిక్ లిపిలో యీ క్రిందివివరాలు చిత్రించబడ్డాయి: (ఎడమవైపు నున్న దానిపై) వొక యుద్ధవీరుడు, జయించబడిన శత్రువును జుట్టుపట్టుకొని, కొడానని బెదిరిస్తోన్నాడు. సీసా ఆకారంలో వున్న వొక పొడుగాటి కిరీటాన్ని యీతడు ధరించాడు. ఇతడు - ఎగువ యీజిప్టు రాజు. ఈ రాజుకు కుడి వైపున డేగ ఆకారంలో వున్న వొక దేవుడు, తాడునుపట్టుకొన్నాడు. ఈతాడు వొక యుద్ధఖైదీ మెడకు కట్టివేయబడింది. ప్రాచీన యీజిప్టులో యుద్ధ ఖైదీలు, పశువులమందల్లా వారితలల సంఖ్యను బట్టి లెక్కింపబడేవారు. డేగయొక్క కాళ్ళకింద ఆరు మొక్కలున్నాయి. ప్రతి మొక్కా - వెయ్యిమంది యుద్ధ ఖైదీలకి సంకేతం. అంటే ఆ రాజు ఆరువేలమంది యుద్ధ ఖైదీల్ని పట్టుకొన్నాడన్నమాట. మరీకింద, పారిపోతోన్న యుద్ధ ఖైదీలు సూచించబడ్డారు.



(కుడివైపున వున్న) యీ రాతి పలకకి చెందిన వివరాలు: యీ సంఘటనకి చెందిన కథయొక్కకొనసాగింపే యీ వివరాలు. యీపలకకి మరీకింద, ఎద్దు ఆకారంలో వున్న రాజు, శత్రువుకోటను ధ్వంసంజేస్తోన్నాడు. అంతకన్న మరీ పైన, తలలు నరికివేయబడిన యుద్ధఖైదీలున్నారు. వారి శిరస్సులు వారి కాళ్ళమధ్య రాలిపడివున్నాయి. వీరికి ఎడమ వైపున, ఎగువ యీజిప్టుకి చెందిన పతాకాల్ని కొందరు యుద్ధవీరులు మోసుకవెళ్తోన్నారు. వారివెనక సైనికాధిపతి, అతని వెనక రాజూ, రాజువెనక బాడీగార్డూ వున్నారు. దిగువ యీజిప్టు రాజ్యం కిరీటాన్ని యీ రాజు ధరించాడు. అంటే - యీతడు దిగువ యీజిప్టుని జయించాడన్నమాట. రాజు-సేనాని - యువీద్ధరుల ఆకారాల సైజును జాగ్రత్తగా పరిశీలించండి. మధ్య భాగంలో - కుక్క శరీరమూ, పాము తలలో వున్న బొమ్మ భావం నేటికీ పండితులకి అర్థం గాలేదు.

పందికొక్కుల్లా తెగ బలిసిన బానిస యజమానులు

ఓడిపోయిన దేశాల్ని గజదొంగల్లా కొల్లగొట్టిన యీ ఫేరోలు, దారుణమైన కప్పాల్ని ఆయాదేశాలనుండి వసూలుజేశారు. అంతేగాక, యీదేశాలనుండి బంగారం-కంచు-నల్లకర్ర దంతం మొదలైన వాటిని గాడిదలూ ఓడలపై యెక్కించుకొని, తమ దేశానికి తరలించుక పోయారు. వేలాది యుద్ధఖైదీలూ, పశువుల మందలూ, గుర్రాలతో ఇజిప్షియన్ సైనికులు స్వదేశానికి వొచ్చారు. యీజిప్టు ఎడారుల్లో ఎంత ఇసక వుందో, ఫేరోల ప్రాసాదాల్లో అంత బంగార మున్నదని రాజధానిలో పుకార్లు తీవ్రంగా వ్యాపించాయి.

దేశదేశాల్లో యీ విధంగా దోచుకొచ్చిన ధన కనక వస్తువాహనాలన్నీ, బానిసయజమానులైన నాటి ఇజిప్షియన్ పూజారుల హస్తాల్లో కేంద్రీకృతమయ్యాయి. యీజిప్టు చరిత్రలో కనీవినీ యెరుగనంతమంది స్వదేశ- విదేశ- బానిసలు లక్షల సంఖ్యలో మానవ మృగాల్లా తమ జీవితాలు గడిపారు. రాజధానిలోని ప్రధాన దేవాలయ యాజమాన్యం కింద, ఆనాడు ఎనిమిది లక్షలమంది బానిసలుండేవారు. వీరిచే అడ్డమైన చాకిరీ చేయించుకొన్న నాటి పూజారులు, గాదె కింది పందికొక్కుల్లా, మానవ రక్తం తాగి బలిసిన జలగల్లా, మనుషుల్ని అమాంతం విరుచుక తినే కొండ చిలవల్లా, మంద్రగబ్బల్లా, మిన్నాగుల్లా, రక్త పెంజర్లలా ప్రవర్తించారు. బానిసల రక్తమాంసాలపై పెరిగిన నాటి పాలకవర్గాలూ, దేవుళ్ళ ఏజెంట్లమని చెప్పుకొన్న నాటి పూజారులూ, భాషకీ మానవ ఊహకీ అందని అమానుషమైన వారి నిలువు దోపిడీ గూర్చి రాయడానికి వందలాది పేజీలు కావాలి.

క్రీ. పూ. 1500 సంవత్సరాల ప్రాంతాలకి, యీజిప్టు పాలకవర్గాల పునాదులు క్రమంగా సడల నారంభించాయి. ఓడిపోయిన దేశాలకి చెందిన ప్రజలు, ఫేరోలకి వ్యతిరేకంగా పోరు సల్పి సిద్ధమయ్యారు. ఫేరోలు జేసే నిరంతరమైన యుద్ధాలు, యీజిప్టు రైతులపై మోయలేని భారాన్ని వేశాయి. పొరుగు దేశాలపై జరిపిన దురాక్రమణ యుద్ధాల్లో, అనేకమంది రైతులు మరణించారు. న్యుబియా చిత్తడి భూముల్లోని జ్వరం వొల్ల, ఎడారుల్లో భరించలేని వేడి వొల్ల, ఎంతోమంది చని పోయారు. తత్ఫలితంగా పాలకవర్గాల క్షేత్రాల్ని సాగుజేసేందుకు రైతులు పూర్తిగా కరువయ్యారు. దేశం బ్రహ్మాండమైన బంజరు భూమిగా మారిపోయింది. యుద్ధా

నంతరం క్షతగాత్రుడై స్వదేశాని కొచ్చిన సైనికుడు, తన యిల్లూ వాకిలీ దోపిడీ చేయబడడమూ, తన భార్యా బిడ్డలు బానిసల్లా అమ్మివేయబడడమూ చూసి గుండెలు బాదుక దుఃఖించాడు.

యీ హృదయ విదారకమైన పరిస్థితుల మూలంగా, ఫేరోలూ, పూజారులూ, బానిసయజమానుల పట్ల, రైతులూ వృత్తిపనివారూ బానిసల హృదయాల్లో వర్ణించ రాని ద్వేషం పడగ విప్పి నాట్యమాడ నారంభించింది. దేశం నలుమూలలా పేదలూ బానిసలూ తిరుగుబాటు జేశారు. యీ శ్రామిక ప్రజల తిరుగుబాట్లు, యీజిప్టు పాలక వర్గాల అధికారాన్ని చిన్నాభిన్నం గావించాయి. క్రీ. పూ. వెయ్యి సంవత్సరాల నాటికి, ఆసియా- న్యుబియాలో వున్న భూభాగాల్ని సైతం యీజిప్టు కోల్పోయి, పొరుగు దేశాల దాడుల్ని సైతం తట్టుకోలేనంత బలహీనంగా తయారైంది. క్రీ.పూ. 525లో పెర్షియన్ సైన్యాలు యీజిప్టుపై దండెత్తి, మొత్తం దేశాన్ని స్వాధీనం జేసుకున్నాయి.

3. మెసపొటేమియా నాగరికత

(క్రీ. పూ. 3000 - క్రీ. పూ. 539)

ప్రాచీన నాగరికతలన్నీ నదీ తీరాల్లో వెలసి విలసిల్లినవే. పశ్చిమ ఆసియా చరిత్రలో ప్రాచీనమైన ప్రథమ నాగరికత, యూఫ్రటిస్-టైగ్రిస్ నదుల మధ్యగల పచ్చని మాగాణంలో పరిఢవిల్లింది. ఆనాడు ఈ జీవనదులకు ఏటా వొచ్చే వొండ్రు మట్టితో, లోయ సారవంతమై సస్యశ్యామల మవుతుండేది. క్రీ. పూ. 4000 సంవత్సరాల ప్రాంతంలో, పర్షియన్ సింధుశాఖనుంచి ఉత్తర అరేబియా-పాలస్తినా దేశాల వరకూ, ఎంతో సారవంతంగా వుండేది. ఈ భూభాగం అర్ధచంద్రాకారంగా వున్నందు వొల్ల, చరిత్రకారులు దీనికి "సారవంతమైన చంద్రరేఖ" (Fertile crescent) అని నామకరణం జేశారు. మానవేతిహాసంలో అత్యంత ప్రాచీనమైన మెసపొటేమియా నాగరికత, ఈ భూభాగంలోనే వికసించింది.

(మెసపొటేమియా అంటే- నదుల మధ్యనున్న దేశం- అని అర్థం. నేటి ఇరాక్ దేశమే ఆనాటి మెసపొటేమియా. సుమేరియా, బాబిలోనియా, అక్కాడ్, అస్సీరియా-ఈ నాలుగు రాజ్యాల సముదాయమే-నాటి మెసపొటేమియా) మానవ రక్తాన్ని ఏరుల్లా ప్రవహింపజేసిన విజేతలు, ఈ నాలుగు ప్రాంతాల్నీ కలిపి, బ్రహ్మాండమైన సామ్రాజ్యంగా నిర్మించారు. తత్ఫలితంగా ఈ నాలుగు ప్రాంతాలూ సాంస్కృతికంగా ఏకమై, సుమేరియా దేవతల్నీ-పురాణాల్నీ, వారి సాంఘిక ఆచార వ్యవహారాల్నీ అనుసరించి తమ సొంతం జేసుకొన్నారు.

యూఫ్రటిస్-టైగ్రిస్ నదుల దిగువభాగానవున్న సుమేర్‌లో ప్రప్రథమంగా పల్లవించిన ఈ నాగరికత, అనంతరదశలో అక్కాడ్-బాబిలన్ (ఆమొరైట్)- అసీరియా-కాల్డియాలో పూవుపూసి, కాయకాసి, నలుదిక్కులా వ్యాపించింది. ఈవిధంగా ఈ నాగరికత, క్రీ. పూ. 3000 నుండి క్రీ. పూ. 539 వరకూ 1. సుమేరియా 2. అకాడియా 3. బాబిలన్ 4. అసీరియా 5. కాల్డియా నాగరికతలుగా, అయిదు విభిన్న ప్రదేశాల్లో అయిదు దశలుగా అభివృద్ధి చెందింది.

క్రీ. పూ. నాలుగువేల సంవత్సరాల ప్రాంతంలో, దక్షిణ మెసపొటేమియాలోని ఆదిమగణ జీవితవిధానం (primitive communal society) స్థానంలో, బానిస సమాజం ఆవతరించింది. ఈ బానిస సమాజ వ్యవస్థ అవతరణతో, మెసపొటేమియాలో వివిధ రాజ్యాలు ఆవిర్భవించాయి. రాజ్యాంగయంత్రం (state) లేకండా, అంటే – రాచరికాధికారమూ సైన్యమూ ప్రభుత్వోద్యోగులూ జైళ్ళూ లేకండా – వేదల్నీ బానిసల్నీ, బానిసయజమానులు పరిపాలించడం అసాధ్యం గదా?!

సుమేరియా

క్రీ. పూ. 3500 నాటికే సుమేరియన్ నాగరికత ఉచ్ఛస్థితి నందుకొంది. ప్రారంభదశలో సుమేరియన్లు ఎరిడ్-ఉర్-లగాష్-వంటి చిన్న చిన్న నగరరాజ్యాలు స్థాపించుకొన్నారు. క్రమేణా ఈ రాజ్యాలు వృద్ధిజెంది, పరస్పరం కలహించుకొని యుద్ధాలకి దారితీయడమూ, వొకరాజ్యం మిగిలిన నగర రాజ్యాలపై ఆధిపత్యం చలాయించడమూ జరిగింది.

అ కా డి యా

క్రీ.పూ. 2400 ప్రాంతంలో, సుమేర్ పతనం చెందిన అనంతరం, అక్కాడ్ అధికారానికొచ్చింది. అయితే అంతఃకలహాల మూలంగా అక్కాడ్ రాజ్యం త్వరలోనే పతనమై, తిరిగి సుమేర్ ప్రాభవంలోనికొచ్చింది. ఈ దశలో నిర్మింపబడిందే-జిగ్గురాత్-భవనం. నగరంలోని మిగతా భవనాలకన్న యిది చాలా ఎత్తుగా వుండి, త్రికోణాకారంలో వున్న గోపురం ఆకాశంలోకి అమాంతం చొచ్చుకపోయినట్లు వుండేది. యీ జిగ్గురాత్ భవన నిర్మాణ శైలి, నాటి మెసపొటేమియన్ నాగరికత విశిష్టతను వేనోళ్ళ చాటుతోంది.

బాబిలోనియా

క్రీ.పూ. 1800నాటికి, ఆమొరైట్ తెగవారు బాబిలోనియన్ సామ్రాజ్యం స్థాపించారు. బాబిలన్‌ను పాలించిన రాజుల్లో హమురాబీ గొప్పవాడు. క్రీ.పూ. 1792 నుండి క్రీ.పూ. 1750 వరకూ బాబిలన్‌ను పాలించిన యీతడు, విశాలమైన సామ్రాజ్యం నిర్మించాడు. ప్రపంచ చరిత్రలో "గొప్ప" ధర్మ శాస్త్రవేత్తగా - బాబిలోనియన్ ఆశోకుడుగా-బూర్జువా చరిత్రకారులచే తెగ పొగడబడిన యీతడు, తనకి పూర్వమున్న ప్రాచీన చట్టాల్ని క్రోడీకరించాడు. దీనినే "హమురాబీ కోడ్" అని పిలుస్తారు.

అసిరియా

హమురాబీ తర్వాత బాబిలన్ అధికారం క్షీణించింది. క్రీ.పూ. 900 సంవత్సరాలనుండి, అసీరియా ఆధికారంలో కొచ్చింది. బాబిలోనియా-సిరియా-అసీరియా-పాలస్తినాలతో సహా ఇరాన్‌నుంచి నైలునది డెల్టావరకూ వ్యాపించిన యీ అసీరియా సామ్రాజ్యం, ప్రాచీన చరిత్రకి చెందిన రాజ్యాల్లో చాలా విశాలమైంది. అసీరియన్లు ప్రధానంగా గ్రామీణ జీవితం గడిపేవారు. పరాజిత దేశాల్ని సమూల విధ్వంసం గావించిన అసీరియన్ రాజులు, ఆయాదేశాల ప్రజల్ని అమానుషమైన చిత్రహింసల పాల్జేశారు.

అసీరియా సామ్రాజ్యానికి రాజధానియైన నినెవె వొద్ద, పురాతత్వ శాస్త్రవేత్తలు సాగించిన తవ్వకాల ఫలితంగా, ప్రాచీన అసీరియాచరిత్రకి చెందిన ఎన్నో విశేషాలు బయటికొచ్చాయి. నినెవె తవ్వకాల్లో, దగ్ధంజేయబడిన రాజ ప్రాసాదాలూ వేలకివేల మట్టిముద్రికలూ (clay tablets) కన్పించాయి. రాజప్రాసాదాల శిధిలావశేషాల్లో, పురాతత్వ వేత్తలకి అనేకమైన శిల్పాలు గూడా లభించాయి. యీ రాతిపలకలపై యుద్ధాల దృశ్యాలూ, మూకుమ్మడి నరహత్యలూ, ఓడిపోయిన నగరాల్ని దోచుకోవడమూ, పట్టుబడ్డ యుద్ధఖైదీల్ని బానిసల్లా మార్చివేయడమూ, సింహాలవేట యిత్యాది రకరకాల బొమ్మలు చెక్కబడ్డాయి.

నిరంతరం విదేశ దండయాత్రల్లో, మొలబంటి లోతుదాకా మునిగితేలిన అసీరియన్ చక్రవర్తులు, దేశ సంపదను వృద్ధిజేయడానికి ఏమాత్రం కృషిజేయలేదు. క్రీ.పూ. 612లో రాజధానియైన నినెవె పతనంతో, అసీరియా సామ్రాజ్యం కాలగర్భంలో లీనమైంది.

కాల్డియా

క్రీ.పూ. 605నాటికి మొత్తం మెసపొటేమియా, కాల్డియన్‌ల పాదాక్రాంత మైంది. యీ చక్రవర్తుల్లో ప్రముఖుడు-నెబుకడ్‌నెజర్. ఈతడు బైబిల్‌లోని పాత నిబంధనలో సైతం ప్రస్తావించబడ్డాడు. 57 ఏళ్ళు పాలించిన యీతడు, ఈజిప్టు రాజుల్తో అనేకసార్లు యుద్ధాలు జేశాడు. ఇతడు జెరూసలెమ్‌ను జయించి, హీబ్రూల్ని (యూదుల్ని) యుద్ధఖై దీలుగా బంధించాడు. మెసపొటేమియాలోని అనేక నగరాల్లో పాత దేవాలయాల్ని పునరుద్ధరించి, కొత్త దేవాలయాలు నిర్మించాడు. బానిసల శ్రమ శక్తితో అత్యంత సుందరమైన నగరంగా బాబిలన్‌ను నిర్మించిన యీతడు, దానిలో బ్రహ్మాండమైన జిగ్గురాత్ భవనం కట్టించాడు. ఈ భవనం ప్రాచీన ప్రపంచానికి చెందిన ఏడు వింతల్లో (seven wonders) వొకటిగా పరిగణింపబడి, Hanging gardens) అనే పేరిట నేటికీ పిలవబడుతోంది. క్రీ.పూ. 562లో యీతని మరణంతో కాల్డియన్‌ల అధికారం క్షీణించింది. క్రీ.పూ. 539లో పెర్షియన్లు కాల్డియన్లను ఓడించారు.

పూజారులే రాజులు

మెసపొటేమియన్ నాగరికత మతపరమైంది. నాటి పరిపాలన యావత్తూ, దేవుని పేరిటే జరిగేది. రాజ్యానికి ప్రభువు-దేవుడేననీ, ఆ దైవాంశతోనే పాలకులు అవతరించారనీ, ప్రజలచే పూజారులు నమ్మించారు. అమాయక ప్రజలు దానినే నమ్మారు. యీ రాజులు పూజారులు. (priest-king or king-priest) చాలాకాలం వరకూ యీ రాజులు పూజారివర్గం చెప్పుచేతల్లోనే వుండేవారు. అంచేతనే, నాటి రాజ్యాలపేర్లు, ఆయా నగర రాజ్యాల అధిష్టాన దేవతల పేర్లను బట్టి ఏర్పడ్డాయి. అసూర్ దేవత పాలనలో వున్న దేశం గాబట్టి, అసీరియా అనే పేరు వొచ్చింది. నిప్పూర్ నగర అధిష్టాన దైవంపేరు- ఎన్‌లిల్. బాబిలన్-అంటే-భగవంతుని సింహద్వారం- అని అర్థం. బాబిలన్‌లో వున్న దేవుని పేరు - మర్డుక్. కర్ - షమాష్ అంటే-షమాష్ దేవుని దుర్గం. సర్-అదద్ అంటే,అదద్ దేవుని కాంతి.

ఆనాటి రాజు, దేవుని ప్రతినిధిగా పాలన సాగించేవాడు. దేశంలోని మతాధికారులంతా వొక వ్యక్తికి పట్టాభిషేకం జేసేంతదాకా, అతణ్ణి ఎవ్వరూ గుర్తించేవారు కారు. యీ పట్టాభిషేక సందర్భంలో, రాజును సైతం పూజారి దుస్తుల్లో అలంకరించే వారు; బహుశా పూజారే క్రమేణా రాజుగా మారివుండాలి.



లగాష్‌ను పాలించిన Prince-Priest

గుడియా (మెసపొటేమియా) క్రీ. పూ. 3000

ఆనాడు సుమేరియాలో అనేక నగర రాజ్యాలుండేవి. వొక్కో నగరాన్ని వొక్కోరాజు పాలించేవాడు. ఆ నగర అధిష్టాన దైవానికి ప్రతినిధిగా, యీ రాజు సమస్త అధికారాలూ చలాయించాడు. అనంతరకాలంలో విజేతలు బయలుదేరి, యీ నగర రాజ్యాలన్నీ కబళించి, వొక మహా సామ్రాజ్యాన్ని స్థాపించారు. యీ విధంగా ఉనికిలోకొచ్చిన సార్వభౌముడు, సాక్షాత్ దైవాంశ సంభూతుడుగా పూజారివర్గంచే చిత్రించబడి, వారికి రకరకాల దానాలిచ్చి సంతోషపెట్టేవాడు.

దండయాత్రలు : దేవుళ్ళకి నరబలులు

యుద్ధాలూ దండయాత్రల్లో మునిగితేలిన మెసపొటేమియన్ రాజులకి, సైనిక వ్యవస్థ సహజంగానే పునాదియైంది. రాజులు రథారూఢులై, ధనుర్బాణాలూ శిరస్త్రాణాలూ బల్లేలూ గండ్రగొడ్డళ్ళూ ధరించిన సైనికుల్ని వెంటబెట్టుకొని, పొరుగు రాజ్యాలపై దండెత్తేవారు. యుద్ధఖైదీల్లా పట్టుబడ్డ శత్రు సైనికుల్లో, దృఢగాత్రులందర్నీ బానిసల్లా అమ్మివేసేవారు. మిగిలినవారిని దయా దాక్షిణ్యం లేకండా, ముక్కలకింద నరికివేసేవారు. యుద్ధఖైదీలుగా పట్టుబడ్డ వేలాది శత్రు సైనికుల్ని ఆసీరియా విజేతలు తమ ఇష్టదేవతలకు మూకుమ్మడిగా నరబలి యిచ్చేవారు. ఓడిన వారిలో అనేక వేలమందిని, సామ్రాజ్యంలోని మారుమూల ప్రాంతాలకి బానిసలుగా తరలించేవారు.

శత్రుసేనలు నాటి నగరాలపై దండెత్తినప్పుడు, అమానుషమైన విధ్వంసకాండ జరిగేది. ఆ సమయంలో పశువుల కొట్టాల్లోని గోవులు- దూడల్ని కుమ్మివేసేవి. భీతావహులైన మనుషులు చెవులు చిల్లులు పడేట్లు కేకలూ బొబ్బలూ పెట్టుతూ, పశువుల్లా దిక్కుదిక్కులకీ పారిపోయేవారు. కన్నెపిల్లలు గోడుగోడున ఏడుస్తూ విలవిల్లాడి పోయేవారు. ఆ ఆపత్కాలంలో, నగర రక్షాదక్షులైన దేవతలు సైతం, నిస్సహాయస్థితిలో పడి, ఈగలూ దోమల్లా మారి, వీధుల్లో రొద చేసుకొంటూ పారిపోయేవారు! ఈ దండయాత్ర సమయంలో, నాటి పాలకవర్గానికి జెందిన గాడిదకొడుకులు, ఏ భర్తకీ భార్యను దక్కనిచ్చేవారు కారు. ఏతల్లికీ కూతుర్ని మిగలనిచ్చేవారు కారు.

పూజారులు

ఆనాడు దేవాలయాలకి అమూల్యమైన ఆస్తిపాస్తులుండేవి. పైగా రాజులు జయించిన ప్రతి యుద్ధంలోనూ పెద్ద వాటా దేవునికే లభించేది! దేవునికి లభించిన

వాటా, ఆతని ప్రతినిధులైన పూజారులకే సరాసరి దక్కేది. తత్ఫలితంగా ఈ పూజారులు ధన కనక ఉత్పరాసల్తో కుబేరుల్లా తులతూగారు. ఎవరి కేవిధమైన పెట్టుబడి కావాల్సినా, ఈ పూజారుల వేపుకే దృష్టి మరల్చేవారు: క్రమేణా దేశంలోని వాణిజ్యమూ వడ్డీ వ్యాపారమూ, ఈ పూజారివర్గం చేతిలో యిరుక్కుపోయాయి:

మెసపొటేమియన్ సాంఘిక వ్యవస్థలో, రాజుతో సరిసమానమైన అధికారాన్ని పూజారి సైతం చలాయించాడు. హిందూ దేవాలయం లోని పూజారి నిర్వర్తించిన విధుల్లాంటి విధుల్నే, నాటి మెసపొటేమియన్ పూజారి సైతం నిర్వర్తించాడు. ఉదయాన్నే దేవుణ్ణి మేల్కొల్పడం, పూజ తర్వాత నైవేద్యం పెట్టడం, రాత్రికి నిద్రబుచ్చడం - యివే ఆనాటి మెసపొటేమియన్ పూజారి గుళ్ళో నిర్వర్తించిన విధులు.

మానవ సమాజంలోని అంతరాల వలెనే, మెసపొటేమియన్ దేవుళ్ళూ దేవతల్ని ఓన్నా-పెద్దా తరగతుల్లా విభజించి, వారి వారి లక్షణాల్నీ విధుల్నీ, ఈ పూజారులు ఆయా దేవుళ్ళకీ అంటగట్టారు. తరతరాల నించీ సంక్రమించిన మత సాహిత్యాన్ని సైతం, ఈ పూజారివర్గం సేకరించి జాగ్రత్తగా భద్రపర్చింది.

రాజులకి మతగురువులు సలహాదారులుగా వుండి, తెరవెనక భాగోతం ఆడించే వారు. ఈ మతగురువులపై కోపంతో, ప్రజలు వొక్కోసారి తిరుగుబాటుజేసి, శత్రువులకి అనుకూలంగా నగర ద్వారాల్ని సైతం తెరిచేవారు. మతగురువులు ఏదో వొక సాకు చెప్పి, పేదప్రజల కష్టార్జితమంతా దోస్తుండేవారు. పేదల దొడ్లల్లో ప్రవేశించి చెట్లు నరికివేసి తోటల్లోని పూలూ పళ్ళూ వీరు దండుకపొతుండేవారు. చనిపోయిన తర్వాత జరిపే కర్మకాండ పేరిట, వీరు విపరీతంగా డబ్బు గుంజేవారు. రాజోద్యోగులూ శ్రీమంతులూ మతాధికారులూ కలిసి, నిరుపేదల్ని పీల్చి పిప్పి జేసేవారు.

దేవాలయానికి జెందిన పశువుల కొట్టం లోని ఎద్దుల్తో, ప్రభుత్వోద్యోగులు తమ పొలాలు దున్నించుకొనేవారు. గుడిమాన్యాల్లో పండిన పంటనంతా, పూజారులు తమ బాబుగాడి సొమ్ములా, తమలోతాము పంచుకొనేవారు. న్యాయమూర్తుల్లా నాటక మాడిన ఈ పూజారులు, లంచాలు మేసి, ధనవంతులకు అనుకూలంగా తీర్పు చెప్పేవారు. అయితే, క్రీ.పూ. 2900 ప్రాంతంలో, లగాష్‌ను పాలించిన ఉరుకాజినా, (రాజు) ఈ పరిస్థితుల్ని నిషేధిస్తూ కొన్ని కన్నీటితుడుపు సంస్కరణల్ని మాత్రం

ప్రవేశపెట్టాడు. ఒక్కమాటలో చెప్పాలంటే, ఈ మతగురువుల చేతుల్లో నాటి రాజులు-తొత్తులు ! ఈ తొత్తుల చేతుల్లో సామాన్యప్రజలు-బడితొత్తులు.

అంచేత, నాటి మెసపొటేమియన్ నాగరికతకి దేవాలయమే- పునాది. ఈ పునాది పైనే, నాటి సాంఘిక వ్యవస్థ యావత్తూ నిర్మించబడింది. సమస్త దోపిడీ శక్తులకీ నిలయమైన నాటి దేవాలయం చుట్టూ, మెసపొటేమియన్ నాగరికత ప్రదక్షిణం జేసింది.

దేవాలయాలు

కాల్చిన ఇటుకలతో, మూడు నించి ఏడు అంతస్తులుండే గోపురాల పద్ధతిలో, బాబిలోనియావారు దేవాలయాలు నిర్మించారు. దేవాలయాల పరిసరాల్లో తమ ప్రాసాదాలు నిర్మించదలచుకొన్న రాజులు, తమ భవనాలు - ఎత్తులో వాటికన్న ఎన్నో రెట్లు చిన్నవిగా వుండేట్లు, ఎంతో జాగ్రత్త పడేవారు. మెసపొటేమియా భవన నిర్మాణకళకి "జిగ్గురాత్" భవనం, పతాక సంకేతం. ఇది- మిగతా భవనాల కన్న ఎంతో ఎత్తుగా వుండి, త్రికోణాకారంలో వున్న గోపురం, ఆకాశంలోకి చొచ్చుకపోయినట్లు వుండేది. ఇదొక బ్రహ్మాండమైన దేవాలయం. 70 అడుగుల ఎత్తున ఇటికరాళ్ళ వేదికలపై, వారు దేవాలయాలు నిర్మించారు. దూరం నించి చూసే నేత్రాలకి ఈ గుళ్ళు, కృత్రిమ పర్వతాల్లా కన్పిస్తాయి.

గుళ్ళకి అనుబంధంగా పాఠశాలలు

ఆనాడు దేవాలయాలకి అనుబంధంగా పాఠశాల లుండేవి. వీటిలో పూజారులే గురువులు: పిల్లలకి చదువు చెప్పడంతో పాటు, పురాణాల్ని మతధర్మాల్ని బోధించే వారు. మెసపొటేమియాలో శాస్త్రవిజ్ఞానం మొదట - ఇంద్రజాలవిద్యగా ప్రారంభమైంది. అలాగే జ్యోతిష్యంగా ప్రారంభమైంది - క్రమేణా ఖగోళశాస్త్రంగా పరిణామం చెందింది.

దేవాలయాలే న్యాయస్థానాలు
పూజారులే న్యాయమూర్తులు

మెసపొటేమియా న్యాయవ్యవస్థలో, హమురాబీ "ధర్మశాస్త్రం" (కోడ్) సుప్రసిద్ధమైంది. ఆనాడు ప్రతి ఫిర్యాదునూ ముందుగా మధ్యవర్తి పరిష్కారానికి

పంపేవారు. మధ్యవర్తికి వీలుగాని పరిస్థితుల్లోనే, తగాదాలు న్యాయస్థానాలకి వెళ్ళేవి. సాధారణంగా నాటి దేవాలయాలే న్యాయస్థానాలు; నాటి పూజారులే-న్యాయమూర్తులు; వ్యాపార తగాదాలూ, సాంసారికమైన వివాదాలూ, క్రయ విక్రయాలూ, దత్తతా యిత్యాది వివాదాల్ని ఈ పూజారులే విచారించి తీర్పు చెప్పేవారు.

వివాహ సమయంలో కన్యాశుల్కం ఎంత యివ్వాలో, వధువే నిర్ణయించడం సాంప్రదాయంగా వుండేది. భర్త ప్రమేయం లేకండా, స్వంతంగా వ్యాపారం జేసుకొనే హక్కు ఆనాడు స్త్రీల కివ్వబడింది. వారసత్వపు హక్కులూ, ఆస్తి పంపకాల విషయంలో మెసపొటేమియన్ శాసనకర్తలు, సమిష్టి కుటుంబ విధానానికే ప్రాధాన్య మిచ్చారు.

నాటి బానిస వ్యవస్థలో, ఏకపత్నీవ్రతం చేతకానితనానికి పతాక సంకేతం. అంచేత, ఉంపుడుకత్తెల్ని వుంచుకోవడం ఆనాడు ఏమాత్రం నేరం గాదు. ఆ కాలంలో నేటి దేవదాసీల్లా, దేవాలయాల్ని ఆశ్రయించుకొని జీవించే వ్యభిచారిణు లుండేవారు.

మెసపొటేమియన్ దేవుళ్ళు

ఆదిమ జాతుల పురాణ సాహిత్యం, వారి సాంఘిక జీవితానికి అచ్చమైన ప్రతిబింబం. ప్రకృతీ- మానవ జీవితమూ గూర్చి, నాటి మెసపొటేమియన్ల విశ్వాసాలు వారి పురాణాల్లో ప్రతిఫలించాయి.

క్రీస్తు పుట్టుకకి తొమ్మిది శతాబ్దాలకి పూర్వమే, మెసపొటేమియాలో 65వేల మంది దేవతలుండేవారు; అయితే, ఈ దేవతలు హిందూ దేవతల కన్న సంఖ్యలో చాలా తక్కువ; ఎంచేతనంటే హిందూ దేవతలు-33 కోట్ల మంది; 65 వేలమంది మెసపొటేమియన్ దేవతల్లో, చాలామంది అనామకులు; కొద్దిమంది మాత్రమే ముఖ్యులు. సాధారణంగా ఆనాడు గెలిచిన జాతి యొక్క దేవుళ్ళు, ఓడిన జాతి యొక్క దేవుళ్ళ పుత్రులుగా మారిపోయేవారు; ఈ రకమైన రాజీ ఫలితంగా, వేలాది దేవుళ్ళూ దేవతలూ అతి కొద్దిమందిగా పరిణామం చెందారు.

అణు

ఈ విధంగా ఎన్నో మార్పులూ చేర్పులూ జరిగిన తర్వాత, "అణు" అనే దేవుడు స్వర్గాధిపతిగా స్థిరపడ్డాడు. (ఈతడు మన దేవేంద్రుడు లాంటివాడు) మానవ

లోకాధిపతి పేరు- ఎన్‌లిల్. జలాధిదేవుని పేరు - ఇయా. ఈ ఇయా పుత్రుడే- బాబిలోనియా అధిష్ఠాన దైవమైన మర్దుక్. అణు ముసిలివాడైన పిదప, రాజ్యాధికారాన్ని మర్దుక్‌కు అప్పగించినట్లు, మనకు మెసపొటేమియన్ పురాణగాథ ద్వారా తెలుస్తోంది.

ఎన్‌లిల్

మొట్టమొదట కొండప్రాంతాల్లో నివసించిన సుమేరియన్లు, తర్వాత వాటిని వొదిలి, మైదాన భూములకి వొచ్చి స్థిరపడ్డారు. కంటికి కన్పించే వానలూ వరదలూ తుఫానులూ, కంటికి కన్పించని "అదృశ్య శక్తి"కి నిదర్శనాలుగా వారు ఊహించారు. అంచేతనే, సుమేరియన్ల దేవుడైన ఎన్‌లిల్, భయంకరమైన వానలూ వరదల్తో కొండలోయల్ని అమాంతం ముంచివేయగల కుంభవృష్టికి కారణమైన పర్వతసీమల్తో జనించినవాడుగా నాటి వారు భావించారు: నాటి మెసపొటేమియన్ కవులు, ఈతని ధైర్య సాహసాల్ని ఎన్నో గీతాల ద్వారా కీర్తించారు.

అదార్

సుమేరియన్లకి వ్యవసాయం ప్రధాన వృత్తిగా మారిన దశలో, ఎన్‌లిల్ - వ్యవసాయానికి అధిదైవం అయ్యాడు. నాటినించి ఈతని స్వభావంలో చాలామార్పులొచ్చాయి. తుఫాన్‌కీ ప్రళయానికీ కారకుడైన ఎన్‌లిల్ కఠోర లక్షణాలన్నీ, ఈతని అనుచరుడైన అదార్‌కు సంక్రమించాయి. హిందూమతంలోని పరమశివునికీ కాలభైరవునికీ మధ్యనున్న సంబంధం లాంటిదే, ఎన్‌లిల్‌కీ అదార్‌కీ మధ్యనున్న బాంధవ్యం: స్వర్గ మర్త్య పాతాళలోకాల్ని క్షణకాలంలో నాశనం జేయగల ప్రళయరుద్రుడే- ఈ అదార్. హిందూ మతానికి జెందిన త్రిమూర్తుల్లో శివుడు-లయకారుడు. ఈ శివుని లక్షణాలన్నీ దాదాపు అదార్‌లో కన్పిస్తాయి.

నబూ

ఈ నబూ దేవుడు సమస్త సృష్టికీ సాక్షిమాత్రుడు. భూత భవిష్యత్ వర్తమానాల్ని గురించి తెలిసిన త్రికాలజ్ఞుడు. నక్షత్ర మండలాన్ని పరిశీలించి, మేషాది రాసుల్ని గ్రహగతుల్ని వివరించగల పండితుడు. జోస్యం చెప్పగల దైవజ్ఞుడు: ఈతడు "విధి" నిర్ణయాల్ని నమోదు జేసే చిత్రగుప్తుడు లాంటివాడు.

షమాష్

ఈ షమాష్ దేవుడు సాక్షాత్తూ సూర్యభగవానుడే! తన కోటికోట్ల కిరణాల్తో దశదిశలకీ వెలుగునీ వేడినీ అందిస్తూ, భూమిని సస్యశ్యామలం జేసే మానవాళి మిత్రునిగా, సమస్త సంపదలూ ప్రసాదించే దాతగా, ఈ షమాష్‌ను నాటి మెసపొటేమియన్ కవులు స్తుతించారు. (ఈ విధమైన స్తోత్ర పాఠాలే, సూర్యుని గూర్చి రుగ్వేదంలో గూడా మనకు కానవొస్తాయి) పగలంతా పర్యటిస్తూ, ప్రపంచానికి కాంతిని ప్రసరింపజేసే సూర్య "దేవుని", నాటివారు సర్వజ్ఞుడుగా పరిగణించారు. వారి దృష్టిలో సూర్యుడు- శిష్టరక్షణ దుష్ట శిక్షణాదక్షుడైన ధర్మమూర్తి. ఈ సూర్య దేవుడే ఆనంతర దశలో, నరలోక పరలోకాలకి అధినాథుడుగా పరిణామం చెందాడు! ఈ విధంగా నాటి మెసపొటేమియన్లు ప్రకృతిశక్తులకు దైవత్వ మారోపించి, వాటిని వివిధ దేవతలూ దేవుళ్ళుగా సృష్టించారు.

దయ్యాలు - భూతాలు
క్షుద్ర సాహిత్యానికి బీజాలు

ప్రకృతి శక్తులకి ప్రతిబింబమైన నాటి దేవతల వరకే, వారి మతం పరిమితం గాలేదు. దేశంలోని ప్రజలకీ పశువులకీ తరచుగా వొచ్చే రోగాలకి, దయ్యాల దుష్ట చేష్టలే కారణమని వారు గాఢంగా విశ్వసించేవారు! అంచేత, దెయ్యాలూ భూతాలూ వున్నాయని వారు నమ్మేవారు. భూమికి బరువైన భూత ప్రేత పిశాచాల్ని, మంత్ర తంత్రాల ద్వారా వెళ్ళగొట్టడానికి ప్రయత్నించేవారు!

కంటికి కన్పించకుండా ఎన్నోబాధలు పెట్టే, భూత ప్రేత పిశాచాలు జ్ఞాపకం వొచ్చినప్పుడు, వారు భయంతో గజగజలాడిపోయేవారు. నాటి పురాణ సాహిత్యంలో యీ దెయ్యాలవర్ణనలు విపరీతంగా కానవొస్తాయి. యీ దెయ్యాలవొల్లనే తలనొప్పి వొస్తుందని వారు గట్టిగా నమ్మేవారు! పరిశుభ్రమైన జలంతో ఏడుసార్లు, దెయ్యం పట్టిన మనిషిని "ప్రక్షాళనం" జేసినతర్వాత, "దూరంగా-యింకా దూరంగా-సిగుతో తలవొంచుక - దూరంగా పారిపో-తిరిగి పో-తొలగిపో-ఆకశాని కెగిరిపో"- అంటో మంత్రాన్ని చదివి, దెయ్యాన్ని వొదలగొట్టేవారు. (ఈ విధమైన దెయ్యాలూ భూతాలూ మంత్రతంత్రాలూ మన అధర్వణవేదంలో కుప్పతెప్పలుగా కన్పిస్తాయి.)

సమాజంలో వర్గ భేదాలు

క్రీ. పూ. 3వేల ఏళ్ళ నాటికే, (ఈజిప్టులో వలె) మెసపొటేమియాలో గూడా సమాజం బానిసలూ- బానిసయజమానులనే విరుద్ధ వర్గాలుగా చీలిపోయింది. నాటి సాంఘిక వ్యవస్థలో, రాజవంశస్థులు- పురోహితులు- రాజోద్యోగులు- రైతులు- బానిసలూ వుండేవారు. సమాజంలో పూజారులు అత్యంత ప్రధానమైన స్థాన మాక్రమించారు. రాజవంశస్థులకీ పేదప్రజలకీ మధ్య సామంతులుండేవారు. ప్రతి యుద్ధం తర్వాత, రాజులు ఈ సామంతులకు ఇనాములిచ్చేవారు. అసీరియా వారిలో సంపన్నులంతా భూస్వాములు. బాబిలోనీయన్ సంపన్నుల్లో చాలామంది వ్యాపారులు.

సంపన్నవర్గాలు చీకూ చింతా లేని జీవితం గడిపేవారు. వారి భవనాల గోడలపై అందమైన బొమ్మలు చిత్రించబడ్డాయి. పోతపోసిన ఇనుము- కంచు- వెండి- బంగారు- పాత్రలూ, అందాలు చిందే ఆభరణాలు, లేసులూ, దుప్పట్లూ, నాజూకైన అద్దకం దుస్తులూ, మేజాలూ, కుర్చీలూ, మంచాలూ యిత్యాదుల్ని ఉపయోగించిన సంపన్న వర్గాలు, జీవితాన్ని ఖుషీగా గడిపారు. మద్దెక్కా, తంత్రీవాయిద్యాలూ, బూరలూ తప్పెట్లూ, తాళాలూ యిత్యాది వాటిని నాటివారు వాడేవారు. దేవాలయాల్లో, సంపన్నుల సౌధ ప్రాంగణాల్లో, విందులూ వేడుకల సమయాల్లో, మేళతాళాల్తో పాటకచ్చేరీలూ గానాబజానాలూ విరివిగా జరుగుతుండేవి.

కొండ కొమ్ములపై ఆనాడు నగరాలు నిర్మింపబడేవి. కమ్మరి, కుమ్మరి, నేత పనివారు, చర్మకారులు యిత్యాది వృత్తిపనివారు నగరాల్లో వుండేవారు. ఉన్ని దుస్తులకు నాటి మెసపొటేమియా చాలా ప్రసిద్ధికెక్కింది. ఆనాడు వెండికడ్డీలు ధనంగా వినియోగింపబడ్డాయి.

పల్లె ప్రజలు

అడుసూ గడ్డీ కలిపి ముద్దలుజేసి కట్టుకొన్న పూరిళ్ళలో పేదప్రజలు నివశించేవారు. ఎండ వేడికి ఈ అడుసు రాయిలా బిగుసుకపోయేది. గట్టిగా వుండేందుకు, కొయ్యకమ్మల్తో వాసాలు బిగించి, వాటిపై పూరి పరిచి మట్టితో కప్పేవారు. ఏటా వొచ్చే వరదలనించి తప్పించుకోవడానికి, ఇళ్ళ తోటలచుట్టూ ఆనకట్టలు కట్టేవారు. వరదల సమయంలో ప్రత్యేకంగా మట్టిదిబ్బలు నిర్మించి, తామూ తమ పశుగణమూ వాటిపై రక్షణ తీసుకొనేవారు.

మహత్తరమైనమానవశ్రమశక్తి,మెసపొటేమియాను సశ్యశ్యామలభరితమైన భూమిగా మార్చివేయగల్గింది. వొకవిత్తనానికి వందవిత్తనాల పంటదిగుబడి వొచ్చేది. పల్లెలచుట్టూ దట్టంగా పెరిగిన ఖర్జూరంచెట్లు కళకళలాడుతుండేవి. ఖర్జూరంతో పిండి, తేనె, సారాయి తయారుజేసేవారు. చెట్టునారతో తాళ్ళు, బుట్టలూ అల్లేవారు. ఈ పల్లె వాసుల బతుకుతో, ఈ చెట్టు యింత గాఢంగా పెనవేసికొన్నందున, దీనిని "జీవన వృక్షం" అనే సార్థక నామంతో వారు పిలిచారు. పెన్నలా నున్నగానున్న ఉన్నితో వున్న గొర్రెలూ, ఎద్దులూ ఆవులతోగడ్డిబీళ్ళు కళకళలాడుతుండేవి. అక్కడే మెసపొటేమియన్ గోపాలురు, తమ అమాయక జీవితం వెళ్ళబుచ్చారు.

బానిసలు : బానిస యజమానులు

ఈజిప్టులో వలె మెసపొటేమియాలో గూడా, వ్యవసాయమూ, పశువుల పెంపకమూ సమాజంలో పాలక- పాలితవర్గాలు అవతరించడానికి దోహదం జేసింది. బానిసలచే పనిచేయించడం ద్వారా, అవసరమైన దానికన్న అధికంగా, ధాన్యం ఉత్పత్తి జేయడానికి అవకాశముందని గ్రహించిన బానిస యజమానులు, వేలాది బానిసలచే రాత్రింబగళ్ళు చాకిరీ చేయించేవారు. బానిసలకి వెట్టికూడువేయగా మిగిలిన ధాన్యాన్ని, బంగారం- కంచు- నాజూకైన వస్త్రాలూ అలంకరణల కోసం ఈ యజమానులు విరివిగా మారకం వేసేవారు. వేలాది యుద్ధఖైదీలు బానిసలుగా చేయబడేవారు. వీరిని వినియోగించి, వైభవోపేతమైన భవనాలతో నగరాల్ని ముస్తాబుజేసి, దుర్భేద్యమైన గోడలతో వాటిని రక్షించేవారు. బానిసయజమాన వర్గంలో, సామంతులు తెగల పెద్దలూ వుండేవారు. దేశజనాభాలో అధికభాగం, పేదరైతులు వ్యత్తి పనివారే. సాధారణంగా పేదప్రజలకి తింటానికి తిండీ పనిచేయటానికి పనిముట్లూ వుండేవిగావు. ఆ పరిస్థితుల్లో కొంత వెండిగానీ, కొద్దిగా ధాన్యంగానీ, ఆప్పుగా యివ్వమని పేదవాడు బానిసయజమానిని అర్థించేవాడు. ఖైం ప్రకారం యీ అప్పునూ యిందుకు వడ్డీనీ, యీ దరిద్రుడు ధనికునికి చెల్లించాలి. బతుకంతా కష్టించినా, వడ్డీ డబ్బులు కట్టడానికి గూడా వీలుండేదిగాదు. అసలు- అసలుగానే మిగిలిపోయేడి. విశ్రాంతి లేకుండా అహోరాత్రాలూ చెమటోడ్చినా, పేదలు రుణగ్రస్తులుగానే మిగిలిపోయేవారు. భూమిని కౌలుకు తీసుకొన్న పాలికాపు, భూస్వామికి పంటలో సగభాగంగానీ, తోటలో కాసిన పళ్ళలో ముప్పాతిక వంతుగానీ, యిచ్చితీరాలి.

బానిస విధానం

మెసపొటేమియాలో క్రీ. పూ. నాల్గువేలసంవత్సరాల ప్రాంతంలో, ఆదిమ కమ్యూనిస్టు సమాజం అంతరించి, దాని స్థానంలో బానిస సమాజం ప్రవేశించింది. ఈ సమాజ అవతరణతో రాజ్యాంగయంత్రం అమల్లోకొచ్చింది. రాజ్యాంగయంత్రం లేకుండా బానిసయజమానులు, పేదప్రజల్నీ బానిసల్నీ తమ చెప్పుచేతల్లో పుంచుకొని, వారిని తొక్కిపట్టి నారదీయడానికి అవకాశం లేదనే విషయం చారిత్రక సత్యమేగదా?!

క్రీ. పూ. 1792 నుండి 1750 వరకూ బాబిలోనియా సామ్రాజ్యాన్ని హమురాబీ పాలించాడు. ఈ ప్రబుద్ధుడు, బానిసలపట్ల మెసపొటేమియన్ మనువుగా ప్రవర్తించాడు. బానిస యజమానుల ఆస్తిపాస్తుల్ని భద్రంగా రక్షించి, బానిసలూ, పేదప్రజలపై వారిపెత్తనాన్ని కొనసాగించాడు. ఇందుకవసరమైన ఎన్నో శాసనాల్ని గూడా జేశాడు. మనిషి ఎత్తున పున్న వొక నల్లరాతి పలకపై (స్థూపం) ఈ హమురాబీ చెక్కించిన "న్యాయ" శాసనాల్లో కొన్నిటిని మాత్రం ఉటంకిస్తాను.

"దేవుళ్ళచే పంపబడిన నేను, రాజులకి రారాజునైన నేను, దేశం నోటిలో సత్యమూ, న్యాయమూ పెట్టి, ప్రజల జీవితాన్ని సంపన్నవంతం జేశాను. నేటి నుండి నేను ఈ క్రింది విధమైన శాసనాలు జేస్తోన్నాను :"

"దేవాలయం ఆస్తిగానీ, లేదా రాజు ఆస్తిగానీ, దొంగిలించిన వ్యక్తికి మరణదండన విధించబడుతుంది. తస్కరించబడిన ఆస్తిని, స్వీకరించిన వ్యక్తికి గూడా ఈ శిక్షయే విధించబడుతుంది."

"స్త్రీ లేదా పురుష బానిసను అపహరించిన వ్యక్తికి మరణశిక్ష."

"పారిపోతున్న బానిసను దాచిన వ్యక్తికి మరణశిక్ష."

"బానిస శరీరంపై వేయబడ్డ ముద్రని, దేహంనించి కోసివేసిన వ్యక్తి యొక్క వేళ్ళు నరకబడ్తాయి."

"మరొకనికి చెందిన బానిసను చంపినవాడు, అందుకు బదులుగా తన బానిసను యిచ్చితీరాలి."

"రుణగ్రస్తుడు బాకీని తీర్చడానికి, తన భార్యను లేదా కొడుకునూ లేదా కూతురును మూడేళ్ళ పాటు, చాకిరీ జేయడానికి బానిసయజమానికి అప్పగించాలి."

"ఏొక వ్యక్తి, తనతో సమానమైన వాణ్ణి, దవడపై కొడితే, జరిమానా చెల్లించాలి."

"తనకన్న అధికమైన భూస్వామిని లేదా పూజారిని, ఏవ్యక్తియైనా చెంపపై కొడితే, ఆ వ్యక్తిని ఎద్దుచర్మంతో చేసిన కొరడాతో ఆరువై దెబ్బలు కొట్టాలి."

"ధర్మప్రభువునైన నేను, ఈ శాసనాల్ని సూర్యదేవుని నించి కానుకగా స్వీకరించాను : నా కూతలు-ఆశ్చర్యకరమైనవి; నా చేతలు-అసాధారణమైనవి."


కష్టజీవుల్ని నిష్టదరిద్రుల్ని కాల్చుకతింటానికి అమలుజేయబడ్డ ఈ కిరాతక శాసనాల్ని, సూర్యదేవుడే తనకి బహుమతిగా ప్రసాదించాడని హమురాబీ చెప్పుకొన్నాడు. బానిసయజమానుల ఆస్తిపాస్తుల్ని రక్షించేందు కవసరమైన రాక్షసచట్టాల్ని అమలుజేసిన ఈ హమురాబీ, బానిసల మూల్గుల్ని పీల్చి పిప్పిజేసేందు కవసరమైన కిరాతక చట్టాల్ని పాస్ జేసిన ఈ హమురాబీ, బానిసయజమానుల పచ్చితొత్తుగా వ్యవహరించిన ఈ హమురాబీ, బూర్జువా చరిత్రకారులచే సిగ్గూ బిడియం లేకండా ధర్మప్రభువని కీర్తించబడ్డాడు :

నాటిమెసపొటేమియన్ సాంఘిక వ్యవస్థకి నిండుటద్దం లాంటి ఈ కోడ్‌లో వ్యవసాయం వర్తకం నౌకాయానం ధరలు జీతాలు నేరాలు శిక్షలు యిత్యాది అనేక విషయాలు ప్రస్తావించబడ్డాయి. ఈ "ధర్మశాస్త్రం"లో మొదట ఈ విధంగా వుంది : "నా హృదయంలో నిరంతరం బాబిలన్ ప్రజ లుంటారు. వారు నా బిడ్డల్లాంటివారు. ఈ న్యాయశాస్త్రం బలహీనుల్ని, భర్తృహీనుల్ని (విధవరాళ్ళనీ) అనాథల్ని, రక్షించేందుకే అమలుచేయబడింది."

వ్యవసాయం

మెసపొటేమియాలో నదులకు ప్రతిఏడూ వరదలు వొచ్చేవి. నదుల వరదల్తో దేశమంతా బురదై పోతుండేది. ఈ వరద బురద నించి తప్పించుకోవడానికే, పరిస్థితుల ఒత్తిడి మూలంగానే, వారు వ్యవసాయం చేయడం నేర్చుకొన్నారు. నదులకి వొచ్చే అదనపు వరదనీరు, దేశాన్నంతటినీ ముంచివేయకుండా, దాన్ని కాలవల్లోకీ బోదెల్లోకీ మళ్ళించి, వారి పంటపొలాలకి పెట్టి వ్యవసాయం చేసేవారు. వలలతో కప్పినట్లు దేశమంతా పంటకాలవల్తో నింపివేశారు. వ్యవసాయానికి కొయ్యనాగళ్ళు

ఉపయోగించారు. వాటికి ఎడ్లని కట్టి పొలం దున్నేవారు. బార్లీ, గోధుమ, నువ్వులు, ఉల్లిపాయలు, ఖర్జూరం, పండించారు. మేకలు, గొర్రెలు, పశువుల్ని పెంచారు.



మెసపొటేమియాలో వ్యవసాయం

మొదట వీరి పని ముట్లన్నీ చెకుముకి రాయి– దంతం– ఎముకలతో తయారు చేయబడ్డాయి. సుమేరియన్లు లోహ విద్యలో చాలా నేర్పరులు. బంగారం, వెండి, సీసం వాడేవారు. రాగితో అనేకపాత్రలూ, దేవతా విగ్రహాలూ, పనిముట్లూ, ఆయుధాలూ, లోహాల్ని పోతపోయడం పోయడం సైతం వారు నేర్చుకొన్నారు. వారికి బట్టల అద్దకం గూడా తెలుసు. అనేకమైన రంగులూ పుష్పాలూ లతలతో, చిత్ర విచిత్రమైన నమూనాలతో అందమైన అద్దకంపని వారు చేసేవారు.

వ్యాపారం

నాటి ఆర్థిక వ్యవస్థలో వర్తకం ప్రముఖమైన పాత్ర వహించింది. భూమి–బానిసలు–పశుసంపద–వ్యాపార సరుకుల రూపంలో, నాటి వ్యాపారవర్గాలకి విపరీతమైన ఆస్తిపాస్తులుండేవి. వీరు బళ్ళూ యితర వాహనాలు ఎక్కి, దూరప్రయాణం చేసేవారు. పడవప్రయాణాలు గూడా మామూలే. వీరు ఉపయోగించిన కొన్ని శకటాల నమూనాలు, పురాతత్వ శాస్త్రవేత్తలకి కీష్ ప్రాంతంలో దొరికాయి. బళ్ళను గాడిదలకీ గుర్రాలకీ కట్టి తోలేవారు. శాంతికాలంలో వ్యాపారం కోసమూ, యుద్ధకాలంలో దండయాత్రల నిమిత్తం వుపయోగపడేటట్లు, రాజులు దేశం నలుమూలల్నీ కలిపే రహదారుల్ని నిర్మించారు. ఉన్నివస్త్రాలు, ఖర్జూరం, ధాన్యం, రొట్టెయిత్యాది వస్తుసామగ్రితో వారు పశ్చిమాసియా దేశాలతో వ్యాపారం చేశారు. ఆనాటికి నాణేలు యింకా చలామణిలోకి రాలేదు. వ్యాపారమంతా సరికి సరి యిచ్చి, సరుకు

యిచ్చి పుచ్చుకొనే వస్తుమారకం పద్ధతిలోనే కొనసాగింది. అనంతర కాలంలో, వెండి బంగారాలు యిచ్చి, సరుకులు పుచ్చుకోవడం ప్రారంభమైంది. రసీదులు యిచ్చి పుచ్చుకోవడం, వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడం, పద్దులు రాయడం వంటి పద్ధతుల్లో సుమేరియన్లు సిద్ధహస్తులు.

శాస్త్రీ ప్రగతి

అత్యంత ప్రాచీనకాలంలోనే, బాబిలోనియన్లు గ్రహగతుల్ని గూర్చి అధ్యయనం జేశారు. సూర్య-చంద్ర-గ్రహణాలు ఎప్పుడు వొస్తాయో ముందుగానే వారు చెప్పగలిగేవారు. సంవత్సరాన్ని నెలలూ వారాలుగా విభజించి, రోజును గంటలూ నిమిషాలుగా లెక్కించేవారు. నినెవె లైబ్రరీలో వైద్యశాస్త్ర సంబంధమైన "పుస్తకాలు" గూడా లభించాయి.

అయితే నాటి బాబిలోనియన్లకి వున్న విజ్ఞానం, వాస్తవమైన శాస్త్రీయ దృక్పథంపై ఆధారపడినట్టిది మాత్రం గాదు. ఉదాహరణకి- ఆకాశం బ్రహ్మాండమైన టోపీ లాంటిదనీ, ఈ టోపీకి కిటికీలు గూడా వున్నాయనీ వారు భావించేవారు! సూర్య చంద్రులతో పాటు మిగతా అయిదు గ్రహాలూ దేవుళ్ళేనని వారు విశ్వసించే వారు. వారానికి చెందిన వొక్కో రోజును - వారు వొక్కో దేవునికి అంకితం జేశారు. నాటి వైద్యశాస్త్ర గ్రంధాల్లో, కొన్ని రోగాలు నయంకావడానికి, ఎలుక నాలికలూ - కుక్క వెంట్రుకలూ - పసుపుపచ్చ రంగున్న ఎద్దుచెవుల్ని వారు "మందులు"గా సూచించారు!

సుమేరియా లిపి

అసీరియా సామ్రాజ్యం యొక్క రాజధానియైన నినెవె వొద్ద పురాతత్వ శాస్త్రవేత్తలు సాగించిన తవ్వకాల్లో, అనేక వేల మట్టి ముద్రికలు దొరికాయి. మెసపొటేమియా- దాని యిరుగు పొరుగు దేశాల చరిత్రను వివరించే భౌతిక అవశేషాలే ఈ మట్టి పలకలు. వీటిపై క్యూనిఫారం లిపిలో రాయబడిన విలువైన చరిత్ర ఎంతో వుంది.

క్రీ. పూ. నాలుగువేల సంవత్సరాల ప్రాంతంలో, మెసపొటేమియాలో లిపి అంకురించింది. ప్రాచీన ఈజిప్టులో వలె యిక్కడ గూడా, నాటి వారు బొమ్మల ద్వారా లిపిని రాసేవారు. ఈజిప్టులో దొరికిన పాపిరస్ (రెల్లుగడ్డి) మెసపొ


మేమియాలో దొరకనందున, వారు సున్నితమైన మట్టిపలకలపై రాసేవారు. ఒక వ్యక్తి రాయడానికి కూర్చున్నపుడు, తన ప్రక్కన తడిచిన బంకమట్టి పలకలు పెట్టుకొనేవాడు. ఒక పలకపై రాయడం పూర్తికాగానే, అది గట్టిపడేందుకు ఎండలో ఎండబెట్టడం గానీ, నిప్పులో కాల్చడంగానీ జరిగేది. మొదట గీతలుగా ప్రారంభమైన ఈ లిపి, క్రమేణా బొమ్మలూ సంకేతాలుగా పరిణామం జెందింది. ఒక్కో సంకేతం– ఒక అక్షరాన్ని గానీ, ఒక పదాన్నిగానీ సూచించేది. మొత్తంమీద నాటివారు ఒక వెయ్యి సంకేతాల్ని వాడారు. ఈరకమైన రాత పద్ధతిని క్యూనిఫారం లిపి అని పిలుస్తారు.

దక్షిణ మెసపొటేమియాలో ప్రప్రథమంగా అంకురించిన ఈ లిపి, పొరుగు దేశాలకి సైతం వ్యాపించింది. నినెవె రాజధానిలో, అసీరియన్ రాజైన "ఆసూర్ బనివాల్" మెసపొటేమియన్ నాగరికతకి చెందిన మత– చారిత్రక– సాహిత్య– శాస్త్రీయ విశేషాల్ని తెలియజేసే వేలాది మట్టిపలకల్ని సేకరించి, బ్రహ్మాండమైన "పుస్తక" భాండాగారాన్ని నెలకొల్పాడు. ఈ మట్టిపలకలపై, చారిత్రక వివరాలు, రాజుల ఆజ్ఞలు, శాస్త్రీయ విశేషాలు, చట్టాలు, ప్రాచీన పురాణగాథలూ లిఖించబడ్డాయి.

ప్రపంచంలో ప్రప్రథమంగా లిపిని కనిపెట్టినవారు సుమేరియన్లే : మొదట ఈ లిపి – బొమ్మల రూపంలో ప్రారంభమైంది. తర్వాత ఆ బొమ్మలు గీతలయ్యాయి. గీతల్ని మట్టిపలకలపై రాయడం ప్రారంభించాక, మట్టిపలకలు వాడుకలో కొచ్చాయి. మట్టిముద్ద గట్టిపడడానికి ముందే, గీతలు గంటుపడేట్లు రాసేవారు. అసీరియాలో – అసూర్ బనివాల్ – రాజప్రాసాదమున్న ప్రదేశంలో, శాస్త్రవేత్తలు సాగించిన తవ్వకాల ఫలితంగా, లిపి సంకేతాలున్న మట్టిపలకలు దాదాపు ముప్ఫయ్ వేల వరకూ దొరికాయి.

సుమేరియన్ లిపి, మానవ సంస్కృతీ వికాసానికి ఎంతగానో దోహదం జేసింది. బంకమట్టి పలకలపై, గట్టి వెదురుపుల్లతో గానీ ఎముక లేదా కొయ్యతో తయారుజేసిన "స్టయిలస్" అనే సాధనంతోగానీ వారు రాసేవారు. ఎండలో ఎండి, బాగా గట్టిపడ్డ ఆ బంకమట్టి పలకలే, శాశ్వతమైన చారిత్రక రచనలుగా భావి తరాలకి సంక్రమించి, అనంతరయుగాల్లో మానవజాతి నిస్తుల వారసత్వంగా పరిణమించాయి.

ఈ చిత్రరూపకమైన లిపికి - పంగలకర్ర లిపి-అని భాషాతత్వవేత్తలు నామకరణం జేశారు. ఈ గుర్తుల్తో (సంకేతాలు) రాసిన బొమ్మల్ని గుర్తుపట్టడం కాలక్రమేణా



సుమేరియా లిపి

అసాధ్యమై, చివరికి ఈ బొమ్మల పోలికే నశించింది. ఆఖరికి ఈ లిపి, ఆరు వందల సంకేతాలుగా మాత్రం నిల్చింది. ఈ లిపిలో భావసంకేతాలూ - ధ్వని సంకేతాలూ వున్నాయి. వస్తువుల్ని భావాల్ని - భావసంకేతాలు తెలియజేయగా, శబ్దాల్ని - ధ్వని సంకేతాలు తెలియజేస్తాయి.

ఇటుకలతో వేదికలు నిర్మించి, వాటిపై బ్రహ్మాండమైన భవనాల్ని అసీరియా వారు కట్టారు. జీవకళ తొణికిసలాడే సుందరమైన శిల్పకళకి బాబిలోనియా ప్రసిద్ధి

చెందింది. అసీరియావారు మట్టి పలకలపై గంట్లు పెట్టి, చాలా బొమ్మలు చిత్రించారు. పెంకులపై ముందుగా బొమ్మలు చెక్కి, వాటికి మెరుగుపెట్టి గోడల్లో పొదిగారు. చేతివృత్తులు చాలా ఉన్నతమైన స్థాయి నందుకొన్నాయి. ఉర్‌ను పాలించిన కొంతమంది రాజుల గోరీలు తవ్వినపుడు, పురాతత్వవేత్తలకు వీణ వంటి వాయిద్యాలు దొరికాయి.

సాహిత్యం

(గిల్‌గమేష్ కథానాయకుడుగా అభివర్ణితమైన మెసపొటేమియన్ కావ్యంలో, ప్రాచీన ఇతిహాస లక్షణాలన్నీ వున్నాయి. క్రీ. పూ. 3500 నాటి ఈ ఇతిహాసం, ప్రాచీన గ్రీకు మహా కావ్యమైన "యులిసెస్"కు నాందీ ప్రాయమైంది. ఈ కావ్యంలో-యుద్ధం, ముట్టడి, వ్యక్తిగత కక్షలు, ప్రణయం, ప్రళయం, మొదలైన వన్నీ వున్నాయి. కాటికి కాళ్ళు జాపుకొన్న వయస్సులో స్మశాన వైరాగ్యం ఆవహించిన కథానాయకుడు మన ముందు సాక్షాత్కరిస్తాడు.

మెసపొటేమియన్ సాహిత్యంలో లౌకిక రచనకి, గిల్‌గమేష్ గాథ - నాంది లాంటిది. కట్టు కథలకీ, ప్రేమ కవిత్వానికీ, మెసపొటేమియా కవులే పునాదులు వేశారు. జంతువులు మాట్లాడుకొనే నీతి కథలు, మెసపొటేమియాలో అధికమైన ప్రజాదరణ పొందాయి.

వాడికోరల్తో, రక్తానికి బదులు విషమే నరనరానికీ పారే పెద్దపెద్ద పాములూ, కళ్ళు మిరుమిట్లు గొల్పే రెక్కల పాములూ, తేలు మనుషులూ, చేపమనుషులూ, అగ్ని జ్వాలల్తో ఆపాదమస్తకం దహించే వీరులూ, వాయువేగ మనోవేగాల్తో దూసుకుపోయే గుర్రాలు, ఆకాశమంత ఎత్తు తలలూ-భూమండలమంత వెడల్పయిన వక్షస్థలాలు గల రాక్షసులూ, గెరిల్లాల వంటి అడివి మనుషులూ, ఒడలు జలదరించే నరకలోక వాసుల స్థితిగతులూ, రంభా ఊర్వశి వంటి అప్సరసలూ సింహాలులాగే బంగారు చక్రాల రథాలూ, మెసపొటేమియన్ కావ్యాల్లో కోకొల్లలుగా కన్పిస్తాయి :

జల ప్రళయం గురించి కట్టుకథ

నినెవెలో లభించిన మట్టిపలకలు, జలప్రళయం గూర్చి వొక కట్టుకథను ప్రస్తావించాయి. ఈ కథ ప్రకారం, సమస్త మానవజాతినీ నాశనం జేయాలని దేవుళ్లు

నిర్ణయించుకొన్నందువల్ల, బ్రహ్మాండమైన జలప్రళయం సంభవించింది. దాదాపు 40 రోజుల పాటు ఎడతెరిపిలేకుండా వాన కురిసినందు వల్ల, భూమండలమంతా నీటిలో మునిగిపోయి జనమంతా చనిపోయారు. అయితే ఈ జనంలో వొక్కడు మాత్రం దేవుళ్ళపట్ల విధేయుడై, వారికి బలిసమర్పణ గావించేవాడు. [ఇతనిపేరు - ఉట్నా పిష్టిమ్] దేవుళ్ళ పట్ల ఎంతో భయ భక్తులున్న యితనిని మాత్రం వొక దేవుడు రక్షించ సంకల్పించాడు. రానున్న జలప్రళయం గూర్చి ముందుగానే ఉట్నా పిష్టిమ్‌ను, ఈ దేవుడు హెచ్చరించాడు. అంచేత ఈతడు వొక పడవను నిర్మించి, అందులో తన భార్యాబిడ్డల్నీ, ఆడా - మగా - జంటలకి చెందిన సమస్త పశు పక్ష్యాదుల్నీ వుంచి, దూరప్రాంతానికి జేరినందువొల్ల, ఈ ప్రళయం నించి వారు రక్షించబడ్డారు.

నాటి దక్షిణ మెసపొటేమియాలో తరచుగా సంభవించే భీకరమైన వరదల్లో నుండే, ఈ కట్టుకథ పుట్టిందనేది - ఇంగితజ్ఞానమున్న ఎవరికైనా అర్థమయ్యే అంశం. ఈ వరదల సమయంలో, యూఫ్రటిస్ - టైగ్రిస్ - నదులు మహా భయానకంగా ఏకమై ఆనాడు సమూల విధ్వంసం గావించేవి. అంచేత, యావత్ ప్రపంచమూ నీటిలో పూర్తిగా మునిగిపోయిందని నాటి ప్రజలు భావించేవారు. ఈ కట్టుకథ విదేశాలకి వ్యాపించి, రకరకాల మార్పులూ చేర్పులతో ఆయాదేశాల పురాణ సాహిత్యంలో సైతం జొరబడింది: బైబిల్ - పాత నిబంధనలోని "నోవాస్ ఆర్క్", ఈ మెసపొటేమియన్ గాధకి, బిబిలికల్ ప్రతిరూపమే: ప్రకృతి శక్తుల పట్ల నాటి సామాన్య ప్రజలకున్న భీతియే, దేవుళ్ళూ దేవతల్లో విశ్వాసం కలగజేసింది. ఈ భీతిని ఆసరాజేసుకొన్న నాటి కంతిరి పూజారులు, దేవుళ్ళ పట్ల అవిధేయతగా ప్రవర్తిస్తే, దేవుళ్ళు మరో జలప్రళయాన్ని భూమ్మీదకి పంపుతారని జనాన్ని బెదిరించి, భేషుగ్గా తమ పబ్బం గడుపుకొన్నారు.

సుమేరియన్ల దృష్టిలో సృష్టిక్రమం

బైబిల్ - పాతనిబంధనలో, సృష్టిక్రమాన్ని వర్ణించే అధ్యాయం వొకటుంది. సర్వశక్తిమంతుడైన దేవుడు, అరాచకస్థితి నించి తన ఆజ్ఞాశక్తి ద్వారా సమస్త విశ్వాన్నీ సృజించినట్లు హీబ్రూ రచయితలు భావించి బైబిల్‌లో రాశారు. హీబ్రూ రచయితలు పాతనిబంధన రాయకపూర్వమే, బాబిలోనియన్ కవులు సృష్టిక్రమాన్ని గూర్చి తమ కావ్యాల్లో విపులంగా ప్రస్తావించారు. అయితే, ఈ ఉభయుల భావనకీ తేడా లున్నాయి.

ఆదిమకాలంలో యావత్ ప్రకృతీ సంక్షుభిత స్థితిలో వుందనీ, ఈ స్థితిలో నుంచే దేవుళ్ళు సైతం పుట్టుకొచ్చారనీ, దేవుళ్ళలో వొకడు తన తల్లితో పోట్లాడి, ఆమెను వధించిన తర్వాతనే ఈ విశ్వసృష్టి జరిగిందనీ, బాబిలోనియన్ కవులు విశ్వసించారు. మెసపొటేమియన్ దేవుడైన మర్డుక్ స్వయంగా తన దేహానికి గాయం జేసుకొని, దాని నుంచి స్రవించిన రక్తాన్ని మట్టితో కలిపి, ఆది మానవుని సృజించినట్లు మెసపొటేమియన్ పురాణగాథ చెప్పింది.

ఆదాము ముక్కు బొక్కల్లో గాలి ఊదిన దేవుడు

"సృష్టికి పూర్వం భూమిపై ఏ పొద లేదు. ఏ మొక్క మొలవలేదు. ఏల యనగా దేవుడైన యెహోవా భూమిపై వాన కురిపించలేదు. భూమిని దున్నడానికి మనిషి లేడు. అయితే, ఆవిరి భూమిపై నించి లేచి నేలనంతా తడిపెను. దేవుడైన యెహోవా నేలమట్టితో మనిషిని (ఆదామును) నిర్మించి, వాని నాసికా రంధ్రములలో జీవ వాయువును వూదగా, మనిషి జీవాత్మ (living soul) ఆయెను." (బైబిల్-ఆదికాండము - 4 వ అధ్యాయం- 5 నుండి 8)

నాటి మెసపొటేమియన్ దేవుడైన మర్డుక్, అనంతర దశలో యూదుల దేవుడైన యెహోవాగా పరిణామం చెందాడా - అనేది నిశితంగా పరిశీలించ వలసిన అంశం. అంతేగాదు, దేవునిచే అనుగ్రహించబడిన ఉట్నాపిష్టిం యొక్క సంతతి వారమని నాటి మెసపొటేమియన్లు భావించగా, యెహోవాచే సృష్టించబడిన ఆదాము సంతతివారమని నాటి యూదులు విశ్వసించారు:


మెసపొటేమియా నాగరికత విశిష్టత

మెసపొటేమియా నాగరికత, కాలగర్భంలో కలిసి ఎన్నో వేల సంవత్స రాలైంది. మరణించిన ఈ సంస్కృతీ ప్రభావం, అనంతర తరాలపై చాలా తీవ్రంగా ప్రసరించింది. బాబిలోనియన్ దేవాలయ గోపురాలకి నకలుగా- ముస్లిం మసీదుల గోపురాలూ, మధ్యయుగాల నాటి యురపియన్ వాస్తుశిల్పంలో ప్రాధాన్యం వహిం చిన గంటగోపురాలూ (Bell Towers) నిర్మాణమయ్యాయి. ఈనాడు మన మనుస రించే కాలమానమంతా-వారాలు-రోజులు-గంటలు-నిమిషాలు- అన్నీ బాబిలోనియన్ మేధావులు పెట్టిన భిక్షయే: ప్రథమ దశలో ఈజిప్ట్‌వారు అవలంబించిన హైయిరో

గ్లిఫిక్ లిపి సైతం, సుమేరియా ప్రజలదే. ప్రాచీనకాలంలో అమల్లో కొచ్చిన సామాజిక వ్యవస్థలకి మూలం- మెసపొటేమియన్ సమాజమేనని అనడం-చారిత్రక అసత్యం మాత్రం గాదు.

నాటి మెసపొటేమియన్ మత సాంప్రదాయాలు, నేటి క్రైస్తవమతంలో సైతం కానవొస్తాయి. బాబిలోనియన్ దేవతలకి గొర్రెల్ని బలి యిచ్చినప్పుడు, క్రింది ఆర్థమున్న మంత్రాన్ని చదివేవారు: "మనిషికి బదులు ఈ గొర్రెను మీకు సమర్పిస్తున్నాం; మనిషి ప్రాణానికి బదులు గొర్రె ప్రాణాన్ని మీకు సమర్పిస్తున్నాం." వొక దానికి బదులు మరోదాన్ని బలిగా సమర్పించే సాంప్రదాయం, యూదు-క్రైస్తవ మతాల్లో మనకు ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. అంతేగాదు-హిందువుల యజ్ఞయాగాల్లో, తెల్లగుర్రాల్ని నల్ల మేకల్ని బలియిచ్చే సాంప్రదాయంలో సైతం ఈ ఆచారం గోచరిస్తుంది.


మొత్తంమీద మెసపొటేమియా నాగరికత, మానవ నాగరికతా వికాసానికి నాంది పల్కింది. నగర రాజ్యాలు, సువిశాలమైన సామ్రాజ్యాలు, వ్యవసాయ-వాణిజ్యాలు, ద్రవ్యమారకం విధానాలు, న్యాయపట్టాలు, రాతపద్ధతులు, కవితా రచనలు, విశ్వసృష్టిని గూర్చిన ప్రప్రథమ కథలు, గ్రంథాలయాలు, యిత్యాది అనేకానేక విషయాలు మొట్టమొదటగా ఈ నాగరికతలోనే ప్రభవించాయి:



4. ఇస్టార్ దేవత

మెసపొటేమియన్ పురాణ గాధల్లో, ఇస్టార్ అత్యంత ప్రధానమైనది. కామ దేవతయైన ఈమె, దేవదాసీలకి అధిష్టాన దైవం. ఈమెకీ మన రతీదేవికీ చాలా దగ్గర పోలికలు కన్పిస్తాయి.

తరులతాదుల్లో, మానవుల్లో, వేయేల సమస్త జీవకోటిలో సంతానాభివృద్ధిని కలుగజేసేది - ఈ దేవతయేనని నాటి వారు భావించారు. యావత్ ప్రకృతి - నవనవోన్మేష ప్రఫుల్లమై, వసంతరాగ రంజితమైన మనోహర సమయానికీ, సస్యశ్యామలమైన భూమాతకీ, ఈమెను ప్రతీకగా నాటి వారు ఊహించారు. ఈమె ఆరు మాసాలు మాత్రమే భూమి పై వుంటుందనీ, ఆ తర్వాత, సమస్త ప్రకృతి నిర్జీవమై వున్నట్లు కన్పించే మిగతా ఆరు మాసాల శీతాకాలంలో, మృత్యులోకానికి అవతలి వైపునున్న "అరలు"అనే మరో లోకంలో బందీగా వుంటుందనీ వారు విశ్వసించారు. "అరలు" అనే లోకానికి ఈమె వెళ్ళిపోవడం, గ్రీష్మంనించి శీతాకాలానికి పరివర్తన జెందే మార్పును సూచిస్తుంది. ఈమె తిరిగి రావడం, శిశిరం నించి వసంతరుతువుకి పరివర్తన జెందే మార్పును గోచరింపజేస్తుంది.



ఇస్టార్ దేవత

పంటల దేవత

సృష్టి పునర్జీవనానికి, ఇస్టార్‌ను అధిదేవతగా వారు పరిగణించిన విషయం, వ్యవసాయాధి దేవతగా- పంటల దేవతగా- ఆమెను కీర్తించిన ప్రార్థనా గీతాల్లో మనకు స్పష్టంగా వ్యక్తమవుతుంది. రైతులకు పుట్ల కొద్దీ ధాన్యరాసుల్ని ప్రసాదించే జీవనదులూ- కాలవలూ - ఈమె అనుమతి తోనే ప్రవహిస్తాయని వారు తలచారు. సారవంతమైన సమస్త సృష్టికీ ఈమె అధిష్టాన దేవత గాబట్టి,(Goddess of Fertility) కాన్పు కష్టమైన ప్రతిసారీ, బాలింతలూ సూలింతలూ సులువుగా తమకు కాన్పు జరిగేట్లుగా అనుగ్రహించమని ఈమెను ప్రార్థించేవారు. అంచేత ఈమెను ధాన్యలక్ష్మిగా- సౌభాగ్యలక్ష్మిగా వారు భావించారు.

అనేక అవతారాలు

ఈమె ప్రియుని పేరు తామూజ్. ఈమె- తామూజ్‌కు తల్లియని కొందరు, సోదరియని మరికొందరూ, ప్రియురాలని యింకొందరూ రకరకాలుగా వర్ణించారు. తనయుని కోల్పోయిన తల్లిగా, ప్రియుని పోగొట్టుకున్న ప్రేయసిగా, ఈమె దుఃఖిస్తున్నప్పుడు నాటి కవులు వర్ణించిన భాగాలు, నిసర్గసుందరమైన కవితకి ఆలవాలాలు.

సంతాన- సౌభాగ్యాలకి అధిదేవతయైన ఇస్టార్, కొంతకాలం తర్వాత రణాధి దేవతగా మారింది। ఈ దశలో ఈమె ధనుర్బాణాలు ధరించి సింహాసనంపై అధిష్ఠించి, సజీవ సింహాన్ని పాదపీఠంగా స్వీకరించిన భీకరాకారిణిగా నాటి వారు వర్ణించారు. (మహిషాసుర మర్దన సమయంలో దుర్గ అవతారాన్ని గమనించడం అవసరం) అనంతర దశలో అనేకమంది ప్రియుల్ని ఆకర్షించి, అందరినీ గిక్కురించే కామ పిశాచిగా ఈమె పరివర్తన జెందింది. ఈ కొత్త అవతారంలోనే ఈమె- మెసపొటేమియన్ దేవదాసీల దేవతగా రూపొందింది.

తామూజ్

ఇస్టార్ దేవత ప్రియుని పేరు- తామూజ్. ఆత్మోద్భవుడనీ; సముద్రానికి ప్రాణంలాంటి వాడనే పేర్లు యితనికున్నాయి. మన మన్మధునికి గూడా మనసిజుడు (మనసులో నుంచి పుట్టినవాడు) అనే పేరుండడం ప్రత్యేకంగా గమనార్హం.

ఇతనికీ, రతీనాథుడైన మన్మథునికీ చాలా దగ్గర పోలికలు కానవొస్తాయి. తామూజ్-సముద్రానికి ప్రాణం వంటి వాడు. ఆ విధంగానే మన మన్మథుడు గూడా లక్ష్మీదేవితో పాటు సముద్రం నుండి పుట్టినవాడనే పురాణగాథ హిందూ పురాణాల్లో వుంది. (ఈ తామూజ్-ఈజిప్ట్‌లో ఓసిరిస్‌గా, ఫ్రిజియాలో అట్టిస్-టిస్‌గా, గ్రీస్-ఫ్రొనీషియా దేశాల్లో ఆడోనిస్‌గా అయ్యాడు. ఇండియాలోని మన్మథుడు, పాలక వర్గాలకీ చెందిన రంకుముండల దేవుడయ్యాడనే విషయం మనందరికీ తెలిసిందే.) ఈ వివిధ దేశాల్లో, పేర్లు మారినా లక్షణాలు మాత్రం వొక్కటే.

సమస్త ప్రకృతినీ పులకితం జేసి, వసంత శోభ కల్గించే వాడుగా యితన్ని నాటి వారు భావించారు. వేసవి పోయి శీతాకాలం వొచ్చినపుడు, యావత్ జీవకోటికి అధినాథుడైన ఈతడు మరణించినందుకు ప్రచారసూచకంగా, ఆనాడు కాలవల్లో ధాన్యం మొక్కలు వేసేవారు. నాగేటి చాలులో నీటి ఊటను పీల్చుకొనని విత్తనంతోనూ, వికసించని మొగ్గతోనూ, నీరు పోయని నారుతోనూ, మొదలు తెగిన చెట్టుతోనూ, ఎడారిలోని పూలమొక్కతోనూ, ఈ తామూజ్‌ను పోల్చి, వారు విచార సూచకమైన పాటలు పాడేవారు. వరద బురదలేని నదుల్ని గూర్చి, పూలూ కాయలూ లేని చెట్లగూర్చి, గొడ్డువోయిన పశువుల్నిగూర్చి, వారు విచారసూచకంగా గీతాలాలపించేవారు: పాలులేని దూడలు, ఆకు రాలిన చెట్లు, బీళ్ళలా మారిన పొలాలు, గూళ్ళు లేని పక్షుల రూపంలో- వారు శిశిరరుతువు యొక్క భీకర తాండవాన్ని చూచేవారు.

ఈ సమయంలో తామూజ్ దేవుని విగ్రహం వొకటి తయారుజేసి, పడవలో పెట్టి, యూఫ్రటిస్-టైగ్రిస్ నదుల్లో వదలి పెట్టేవారు. అది నీటిలో కొద్దిదూరం వెళ్ళిన తర్వాత, బుడుంగున మునిగిపోయేది. ఆ విధంగా పడవతో గూడా మునిగి పోయిన దేవుడు, తిరిగి తప్పక వొస్తాడని వారు విశ్వసించేవారు. (ఈ సందర్భంగా మన తెప్ప తిరనాళ్ళ గుర్తు తెచ్చుకోవడం అవసరం.) ఈ సమయంలో వారు నదిలో ధాన్యంగింజలు వేసేవారు. నీటిలో మునిగిన ఈ ధాన్యం గింజల్లో, తామూజ్ దాగి వుంటాడనీ, కాని పుష్కలమైన పంటరూపంలో అతడు తిరిగి ప్రత్యక్షమవుతాడనీ, వారు విశ్వసించేవారు. తామూజ్ తిరిగి వొచ్చినప్పుడు, మేకపిల్లలకి పాలనీ, పశుగణాలకి పచ్చిక బీళ్ళనీ ప్రసాదించమని వారు వేడుకొనేవారు.

కామదేవతగా ఇస్టార్

ప్రాచీన మెసపొటేమియన్ కావ్యంలో – గిల్‌గమేష్ అనే వొక రాజు న్నాడు. ఇతణ్ణి ఇస్టార్ కామిస్తుంది. ప్రతి వ్యక్తినీ మురిపించి మరపించి చివరికి అందరికీ ద్రోహం జేసిన ఈ కామదేవత గతచరిత్ర నంతా గిల్‌గమేష్ వొక సందర్భంలో ఏకరువు పెడ్తాడు: "పాపం ఆ తోటమాలి జేసిన తప్పేమిటి? నువ్వు అతణ్ణి మోహించి, వాణ్ణి పెడదారులు పట్టించావు. కామపిశాచి వైన నీ ప్రేమ నిజ మనుకొని, నిన్ను సంతోషపెట్టడానికి ప్రతిరోజూ తన తాహతుకుమించిన కానుకలు తెచ్చి నికిచ్చేవాడు. నువ్వు తిన్న కంచాన్ని సైతం కడిగి, నీ సొంత నౌకరు కన్న నీచంగా నీకాతడు ఊడిగం జేశాడు. ఆలాంటి వాణ్ణి నువ్వు ఏంజేశావు? ఛీ – పాపీ– నీ మోహం తీరిం తర్వాత వాడికి మంత్రం పెట్టి, పక్షవాతంతో వాడు పడిపోయేట్లు చేశావు. ఆ తర్వాత తేనె పూసిన కత్తుల్లాంటి నీ చూపులు వొక గొర్రెల కాపరిపై (తామూజ్) పడ్డాయి. కొంతకాలం వాడితోనూ కులికావు. ఆఖరికి వాడంటే నీకు మొహం మొత్తింది. వాణ్ణిగూడా వొదిలి యింకొకణ్ణి పట్టుకున్నావు ! నిజానికి నీ ప్రేమను నమ్మిందెవ్వరు? ఛీ – పో –" అని ఈసడిస్తాడు.

అంచేత, ఇస్టార్ దేవత – విటుల పాలిట పడుపుకత్తె. నిత్య సువాసిని; అజన్మాంతం కన్య; నాటి మెసపొటేమియన్ దేవదాసీల అధిష్టాన దైవం. ఈమె మహామాతయే గాని (Mother Goddess) ఏ దేవునికీ భార్య మాత్రం గాదు.

ప్రపంచ వ్యాప్తమైన
మహామాత పూజ

ఇస్టార్ దేవతలా, ప్రాచీన ప్రపంచ దేశాల్లో సంగమ కార్యానికి ప్రతినిధులుగా భిన్నభిన్నమైన నామాలు దాల్చిన దేవతల్ని ప్రస్తుతం పరిశీలిద్దాం.

ప్రాచీన గ్రీస్ దేశంలో ఆఫ్రొడైట్ అనే పేరిట వొక దేవత వుండేది. ఈమె "గ్రీకు పురాణములందు ప్రేమ సౌందర్యముల కధిష్టాన పదము వహించిన దేవత. రోమనులు ఈమెను వీనస్ పేరున పిలచిరి. హిందూ పురాణము నందలి లక్ష్మి ఈమెతో సరిపోల్చుటకు కొంతవరకు తగియున్నది. ఎట్లనగా, మన్మధుని

లక్షణములు గల "క్యూపిడ్" ఈమె కుమారుడు. లక్ష్మికి జన్మస్థానమైన సముద్రము, ఆఫ్రొడైట్‌నకు గూడా జన్మస్థానము. లక్ష్మి చంద్రులకు బాంధవ్య మున్నట్లు, ఆఫ్రొడైట్ చంద్రులకు బంధుత్వ ముండడమేగాక, వీరిరువురు అభిన్నులుగా తలంపబడిరి. ఈమెను సెమిటిక్ జాతులవారే కల్పించిరని పాశ్చాత్యుల యభిప్రాయము. సెమిటిక్కుల లోని భిన్న భిన్న సంప్రదాయములవారు పూజించు దేవతా లక్షణములు, యీమె యందును కలవు. ఒక్క హీబ్రూలు తప్ప, తక్కిన సెమిటిక్ జాతుల వారందరును, ఒక ఉత్కృష్ట దేవతను భిన్న భిన్న నామములతో పూజించుచు వచ్చిరి. అసీరియనులు ఇష్టార్ పేరు గల దేవతను, ఫినీషియనులు అష్టారెత్ లేక అష్టర్తె యను దేవతను, సిరియనులు అటర్‌గాటిస్‌డెరోక్టా యను దేవతను, బాబిలోనియనులు బెలేటికట్ మిలిట్టా దేవతను, అరబ్బులు ఇలాత్ దేవతను ఆరాధించిరి.

ప్రాచీన కాలమున యీ దేవతా పూజ, ఫినీషియనుల ద్వారా సైప్రస్, సైధేరా, క్రీట్ ద్వీపములందు ప్రవేశించి, అచటనుండి క్రమముగా గ్రీకుదేశమంతటనూ, ఇటలీ సిసిలీ ప్రాంతమందును వ్యాపించినది. యీమెకే "సెప్రైస్", "సైధీరియా", "పఫియా", "అమథూసియా", "ఇడాలియా" అని మరికొన్ని పేర్లు గలవు. ఎరిక్స పర్వతాగ్రమున చేయబడు పూజ క్రమంగా కార్తేజ్, రోమ్, లాటియమ్‌లలో వ్యాపించింది.

ఈమె అధికారం సర్వ జీవరాసుల మీదనే గాక, దేవతలమీద సైతం చలాయించ బడింది. ఆరామ దేవతా రూపమున, యీమె సస్య సంవర్ధకములయిన మైదానము లందును, వసంత వాసరములందును పూజింపబడేది. ఈ లక్షణములతోనే ఈమె క్రీట్‌నందు పుష్పదేవత (goddess of flowers) అని పిలువబడింది. ఈమెను వనదేవతగా గూడా ఆరాధించిరి. జంతుకోటి యందు ఈమె కామోద్రేకమును పుట్టించును. మానవుల విషయమున-జన్మ, వివాహ, గార్హస్థ్యములకు చెందిన దేవత. అట్టి సమయములో, యీమెకు- జెనిటెల్లిస్, (జన్మధాత్రి) నింఫియా (వివాహ దేవత) కారోట్రోఫోస్ (బాలవర్ధని) మున్నగు బిరుదములు లభించాయి. గ్రీకుల మతాచారం ప్రకారము యీమె మోహానికి అధిదేవతయై, స్త్రీ పురుషులలో ప్రబలమయిన సంగమవాంఛను పుట్టించుచుండును.

హిందూ ఐతిహాసిక గాథలలోని మన్మధునివలె, యీమె ప్రియాప్రియులను గూర్చు మధ్యవర్తి ధర్మమును దాల్చును. ఇందువల్ల యీమె సౌందర్యాధిదేవత

అయినది. సౌందర్యమునకు ప్రమాణభూతమగు యీమె విగ్రహము స్పార్టా వద్ద కలదు. కాని వేశ్యాధిదేవతగా యీమెకు చేయబడు పూజ, కడుంగడు నింద్యము. అశ్లీలమయిన యీ ఆరాధన, ఫొనీషియనులే ప్రవేశపెట్టిరని పాశ్చాత్యుల విశ్వాసము. ఒక్క కోరింథ్ పట్టణము లోనే యీ దేవతకు అర్పింపబడిన దేవదాసీజనము వెయ్యిమంది కన్న నెక్కువగా నుండిరి.

ధనాఢ్యులగు కొరింధియనులు తమ అధీనములో నుండు దాసీజనములలో అందరికన్న మించిన సౌందర్యవతులను, దైవ కైంకర్యార్థ మర్పణము చేయుట గౌరవమని భావించిరి. వేటికన్, నేపిల్స్ యందలి యీమె విగ్రహములు మహా మహోద్రేక కరములు." (ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం- ద్వితీయ సంపుటం- పేజి- 157-159)

న్యూగినీ లోని యోని-లింగ-దేవతాకారాల్ని ; సైప్రస్ లోని పాఫాస్ గుడి లోని లెగ్బా దేవునీ ; పెర్షియా లోని అనాహిత దేవతనూ ; అక్కడే వున్న మశ్నేభా-అష్షేరా-అనే పేరు గల స్తంభాల్ని ; బాబిలన్ లోని మిలిట్టా దేవతనూ ; లిడియాలో- సిరియాలోని హేలియొపాలిస్‌లో- ఫినీషియా గుళ్ళలో గల అస్టరట్-ఎస్టార్టి దేవతల్ని ; ద్రావిడుల మహామాతనూ (అమ్మతల్లి) సంభోగకార్యానికి అధిదేవతలుగా పరిగణించి, ప్రాచ్య పాశ్చాత్య దేశాల్లోని ప్రాచీనులు పూజించారు. ఆ పూజ నాటి వారికి వొక జీవితావసరంగా, ఉత్సాహ మూలకంగా రూపుదాల్చింది.

ఇస్టార్ దేవత గుడిలో
పూజారిణి - వ్యభిచారిణి

కామదేవతయైన ఇస్టార్‌కు శాశ్వతమైన ప్రియుడెవడూ లేనట్లే, ఆమె పూజారిణులైన నాటి జారిణులకు గూడా శాశ్వతంగా ఏ ప్రియుడూ లేడు. సర్వకాల సర్వావస్థల్లో, సకల చరాచర జీవకోటిలో, సంభోగ వాంఛను ప్రేరేపించి ప్రకోపింప జేసే కామునికిగా- దేవదాసీల అనుంగు దేవతగా- ఈమె చిత్రించబడింది. మతం- దేవుని పేరిట జరిగే పరిపాలనలో, నాటి దేవాలయమే-యావత్ సాంఘిక జీవనానికి కేంద్రంగా వుండేది. అంతటి ఉన్నత స్థాన మాక్రమించిన దేవాలయంలో, పూజా పునస్కారాది కర్మకాండ కోసం, అనాథలూ యుద్ధాల్లో పట్టుబడ్డ స్త్రీఖైదీలూ, బానిసలతో పాటు సమాజం లోని సమస్త అంతస్తుల యువతులూ, దైవ కైంకర్యార్థం

దేవదాసీలుగా వుండేవారు. కొద్దికాలం పాటు దైవ కైంకర్యం కొరకు జీవితం గడిపి పిదప పెళ్ళిచేసుకొనేవారూ ; ఆజన్మాంతమూ దేవదాసీలుగానే నిలిచిపోయినవారూ ; నాటి మెసపొటేమియన్ సాంఘిక వ్యవస్థలో వుండేవారు. ప్రాచీన భారతదేశంలో వలె, ఆ కాలంలో గూడా దేవాలయాల్ని ఆశ్రయించుకొని జీవించే వ్యభిచారిణు లుండేవారు. అయితే వారు వొక కులంగా మాత్రం నాడు లేరు. నాటి దేవాలయా ల్లోనూ, సంపన్నుల సౌధ ప్రాంగణాల్లోనూ, విందులూ వేడుకల్లోనూ, మేళతాళాలతో గానా బజానాలు సాగేవి. వాటిలో గాన నాట్యాల్లో ప్రౌఢలైన దేవదాసీలు ప్రధాన పాత్ర నిర్వహించేవారు.

సర్వం జగన్నాధమే

క్రీ. శ. మొదటి శతాబ్దంలో, యీ దేవదాసీలు ఆసియాఖండం లోని అన్ని దేశాలలోనూ వుండేవారని, బైబిల్‌లోని పాతనిబంధన ద్వారా (ఆదికాండం) తెలు స్తోంది. ఆ కాలంలో, స్త్రీ దేవదాసీలే గాక పురుష దేవదాసులు గూడా వుండేవారు ; పురుష దేవదాసులను "గుడేషిం" అనీ, స్త్రీ దేవదాసీలను "గుడేషాట్" అనీ పిలచే వారు. గుడేషాట్-గుడిషెట్‌గా మారడానికి చాలా అవకాశముంది. మన గుడిచేటికి యిది చాలా దగ్గరగా వున్న మాట. వీళ్ళు గుడికే అంకితమైపోతారు. సృష్టికార్యం సాగిస్తూ వుంటారు.

"ఆనాడు దేవాలయ ప్రాంగణములో స్త్రీలు బారులుతీరి కూర్చుంటే, మగాళ్ళు వచ్చి ఎంచుకొని ఏరుకొని వారిని తోడుకొని పోయేవారు. కొన్ని చోట్ల స్త్రీలు, వారి కంటికి కనిపించిన మొదటి కొత్తవాడితో సంగమించేవారు. కొన్ని చోట్ల సంగమానికి ధనం పుచ్చుకొని, స్త్రీలు దేవారాధన చేసేవారు. గొప్పవారూ పేదవారూ అన్న విచక్షణ లేకుండా అన్ని యిళ్ళవాళ్ళూ ఈ పనికి పూనుకొనేవారు. కొన్నిచోట్ల స్త్రీలు తమ స్త్రీశక్తిని దేవతకర్పించేవారు. పురుషులు తమ పురుషశక్తిని (ఇంద్రియం) అర్పించేవారు. వారు ఎల్లకాలము కోవెల నాశ్రయించుకొని వుండిపోయేవారు. ఆ విధంగా దేవతలకు స్త్రీ పురుషుల శక్తుల నిచ్చి ధన్యులయ్యేవారు." (తాపీ ధర్మారావు- దేవాలయాల మీద బూతుబొమ్మ లెందుకు ?)

అలిసిపోయిన దేవునికి బలం యివ్వడం

దేవతలకు స్త్రీ–పురుష- శక్తులు యివ్వడమంటే ఏమిటి ?

"దేవుడు అంటే మనకున్న అభిప్రాయాల మీద, ఆరాధన భక్తి అర్చన పూజ యివన్నీ ఆధారపడతాయి. దేవుడు ఒక భయంకరమైనవాడు, మనుష్యులను

తినేస్తాడు, కోపం వస్తే అంతా ధ్వంసం చేస్తాడు, అన్న అభిప్రాయం మనకుంటే, ఆ దేవుడికి రక్తం మాంసం గొర్రెలు మనుష్యులు వీటి నిచ్చి ఆరాధన చేస్తాం. దేవుడు నిర్వికారుడు నిర్గుణుడు అన్న ఊహ మనకుంటే, మనం తపస్సు ధ్యానం ద్వారా ఆరాధన చేస్తాం.'' (తాపీ ధర్మారావు- దేవాలయాల మీద బూతు బొమ్మ లెందుకు ? పేజి-43)

దేవుడు సృష్టికర్త, (నారు పోసేవాడు నీరు పోస్తాడనే భావం) సంతానాన్ని ప్రసాదించే వాడనే అభిప్రాయముంటే, సంతానోత్పత్తియే- సృష్టికార్యమే ఆరాధన అవుతుంది. అంతేగాదు - ప్రజోత్పత్తికి మూలకారకమైన సృష్టికార్యం- సంగమ కార్యం- ప్రధానమే గాక పవిత్రంగా గూడా భావించబడింది. ఆదిమ సమాజంలోని మానవుడు, ఏ సాంఘిక కార్యకలాపం భగవంతుని అభీష్టమని భావిస్తే, దాన్ని ఆచరించడమే పవిత్ర ఆరాధనగా యెంచి, తానుచేసే పనుల్నీ, తనకున్న గుణాల్నీ, ఆ దేవునికి లేదా దేవతకి ఆపాదించి, దాన్ని వేలుపుగా కొలవడం ప్రాచీన మానవుల లక్షణమని చరిత్ర చెప్పింది.

ప్రకృతి లోని సమస్త జీవకోటి- చెట్లు పుట్టలు పూలు కాయలు- పిపీలికం మొదలు బ్రహ్మాండం దాకా, వీటన్నిటినీ పుట్టించేవాడు-సృష్టికర్త- మహాశక్తివంతుడైన దేవుడే నని ప్రాచీన మానవుడు ఊహించాడు. ఏదయినా సృష్టించవలెనంటే, స్త్రీ పురుషు లిద్దరూ వుండాలనేది నాటి మానవుని నిత్య జీవితానుభవం. ఈ యిద్దరి సంభోగకార్యం ఫలితంగానే సృష్టి జరుగుతోందని ఆతడు భావించాడు. అంచేత, భూమి-స్త్రీ భాగమైంది. దేవుడు-పురుష భాగమయ్యాడు. ప్రకృతీ పురుషుల నిరంతర సంయోగం వొల్లనే, సర్వ సృష్టీ జరుగుతోందని నాటి మానవుడు నమ్మాడు. ''ప్రపంచం అంతా యీ రెండు భాగాలకు కలిగే సంగమం వల్లనే, పుడుతూందని గట్టి నమ్మకం. భగవంతుడి కార్యం అంతా యీ సంగమమే కాబట్టి, సంగమం అన్నది చాలా పవిత్రమైనది. దేవుని ముఖ్య కర్తవ్యం.'' (తాపీ- దేవాలయాల మీద బూతుబొమ్మ లెందుకు ?-పేజి-45)

సర్వకాల సర్వావస్థల్లోనూ జరుగుతుండే ఈ మహాసంగమం వొల్ల నిరంతరం పంటలు పండకుండా, వొక్కోసారి బీళ్ళసి పోతుండేవి. ప్రచండంగా పగలు అస్త మానమూ ప్రకాశించే సూర్యుడు, సాయంత్ర మయ్యేసరికి క్రమంగా అదృశ్యమై పోతుండేవాడు. దీనికి కారణమేమిటని ఆలోచించిన నాటి వారు, తమ స్వీయానుభవంతో సమాధాన పడ్డారు. తిరిగి తిరిగి వొచ్చిన వాడు, ఎలా అలిసిపోయి

బలహీనుడౌతాడో, అలాగే దేవుడు గూడా నిరంతరం జరిగే మహాసంగమ కార్యం వొల్ల, అలిసిపోయి బలహీనుడవుతాడని భావించారు.

అంచేత, "అలిసిపోయిన దేవుడికి మేతబెట్టి బలుపు నియ్యాలి. బడలి పోయినదేవుడికి బలం కలిగించాలి." (దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు) అలా చేయడానికి వారు తీసుకొన్న శ్రమ అంతా అర్చన, దేవపూజ, పవిత్రకార్యం. ఈ దృక్పథం మరో రూపంలో బ్రాహ్మలసంధ్యావందన సమర్పణ రూపంలో కన్పిస్తుంది. సూర్యుడు తన యాత్రను సాగించేటప్పుడు, మండేహాలన్న రాక్షసులు అడుగడుగునా సూర్యరథాన్ని ఆడ్డగిస్తారు. [కాబట్టి, ముప్పూటాజేసే సంధ్యావందనం ద్వారా విసరబడే నీటిబిందువులు, తీక్షణమైన బాణాల్లా వెళ్ళి, ఆ మండేహ రాక్షసుల్ని వధించడం ద్వారా సూర్యదేవునికి బలం చేకూర్చి, ఆతని యాత్రను దిగ్విజయం జేస్తాయి. సూర్యభగవానుడు అలిసిపోకుండా బ్రాహ్మడు సాయపడుతున్నాడన్న మాట!]

ఈ విధంగా పరమపవిత్రమనీ మానవోత్పత్తికి మూలకారకమనీ భావింపబడ్డ సృష్టికార్యాన్నే - సాక్షాత్తూ దేవుడు జేసే కార్యాన్నే - మానవుడు గూడా చేయనారంభించాడు. దానినే దైవపూజగా పరమపవిత్రమైన ఆరాధనగా యెంచి, మానవులంతా స్త్రీ పురుష వివక్షత పాటించకుండా సాముదాయకంగా చేశారు. ధనిక దరిద్ర వ్యత్యాసం లేకుండా అంతా ఆ పనినే చేశారు. ఆనాడు సర్వం జగన్నాధమే : సర్వ సృష్టికీ మూలకారకుడైన దేవుడు, బలహీనుడయ్యాడని తలిచినపుడు, ఆ దేవుని ప్రీతికోసం అంతా సంభోగం చేయడమే-ఆరాధన-పూజ. ఈ పూజదేవాలయం లోనే దేవుని సమక్షానే బహిరంగంగానే జరుపబడేది. దేవుని మహా సంగమకార్యానికి బలాన్ని ఊతాన్ని కల్గించే సదుద్దేశంతో చేయబడేదే - దైవారాధన. సంగమ కార్యం పవిత్రమని నాటివారు భావించినందువొల్లనే, ఖజురాహో - పూరీ జగన్నాధం - కోణార్క - దక్షిణాదిన వున్న సుప్రసిద్ధ దేవాలయాలపై, సంగమ కార్యానికి చెందిన వివిధ భంగిమలు "సుమనోజ్ఞ సుందరంగా" చెక్కబడ్డాయి. ఈనాడు ఈ కార్యం దేవాలయంలో చేయడం మన దృష్టిలో నేరమైనా, నాటి వారిచే యిది పవిత్రకార్యంగానే పరిగణింపబడిం దనేందుకు, గుడి గోపురాలపై రతిశాస్త్ర సంబంధమైన రంగురంగుల రంకు బొమ్మలు వుండడం తిరుగులేని నిదర్శనం! ఆనాడు దేవుడు ఏపని జేస్తున్నాడని నాటి వారు విశ్వసించారో, ఆపనినే చేయడం, లేదా ఆదేవునికి కావాల్సిన దాన్ని ధారపోయడమే పవిత్ర ఆరాధనగా యెంచారు.

ఈ విషయం గురించి నేటి కుహనా పండితులూ వేదాంతులూ ఎన్ని తప్పుడు వ్యాఖ్యానాలు జేసినా, యిది మాత్రం తిరుగులేని చరిత్ర సత్యం.

సంభోగకేళీ స్థలమే
ఇస్టార్ పూజా మందిరం

నాటి కాలంలో సృష్టికార్యమంటే, పవిత్రమైనదనే భావం వుండేదని చూచాం. అంచేతనే, ఈ కార్యాన్ని దేవాలయంలోనే, సాక్షాత్తూ దేవుని (దేవత) సన్నిధానంలోనే, అందరికీ తెలిసేట్లు బహిరంగంగానే చేసేవారు. ఈ ఆచారం ఆనాటికి సర్వ జనాంగీకృతం. నాటి స్త్రీలు దేవాలయంలో పరపురుషులతో సంభోగించి, తత్ఫలితంగా గడించిన ధనాన్ని దేవునికి దానం జేసేవారు. నేటి "ధర్మాత్ములు" దేవుడికి బండ వేయించడమో, ధ్వజస్తంభం ప్రతిష్ట చేయించడమో, గోపుర మండపాలు నిర్మించడమో యిత్యాది "ధర్మ" కార్యాలు చేసి, వాటిని రాతిపలకలపై శాసనాలు చెక్కించి నట్లే, తాము మైథునకార్యం ద్వారా ఆర్జించిన ధనాన్ని, దేవనికి దానం జేసినట్లు శాసనం రాయించేవారు. లిడియా దేశంలో "ట్రాలెస్" అనే ప్రదేశం వొద్ద, పురాతత్వ శాస్త్రవేత్తలు వొక ప్రాచీన నగరాన్ని తవ్వి వెలికి దీశారు. ఆ శిధిలాల్లో వొక చలవరాతి స్తంభం దొరికింది. సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకుడైన రాలిన్సన్, ఈ స్తంభంపై చెక్కిన శాసనాన్ని చదివాడు. "అదేలియా యిమీలియా" అనే పేరుగల వొక స్త్రీ, తనది గుడిలో పడుపువృత్తి యనీ, తరతరాలుగా వొస్తోన్న తన వృత్తిని గూర్చి చెప్పుకొని, తాను తన వృత్తి ద్వారా గడించిన సొమ్మును ఆగుడికి దానం జేసినట్లు శాసనంపై రాయించింది. [Un edited inscriptions of Asia Minor–Ramsay Muir]

ఆసియా మైనర్‌లోని యురుక్ నగరంలో, ఇస్టార్ దేవత గుడి వుండేది. ఈ దేవత గుడిలోని జారిణులైన, పూజారిణులు, తాము గర్భం దాల్చేందుకు సాయపడే ఈ దేవతకి సమస్త పూజా పునస్కారాలూ చేసేవారు. పడుపువృత్తి ద్వారా బతికినా, వారు పవిత్రులుగానే ఆనాడు పరిగణింప బడేవారు.

క్రీ పూ. 5వ శతాబ్దంలో, బాబిలన్ యువతులంతా ఆ పట్టణం లోని "మిలిట్టా" దేవాలయానికి వొచ్చిన ప్రతి కొత్త పురుషునితోనూ రమించేవారు. అప్పుడు ఈ బాటసారులు వారి ఒడిలో కొంత ధనాన్ని విసిరేవారు. అలా ఆర్జించిన

ధనాన్ని, దేవీ పూజకోసం ఖర్చుజేయడానికి ఈ యువతులు యిచ్చివేసేవారు. బాబిలోనియన్ మట్టి పలకలపై రాయబడిన శాసనాల ద్వారా ఈ విషయం తెలిసింది.

గ్రీస్‌లోని "అఫ్రొడైట్" ఆలయంలో గూడా, హెయిరొడుల్స్ అనే పేరిట పిలువబడిన జారిణులు, దేవీపూజ కోసం ఆ విధంగానే ధనం ఆర్జించేవారు. "వివాహానికి ముందు అందరు స్త్రీలూ, ఆచారం ప్రకారం దేవతా సమక్షంలో పర పురుషులతో వ్యభిచరించాలి" అని ప్రాచీన గ్రీకు చరిత్రకారుడైన హెరొడోటస్ రాశాడు. "ఈ విధమైన పరిస్థితులు, ఆసియా ఖండంలో చాలా చోట్ల కనబడుతున్నాయి. ఏ భావనతో చేసినప్పటికి, యీ బూతుపనులు విషయలోలత్వంచేత చేసినట్టివి గావు. మహామాత సేవలో ఆచరించాల్సిన ఆచారానికి చెందినట్టివి. అమిత భక్తిశ్రద్ధలతో చేసినట్టి పనులే గాని వేరుకాదు" అని, ప్రపంచ ప్రసిద్ధ విద్వాంసుడైన జె. జి. ఫ్రేజర్ Golden Bough గ్రంధంలో రాశాడు. "లిడియా లోనూ, సైప్రస్‌లోనూ, స్త్రీలు పడుపువృత్తి ద్వారా గడించిన ధనంలో కొంత భాగాన్ని, గుడికి దానంగా యిచ్చేవారు" అని జస్టిన్ అనే రోమన్ చరిత్రకారుడు రాశాడు. రోమన్ చక్రవర్తియైన కాన్‌స్టెంటైన్, రోమన్ దేవాలయంలో జరిగే యీ సామూహిక జారత్వాన్ని నిషేధించేందుకు ప్రయత్నించాడని ఈ చక్రవర్తి జీవితం రాసిన యుసిబియస్ రాతల ద్వారా తెలుస్తోంది.

5. ఊర్వశి

ఊర్వశి- మేనక- రంభ- తిలోత్తమ - ఘృతాచి- అలంబుశ- యిత్యాది అప్సర కాంతల్ని గూర్చి మనం సాధారణంగా వింటుంటాము. ఇతిహాస పురాణాల్లో సైతం చదువుతుంటాము. అల్లసాని పెద్దన రాసిన "మనుచరిత్ర"లోని వరూధినీ-ప్రవరులు, పింగళి సూరన్న రాసిన "కళాపూర్ణోదయం" లోని రంభా-నలకూబరులూ మనలో కొందరికి తెలిసినవారే. రుగ్వేదంలో ఊర్వశి పేరు తప్ప, మరే అప్సర పేరూ ప్రస్తావించబడలేదు. ఆయితే, అధర్వణ వేదంలో మాత్రం చాలా మంది అప్సర స్త్రీల పేర్లు ప్రస్తావించబడ్డాయి.

ఊర్వశి అప్సర కాంత. ఇళా పుత్రుడైన పురూరవుడు ఈమెను ప్రేమించాడు. పురూరవుని మానవునిగా, ఊర్వశిని దేవకన్యగా చిత్రించడం జరిగింది. రుగ్వేదం లోని ఈ ప్రేమకథా సూక్తాన్ని, ఊర్వశీ - పురూరవులే రచించినట్లు చెబుతారు. (10 వ మండలం-95 వ సూక్తం) తనని విడిచి వెళ్ళిపోయే ఊర్వశిని, పురూరవుడు ఎంతగానో బ్రతిమాలుతాడు. చివరికి కోపంవొచ్చి ఆమెను "ఘోర" (కఠినురాలు) అని అంటాడు. కాని ఆమె అతడు చెప్పినదేమీ వినిపించుకోదలచలేదు. పైగా ఆమె "స్త్రీలలో ప్రేమ వుండదు. వారి హృదయాలు తోడేళ్ళ హృదయాల వంటివి" అని గూడా అంటుంది. (10-95-15) "17 వ రుక్కులో వసిష్ఠుని పేరు గూడా వొచ్చింది. అంచేత, వసిష్ఠుడే యీ రుక్కులకు కర్త యనే సందేహం కలుగుతోంది." (రాహుల్ సాంకృత్యాయన్ - రుగ్వేద ఆర్యులు - పేజి 229)

పురూరవునికి ఊర్వశితో వున్న "ప్రేమ" కలాపాన్ని, రుగ్వేదకర్తలు మరిచిపోలేదు. ఇది వాస్తవంగా జరిగిన దనడంలో ఆశ్చర్యపడ నవసరమూ లేదు. ఆ విధంగా అనుకొంటే, ఊర్వశి అప్సర కానేరదు. మానవ కన్యయై వుండాలి. ఊర్వశికి పురూరవుని ద్వారా వొక కొడుకు పుట్టాడు. మహాభారతం, అగ్నిపురాణం, బ్రహ్మాండపురాణంలో, ఊర్వశీ పురూరవుల్నిగూర్చి చాలాకథలున్నాయి. వీరి ప్రణయ కలాపాన్ని ఇతివృత్తంగా స్వీకరించి, మహాకవి కాళిదాసు "విక్రమోర్వశీయం" అనే నాటకం గూడా రాశాడు.

మాతృస్వామ్యానికీ పితృస్వామ్యానికీ మధ్యనున్న దశకి- అంటే -మాతృస్వామ్యంపై పితృస్వామ్య వ్యవస్థ పెత్తనం చలాయిస్తోన్న కాలానికి చెందినవాడే- పురూరవుడు. మాతృస్వామ్య వ్యవస్థకి చెందిన ఊర్వశి, అందరికీ సాముదాయకంగా "వలపు" పంపిణీ జేసే ప్రేయసి.

యజ్ఞ ప్రదేశం వొద్ద పురూరవుడు చంపబడినాడని, శతపథ బ్రాహ్మణం ద్వారా తెలుస్తోంది. ఊర్వశి ద్వారా వొక కుమారుని కన్న తర్వాత, పురూరవుడు దేవతలకి బలిగా సమర్పించ బడ్డాడనీ, ఆదిమ "పవిత్ర" వివాహ ఫలితమైన ఈ అంశం, పురాతత్వ శాస్త్రవేత్తలకి పూర్తిగా తెలిసిన విషయమేననీ కొశాంబీ వాదించాడు. (Myth and Reality-Page-54) ఏది ఏమైనా, పురూరవుడు దేవతలకి బలిగా సమర్పించబడ్డాడో లేక సహజమరణమేపొందాడో ఖచ్చితంగా తేల్చిచెప్పలేని విషయం.

ఇళాదేవి

రుగ్వేదంలో ఇళా-వొక ప్రధానమైన స్త్రీదేవత. ఇళా పుత్రుడే-పురూరవుడు (ఐలుడు). ఇతని తండ్రి యెవరో తెలియదు. ఈమెకు ఊర్వశితోనూ, జలదేవతలతోనూ సంబంధముంది. (రుగ్వేదం - 5-41-19) సరస్వతి, ఉషస్సు, ఆప వలె, ఇళాదేవి గూడా వైదికార్యాలకు దేవతయే. ఇళా అంటే అన్నం అని అర్థం. విశ్వామిత్రుడు ఇళాతోపాటు భారతినీ సరస్వతినీ స్తుతించాడు. (రుగ్వేదం-3-4-8)

మనువు కుమారుడైన ఇళా, పార్వతీదేవి యొక్క పవిత్రమైన వనంలో కాలు బెట్టినందువల్ల, స్త్రీగా మారిపోయాడనీ, ఆ దశలో బుధునితో సంగమించి పురూరవుని కన్నాడనీ అనంతర సాంప్రదాయం ద్వారా తెలుస్తోంది.

ఉషస్సు

ఉషోదేవి (Goddess of the Dawn) అత్యంత ప్రాచీనమైన దేవత. ఈమె ప్రముఖమైన అప్సరాంగన యని ప్రొఫెసర్ కొశాంబి అభిప్రాయపడ్డాడు. ఈమెను సూర్యుని భార్యగా, (సూర్యస్య యోషా) చెల్లిగా, తల్లిగా, ఋగ్వేదకర్తలు కీర్తించారు. (3-61-4) అంచేత, మాతృస్వామ్య వ్యవస్థ అమల్లోవున్న దశలో, ఈమె దేవతలందరి మాతగా (మాతా దేవానాం అదితిర్ అనీకం) పరిగణింపబడి వుండాలని కొశాంబి వాదించాడు. వైదికార్యుల యుద్ధ నాయకుడుగా అవతరించిన ఇంద్రుడు, ఈమెను విపస్ (బియాస్) నదీతీరాన ఓడించి, దూరప్రాంతాలకి నిర్దాక్షిణ్యంగా తరిమివేసిన ఉదంతాన్ని కొశాంబి చూపుతున్నాడు. (ఋగ్వేదం - 4-30-8 నుండి 11) అంచేత, మాతృస్వామ్య సమాజం ఉనికిలోవున్న దశలో, ఉషస్సు అత్యంత ప్రధానమైన మహామాతగా వుండి వుండాలి. ఆ వ్యవస్థ బలహీనమైన తర్వాత, ఈ స్థానాన్ని ఈమె కోల్పోయి వుంటుంది. (మిత్ అండ్ రియాలిటీ - పేజి 64)

అధర్వణ వేదంలోని అప్సర కాంతలు

అధర్వణ వేదంలో గుగ్గులు - పీల - నాలది - అక్షగంధి - ప్రమందిని-అనే అప్సర కాంతల పేర్లు గ్రంథస్థం చేయబడ్డాయి. (4-37-3) వాజసనేయ సంహితలోనూ, (5-15) తైత్తిరీయ సంహితలోనూ, (4-4-3) దేవుని ఉత్సవాల్లో పాల్గొనడానికి, యిద్దరిద్దరు అప్సరల చొప్పున (నాట్యకత్తెల చొప్పున) పేర్కొనడం జరిగింది. అగ్నిదేవుని వెంట పుంజికస్థల-క్రతుస్థల-అనే స్త్రీలూ; వాయుదేవుని వెంట మేనక-సహజన్య-అనేవారూ ; సూర్యదేవుని వెంట ప్రంలోకంతి - అనులోకంతి-అనేవారూ; పర్జన్యుని వెంట విశ్వాచి-ఘృతాచి-అనే అప్సరాంగనలూ ఉత్సవంలో పాల్గొనేవారని పై రెండు సంహితలూ పేర్కొన్నాయి. దక్షిణ భారతంలోని దేవాలయాలపై చెక్కబడిన శిల్పాల్లో, ప్రతి దేవునికీ యిద్దరిద్దరు అప్సరకాంతల చొప్పున వున్నట్లు సర్వసాధారణంగా కన్పిస్తుంది. (గంధర్వాప్సరో భామినీ వక్షోజద్వయ కుంభి కుంభములు - అని శ్రీనాథ మహాకవి తన భీమఖండంలో అన్నాడు.)

వొక్కో దేవుడికి యిద్దరిద్దరు అప్సరాంగనల చొప్పున కేటాయించబడిన ఈ అంశం, అనంతర హిందూమతంలోని త్రిమూర్తుల భార్యల అవతరణకి నాంది పల్కింది. (బహ్మకి సరస్వతి - విష్ణువుకి లక్ష్మి - శివునికి పార్వతి) వీరే గాక

పూర్వాచిత్తి-ఉగ్రజిత్తు-ఉగ్రంపశ్య-యిత్యాది అప్సరాంగనల్ని సైతం, అధర్వణ వేదం పేర్కొన్నది. వాస్తవానికి ఈ అప్సరల సంఖ్య, చిన్నసైజు ఆడసేన లాంటిది. విశ్వామిత్రుని తపస్సు భగ్నం గావించి, ఆతని ద్వారా శకుంతలను కన్న మేనక గూడా అప్సరాంగనయే. (స్త్రీ అర్థాన్ని సూచించే అనార్య భాషా శబ్దమే-మేనక) మరీ విచిత్ర మేమంటే, శతపథ బ్రాహ్మణంలో శకుంతల సైతం అప్సర కన్యగా పేర్కొన బడింది. (13-5-4-11) మేనక-విశ్వామిత్రులు తమ పని పూర్తి చేసుకొని చక్కపోగా, గాలికి వొదిలివేయబడిన ఈ శిశువును పక్షులు (శకుంత) పెంచినట్లూ, అందుకే ఈమె కీ పేరు వొచ్చినట్లూ, మహాభారతం ద్వారా తెలుస్తోంది. (మహాభారతం-1-67-10 నుండి 11)

గంగ

ఈ అప్సర స్త్రీలలో అత్యంత ప్రముఖమైన జలదేవతగా (Water-goddess) కన్పిస్తోంది. రుగ్వేదంలోని వశిష్ఠుని జన్మ వృత్తాంతం ద్వారా ఈ అప్సరకాంతలు జలదేవతలుగా గూడా కన్పిస్తారు. ఉదాహరణకి-శివుని భార్యగా చెప్పబడిన గంగా భవాని (గంగమ్మ తల్లి) శంతన మహారాజుతో జతగూడి, ఏడుగురు పుత్రుల్ని కన్నది. వీరందరినీ వొకరి తర్వాత వొకర్ని నదిలో ముంచివేసి చంపింది. ఎనిమిదో కుమారుడైన భీష్ముని (గాంగేయుని) గూడా నదిలో ముంచి చంపడానికి సిద్ధమవగా, శంతనుడు ఆమెను చంపవొద్దని వేడుకొంటాడు. ఇందుకు అంగీకరించిన గంగ, కొడుకును అతని వొద్దనే వుంచి, శంతనుని పరిత్యజించి, తన దోవన తాను వెళ్ళిపోయింది:

దేవ వేశ్యలకి పుట్టిన
బ్రాహ్మణ ఋషులు - రాజులు

ఈ అప్సరలు ఆనాడు ఎంతటి ప్రముఖ స్థాన మాక్రమించారంటే, ప్రాచీన భారతాన్ని పాలించిన రాజవంశాల మూలపురుషులూ, వైదికమత సిద్ధాంత వేత్తలైన బ్రాహ్మణ ఋషులూ, ఈ అప్సర కాంతలకే జన్మించారు.

అప్సర భామినియైన ఇళాకి జన్మించినవాడే - పురూరవుడు.

మేనకకి, పాంచాల రాజైన వృషతుని ద్వారా జన్మించిన వాడే - ద్రుపద మహారాజు. (భారతం-ఆదిపర్వం-పంచమాశ్వాసం)

ఊర్వశికి జన్మించిన వారే - అగస్త్య-వసిష్ఠ - మునీంద్రులు. (రుగ్వేదం-7-33-9)

మేనకకి విశ్వామిత్రుని ద్వారా జన్మించినదే-శకుంతల.

ఘృతాచికి వ్యాసుని ద్వారా పుట్టినవాడే-శుక మహర్షి. (భారతం-శాంతిపర్వం)

జలపదికి శరధ్వంతుని ద్వారా జన్మించినవాడే - కృపాచార్యులు. (భారతం-ఆదిపర్వం-పంచామాశ్వాసం)

ఘృతాచికి భరద్వాజ మహర్షి ద్వారా జన్మించినవాడే - ద్రోణాచార్యులు. (భారతం-ఆదిపర్వం-పంచమాశ్వాసం)

అంచేత, ప్రాచీన భారతదేశంలోని రాజులూ, రుషులూ, ఈ అప్సరకాంతలకి, ఈ దేవ వేశ్యలకి జన్మించారనే నగ్నసత్యాన్ని, రుగ్వేదం నుండి మహాభారతం దాకా వున్న సమస్త ఇతిహాస పురాణాలూ నిర్ద్వంద్వంగా చాటి చెప్పాయి.

అప్సరానాం పతిర్ నాస్తి

మాతృస్వామ్య సమాజమూ, అనంతర సాంప్రదాయం అందజేసిన సమాచారం ప్రకారం, అప్సరలకి శాశ్వతమైన భర్త అనేవాడు వుండడు అనే అంశం రూఢి అయింది. ఇది నాటి సమాజంలో నేరమూ పాపమూ గాదు; సర్వే సర్వత్రా అమల్లో వున్న విషయం. ఈ అప్సర కాంతలు వివస్త్రలై పూర్తి నగ్నంగా వుంటారని రుగ్వేద వర్ణనల ద్వారా తెలుస్తోంది. (10-95-8,9) ఇలాగే ఉషోదేవత సైతం నిరంతరం నగ్నంగా వుండి, కాముకిగా పురుషులకు కన్పించినట్లు, రుగ్వేద వర్ణనలు తెలియజేశాయి. ఈవిధంగానే వుండిన మేనక యిత్యాది అప్సరాంగనలు, విశ్వామిత్రుడు మొదలైన రుషుల తపోభంగం గావించారు.

అంచేత, ఇళా- ఉషస్సూ- ఊర్వశి- యిత్యాది అప్సరలు, మాతృస్వామ్య వ్యవస్థకి చెందిన స్త్రీలు. మహామాత (Mother goddess) మానవ ప్రతినిధులైన ఈ అప్సరలు, ఆనాడు అందరికీ అందుబాటులో వుండేవారు. వారి విశృంఖల ప్రవర్తనకీ, స్వేచ్ఛా విహారానికీ, నాడు ఎలాంటి విధి-నిషేధాలూ లేవు. అంచేత, స్వేచ్ఛా వర్తనమే-నాటి రీతి. అదే నాటి సామాజిక "నీతి".

మహామాత పూజ

దేవాలయ పూజలో నించే జారత్వం ప్రాదుర్భవించింది. ఇండియాలోని అనేక ప్రాంతాల్లో ఈ జారత్వం, దేవాలయ పూజలతోనే నేటికీ ముడివడి వుంది. అత్యంత

ప్రాచీన కాలంలో, ఈ జారత్వం మహామాత పూజతో సంబంధం కలిగియుంది-అని కొశాంబి నిర్ధరించాడు : "The hetaerism originates in temple cults, and in many parts of India still remains connected with temple cults, and at the earliest stages, with the cult of the mother-goddess." [Myth and Reality-page-45.]

ఈ నగ్నసత్యాన్ని రుగ్వేదమూ, శతపథ బ్రాహ్మణమూ, కథా సరిత్సాగరమూ (17-4) మహా భారతమూ, అధర్వణ వేదమూ, యిత్యాది ప్రాచీన గ్రంధాలు రుజువు జేశాయి.

సింధు నాగరికత అమల్లోవున్న కాలంలో, ఈ మహామాత పూజ ప్రముఖంగా సాగేదనేందుకు, సింధు ముద్రికలే మనకు ఎదురులేని సాక్ష్యాన్ని అందజేశాయి. అంతేగాదు-మాత్రానమని అనే పేరిట అధర్వణ వేదంలో వున్న రుక్కుల ప్రకారం అప్సరస్త్రీ యంటే మహామాతగా కన్పిస్తోంది.


గ్రీసులోని ఆఫ్రొడైట్ వలె, లక్ష్మి గూడా సముద్రం నించి జన్మించినదే. ఈమెకు రమా-మా- (లోకమాత) అనే నామాలు వున్నాయి. మహామాత లందరి పేర్ల చివర "మా" అనే పదం తప్పక పుండడం ప్రత్యేకంగా గమనార్హం. (ఉమా-రమా-రుశమా)

సంస్కృత సాహిత్యానికి చెందిన ఏ ప్రాచీన గ్రంధంలోనూ, ఈ విధమైన మహామాత పూజకి, ప్రాతిపదిక కన్పించడం లేదు. అంచేత, నేటికీ ఇండియాలో అమల్లో వున్న ఈ రకమైన పూజలు (Temple cults) విదేశాలకి చెందిన మతాల నుండి సంక్రమించాయా-లేక-సింధు నాగరికతకి చెందిన ద్రావిడ-ఆదివాసుల నుండి సంక్రమించాయా అనే అంశాన్ని మరింత నిశితంగా పరిశీలించవలసిన అవసరముంది. "ఇండియా లోని అమ్మ-తల్లి గుళ్ళు, ఆదిమ ఆటవిక పూజా విధానం నించి నేరుగా అభివృద్ధి జెందినవే. విభిన్న ప్రాంతాల్లో వృద్ధిజెందిన ఈ పూజలు అనంతరదశలో బ్రాహ్మణ మతానికి అనుకూలంగా మలచబడ్డాయి"- అని కొశాంబి వ్యాఖ్యానించాడు: "Indian mother-goddess temples are a direct growth from primitive tribal cults, each of local origin, later brahminiged." (మిత్ అండ్ రియాలిటీ - పేజి 68)

కుంభం- స్త్రీ మర్మాంగం

వసిష్ఠుడు కుంభ సంభవుడని (కుండలోంచి పుట్టినవాడని) రుగ్వేదం ఏడవ మండలంలో చెప్పబడింది. బదరికాశ్రమంలో మిత్రుడూ వరుణుడూ తపస్సు జేస్తోడగా, వారికి ఊర్వశి కన్పించిందనీ, తక్షణం వారికి వీర్య స్కలనమైందనీ, ఆ స్కలనమైన ఉభయుల వీర్యాన్ని వొక కుండలో పోయగా, దానిలో నుండి అగస్త్య- వశిష్ఠులు జన్మించారనీ రుగ్వేదం ద్వారా తెలుస్తోంది. తత్ఫలితంగా వీరి తండ్రి యెవరో తెలియకుండా పూర్తిగా మరుగున పడిపోయింది. అయితే, బ్రాహ్మడుగా వసిష్ఠుడు పరిగణింపబడినా, వాస్తవానికి ఈతడు అనార్యుడే. కుంభం లోంచి పుట్టినవాడుగా చెప్పబడుతోన్న ఈతడు నిజానికి స్త్రీకే జన్మించాడు ; ఎంచేత నంటే, ఈ కుంభమే, అమ్మ-తల్లియైన ఊర్వశి. ("The pots generally represent the mother-goddess." పై గ్రంధం-పేజి 70)

మెసపొటేమియన్ కామదేవతయైన ఇస్టార్, నీరు పారుతోన్న కూజాను పట్టుకొన్నట్లు చిత్రించబడింది. ఈ కూజా- మైధున కార్యానికి చిహ్నమని సుప్రసిద్ధ పండితుడైన ఆర్. డి. బార్నెట్ వ్యాఖ్యానించాడు. అంచేత, ఈ కూజా-స్త్రీ యోనికి చిహ్నమని చరిత్రకారులూ పురాతత్వ వేత్తలూ ఏకగ్రీవంగా అంగీకరించారు.



కుమ్మరి సారెపై కుండలు చేసే దశకి పూర్వం, అంటే-చరిత్రకి పూర్వం - స్త్రీలే చేతులతో కుండలు చేసే వారనే విషయం అంతా అంగీకరించిన సత్యమే. అంచేత, కుంభం సాధారణంగా మహామాతను సూచిస్తుంది. కుండ- ఆమెకి (ఆమె యోనికి) ప్రాతినిధ్యం వహిస్తుంది. కుంభ సంభవులుగా వర్ణింపబడిన వసిష్ఠ-అగస్త్యులు, అనార్యజాతికి చెందిన స్త్రీకి (ఊర్వశికి) పుట్టిన తమ జన్మ వృత్తాంతాన్ని ఇస్టార్ ఆర్యభాషలో చెబుతున్నారు తప్ప మరేమీ కాదు; తండ్రి యెవరో తెలియని స్థితిలో, తల్లిని సైతం తిరస్కరించి, కుండకి పుట్టామని చెప్పుకోవడం శ్రేయస్కరం గాదా? (మిత్ అండ్ రియాలిటి-పేజి 76)

ధృతరాష్ట్రుని భార్యయైన గాంధారికి కౌరవులు నేరుగా పుట్టలేదనీ, నెలలు నిండని పిండాల్ని నేతితో నింపబడిన కుంభాల్లో (కుండల్లో) వేయగా, వీటిల్లోంచి వందమంది కౌరవ సోదరులు జనించారని మహాభారతం ద్వారా మనకు తెలుస్తోంది.

భరద్వాజ మహర్షి గంగానదికి అభిషేకం నిమిత్తం వెళ్ళగా, ఘృతాచి యనే అప్సరను చూచినందువల్ల, తక్షణం వీర్య స్కలనమైందనీ, ఆ వీర్యాన్ని ద్రోణంలో (దొప్పలో) వేయగా, దానిలో నుండి ద్రోణాచార్యులు పుట్టాడనీ భారతం ద్వారా తెలుస్తోంది. (మహాభారతం-ఆదిపర్వం-పంచమాశ్వాసం)

అంచేత, ఈ కుంభ సంభవులూ, యీ సద్యోగర్భాలూ, యీ అయోనిజలూ (యోని ద్వారా పుట్టనివారు) అత్యంత ప్రాచీనమైన మాతృస్వామ్య వ్యవస్థకి చెందిన అవశేషాలు మాత్రమే. పైకి పేర్వేరుగా కన్పించే ఈ అప్సరకాంతలూ-జలదేవతలూ-సరోవరాల్లో జలక్రీడలూ-యధేచ్ఛా విహారాలూ-వొక నాటి సామూహిక జారత్వానికి ప్రబల నిదర్శనాలు మాత్రమే. ఈ సందర్భంగా కొశాంబి యీ విధంగా అన్నాడు :

"మొహెంజొదారో లోని స్నానఘట్టం (Great Bath) పుష్కర తీర్థమని నేను సూచిస్తోన్నాను. నగరానికి దూరంగా ఎత్తయిన వేదికపై యీ విచిత్ర భవనం నిర్మింపబడింది. తటాకంలో నీరు నింపేందుకు ఎంతో శ్రమను వెచ్చించ వొలసిన అవసరం దృష్ట్యా, యీ స్నానఘట్టం పౌరుల సాధారణ ఉపయోగం కోసం మాత్రమే అయివుండదు. ఈ ఘట్టం చుట్టూ వున్న గదులు, మహామాత ప్రతినిధులైన నాటి అప్సరకాంతలచే మైధునకార్యం నిమిత్తం వినియోగింపబడి వుంటాయి. "జలదేవతలకి" ఎంతో అవసరం గాబట్టి, యింతటి శ్రమ కోర్చి యీ నీటిని యీ స్నానవాటిక లోకి పంపివుంటారు. సరోవరం-తామరపూవు-నాట్యం- (దేవకన్యలు విహరించే) ఆకాశం : పరస్పర సంబంధం లేనివిగా పైకి కన్పించే యీ పదాలు, నిగూఢమైన అర్థాన్ని సూచిస్తాయి. "పుష్" అనే శబ్దం నించి పుష్కర అనే పదం వొచ్చింది. యీ పుష్కర శబ్దానికీ, పుష్కల శబ్దానికీ దగ్గర సంబంధముంది. పుష్కలం-అంటే-ఫలవంతం-సారవంతం-సమృద్ధి- అని అర్థం. ప్రాచీన సంస్కృత సాహిత్యంలో నాట్యకత్తెగా-దేవకన్యగా కన్పించినా, పైన పేర్కొన్న పదాలన్నీ అప్సరలతో సంబంధమున్నవే" అని కొశాంబి వ్యాఖ్యానించాడు. (మిత్ అండ్ రియాలిటీ-పేజి 71)

వైశాలికి చెందిన లిచ్ఛవీ (తెగ) నాయకులు "అభిషేక మంగళ పొక్కరాని" అనే పేరిట ప్రత్యేకమైన- పవిత్రమైన వొక అభిషేకోత్సవం జరుపుకొనేవారని, దమ్మపద అత్తకత లోనూ, 465వ జాతకకథ లోనూ రాయబడింది. క్రీ. శ. 120 ప్రాంతంలో పాలించిన నహపాలుని అల్లుడైన ఉశవదాతుడు, పుష్కరతీర్థం వొద్ద పట్టాభిషేకోత్సవం జరుపుకొన్నట్లు నాసిక్ శిలాశాసనం ద్వారా తెలుస్తోంది. ఇండియా

నుండి కంబోడియాకి హిందూ పురోహితులు వలసపోయి, అక్కడ హైందవ సంస్కృతిని వ్యాపింపజేశారు. ఆంగకర్‌వాట్ (Angkor Vat) దేవాలయంపై అప్సర నాట్యకత్తెల శిల్పాలు మలచబడ్డాయి. వొక చేతిలో తామరపూవూ, మరో చేతిలో తామరపువ్వు యొక్క అండాశయమూ (Seed pod) వున్నట్లు ఆ శిల్పాలు చిత్రించబడ్డాయి. తామరపువ్వు- పుష్కర తీర్థానికీ, అండాశయం-సంభోగకార్యానికీ సంకేతాలు. అంతేగాదు ; పుష్కరతీర్థమంటే తామర ఆకు అనీ, తామర ఆకు అంటే (పుష్కర పర్ణం) స్త్రీ యోని యనీ, శతపథ బ్రాహ్మణం (7-4-1-11, 18) నిర్ద్వంద్వంగా చెప్పింది. అంచేత, కుంభ సంభవుడుగా (కుండలోంచి పుట్టినవాడు) వర్ణింపబడిన వశిష్టుడు, స్త్రీయోనికి సంకేతమైన కుంభం లోంచి జనించినవాడనే విషయం చరిత్ర పండితులచే స్పష్టంగా నిర్ణయింపబడింది. అంచేత, ఊర్వశికి జనించిన ఈ వశిష్టుడు వైశ్యాపుత్రుడే గాని బ్రాహ్మడు మాత్రం కాడు. (ఇందువల్లనే "తల్లి ఊర్వశి లంజ-తానెట్లు బాపడు" అని మహాకవి వేమన అన్నాడు.) వశిష్టులలో పౌష్కరసాది గోత్రం అనేది వొకటి వుంది. ఈ గోత్రానికి చెందిన వాడొకడు, కోసలను పాలించిన ప్రసేనజిత్తుకు పురోహితుడుగా వున్నట్లు దిఘనికాయం ద్వారా తెలుస్తోంది. ఈ వశిష్టులలోనే కౌండిన్యగోత్రం అనేది గూడా వొకటి వుంది.

అగ్నిహోత్రమే కేంద్రంగా వున్న యావత్ వైదికార్య జీవితానికి, తామరపువ్వుతో గానీ, తామరకొలనుతో గానీ ఏవిధమైన సంబంధం లేదు. తామరకొలను గానీ, ఆ కొలనువొద్ద వుండే అప్సరకన్యలు గానీ ఆర్యజాతికి చెందిన వారు కానే కారు. అంచేత, ఈ తామరకొలనుకు చెందిన పూజావిధానం అనార్యులకు మాత్రమే చెందింది.

మొహెంజొదారో లోని స్నానఘట్టం, నీటి ద్వారా జబ్బుల్ని చికిత్సజేసే ప్రదేశమని, సర్ జాన్‌మార్షల్ అభిప్రాయపడ్డాడు. కాని, బహుశా అత్యంత ప్రాచీన కాలం నాటి తీర్థాలకి ఇది- మూలరూపమై వుండాలనీ, మానవ అప్సరకాంతలతో జతగూడడం ఈపూజలో ఒకభాగమై వుండాలనీ కొశాంబి అభిప్రాయం వెలిబుచ్చాడు. ఇష్టార్ మహామాత దేవాలయాల్లో జరిగే మెసపొటేమియన్ దేవదాసీల జారత్వానికి, యీ స్నానఘట్టం- సింధు ప్రతిరూపమై వుండాలి-అని కొశాంబి అన్నాడు. (మిత్ అండ్ రియాలిటి-పేజి 78)

మానవ సమాజ పరిణామ చరిత్రకి చెందిన వొకానొక దశలో, సృష్టికార్యం (సంభోగకార్యం) వొక పవిత్ర ఆరాధనగా, వొక ఘనకార్యంగా పరిగణింపబడిన కాల మొకటుంది. "దేవాలయాలు అన్నీ ఆ రోజులలో సంభోగాల కోసము నిర్మించినవే. బూతు అంటే ఇప్పుడు మనం చాలా అసహ్యంగా చూస్తున్నాము గాని, ఆ రోజులలో అది ఒక మహాకార్యం ; ఒక ప్రజా సేవ ; ఒక మహాభక్తి ; ఒక పవిత్ర ఆరాధన ; ఘనకార్యము. ఆరోజులలో దానియందు అసహ్యత లేదు. నీచత లేదు. పాపం లేదు. మీదు మిక్కిలి అందరూ చెయ్యవలసినది. పవిత్రమైనది. గౌరవానికి అర్హమైనది." (తాపీ ధర్మారావు – దేవాలయాల మీద బూతుబొమ్మలెందుకు?–పేజి–37) సంభోగపూజ పట్ల ఈవిధమైన దృక్పథం, నాటి వారికి వుండేదనేందుకు, పార్వతీ పరమేశ్వరుల కలయిక ద్వారా పుట్టిన కుమారస్వామి జనన వృత్తాంతమే యిందుకు తిరుగులేని నిదర్శనం.

గణిక

వైదికార్యుల గణం చాలా చిన్నది. అందులోని రక్తబంధువులకే అది– పరిమితం. దానికి ఆధారం మాతృస్వామ్య వ్యవస్థ. గణంలోని సభ్యులంతా ఏక కుటుంబీకులే. ఆధునిక నాగరికతకు లక్షణమైన వివాహం– వ్యక్తిగత కుటుంబం – సొంత ఆస్తి– అందులో లేవు. గణానికి చెందిన వివిధ విధుల్ని నిర్వహించే వారంతా, గణ సభ్యులచే యెన్నుకోబడేవారు. గణ నివాసం చుట్టూ రాళ్ళను గట్టుగా పేర్చి, ఆ ఆవరణలో తమ పశువుల్ని కాపాడుకొనేవారు. ఈ ఆవరణను "అశ్మవ్రజం" అని రుగ్వేదంలో పిలిచారు. గణనాయకుని బ్రహ్మణస్పతి– బృహస్పతి – గణపతి అనే పేర్లతో వ్యవహరించారు.

గణంలోని పురుషులందరికీ, గణ స్త్రీలంతా ఉమ్మడి భార్యలు. ఈ గణభార్యలనే గణికలు అని పిలిచారు. ఈ విధంగా గణశబ్దంలో నుండి, గణసమాజ వ్యవస్థ నుండి, గణిక ఉద్భవించింది. సమిష్టి కృషి ద్వారా ఉత్పత్తి చేసినదాన్ని, సమిష్టిగా పంచుకొని, సుష్టుగా తిని మస్తుగా తాగి, స్త్రీ పురుషులు కలిసి జతలు జతలుగా అగ్ని చుట్టూ పడి నిద్రించేవారు. ఆనాటికి వ్యక్తిగత కుటుంబమూ వావి వరసలూ లేనేలేవు.

గణాల మధ్య జరిగే పోరాటంలో, వొక గణం– శత్రువును ఓడించినప్పుడు, ఓడిన గణానికి చెందిన పశువుల్నీ, వస్తుసంపదనూ స్త్రీలనూ వశపరచుకొని, పురుషుల్ని ఖైదీలుగా బంధించి, గణనివాసానికి తెచ్చేవారు. కొల్లగొట్టుక వొచ్చిన సామగ్రినంతా వొక వేదికపై (ఆసన్ది) అమర్చేవారు. అంతా కలిసి సోమపానం

సామగానంతో పెద్ద విందు చేసుకొనేవారు. ఆ పిదప స్త్రీ పురుషులంతా కామన్నృత్యం (సెక్సు డాన్స్) చేసేవారు. ఆట పాటల (నృత్య గానాలు) పిదప, సాముదాయక సంభోగంతో ఆ సంబరం ముగిసేది.

ఈ కామ నృత్యం సమయంలో, శత్రుగణానికి చెందిన కొత్త స్త్రీ ఖైదీ లుండడం వల్ల, కొంతరసభంగం గూడా కలిగేది. కొత్త అందగత్తెలకోసంతాపత్రయ పడే యీ విందు సందర్భంలో, గణానికి చెందిన గణికలకు మొగవుజ్జీలు దొరక నందువల్ల, ఆ గణభార్యలు పడే బాధా, దుఃఖమూ వర్ణించడానికి వీల్లేనంత అసభ్యంగా వుండేది. ఋక్ యజుర్వేదంలో దీన్ని "విలాపము" అనేపేరిట పిలిచారు. ఆ ఘట్టంలో జరిగిన సంవాదం, క్షత్త - పలగలి సంవాదం- యిక్కడ ఉదహరిస్తే బూతుగా వుంటుంది.

విందు పిదప యుద్ధంలో కొల్లగొట్టబడిన స్త్రీ ఖైదీలంతా, గణాని కంతటికీ మూక ఉమ్మడి భార్యలుగా- గణికలుగా- సమిష్టిగా బహూకరింపబడేవారు. గణంలో పూర్వమున్న గణికలతో, ఈ కొత్త గణికలు గూడా కలిసిపోయేవారు. ఈ విధంగా ప్రాచీనార్య గణసమాజం నుండి ఆవిర్భవించినవారే- గణికలు.

సామూహిక వివాహం

వైదికార్యుల ఆదిమ గణసమాజ వివాహానికి చెందిన అవశేషం, ఋగ్వేదంలో కన్పిస్తుంది. (1-167-4) "రోదశి" దేవత, మరుత్తులందరికీ "సాధారణి" అనే పేరిట సామూహిక భార్యగా వ్యవహరిస్తుంది. అయితే, ఇది- బహుభర్తృత్వాన్ని (Polyandry) సూచిస్తుందో, కాక వొక విధమైన "జారత్వాన్నే" సూచిస్తుందో స్పష్టంగా చెప్పడం కష్టమని కొశాంబి అన్నాడు. విశ్ అంటే- ప్రాచీనార్య గణం. విశ్యా అంటే- గణ భార్యలు-లేక- గణికలు. సామూహిక వివాహం (గుంపు పెళ్ళి) ద్వారా అయిన గుంపు భార్యలు. (Common Clan- wives by group marriage) ఈ విశ్యా శబ్దంలోంచి వొచ్చిందే వేశ్య- అని కొశాంబి అభిప్రాయపడ్డాడు.

ఈ గుంపు పెళ్ళి ప్రకారం, తెగలో వున్న పురుషులందరితో, ఆ తెగలోని యువతులంతా యధేచ్ఛగా జతగూడేవారు. ఇందులో చాటు మాటు వ్యవహారం ఏమాత్రం వుండేది గాదు. ఆనాడు తెగలోని ఆడవాళ్ళంతా మగవాళ్ళందరితో జత కట్టడానికి అర్హులే. జతగూడే బుద్ధి పుట్టినప్పుడు, వావి వరసల్లేకండా ఇష్టమున్న వ్యక్తితో సంభోగించడం, నాటి నిత్యజీవితంలో వొక భాగం. నిషేధం లేని ప్రాచీన సాంఘిక సాంప్రదాయం. ఆనాడు ప్రతిస్త్రీ, ఆ తెగలోవున్న ప్రతిపురుషునితోనూ జత

గూడేది. అన్నం-పానం-గానం-నృత్యం-శయనం-అన్నీ గణం మొత్తానికీ చెందిన ఉమ్మడి యింటిలోనే (Common House) జరిగేవి. ఈ విధమైన ఉమ్మడి ఇంట్లో నివసించే స్త్రీయే-గణిక-లేక-వేశ్య. అయితే అనంతర దశలో యీ వేశ్య శబ్దం, వేరే అర్థాన్ని సంతరించుకొన్నది. అంచేత, ప్రాచీనార్య సాముదాయక వివాహానికి (గుంపు పెళ్ళికి) చెందిందే-గణిక. ఈ సాముదాయక భార్యల్లోంచి జనించినదే-గణిక.

వైదికార్యుల ఆదిమ గణసమాజంలో, సమిష్టిగా వస్తువుల్ని ఉత్పత్తి చేయడంతో పాటు, సాముదాయకంగా సంభోగించి, సమిష్టిగా సంతానోత్పత్తి గావించారని అన్నప్పుడు, మడిబట్టలు కట్టుకొన్న కొందరు సనాతన పండితులు అమాంతం విరుచుక పడవొచ్చు. అల్పసంఖ్యలో వొక చిన్న సామాజిక సమూహంగా యేర్పడ్డ నాటి గణంలోని స్త్రీ పురుషులు, క్రూరమైన ప్రకృతి పరిస్థితుల మధ్య, వొకరికొకరు అంటిపెట్టుకొని వుండి, సమిష్టిగా శ్రమించి, జీవించి, వారిలో వారే సంభోగించి సంతానాన్ని కనేవారు. అంచేత, నేడు వ్యభిచారంగా పరిగణింపబడే వావి వరుసలు లేని స్వేచ్ఛా విహారం, "నీతి నియమ" రహితమైన కామ సంబంధాలు, నాడు నిషేధం గావు.

మానవుల సామాజిక ఆర్థిక సంబంధాలకు కుటుంబం-ప్రతిబింబం. ప్రతి చారిత్రక ఘట్టంలో వుండే కుటుంబ విధానం, ఆనాటి ఉత్పత్తి విధానాన్నిబట్టి నిర్ణయమై వుంటుంది. అంచేత, సమిష్టిగా జీవించిన ప్రాచీనార్య గణసమాజంలో, స్త్రీ పురుష సంబంధాలు గూడా సాముదాయిక పద్ధతి మీదనే ఆధారపడి వుండేవి.

గణజనని

ప్రాచీన సమాజంలోని సాముదాయిక వివాహ పద్ధతి- గుంపు పెళ్ళి నుండి, తల్లి ప్రధాన స్థానమాక్రమించిన మాతృస్వామిక విధానం వొచ్చిందనీ, అదే ప్రతి సమాజ సమూహానికీ మూలమనీ బాస్కోఫెన్ చెప్పినప్పుడు విపరీతంగా ఆయన్ని నిరసించారు. మాతృస్వామ్య వ్యవస్థలో తల్లియే-గణ నాయిక; జన నాయిక. ఈ వ్యవస్థకి చెందిన నాటి స్త్రీ-స్వేచ్ఛా విహారం జేసిన "మృగం." స్వతంత్రంగా ఎగిరిన విహంగం. యధేచ్ఛగా వర్తించిన స్త్రీ-వ్యాఘ్రం. ఆమె సర్వస్వతంత్ర. ఆమె ఏవొక్క వ్యక్తినీ పెళ్ళాడలేదు. ఆమె ఏవొక్క వ్యక్తి "భార్య" కాదు. ఏవొక్క వ్యక్తి యొక్క సొత్తూ కాదు. సెక్స్‌సంబంధాల్లో ఆమెకి కొడుకు-అన్న-తమ్ముడు-అనే విచక్షణ గానీ, వావి వరసలు గానీ లేనేలేవు. ఈ వ్యవస్థలోని బిడ్డలకి తల్లి తప్ప, తండ్రి యెవరో తెలియదు. అనేకమైన పురుష వీర్యాలు, వొకే స్త్రీ క్షేత్రంలో

సంగమించినందువొల్ల, ఏ బిడ్డ ఏ పురుషునికి జన్మించిందో తెలియడం ఆనాడు అసాధ్యం. అంచేత మాతృస్వామ్య వ్యవస్థలోని స్త్రీ, ఆజన్మాంతమూ సర్వ స్వతంత్రురాలై వుండేది.

వావి వరుసలు

ప్రాచీనార్య గణ సమాజంలో సాముదాయికంగా స్త్రీలను అనుభవించారనడం అబద్ధం అవినీతికరం అని అంటే, నేటి భారతదేశంలో ప్రతివానికీ భయంకరంగా అసహ్యకరంగా కన్పించే కుటుంబ పద్ధతులూ, సెక్స్ సంబంధాలూ, వావి వరసలు శూన్యమైన యధేచ్ఛా విహారాలూ, పూర్వకాలంలో పుణ్య పురుషులూ మహా రుషులూ దేవుళ్ళని గౌరవించబడ్డవారూ ఆచరించినట్లు, హిందూ పురాణాల్లో, భారత-రామాయణాల్లో వివరంగా వివరించబడ్డాయి. వీటిని రాసిన ప్రాచీన హిందూ రచయితలు, నాటి వాస్తవికపరిస్థితులకు దగ్గరగా వున్నవారు కావడంవొల్ల నాటి ఆదిమ సామాజిక సంబంధాలకూ, అంతకి పూర్వపరిస్థితుల్ని గూర్చిన చారిత్రక స్మృతులకూ, కృత్రిమమైన అర్థాల్ని కల్పించవలసిన అవసరమేదీ వారికి లేకపోవడంవొల్ల, సెక్స్ సంబంధాలకి చెందిన విషయాల్ని దాచేందుకు వారు ప్రయత్నించలేదు. సంతానాభివృద్ధికోసం యేర్పడ్డ కామ సంబంధాలు, వివిధ కాలాల్లో (కృత-త్రేత-ద్వాపర-కలియుగాల్లో) విభిన్నంగా వున్నాయని వారు తమ సహజ ధోరణిలో వివరించారు.

సమిష్టి గణకుటుంబమూ, సంకల్ప వివాహమూ, మాతృస్వామ్య వ్యవస్థకి మూలం. ప్రాచీన కాలానికి చెందిన వివిధ దేశాల్లోని యావత్ సామాజిక వ్యవస్థలకీ ఈ మాతృస్వామ్యమే పునాది. మాతృస్వామ్యానికి చెందిన సంకల్ప వివాహ పద్ధతిప్రకారం, ఏ స్త్రీయైనా, ఏ పురుషునితోనైనా జతగూడవొచ్చు. అది-వారి సంకల్పాన్ని (ఇష్టాన్ని) బట్టి ఆధారపడి వుంటుంది. ఇందుకు సాంఘిక లేదా వ్యక్తిపరమైన అడ్డంకులేమీ వుండేవి గావు. ఈ పద్ధతి, మానవ సమాజ ప్రారంభదశలో-"సృష్టి" ఆది దినాల్లో-వుండేది. ఈ దశలో వొకే తల్లికి పుట్టిన అన్నాచెల్లెళ్ళమధ్య పెళ్ళిళ్ళు జరిగేవి. అకూరుచి ప్రజాపతి బిడ్డలైన యజ్ఞుడూ దక్షిణా అనేవారు భార్యా భర్తలయ్యారు. (అలాగే వొకే తల్లి బిడ్డలైన యముడూ - యమీ మొగుడూ పెళ్ళాలయ్యారు.) (ఋగ్వేదం-10-10)

ఆటవిక పరిస్థితుల్లో వున్న ఆర్యులు ఏ వావీ వరసా లేకుండా, స్వేచ్ఛగా కామేచ్ఛను తీర్చుకొనేవారు. ఆనాటికి తల్లీ-కొడుకూ, అన్నా-చెల్లీ, తండ్రీ-కూతురూ, తాతా-మనుమరాలూ, మధ్య సంబంధాలు నిషేధించే సాంఘిక నియమాలు

సమాజంలో యింకా ఆవిర్భవించలేదు. ఆర్యుల పౌరాణిక గాధల్లో, దేవతలూ ప్రజాపతులూ పుట్టి పెరిగిన ఘట్టాలు వర్ణించబడిన సందర్భాలన్నీ, వావీ వరసలు పాటించని సెక్స్ సంబంధాలున్న దశను సూచిస్తోన్నాయి. [ఐతరేయ బ్రాహ్మణంలో, సృష్టి క్రమాన్ని వివరించే సందర్భంలో, సృష్టికర్తయైన ప్రజాపతి, సృష్టికొరకు తన కుమార్తెతోనే సంభోగి చాడని చెప్పబడింది. "ప్రజాపతి ర్వైస్వామ్ దుహిత రమధ్యాయత్" అని అన్నాడు.)

మత్స్య- వాయు పురాణాలు బ్రహ్మను గూర్చి యిలాగే చెప్పాయి. అనంతర దశలో తండ్రీ కూతుళ్ళ మధ్య కామ సంబంధాలు నిషేధించబడి నప్పటికీ, ప్రజాపతికి పాత కామసంబంధాల వాసనమాత్రం వదల్లేదు. అంచేత, అతడు జింక రూపం ధరించి, తనలాగే జింకరూపం ధరించిన రోహిత అనే తన కూతురుతో భోగించడానికి వెళ్ళాడు. ఈ విషయం కనిపెట్టిన దేవతలు, సంభోగించక పూర్వమే వారిని బాణంతో కొట్టారు. తత్ఫలితంగా వారిద్దరూ నక్షత్ర లోకానికి పోయారు. వీరే నేటి ధనుర్నక్షత్రం: (ఐతరేయ బ్రాహ్మణం- 3-33: 5-32) హరివంశం గూడా యిలాంటి సంఘటనల్ని ఎన్నిటినో ఉదహరించింది. విశిష్ట ప్రజాపతి కూతురైన శతరూప, తన తండ్రినే పెళ్ళాడింది. (హరివంశం- 11వ అధ్యాయం) ఇళ తన తండ్రియైన మనువును పెళ్ళాడింది. (10వ అధ్యాయం) జహ్ను తన కూతురైన జహ్నవీగంగను పెళ్ళాడాడు.(27వ అధ్యాయం)

బృహస్పతి భార్యయైన తార, పరపురుషుడైన చంద్రునిద్వారా గర్భం ధరించి బిడ్డని కని, పిల్లవాడిని చంద్రుని కప్పగించి, మళ్ళీ మామూలుగానే మగనితో కాపరం జేసింది. జారత్వంచే పరుని ద్వారా బిడ్డని కన్నా, తార సంఘ బహిష్కృత కాలేదు. బృహస్పతి దేవగురువు పదవి నుండి చ్యుతుడూ కాలేదు.

ఈ సంఘటనను బట్టి జారత్వంచే సంతానం కలిగినా, నాటి యుగంలోని సంఘం, దాన్ని దురాచారంగా అనాచారంగా భావించలేదు. ఈ బృహస్పతియే తన అన్న భార్యయైన మమత-పూర్ణగర్భిణిగావుండగా, బలవంతంగా ఆమెతో సంభోగించినా, ఆమెగానీ, ఆయనగానీ, నేరస్థులుగా పరిగణింపబడలేదు. ఆవిధంగానే తులసిని మహా విష్ణువూ, మునిపతియైన అహల్యను దేవేంద్రుడూ మోసగించి రమించారు. ఓఘరథుని తండ్రియైన సుదర్శనుడు, తన కుమారుని కూతురైన ఓఘవతికి తగిన వరుడు దొరకనందువల్ల, మనుమరాలిని తానే పెళ్ళాడడం "కృతయుగం"లో శిష్టాచారంగానే పరిగణింపబడింది. బ్రహ్మ తన సొంత కూతురైన సరస్వతిని వివాహమాడాడు. అంచేత వావివరసలనేవి నాటి సమాజంలో యింకా ఉనికిలోకి రాలేదనేది స్పష్టం.

రండా గర్భాలు గురించి భీష్ముడు చేసిన బోధ

అంతేగాదు; మహాభారత కాలం నాటికి సైతం, వావి వరసలు పాటించకుండా విశృంఖల స్వైర విహారం జేసే ఆచారం వున్నదనేందుకు భారతంలోనే ఎన్నో నిదర్శనాలు కన్పిస్తాయి. భీష్ముని సవతి తల్లియైన సత్యవతికి (మత్స్యగంధికి) శంతన మహారాజు ద్వారా విచిత్రవీర్యుడనే సోదరుడున్నాడు. ఈ విచిత్రవీర్యుడు అంబిక-అంబాలిక - అనే యిద్దరు రాచకన్యల్ని వివాహమాడి, సంతానం లేకండానే చనిపోయాడు. అప్పుడు భీష్ముని సవతితల్లియైన సత్యవతి, సంతానం లేకపోతే వంశం నాశనమవుతుందని భావించి, అంబిక - అంబాలికల ద్వారా పిల్లల్ని పుట్టించమని భీష్ముని కోరింది. ఆజన్మ బ్రహ్మచారియైన భీష్ముడు యిందుకు అంగీకరించలేదు. అప్పుడు, మొదటి "మొగుడూ"- ప్రియుడైన పరాశర మునీంద్రుని ద్వారా, తాను కన్యగా వున్నప్పుడు కనిన వ్యాసుణ్ణి పిలిపించి, అంబికా— అంబాలికలకు కడుపులు చేయమని కోరింది. తక్షణం అందుకంగీకరించిన వ్యాసమహర్షి, అంబిక ద్వారా ధృతరాష్ట్రునీ, అంబాలిక ద్వారా పాండురాజునీ, దాసీ యువతిద్వారా విదురునీ పుట్టించి, తల్లియైన సత్యవతి తనకి ఒప్పజెప్పిన కార్యాన్ని నిర్విఘ్నంగా పూర్తిజేసి చక్కాపోయాడు.

వంశం నిలబెట్టేందుకి భర్త కాకపోయినా, పరుల ద్వారానైనా సంతానం కనమని అత్తగారైన సత్యవతి కోడల్ని ప్రాధేయపడింది. అప్పుడు ఇతరులతో పోయి పిల్లల్ని కనేందుకు కోడలు తటపటాయించింది. ఆ దశలో సమస్త ధర్మశాస్త్ర పారంగతుడైన భీష్మాచార్యులు, కోడలి అనుమానాన్ని నివృత్తి జేసి, పూర్వకాలంలో పరులతో సంగమించి సంతానం కనేవారనీ, అది-ధర్మమేననీ యీ కింది విధంగా బోధించాడు:

"నచైషాం మైథునో ధర్మో బభూవ భరతవర్షభ॥
సంకల్పాదేవ చైతేషాం గర్భః సముత్పద్యతే॥
తత స్త్రేతాయుగే కాలే సంస్పర్శాజ్జాయతే ప్రజా
నహ్య భూన్మైథునో ధర్మస్తే షామపి జనాధిప॥
ద్వాపరే మైథునో ధర్మః ప్రజానామ భవన్నృప॥
తధా కలియుగే రాజన్ ద్వంద్వ మాపేదిరే జనాః॥

(భారతం-శాంతిపర్వం-206-42, 43, 44)

కుంతీదేవికి పాండురాజు చేసిన బోధ

రోగిష్ఠియైన పాండురాజు తన భార్యలైన కుంతి-మాద్రులకి, యితరులద్వారా సంతానం పొందమని అంగీకరింపజేయడానికి, ఏక పత్నీ వివాహం లేని పూర్వాచారం గురించి సుదీర్ఘమైన ఉపన్యాసమే యిచ్చాడు. ఆతడు కుంతికి ఈ విధంగా బోధ జేశాడు: నీతిగురించి రుషులేమని చెప్పారో విను. రుషులంటే తక్కువవారు కాదు. వారు నీతి నియమాలు నిర్దేశించి చెప్పగల మహాజ్ఞానులు. ఆ అనాది దినాల్లో, స్త్రీలు యిళ్ళలోనే మగ్గి వుండేవారు కారు. ఆ రోజుల్లో వారు భర్తలపై కానీ, యితర బంధువులపై గానీ, ఆధారపడి జీవించేవారు కాదు. స్వేచ్ఛగా తిరిగేవారు. స్వేచ్ఛగా తిరిగి అనుభవించ వలసినదంతా వారు అనుభవించేవారు. ఆనాడు దీన్ని పాపంగా పరిగణించేవారు కాదు. ఆనాడు భర్తలు వారిని అవిశ్వాసంగా భావించేవారు కాదు. అట్టి కామస్వేచ్ఛకి ఆనాడు సాంఘిక ఆమోదం వుండేది. పక్షులూ జంతువులూ ఏవిధమైన అసూయ లేకుండా కామకలాపాలు సాగిస్తున్నవో, ఆ విధంగానే మానవులు సైతం సాగించడం ఈనాటికీ వున్నది. ఈ విధానంలోని గొప్పను రుషులు గూడా కీర్తించారు. ఈ ఆచారం అనుల్లంఘనీయం. ఉత్తర కురువంశంలో, యిటి ఆచారాన్ని పవిత్రంగా భావిస్తారు. స్త్రీలకు స్వేచ్ఛ నిచ్చిన యీ ఆచారం అనాదినించీ వొస్తోన్నదే- అని పాండురాజు కుంతికి నచ్చజెప్పాడు. చూడండి:

"అథత్విదం ప్రవక్ష్యామి ధర్మతత్వ నిబోధమే
పురాణ ఋషి భిర్దృష్టం ధర్మవిద్ధర్మ హాత్మభిః॥

అనావృతాః కిల పురాస్త్రీయ ఆసన్వరాసనే
కామాచార విహారిణ్యాః స్వతంత్రాశ్చారు హాసినీ॥

తాసాం వ్యుచ్ఛ రమణానాం కౌమారాత్సుభగే పతీన్
నాధర్మో ఽ భూద్వరా రోహే సహిధర్మః పురాఽభవత్॥

తం చైవధర్మం పౌరాణం తిర్య గ్యోనిగతాః ప్రజాః
అధ్యాపను విధీయంతే కామక్రోధ వివర్జితాః॥

ప్రమాణ దృష్ట ధర్మోయం పూజ్యతేచ మహర్షిభిః
ఉత్తరేషు చ రంభోరు కురుష్వద్యపి పజ్యతే॥

(శాంతిపర్వం - 128)

అంచేత, మాతృస్వామ్యవ్యవస్థనాటి ఈ యధేచ్ఛా విహారానికి, ధృతరాష్ట్ర-పాండురాజుల జన్మవృత్తాంతమూ, కుంతి-మాద్రులకు యమ వాయు ఇంద్ర అశ్వినీ దేవతల ద్వారా వరసగా ధర్మజ భీమ అర్జున నకుల సహదేవుల జన్మవృత్తాంతమూ యిత్యాదులు తిరుగులేని నిదర్శనాలు. "వావి వరుసలులేక వనితలు పురుషులు కలియు చుంటయెగ్గుగాదు మీకు" అని కర్ణుడు శల్యుణ్ణిదుయ్యబట్టినప్పుడు అంటాడు. (ఆంధ్ర మహా భారతం)

గణ మాతల సంతానం

మాతృస్వామ్య వ్యవస్థ అమల్లో వున్న కాలంలో, గణమాత పేరిటనే ఆమె సంతానంగూడా చలామణీ అయింది. మహాభారతం ఆదిపర్వంలో 18 మాతృ గణాలూ, ఆ గణమాతల పేర్లూ, విపులంగా వివరించబడ్డాయి. ఉదాహరణకి-అదితి అనే గణమాత సంతానం-ఆదిత్యులుగానూ, దితి అనే గణమాత సంతతి దైత్యులు గానూ పిలవబడ్డారు. మాతృస్వామ్య వ్యవస్థలో అన్నదమ్ముల బిడ్డలు గాక, అక్క-చెల్లెళ్ళ బిడ్డలే గణానికి వారసులయ్యేవారు. ఎంచేతనంటే, అన్నదమ్ములు తాము పుట్టిన గణాన్ని వొదిలి, తమకు భార్యలు దొరికే గణాలకి వెళ్ళిపోయేవారు. మాతృ స్వామ్య వ్యవస్థలో సాముదాయిక వివాహం ద్వారా పుట్టిన సంతతి, తల్లిద్వారానే గుర్తింపబడేది. వంశాను క్రమణిక సైతం, తల్లివైపునుండే లెక్కింపబడేది. ఆనాడు అన్నదమ్ముల బిడ్డలు గాక, తల్లితరపున వున్న అక్క-చెల్లెళ్ళ బిడ్డలే గణానికీ, గణ ఆస్తికీ వారసులయ్యేవారు. ఈ పద్ధతినే హిందూ ధర్మశాస్త్రం గోత్రాపత్యం అని పిలిచింది.

మాతృస్వామ్య సాంప్రదాయ అవశేషాలు

ఈవిధానం ఎంత బలీయమైన దంటే, పితృస్వామ్య వ్యవస్థ పూర్తిగా అమల్లో కొచ్చిన తర్వాత గూడ, శాతవాహన చక్రవర్తులు మాతృస్వామ్య సాంప్రదాయం ప్రకారమే తమపేర్లు పెట్టుకొన్నారు. ఉదాహరణకి - గౌతమీపుత్ర శాతకర్ణి, వసిష్ఠీపుత్ర పులుమాయి, అనే శాతవాహన రాజులున్నారు. ఇందులో గౌతమీపుత్ర - వసిష్ఠీపుత్ర - అని వారి వారి తల్లుల పేరిటనే వారు పిలవబడ్డారు గాని, తండ్రుల పేరిట మాత్రం గాదు. కాబట్టి, ఇండియాలో అత్యంత ప్రాచీన కాలంలో, మాతృస్వామ్య వ్యవస్థ అమల్లో వుండేదనే విషయం నిర్వివాదం.

పురుషుడే ప్రధాన స్థాన మాక్రమించిన పితృస్వామ్య సమాజం అవతరించి వేల ఏళ్ళు దాటినా, మాతృస్వామ్య సమాజానికి చెందిన నాటి ప్రాచీన ఆచారాలు, నేటికీ దేవదాసి - గణికలకి చెందిన వారిలో, ఆస్తి - వారసత్వం యిత్యాది వ్యవహారాల్లో ఛాయా మాత్రంగా నైనా వుండడం ప్రత్యేకంగా గమనార్హం. కారణమేమంటే, ఏ మాతృస్వామ్య వ్యవస్థలో నుండి ఊద్భవించిందో, ఆ ఆదిమ గణసమాజానికి చెందిన ఆచార సాంప్రదాయాలు వీరికి వారసత్వంగా సంక్రమించాయి. నాటి మాతృస్వామ్యంలో స్త్రీయే ప్రముఖ స్థాన మాక్రమించింది. అలాగే, దేవదాసి -గణికా కుటుంబంలో, స్త్రీదే పైచేయి. నాటి మాతృస్వామ్యంలో సంతానం, తల్లి ద్వారానే గుర్తింపబడేది. దేవదాసీకి పుట్టిన స్త్రీ- పురుష సంతానానికి గూడా యింటి పేరు "తండ్రి" ది గాక తల్లి పేరు వొస్తుంది. ఈ సంతానంపై "తండ్రి"కి ఎట్టి అధికారమూ లేదు. మాతృస్వామ్యంలో అక్క-చెల్లెళ్ళ బిడ్డలే గణానికి వారసులు. దేవదాసి - గణికా కుటుంబంలో, ఆమె ఆస్తికి వారసురాలు-కుమార్తెయే. కూతురు లేకపోతే, ఆమె ఆస్తి ఆమె రక్తబంధువులకి చెందుతుంది. ఈ మాతృస్వామ్య పద్ధతి, విభిన్న రూపంలో కేరళలోని "ఆడ మళయాళం"లో ప్రత్యేకంగా నాయర్ల లో నేటికీ కన్పిస్తుంది.

ఆదిమ గణసమాజంలోని గణిక - మాతృమూర్తి. ఆమె - గణజనని. సమస్త సమాజ సంపదపై ఆమె అధికారిణి. గణం స్త్రీ వల్ల పుట్టింది. అంచేతనే ప్రాచీన మానవుడు, స్త్రీని "దైవాంశ" గలదిగా, ఆదిమాతగా, ఆదిశక్తిగా భావించాడు. నేటి దేవదాసి-గణికల వలెగాక, నాటి గణసమాజమందలి గణికలు - గౌరవార్హాలు.

వైదికార్యుల సామాజిక వ్యవస్థయే - గణం. ఆ గణం ఉమ్మడి భార్యలే గణికలు. నాటి గణసమాజం లోని స్త్రీలంతా, గణ పురుషులందరికీ ఉమ్మడి భార్యలు. నేటి హిందూ సమాజంలోని గణికలు మాత్రమే, పురుషులందరికీ సాముదాయికంగా ఉంపుడు కత్తెలు. అంచేత, దేవదాసి - గణికా వ్యవస్థ, అత్యంత ప్రాచీన కాలానికి చెందిన మాతృస్వామ్య సమాజ సాంప్రదాయం మాత్రమే. ఊర్వశి- నాటి సమాజానికి ప్రతిబింబం మాత్రమే. మెసపొటేమియాకి చెందిన ఇష్టార్, ఇండియాకి చెందిన ఊర్వశి, మహామాత ప్రతినిధులే. అమ్మతల్లి పూజలో పాల్గొన్న వారే.

6. సింధు - ఈజిప్ట్ - మెసపొటేమియా నాగరికతలు

"సింధు ప్రాంతంలో ఒక విశిష్టమైన నాగరికత వుండేది. ఆ నాగరికత ఆ కాలంలో, మెసపొటేమియా – ఈజిప్ట్ దేశాల నాగరికతలకు ఏవిధంగా తీసిపోదు సరిగదా, కొన్ని విషయాల్లో వాటికన్న ఉత్తమమైంది" అని సర్ జాన్ మార్షల్ వ్యాఖ్యానించాడు. నిజానికి – ఈజిప్ట్ మెసపొటేమియా సింధునాగరికతలు – అక్కచెల్లెళ్ళు. ఈ మూటికీ ఖచ్చితమూ అవినాభావమైన సంబంధాలున్నాయని, పురాతత్వ శాస్త్రవేత్తలూ చరిత్రకారులూ ఏకగ్రీవంగా అంగీకరించారు.

సింధుప్రాంతంలో జనసంఖ్య అధికమవగా, అక్కడవున్న ద్రావిడులు బెలూచిస్థాన్ ఆఫ్‌గనిస్థాన్, పెర్షియా మెసపొటేమియాలకు వలసపోయి వుండవచ్చునని కొందరు చరిత్రకారులు భావిస్తోన్నారు. కాస్పియన్ సముద్ర పరిసర ప్రాంతాల్లో, ద్రావిడ నాగరికతా కేంద్రాలున్నాయనీ, ఆసియా మైనర్‌లోని వైలికియా, ద్రావిడ సంస్కృతికి నిలయమని చెప్పడానికి తగు నిదర్శనాలున్నాయనీ వీరు తలపోస్తున్నారు. తమిళం, తెలుగు, కన్నడం, మళయాళం, తుళుభాషల్ని మాట్లాడేవారే – ద్రావిడులు. దక్షిణ భారతమే ద్రావిడుల జన్మస్థానమనీ, క్రమేణా వీరు ఉత్తర భారతానికి, అక్కడ నించి బెలూచిస్థాన్ ద్వారా పశ్చిమాసియా ప్రాంతాలకి వలసవెళ్ళి, తమ నాగరికతను దేశదేశాల్లో వ్యాపింపజేశారనీ, ఫాదర్ హేరాస్ తదితర చరిత్ర పండితులూ అభిప్రాయపడ్డారు. ఆర్య దండయాత్రల నాటికి, మనదేశంలో చాలా భాగాన్ని ద్రావిడులే ఆక్రమించివున్నారని వీరు భావిస్తున్నారు.

బెలూచిస్థాన్ - దక్షిణ పెర్షియాలలో సర్ ఆరెల్ స్టైయిన్ కొనసాగించిన పరిశోధనలు, సింధునాగరికతకీ ఈ దేశాల నాగరికతలకీ మధ్యనున్న పోలికల్ని నిరూపించాయి. మొహెంజొదారోలో వుపయోగించిన అనేకమైన ముద్రికలు(Seals) సుమేరియాలో గూడా కన్పించాయి. అడివిమేకల కొమ్ములూ, స్వస్తికా చిహ్నం లాంటి కామన్ లక్షణాలున్న మట్టికుండలూ, పెర్షియా -బెలూచిస్థాన్- మొహెంజొదారోల్లో లభించాయి. హరప్పా - సుమేరియా స్త్రీల శిరోజాలంకరణ పద్ధతుల్లో ఎంతో సన్నిహితమైన పోలికలున్నాయి. సింధులోయ, సుమేరియా, బాబిలన్ ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన మట్టిపాత్రలు, బెలూచిస్థాన్ దక్షిణ పెర్షియాల్లో గూడా లభించాయి. వీటి విశిష్ట లక్షణమేమంటే - కుండ చుట్టూ చిన్న చిన్న బుడుపు లుండడం. (Little knots all round the pot) అంతేగాదు- సింధుప్రజలకి నాటి మెసపొటేమియా ప్రజలతో అనేకమైన వాణిజ్య-సాంస్కృతిక సంబంధాలున్నాయనే విషయం నిర్వివాదమని చరిత్రకారులు ధ్రువీకరించారు.

ఆసియామైనర్ ప్రజలు, "మా" అనే దేవతను పూజించేవారు. మన కాళికాదేవి వాహనంలా, ఈమె వాహనం గూడా పెద్దపులియే. (వ్యాఘ్రవాహని) ఈమె భర్త వాహనం - వృషభం. (వృషభవాహనుడు - ఎద్దునెక్కే శివుడు)

మెసపొటేమియాలో "ఉర్" "నిప్పలార్" అనేపేరున్న గ్రామాలున్నాయి. అంచేతనే, మన ఊర్ల పేర్ల చివర ఈ "ఊరు" పదం కన్పిస్తుందని, భాషాతత్వవేత్తల నిశ్చితమైన అభిప్రాయం. (గుంటూరు - ఏలూరు వగైరాలు) సుమేరియా ప్రజల ఆరాధ్యదైవం-పర్వతదేవత. (పార్వతి-Lady of the Mount) ఈమె భర్త చంద్రుడు. వీరిద్దరికీ సుమేరియా ప్రజలు, ప్రతి ఏటా పెద్ద పెద్ద తిరనాళ్ళు జరిపేవారు. పశువుల పూజలు, నాగపూజ లాంటి రకరకాల పూజలు చేసేవారు. నర - జంతు కలిసిన దేవుడుకీ, (నరసింహుడు) గణపతి వంటి దేవతలకి వెంట్రుకలు ...ర్పించడం లాంటి ఆచారం, ఈజిప్ట్ - ఆసియామైనర్ - బాబిలోనియా ప్రాంతాల్లో వుండేది. తిరపతి వెంకన్నకీ తలనీలాలు అర్పించే నేటి ఆచారం, మెసపొటేమియాకి చెందిందని రాస్తే, మన హిందూమత పండిత ప్రకాండులకి ఆగ్రహం రావాల్సిన అవసరంలేదు. ఆసియామైనర్‌లో బయల్పడిన సమాధుల్లాంటివే, దక్షిణ భారతదేశంలోని ఆదిచ్చనల్లూర్ యిత్యాది ప్రదేశాల్లో సైతం బయల్పడ్డాయి.

ఆర్యులరాకకు పూర్వం భారతదేశంలో నివసించిన ద్రావిడ-మున్‌ఖ్మేర్ - యిత్యాది ప్రజలకీ, సుమేరియా ప్రజలకీ, అత్యంత సన్నిహిత సంబంధా

లుండేవనే విషయాన్ని నేడు చరిత్రకారులు రుజువు చేయగలిగారు. అంతేగాదు. హరప్పా – మొహంజదారోల్లోనూ, రాజస్థాన్‌లోని సరస్వతీనదీ గర్భంలోనూ చివరికి – మైసూర్‌లోనూ లభించిన ప్రాచీన నాగరికతా శిదిలావశేషాలను బట్టి, యావత్ దక్షిణభారతంలో ఆర్యులకు పూర్వమున్న నాగరికతలన్నీ ద్రావిడ సాంప్రదాయానికి చెందినవేనని మానుష శాస్త్రజ్ఞులూ (ఆంత్రొపాలజిస్టులు) పురాతత్వ వేత్తలూ, భాషాతత్వవేత్తలూ ఏకగ్రీవంగా అభిప్రాయపడుతోన్నారు. అంచేత, ఇంత వరకూ లభించిన వివిధ ఆధారాల్ని బట్టి, ద్రావిడ – సుమేరియా నాగరికతల మధ్య సన్నిహిత సంబంధాలుండే వన్న విషయం నిర్వివాదం. మానుష శాస్త్రజ్ఞుల్లో అగ్రగణ్యుడైన ప్రిన్స్ పీటర్, మన కొండ కోనల్లో నివసిస్తోన్న తోడాల జీవితాన్ని గూర్చి తీవ్రమైన పరిశోధనలు చేశాడు. తోడాలు అనుసరిస్తోన్న మతాచారాలు అధికాధికంగా సుమేరియా సాంప్రదాయానికి చెందినవేననీ, నేటికీ 11మంది సుమేరియా దేవతల్ని తోడాలు యథాతథంగా పూజిస్తోనే వున్నారనీ, ఆయన సోదాహరణంగా పేర్కొన్నాడు. పురాతత్వ శాస్త్రవేత్తలకు సుమేరియాలో దొరికిన పాత్రల్లాంటి కంచుపాత్రలనే, నేటికీ తోడాలు వుపయోగిస్తుండడం గమనించతగ్గ విశేషం.

సింధు నాగరికతకీ, మెసపొటేమియా – ఈజిప్టు నాగరికతలకీ మధ్య సంబంధ మున్నదనే విషయాన్ని, చరిత్రకారులంతా అంగీకరించారు. ప్రత్యేకంగా సింధు-మెసపొటేమియన్ నాగరికతలకి అత్యంత సన్నిహిత సంబంధా లున్నవనే అంశాన్ని నిర్వివాదంగా అంగీకరించారు. ఈ ఉభయ మతాలకి చెందిన దేవుళ్ళూ దేవతలకీ, పూజా విధానాలకీ మధ్య ఎన్నో పోలికలున్నాయి. శివ పార్వతులూ, లక్ష్మీ నారాయణులూ, వేర్వేరు పేర్లతో పిలవబడి, మెసపొటేమియాలో ఆరాధింపబడేవారు. అంతేగాదు – ద్రావిడ నాగరికతకి చెందిన దేవాలయపూజ, సుమేరియా నాగరికత లోంచి స్వీకరించబడ్డ అంశమే. అంతేగాదు – క్రీ. పూ. 2500 ప్రాంతంలో నిర్మించబడిన ఈజిప్టు పిరమిడ్లలో, దక్షిణభారతంలో మాత్రమే లభించే చందనమూ రాళ్ళూ కన్పించాయి.

మెసపొటేమియన్ దేవుడైన "ఎన్‌లిల్"ను, కృష్ణకేశుల రక్షకుడు – అని సుమేరియా సాహిత్యంలో వర్ణించారు. సుమేరియన్లకి నిగనిగలాడే నల్లని వెంట్రుకలుండేవి. తాము కృష్ణకేశులమని వారు గర్వంగా చెప్పుకొనేవారు. ద్రావిడ-ఆదివాసి ప్రజలకు గూడా నల్లని వెంట్రుక లుండేవి. రుగ్వేద కవులు వీరిని "కృష్ణ కేశులు" "కృష్ణచర్మలు" అనే పేరిట ఈసడించిన భాగాలు, రుగ్వేదంలోనే మనకు చాలా చోట్ల కన్పిస్తాయి.

మెసపొటేమియన్ల జలప్రళయం :
హిందువుల మహాలయం

నలభయి రోజుల పాటు రాత్రింబవళ్ళూ వర్షం కురిసిందని చెప్పే జల ప్రళయం గాధను గూర్చి, బైబిల్‌లో ప్రస్తావించబడింది. ఆ జలప్రళయం వల్ల సమస్త జీవరాశులు నశించకుండా వుండేందుకు, నోవా అనే దైవభక్తుడు జీవాల్లోని వొక్కో జంటను (ఆడా-మగ) పడవలో కెక్కించి, నీటిపై తేలుకుంటూ "అరారత్" పర్వత శిఖరంపైకి చేరాడనీ, వరద తగ్గిన తర్వాత ఈ జీవాల జంటలు భూమ్మీద కొచ్చి, మళ్ళీ సంతానాన్ని తామరతంపరలా వృద్ధిజేశాయనీ, బైబిల్ లోని కథద్వారా తెలుస్తోంది. సరీగ్గా యిలాంటి గాథే- మెసపొటేమియన్ పురాణంలో గూడా వుంది. బైబిల్‌లోని దైవభక్తుడు-నోవా. మెసపొటేమియన్ పురాణంలోని దైవభక్తుడు-ఉట్నా పిష్టిం.

మెసపొటేమియన్ పౌరాణిక సాహిత్యంలో చెప్పబడిన కథలాంటిదే, మన శతపథ బ్రాహ్మణంలో సైతమ్ముంది. సప్తసముద్రాలూ ఏకమై సమస్త జగత్తునూ జలమయం చేసినప్పుడు, నోవా వలెనే మన మనువుగూడా జీవరాసుల జంటల్ని, వొక పడవలో కెక్కించుకొని, కొండ శిఖరంపై జేరాడు. ఎన్నో రోజుల తర్వాత వరద తగ్గింది. కాని భూమ్మీద కాలు పెట్టాలంటే, పుణ్యాహవచనం చెప్పవలసిన పురోహితుడు అవసరమయ్యాడు. కనుచూపుమేరలో ఏ ఆర్య బ్రాహ్మడూ కన్పించ లేదు. చివరికి అతడు వొక "అసుర బ్రాహ్మడి"ద్వారా మంత్రాలు చదివించుకొని, నేలమీద కాలు పెట్టినట్లు శతపథ బ్రాహ్మణం చెబుతోంది. ఈ జలప్రళయమే-నేడు మన వైదిక పురోహితులచే మహాలయమనీ-మహాలయ అమావాస్య అనీ - పిలవ బడుతోంది.

ఈ రకరకాల పోలికల్ని బట్టి చూస్తే, ఈ జలప్రళయ గాధ, మెసపొ టేమియన్ పురాణం లోంచి బైబిల్‌కి వెళ్ళినట్లే, అసురులని (రాక్షసులని) పిలవ బడిన నాటి ద్రావిడులనించి-సింధు నాగరికత నించి- శతపథ బ్రాహ్మణంలోకి సరా సరి దిగుమతి అయివుండాలి. సింధు నాగరికతలో ప్రస్తావించబడిన అసురులకీ, నాటి వైదికార్యులకీ మధ్య ఖచ్చితమైన సంబంధాలున్నాయనే విషయం చారిత్రక సత్యం. అథర్వణ వేదంలోనే "ఆసురీ గాయత్రి," "ఆస్య త్రిష్టుప్" లాంటి అసుర ఛందస్సులున్నాయి.

సుమేరియన్-హిందూ-దేవుళ్ళు

సుమేరియన్ల ఇష్టదైవం- వొక పర్వతాధిష్టాన దేవత. (కొండదేవత) సుమేరియన్ల కొండదేవతకీ (Lady of the Mount) హిందువుల పార్వతికీ చాలా దగ్గర పోలికలున్నట్లే, సుమేరియన్ల దేవతలకీ సింధునాగరికతకి చెందిన ఈ దేవతలకీ మధ్య ఎన్నో పోలికలు కానవొస్తాయి. అంతేగాదు, సింధు నాగరికతకి చెందిన ఈ దేవతలూ- దేవుళ్ళే, అనంతర దశలో పేర్ల మార్పుతో, హిందూమతం లోకి సరాసరి పరకాయ ప్రవేశం చేశారు. చూడండి;

మెసపొటేమియన్ దేవుళ్ళు	హిందూ దేవుళ్ళు
అణు	దేవేంద్రుడు
షమాష్	సూర్యభగవానుడు
అదార్	కాలభైరవుడు
నబూ	యమలోకంలోని చిత్రగుప్తుడు
ఎరిష్కిగాల్ (నరకాధిపత్యం వహించే దేవత)	యమధర్మరాజు
ఇస్తార్	మహామాత-అమ్మతల్లి
తామూజ్	మన్మధుడు

(ఈతామూజ్, ఈజిప్టులో ఓసిరిస్‌గా, ఫైరిజియాలో ఆట్టిస్‌టిస్‌గా, గ్రీసు-ఫొనీషియా దేశాల్లో అడోనిస్‌గా అయ్యాడు. ఇండియాలో రంకుముండల దేవుడుగా అవతరించాడు. పేర్లుమారినా లక్షణాలన్నీ వొక్కటే.)

హిందూ దేవతల్లో దుర్గ వుంది. ఈమె ప్రతిబింబమో-కాక-ఈమె మూలరూపమో అయిన "ఉర్-అన్నా" (ur-anna) మెసపొటేమియాలోగూడా వుంది. ఈమెయే సుమేరియన్ల కొండదేవత. ఈమెకీ హిమవంతుని పుత్రికయైన పార్వతికీ కొన్నిపోలికలు కన్పిస్తాయి. పార్వతిని గిరిజ, హిమగిరి తనయ, అని పిలవడం మనకు తెలిసిన విషయమే.

ఈజిప్ట్ - సుమేరియన్ - హిందూ - పూజారులు

నేటి హిందూ బ్రాహ్మల్లా, నాటి ఈజిప్ట్ దేవాలయ పూజారులు అసాధారణమైన అధికారాలు కలిగియుండేవారు. కొన్ని సందర్భాల్లో వీరు ఫేరోల్ని సైతం శాసించగలిగారు. సుమేరియన్ మత గురువులు గూడా, ఇజిప్షియన్ మతగురువుల్లా హద్దూ పద్దూ లేని అధికారం చలాయించేవారు.

బ్రాహ్మణ పూజారి ఈనాడు గుడిలో ఏరకమైన విధులు నిర్వహిస్తున్నాడో, సరీగ్గా అదే విధమైన విధుల్ని ఆనాడు ఈజిప్ట్ పూజారి సైతం నిర్వహించేవాడు. ప్రాతఃకాలాన దేవుణ్ణి మేల్కొల్పడం, దేవుడికి నైవేద్యం పెట్టి పట్టబట్టల్తో సింగారించడం, రాత్రికి పవళింపు సేవ జేసి దేవుడిని బజ్జోపెట్టడం లాంటి విధుల్నే, నాటి యీజిప్ట్ పూజారి గూడా నిర్వహించేవాడు.

మంత్రపుష్పం

సృష్టిరహస్యం గూర్చి చెప్పే హిందువుల మంత్రపుష్పం వంటి శ్లోకానికి, మెసపొటేమియా మత సాహిత్యంలో మౌలికమైన బీజాలు కన్పిస్తాయి. ఈ మంత్ర పుష్పం ప్రకారం, సమస్త దేవ గణాధిపతియైన మర్దుక్‌ను, మిగతా దేవతలంతా కలిసి, సహస్రనామ స్తోత్రంలో వలె, వేయి విధాల స్తుతిస్తారు. దేవదేవుడు, పరిశుద్ధ దేవుడు, ఆపదోద్ధారకుడు, సృష్టికర్త, దేవప్రాణత్రాత, ప్రాణవాయు ప్రదాత, కృపా నిధి, అమేయ గుణ సంపన్నుడు, నిగ్రహానుగ్రహ దక్షుడు, అణిమాద్యష్ట సిద్ధులు గలవాడు, తృణాన్ని మేరువుగా రూపొందించగల సమర్థుడు- అని అతని గుణగణ వర్ణనల్తో దండకం వల్లించారు. చివరికి విశ్వప్రభుడూ, చతుర్దశ భువనాలకు సృష్టి కర్త అని గూడా ప్రశంసించారు:

7. ఆర్య - ద్రావిడ మతాల కలయిక

గెలిచిన జాతి యొక్క దేవుళ్ళు, ఓడిన జాతి యొక్క దేవుళ్ళ పుత్రులుగా మారుతుండడం, అన్ని మతాల దేవుళ్ళకీ సాధారణంగా వర్తించే సూత్రం. ఈ రకమైన వడపోత విధాన ఫలితంగానే, అతి ప్రాచీనమైన ద్రావిడ — ఆదివాసుల దేవుళ్ళు, క్రమేణా హిందూ దేవుళ్ళుగా మారి ఆ మతంలో కలిసిపోవడం, తత్ఫలితంగా ఆర్య- అనార్య దేవుళ్ళ కలయిక ద్వారా, సంకరదేవుళ్ళ మతంగా- హిందూ మతం పరిణామం జెందడం జరిగింది. ఈ విషయం మనకు భగవద్గీతలో స్పష్టంగా కానవొస్తుంది. దీన్ని గూర్చి వ్యాఖ్యానిస్తూ ప్రొఫెసర్ కొశాంబి యిలా అన్నాడు:
'Later on the fusion of cults led to the merger of two entirely different forms of society'(Myth aud Reality - page - 71)


మాతృస్వామిక వ్యవస్థకి చెందిన దేవతల్ని, పితృస్వామిక వ్యవస్థకి చెందిన దేవుళ్ళకి పెళ్ళి జేయడం ద్వారా, వొక మిశ్రమసమాజం ఆవిర్భవించింది. ఈ ఉభయ వ్యవస్థలకి చెందిన ఆస్తి విధానాల మధ్యనున్న విభేదాలు పరిష్కరింపబడడం ద్వారా ఉత్పత్తి అధికం గావడానికి గూడా దోహదం కలుగజేసింది. ప్రప్రథమ దశలో అత్యంత నగ్నమైన దౌర్జన్యకాండ పైనే ఆధారపడ్డ పైదికార్యులు, క్రమేణా అనార్యజాతులతోనూ ఆదివాసులతోనూ కలిసి జీవించడం, గత్యంతరంలేని చారిత్రక అవసరంగా పరిణమించింది. ఆటవిక తెగలకి చెందిన అత్యంత ప్రాచీన దైవతాలూ, వారి మత చిహ్నాలూ (ఎద్దు - గద్ద- ఎలుక- నెమలి- ఏనుగు - యిత్యాదులు) శివ-విష్ణువుల పరివారంలో అంతర్గత భాగంగా, వారి వారి వాహనాలుగా కుమారులుగా చేయబడ్డంద్వారా, ఆర్య-అనార్య మతాలు మిశ్రమం గావడానికి అవకాశం కల్గింది. (వినాయకుడి వాహనం ఎలుక; సుబ్రమణ్యేశ్వరుని వాహనం నెమలి; శివుని వాహనం ఎద్దు; విష్ణువు వాహనం గద్ద) ఈ విధంగా మిశ్రమం గావడానికి అంగీక

రించకపోతే, సర్వనాశనానికి గానీ, ఆజన్మాంత బానిసత్వానికి గానీ, సిద్ధపడాల్సి వుంటుంది. ఇది జరగకుండా మధ్యే మార్గంగా ఈ మిశ్రమ పద్ధతి అవలంబించ బడింది. ఇందుకు గీతలోని రాజీ ధోరణియే ఎదురులేని సాక్ష్యం.

ఎద్దు నెక్కు శివుడు - గద్ద నెక్కు విష్ణువు

శివుని మెడలో నాగుబామును ఆభరణంగా అలంకరించడం ద్వారా, అత్యంత ప్రాచీనకాలంలో విశేషవ్యాప్తిలో వున్న నాగపూజను, అనంతర హిందూమతంలో లీనం జేసివేయడం జరిగింది. ఆదిశేషుని శయ్యపై విష్ణువును పండుకోబెట్టడం ద్వారా, ఈ నాగపూజను హిందూమతంలో లీనం జేసివేశారు. శివుణ్ణి- నాగభూషణుడు అనీ, విష్ణువును-శేషశాయి అనీ పిలవడం మనందరికీ తెలిసిన విషయమే: ఎద్దు మీద యెక్కే శివుడు సృష్టించబడడానికి పూర్వమే, రాతియుగం (Stone age) నాటి ఆటవిక ప్రజలచే ఎద్దు (నంది) పూజించబడింది. ఈ విధంగా మన దేవుళ్ళ ఆభరణాలూ, వారి వాహనాలూ, (ఎద్దుపై శివుడు - గద్దపై విష్ణువు) వారి పెళ్ళాల పుట్టు పూర్వోత్తరాల్ని నిశితంగా పరిశీలిస్తే, ఆర్యుల రాకకి పూర్వమే ఇండియాలో వున్న మత సంకేతాలూ (Totems) విభిన్నమైన పూజావిధానాలూ మిశ్రమమై, హిందూమతం పేరిట వొక బ్రహ్మాండమైన సంకరమతం ఆవిర్భవించింది.

వేదాల్లో విష్ణువే కన్పిస్తాడు గాని, "నారాయణ" అనేవాడు లేనేలేడు. "నారాయణ" అనే శబ్దానికి "ప్రవహించే నీటిపై (నార) నిద్రించేవాడు" అని అర్థం. మెసపొటేమియన్ దేవుడైన 'ఎంకి' నీటిమధ్యలో వున్న భవనంలో నిద్రిస్తోన్నట్లు గా చిత్రించబడ్డాడు. ఈ విధమైన సుమేరియన్ పురాణ గాథయే గాక, అనేకమైన సుమేరియన్ మట్టి పలకలుగూడా ఈ విషయాన్ని ధృవీకరించాయి.



నీటిపై నిద్రిస్తోన్న నారాయణుడు

అంచేత, శేషశాయిపై పవళించి, నీటిలో నిద్రించే మన విష్ణుమూర్తి యొక్క వాస్తవరూపం, మెసపొటేమియా పురాణగాధకి చెందిన "ఎంకి" దేవునిలో కన్పిస్తుంది: అంచేత, ఈ నారాయణుడు నేరుగా సుమేరియా నించి సరాసరి హిందూ పురాణాల్లోకి దిగుమతి జేయబడిన విదేశీ దేవుడు:



జలములు (Waters) అనే బహువచన రూపమైన ఈ "నారా" శబ్దం, ఇండో - ఆర్యన్ భాషకి చెందింది గాదు. ఈ పదమూ, ఇందుకు సంబంధించిన దేవుడూ, సింధు నాగరికతకి చెందినవి. ("Both the word and the god might conceivably go back to the Indus Valley." మిత్ అండ్ రియాలిటి -పేజి 21) ఈ పురాణగాధను సరఫరా జేసిన అనార్య తెగలూ, అనంతరం వొచ్చిన ఆర్య తెగలూ మిశ్రమం గావడం ఆలస్యంగా జరిగినందువల్లనే, సంస్కృత భాషలో ఈ "నారా" శబ్దం ఆలస్యంగా చోటు చేసుకొంది.

నీటితో చుట్టబడిన భవనంలో నిద్రిస్తోన్న "ఎంకి"

రామాయణ-భారత-భాగవతాది ఇతిహాసాల్లోనూ, అష్టాదశ పురాణాల్లోనూ లేని "సత్య-నారాయణ" (True-Narayana) అనే దేవుణ్ణి: కనీసం 200 ఏళ్ళ క్రితం గూడా లేని ఈ దేవుణ్ణి, వైదిక పురోహితులు తమ కల్పనా చాతుర్యంతో సృష్టించారు. అలాగే ఏ ఇతిహాసంలోనూ, మరే పురాణంలోనూ లేని వెంకటేశ్వరుడనే గుండుగొరుగుడు దేవుణ్ణి సైతం, తమ అపూర్వ భావనా బలంతో ఈ పురోహితులే సృష్టించారు:

దశావతారాలు

మెసపొటేమియా పురాణం లోని జలప్రళయ గాధకీ, సృష్టిగాధకీ, హిందూ దశావతారాలకి చెందిన మత్స్య-కూర్మ-వరాహ- అవతారాలకీ సంబంధముంది.



స్త్రీ - పురుష మత్స్యాలు

మత్స్య-కూర్మ-వరాహ-అవతారాలు మూడూ, ఆటవిక మత సంకేతాలకి చెందిన పూజా విధానానికి సంబంధించినట్టివే. మెసపొటేమియాకి చెందిన వొక ముద్రికపై (Seal) పురుషమత్స్యమూ, స్త్రీమత్స్యమూ (Merman and Mermaid) చిత్రించబడ్డాయి. ఇదే-మన మత్స్యావతారానికి మూలరూపంగా భావింపబడుతోంది.

విభిన్న మత సంకేతాలు (Totems) గల విభిన్న జాతుల ప్రజలు మిశ్రమమైనప్పుడు, ఈ విభిన్న మత సంకేతాలన్నీ కలిసి, కొత్తదేవుళ్ళ సృష్టికి దోవతీస్తాయి. ఉదాహరణకి - వొక సింధు ముద్రికపై నర-వ్యాఘ్రం వున్న బొమ్మ వుంది. ఇది సింధుప్రజల మతచిహ్నం. ఈ చిహ్నమే-అనంతర హిందూమతంలో నర-సింహంగా పరిణామం చెందింది. త్రిమూర్తుల్లో వొకడైన విష్ణువు యెత్తిన అవతారాల్లో నరసింహావతారం వొకటి అనేది పాఠకులకు తెలిసిన విషయమే.



సింధు నర-వ్యాఘ్రం



హిందూ నర-సింహం

"సమాజంలో దేవతలు పలు విధ స్వరూపాలతో చలామణీ అవుతున్నారు. ఇందులో ఏ దేవతను నీ స్వరూపంగా గుర్తించి ధ్యానించమంటావు ?" అని అర్జునుడు కృష్ణుణ్ణి ప్రశ్నిస్తాడు. (గీత-10వ అధ్యాయం-17వ శ్లోకం)

"నా స్వరూపాలకి అంతు అంటూ వుండబోదు" అని కృష్ణుడు జవాబిచ్చి, అలాంటి 88 స్వరూపాల పేర్లను భగవద్గీతలో కృష్ణుడు ఉదహరించాడు. (10వ అధ్యా-10 నుండి 41వ శ్లోకం) తన స్వరూపాలకి చెందిన వాటిలో, పశు పక్ష్యాదులూ, ద్రావిడ- ఆదిమజాతుల దేవతా స్వరూపాలైన చెట్లూ నదీజలాలూ యిత్యాది ఆరాధ్య దైవాల్ని గూడా కలిపి పేర్కొనడం, వైదిక దైవతాలైన ఇంద్ర-అగ్ని-వరుణ - కుబేర - యిత్యాదుల్ని గూడా అదే స్థాయిలో పేర్కొనడం జరిగింది. ఈ విధంగా మహాభారత అనంతరదశకి వొచ్చేప్పటికి, వైదికార్య దేవతలతో పాటు ఆదిమజాతుల దేవతల్ని గూడా నాటి ప్రజలు సమాన ఫాయిలోనే పూజించేవారనే విషయం స్పష్టమవుతోంది.

ఇందుకు గీత నుండే ఖచ్చితమైన ఆధారాలు చూపవొచ్చు. సమాజంలో దేవతలు సృష్టింపబడి, ఆ దేవతలపై నమ్మకం కుదిరి, వారి ప్రభావం ఆ ప్రజలపై

కొన్ని శతాబ్దాలుగా వుంటున్నపుడు, ఆ దేవతలపై వున్న ప్రగాఢమైన విశ్వాసాన్ని వొదులుకొని, వారికి బదులు మరో జాతి దేవతల్ని పూజించాలంటే, ప్రజల అంగీకారం అంతసులభంగా లభ్యంగాదు. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొనే, వారి వారి యిష్టప్రకారం, వారి వారి ఆరాధ్య దేవతల్ని పూజించినా, ఆయారూపాల్లో వున్న దేవతల ద్వారా, ఫలితాన్ని యిచ్చేది తానే నని కృష్ణుడు అన్నాడు. "ఎవరైతే యితర దేవుళ్ళను శ్రద్ధగా పూజిస్తున్నారో, వారు నా స్వరూపాన్ని గుర్తించలేక పోయినప్పటికీ, వారు నన్నే భజిస్తోన్నారు. దేవతల్ని పూజించువారు-దేవలోకాన్ని, పితరులను పూజించువారు- పితృలోకాన్ని, భూత ప్రేతాల్ని పూజించువారు-ఆయా లోకాల్ని పొందుతారు. నన్ను పూజించువారు నన్నే పొందగలరు" అని కృష్ణుడు అన్నాడు. (గీత-9వ అధ్యాయం-23 నుండి 25వ శ్లోకం) భూత ప్రేతాల్ని పూజించే ద్రావిడులు-నాగులు-యిత్యాది ఆదిమ అనార్య జాతుల ప్రజలు, యీ సందర్భంలో ధ్వనించటం ప్రత్యేకంగా గమనార్హం.

ఈ విధంగా పంచకూళ్ళ కషాయం లాంటి నానా రకాల - నానా జాతుల-దేవతల్ని దేవుళ్ళనీ పూజించే విధానాన్ని, బ్రహ్మాండమైన తాత్విక పరిభాషలో, "అనేకత్వంలో ఏకత్వమూ, ఏకత్వంలో అనేకత్వము" అని, ఫిలాసఫీ గ్రంధాల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ దగ్గర నుండి నేటి యూనివర్సిటీ ప్రొఫెసర్ల దాకా నిరంతరాయంగా బాకా లూదుతోంటారు.

త్రిమూర్తుల్లో వొకడుగా శివుడు మారడం

అత్యంత ప్రాచీన కాలానికి జెందిన లింగపూజ లోంచి ఉద్భవించినవాడే శివుడు. మొహెంజొదారో ఫలకాలపై మూడు ముఖాలున్న నగ్నమైన దేవుడు కన్పిస్తాడు. నెత్తిపై దున్నపోతు కొమ్ములున్న ఈతడే - శివునికి మూలరూపమై వుంటాడని ప్రొఫెసర్ కొశాంబి అన్నాడు. అయితే, ఈ మూడు ముఖాల దేవుడే-అనంతర హిందూమతం లోని త్రిమూర్తుల అవతరణకి కారణమై వుంటాడని నేను భావిస్తోన్నాను. ఆటవిక తెగల పూజా విధానానికి చెందినవాడే-శివుడు. ఈతడు-నటరాజు; నాట్యం జేస్తాడు. ఆటవిక సమాజానికి చెందిన మాంత్రిక - వైద్యుడే శివుడు. ఈ మాంత్రిక-వైద్యునియొక్క- నాటి నాట్యమే, శివుని నటరాజ తాండవంగా, అనంతర హిందూమత గ్రంధాల్లో చోటు చేసుకొంది. ఆర్య-ద్రావిడ మతాల కలయిక జరిగిన దశలోనే, ద్రావిడ దేవుడైన శివుడు, ఆర్య దేవుళ్ళతో కలిసి, చివరికి హిందూమతానికి చెందిన త్రిమూర్తుల్లో వొకడుగా మారడం జరిగివుండాలి. విభిన్న సంస్కృతులకి చెందిన ఆర్య-అనార్య జాతులు సమ్మిశ్రితమైనప్పుడే, ఈ రెండు జాతులకీ చెందిన

మతాలూ, ఆ మతాల దేవుళ్ళూ త్రిమూర్తులుగా అవతరించడానికీ, వైదికమతం హిందూమతంగా పరిణామం చెందడానికి అవకాశముంటుంది.

ఈ కొత్త మతం ప్రజలచే అనుసరింపబడ్డానికి ప్రధానంగా రెండు టెక్నిక్‌లను వినియోగించారు : 1. స్త్రీ-పురుష దేవతల్ని వొకే ఆకారంగా కలగలిపివేయడం. 2. విభిన్న మతాలకి చెందిన సంకేతాల్ని మిశ్రమం జేసి వొకే దేవుణ్ణి సృష్టించడం. మొదటి టెక్నిక్ ప్రకారం ఉనికిలోకి వొచ్చిందే "అర్ధనారీశ్వర" రూపం : శివుడు- సగం పురుష ఆకారంగా, సగం పార్వతి ఆకారంగా మిశ్రమం కాగా వొచ్చిన సంకరరూపమే- ఈ అర్ధనారీశ్వర రూపం. ఈ విధంగా యీ స్త్రీ-పురుష దేవతల్ని మిశ్రమం జేయడం ద్వారా, (ఈ యిద్దరికీ పెళ్ళి జేయడం ద్వారా) ఈ ఉభయ మతాలకి చెందిన ప్రజలూ, వొకే దేవతా స్వరూపాన్ని పూజించడానికి వీలు కలిగింది:

అర్ధనారీశ్వరుడు




జీవశాస్త్ర (బయాలజీ) పరిభాషలో చెప్పాలంటే, స్త్రీ-పురుష లక్షణాలు గల్గిన Hermaphrodite దేవుణ్ణి హిందూ పురోహితులు సృష్టించగల్గారు: స్త్రీ-పురుష లక్షణాలున్న వానపామును, బయాలజీలో హెర్మ్ ఫ్రోడైట్ అని పిలుస్తారు. అంటే త్రిమూర్తుల్లో వొకడైన అర్ధనారీశ్వరుడు (శివుడు) జీవశాస్త్రం లోని వానపాముతో సరిసమాన మన్నమాట:

స్వామీ అయ్యప్ప జననం

అంతేగాదు- ఈ విధమైన టెక్నిక్ ద్వారానే, శైవ-వైష్ణవ దేవతా రూపాల సంకర స్వరూపమైన -హరిహరనాధుణ్ణి-సైతం హిందూ పురోహితులు సృష్టించి,

శైవ–వైష్ణవ మతస్తులిద్దరూ వొకే దేవుణ్ణి పూజించడానికి అవకాశం కల్పించారు.

ఇదే విధంగా ఏ ను గు తలా– మనిషి మొండెం కలగలిపి, వినాయకుడనే పేరిట వొక దే వు ణ్ణి సృష్టించారు!



వి నా య కు డు


సాధారణంగా స్త్రీ–పు రు షు ల కలయిక ద్వారానే బి డ్డ లు పుడ తా రు. కాని స్వా మీ అ య్య ప్ప మా త్రం అలాపుట్టలేదు. విష్ణువూ–శివుడూ – కలిసి సెక్స్ కో లా ట ం వేయగా జన్మిం చి న వా డే ఈ స్వా మీ అ య్య ప్ప! ఆడా–మగకిపుట్టినవారికి సా ధా ర ణ శ క్తు లు మా త్రమే వుంటాయి. కాని యిద్దరు పురుషుల కామకోలాటం ఫలితంగా జన్మించిన ఈ స్వామీ అయ్యప్పకి అసాధారణ శక్తులుంటాయి కామోసు!

హరిహరనాధుడు

సగం విష్ణువూ–సగం శివుడూ మిశ్రమం చేయబడగా తయారైన సంకర దేవుడే–హరిహరనాధుడు! ఈ కొత్త దేవుడే మహాకవి తిక్కన కలలోకి వొచ్చి, మిగిలిపోయిన తెలుగు భారతాన్ని పూర్తిచేయమని చెప్పాడట! అయితే, ఈ కట్టుకధకీ, ఈ పుక్కిటి పురాణానికీ వెనక చాలా బలమైన కారణాలున్నాయి.

శివాలయంలో మోగే గంటను విన్న వైష్ణవుడు, సరాసరి రౌరవాది నరకానికి వెళ్తాడని వైష్ణవమతస్తులు శాపనార్ధాలు పెట్టారు. ఇదే శాపనార్ధాల్ని శైవభక్తులూ విష్ణుభక్తులకి వ్యతిరేకంగా పెట్టారు. "గద్ద నెక్కు విష్ణువు"– అని శైవులు ఎద్దేన జేయగా, "ఎద్దు నెక్కు శివుడు" – అని వైష్ణవులు గేలి జేశారు. మా శివుడు

గొప్పవాడని శైవులనగా, మా విష్ణువు గొప్పవాడని వైష్ణవులన్నారు. "మీ శివుడు బూడిద పూసుకొని వల్ల కాటిలో నివాసముంటా"డని వైష్ణవులనగా, "మీ విష్ణువు పేలాది రంకుముండలో (గోపికలతో) రాసక్రీడలాడే పచ్చివ్యభిచారి"యని శైవులు తిట్టారు. ఈ తిట్లతోనే ముగియక, కొట్లాటదాకా వెళ్ళి, వొహరి పీకలు మరొహరు కోసుకొని, వొకరి దేవుడి విగ్రహాన్ని మరొకరు బద్దల గొట్టి, మొత్తం శైవ - వైష్ణవ దేవతా విగ్రహాలన్నీ ఈ ఉభయుల చేతుల ద్వారా


హరిహరనాధుడు


ముక్కముక్కలకింద కొట్టబడ్డాయి ! ఈ విధంగా యీ ఉభయ మతస్తుల మధ్య రగిలిన భయంకర మత వైషమ్యాన్ని చల్లార్చడానికి, ఈ ఇద్దరు దేవుళ్ళనీ వొకే ధేవుడుగా సృష్టించి- "శివాయ విష్ణు రూపాయ॥ విష్ణు రూపాయ శివయే" అనే కొత్త సూత్రం ద్వారా ప్రచారం జేశారు. ఈ విధంగా శైవ - వైష్ణవ మతశాఖల మధ్య ఐకమత్యాన్ని సాధించడానికి ఈ సంకర దేవుడు వొక సాధనంగా వినియోగింప బడ్డాడు.

అంచేత, సంకర జాతి జొన్నలా, కొత్త వరివంగడంలా, హిందూమతం అనేకానేక మతరీతుల మిశ్రమం. ఈ మతం ఎంతటి "విశాలమైన" దంటే, అవసర మొస్తే నాగజాతికి చెందిన నాగుబాములేగాదు- నవాబుల్ని గూడా కొండచిలవలా అమాంతం మింగివేసి, అలాగ్గా జీర్ణం జేసుకోగలదు. ఆ విధంగా మింగివేసిన ముసల్మానుల్ని "ముసిలి మానులు" గానూ జేయగలదు. వైదికమత బద్ధ శత్రువైన బుద్ధుణ్ణే, దశావతారాల జాబితాలో కెక్కించగా, చిన్నా చితకా లాంటి పనులు వొక లెక్కా - జమా ?!

8. భారతీయ జీవితంపై సింధు నాగరికత ప్రభావం

సింధు ప్రజలు-దేవుని పురుష భాగాన్ని, లింగరూపంలో భావించి పూజించారు. అంచేతనే యీనాటికీ ప్రతి శివాలయంలోనూ, పానవట్టంలో వున్న లింగాకారాన్ని దేవునిగా యెంచి పూజించడం మనం చూస్తున్నాం.

అయితే యీ లింగపూజ, నిన్నా మొన్నటిది మాత్రం కాదు. వేల సంవత్సరాల నించి పాఁఁం పర్యంగా దేశ కాలావధుల్ని దాటి వొ చ్చి ం ది. సింధు శిధిలాల్ని తవ్వినప్పుడు, శివలింగాల్ని పోలిన లి ం గా లు వేలాదిగా దొరికాయని గతంలోనే చూశాము. వీటితోపాటు జీవకోటి ఉత్పత్తికి (పుట్టుకకి) మూలముగా యెంచబడిన ఫలప్రదాయిని యైన పంటదేవత- మహామాత-యొక్క చిత్ర ఫలకాలుసై తం లభించాయి. అంతేగాక, ఏనుగు - పెద్దపులి - వృషభం-ఖడ్గమృగాలచేపరివేష్టింప బడి, యోగముద్రాంకితుడై న పశు



శివలింగం

పతి (శివుడు) సింధు ఫలకాలపై కన్పించాడు. ఈ విధంగా కన్పించిన ఈ లింగాలూ, ఈ మహామాత, ఈ పశుపతీ, పార్వతీ - పరమేశ్వరులుగా మారి, శైవమతంగా

పరిణామం చెంది, పార్వతిని - పానవట్టంగా (యోనిగా) శివుని - లింగాకారంగా పూజించడం జరిగింది. అంచేత, యీ లింగపూజ ఆర్యులది మాత్రం ఎన్నటికీ కాదు. పుట్టించేవాడు గాబట్టి, దేవుడు - పురుష లింగానికీ; సమస్త ఫల పుష్పతరు లతా గుల్మాదులు, భూమినుండే జనిస్తాయి గాబట్టి, భూమి-స్త్రీ అంగానికీ (యోనికి) ప్రాతినిధ్యంగా యెంచి నాటి సింధు ప్రజలు పూజించారు.

లింగపూజ

అనంతర దశలో, ఆర్య-ద్రావిడ మతాల సమ్మేళన ఫలితంగా త్రిమూర్తులు ఉనికిలోకి వొచ్చారు. వారిలో వొకడైన శివుని - పానవట్టంలో వున్న లింగాకారంగా - సాక్షాత్ భగవత్ స్వరూపంగా - యెంచి పూజించారు. లింగపూజకి చెందిన ఐతిహాసిక గాధ, శివపురాణంలోనూ, శివభక్త దురంధరుడైన శ్రీనాథుడు రచించిన "హరవిలాసం"లోనూ, స్పష్టంగా చెప్పబడింది. అయితే, పండితులు హరవిలాసంలోని యీ క్రింద ఉదహరింపబడిన భాగాన్ని, బూతు అనే భావంతో పూర్తిగా ఎత్తివేశారు: ఆ భాగం యిది: దారుకావనం లోని మునుల భార్యల్ని చూసిన శివుడు, వారిని మోహించి, వారితో సంభోగిస్తోన్నాడు. ఈ విషయం తెలిసిన మహారుషులకు ఒళ్లు మండి, శివునిపై కోపించి, ప్రతీకారం చేయాలని తలపెట్టారు. ఈ సంగతి గ్రహించిన పరమ శివుడు, వారిపై ఆగ్రహించి, తన లింగాన్ని అమాంతం నిగుడించి, దానితో రుషుల తలలూ మెడలూ అణిచివేసి, చెవుల్లో దోపి, ముఖాలూ ముక్కులూ నొక్కి, వీపులు చరిచి, పళ్లు రాలగొట్టి, ఆకాశం దాకా దాన్ని బ్రహ్మాండంగా పెంచివేశాడు: భయకంపితులైన మునులూ దేవతలూ, ఆ మహాలింగానికి తలలు వొంచి ప్రొక్కారు. సృష్టికర్తయైన బ్రహ్మ, దానికి భక్తిపూర్వకంగా అభిషేకంజేసి, స్తోత్రంజేసి, ఆ లింగాన్ని ముడవమని శివుణ్ణి ప్రార్థించాడు. అప్పుడు శివుడు పకపక నవ్వి, స్త్రీ పురుషులకీ - రుషులూ దేవతలకీ - యావత్ ప్రజానీకానికీ - తన అనుపమ దివ్యలింగాన్ని, ఆరాధన కర్హమైనదిగా ప్రసాదించాడు. ఈ విధంగా లింగపూజ ఉనికిలోకి వొచ్చిందని హిందూపురాణాలు చెప్పాయి. ఈ విషయాన్ని శ్రీనాథ కవిసార్వభౌముడు ఈ క్రింది విధంగా వర్ణించాడు;

"అట్లు పరమ ధూర్తవర్తనంబునం బ్రవర్తిల్లు నయ్యష్టమూర్తి ... కట్టిన కౌపీనంబు (గోసి) దొలంగవైచి, మదనధ్వజ దండంబు (లింగం) నిగుడించి, యమ్మహనీయ సాధనంబున, నమ్మహీసురోత్తముల(రుషుల) యుత్తమాంగంబు....

మొడ కడత లడంచియు, జెవ్వల కొడంక లొత్తియు, మొగంబులు ముక్కులు నొక్కియు, బరులు వ్రేసియు, వీపులు చరచియు, పండ్లు రాల్చియు, నురంబులు రాచియు, ద్రికంబులు దాకించియు, జంఘలు పొడిచియు, జానువులు తాటించియు, ఒడలు సరచియు, యూర్చి పేర్చి, యమ్మహాలింగంబు నింగి దాకం బెరిగించి..... బ్రహ్మాండ కర్పరం బప్పళింప జేసిన....

సుర గరుడ ఖచర విద్యా
ధర కిన్నర సిద్ధ సాధ్య దానవ ముఖ్యుల్
పురహరుడు చాచిపట్టిన
యురు లింగంబునకు మ్రొక్కి యురుతర భక్తిన్.

బ్రహ్మ....యమ్మహాలింగంబునకు.... నభిషేకం బాపాదించి, "జయ జయ శివలింగ, జ్యోతిర్మహాలింగ, లింగోద్భవ శ్రీమహాలింగ, వేదత్రయీ లింగ, నిర్లింగ, ...సారంగ లింగాత్మ భూలింగ, ఐంలింగ, ఈం లింగ, ఓం లింగ, దివ్యాత్మ నా నా విరూపాక్షలింగ, నమస్తే నమస్తే నమః" అని పూజించి, విరించి (బ్రహ్మ) కరకమలంబులు మొగిడ్చి యిట్లనియె -

తివియుశర్వ, మహాదేవ ధిక్కరింపు
ముడువు మహిరాజ కంకణ, యడపు రుద్ర
వాల్పు ఖట్వాంగపాణి, వదల్పు మభవ
మోహనంబైన నీమహా మేఘనంబు -

అనిన బ్రహసన్నుడై కహకహ ధ్వని నవ్వి, లలాటనేత్రు డిట్లను, భువనంబు లెల్ల వినునట్లుగ - నో పరమర్షులారా, మీకు నా యనుపమ దివ్య లింగమిది యర్చన కర్హము నేటినుండియున్ - అని శంభుండు నిజమహాలింగ స్తంభంబు స్తంభింపజేసె....నప్పుడు ముకుళిత హస్తారవిందులై, దేవదారువన దివ్యాశ్రమస్థులగు గృహస్థు లీర్ష్యా దోషంబు లుజ్జగించి యా శేషాహి భూషణుని బహు విధంబుల భక్తి విశేషంబుల భజియించిరి."

ఇండియాకి ఆర్యులు రాక పూర్వమే, క్రీ. పూ. 3000 సంవత్సరాలనుండి ఉనికిలో వున్న యీ లింగపూజ, ద్రావిడమతానికి చెందినదనే విషయాన్ని చరిత్ర కారులంతా ఏకగ్రీవంగా అంగీకరించారు. అనంతర దశలో ఆర్య - ద్రావిడ సంస్కృతుల సమ్మేళనం ఫలితంగా, వైదికమతం హిందూమతంగా పరిణామం


చెందింది. నటి నుండి త్రిమూర్తులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరుల్లో వొకడైన శివుడు, హిందూ దేవుడుగా పరిగణింపబడ్డాడు. ఎన్నో మతాలూ సంస్కృతులూ మహాసముద్రం లాంటి హిందూమతంలో కలిసిపోయినట్లే, ద్రావిడ లింగపూజ సైతం హిందూమతంలో అంతర్ భాగమై దానిలో లీనమైపోయింది.

ఈ లింగపూజ, వొక్క- మనదేశంలోనే కాదు- అత్యంత ప్రాచీనమైన దేశాలన్నిటి లోనూ కన్పిస్తోంది. అయితే ఈపూజ, ఇండియా నుండి విదేశాలకి వెళ్ళిందా, లేక -మెసపొటేమియా యిత్యాది దేశాల నుండి మనదేశానికి వొచ్చిందా- అనే విషయాన్ని యిదమిద్దంగా యిప్పుడే తేల్చి చెప్పడం కష్టం. సృష్టికార్యానికి పవిత్ర చిహ్నంగా, ప్రాచీన భారతంలో లింగపూజ, మర్రి - రావి చెట్ల పూజ వున్నట్లే, ప్రపంచం లోని వివిధ దేశాల్లో, యీ సృష్టి కార్యానికి విభిన్న సంకేతాలు ఏర్పరచి, భిన్న భిన్న రూపాల్లో మహామాతను పూజించారు.

నాగార్జున కొండ తవ్వకాల్లో, ఎన్నో "హారీతి" దేవాలయాలు బయల్పడ్డాయి. హారీతి - సంతానదేవత. సింధు నాగరికత కాలంలో అమ్మతల్లిగా పూజించబడిన దేవతయే, ఈ హారీతిగా మారి అనంతరదశలో శక్తిస్వరూపిణియైన దుర్గగా అవతరించింది.

హిందూ జీవితంపై లింగపూజ ప్రభావం

లింగపూజ ప్రభావం, హిందువుల జీవిత విధానంపై భిన్న భిన్న రూపాల్లో స్పష్టంగా కన్పిస్తోంది. మన పాలతాలికలు దేన్ని సూచిస్తాయి ? లింగాకారాన్ని కాదా ? మధ్యలో బొక్క వున్న మన గారెలు దేన్ని సూచిస్తాయి ? స్త్రీ యోనిని కాదా ? మన అప్పడాల కర్రలూ - ఆవకాయ బద్దలూ దేన్ని సూచిస్తాయి ? మన రావి ఆకు దేన్ని సూచిస్తుంది ? స్త్రీ యోనిని కాదా ? మేక పెంటికలు దేన్ని సూచిస్తాయి ? లింగాకారాన్ని కాదా ? లింగాకారంలో వున్న మేకపెంటికను పూజించినట్లు, శివభక్త దురంధరుడైన పాల్కురికి సోమన సగర్వంగా చెప్పుకొన్నాడు. మన పూర్వీకులు వేపచెట్టును- మగదేవుడుగా, రావిచెట్టును- ఆడ దేవతగా (లక్ష్మీదేవిగా) ఎంచేత పరిగణించారు ? లింగాకారంలో వున్న వేపకాయలే యిందుకు జవాబిస్తాయి. మనం పరమ పవిత్రంగా భావించే అశ్వత్థపత్రమే - యోని ఆకారంలో వున్న రావి ఆకే - యిందుకు సమాధాన మిస్తుంది.



రావిఆకు

ఏదో విదేశాల్లో అభ్రాచ్యులూ, చిల్లర ముండలూ, చిల్లర ముండాకొడుకులూ, ప్రాచీన భారతంలోని "క్షుద్ర" గ్రామీణులూ, బహిరంగ సంగమ పూజలు చేశారని ఈసడిస్తారేమో! పండిత ప్రకాండులూ, సనాతనత్వం మూర్తీభవించిన పరమ శ్రోత్రియులూ, శంకరపీఠాల్లో తిష్ఠవేసినవారూ, యూనివర్సిటీల్లో డాక్టరేట్లు గడించినవారూ, యివన్నీ క్షుద్ర పూజలనీ, గ్రామప్రజల దేవతార్చనలనీ కొట్టివేస్తారేమో! శుద్ధ సంస్కృత మంత్రాలతో చేయబడిన బహిరంగ సంగమ పూజలూ, బూతు పూజలూ వైదికకర్మకాండలో సైతంవున్నాయి. మంత్రపూతమైనయీ బూతు పూజల్ని -అశ్వమేధం- పౌండరీకం - వంటివాటిని -భారతీయ చక్రవర్తులూ హిందూ పురోహితులూ మహాభక్తి నిష్ఠలతోచేశారు. ఆనాడవి బూతు గాక పవిత్రమూ మంత్రపూతమైనవిగా పరిగణింపబడ్డాయి! అవి వేద విహితాలు; పవిత్రాలు; ఆలాంటి వాటిలో పౌండరీకం వొకటి.

పౌండరీకం

వేదవేదాంగ పారంగతులూ, శ్రుతి స్మృతి పురాణాల్లో దిగ్దంతులైన విద్వాంసులూ, షడ్దర్శనాలు ఆపోసనం బట్టిన మహా పండితులూ, ఘనాపాఠులైన బ్రాహ్మణోత్తముల వేదఘోషతో, హోమధూమం పైకెగస్తోంటే, భక్తి పారవశ్యంతో పౌండరీక యజ్ఞం చేస్తారు.

వొక పందిరి వేస్తారు. దాని కింద రుత్విక్కులు హోమం వేలుస్తుంటారు. వేదఘోష దిక్కులు పిక్కటిల్లేట్లు ఆకాశాన్ని అంటుతుంటుంది. హోమధూమం ఆ ప్రదేశాన్నంతా పరమ పవిత్రం గావిస్తుంటుంది. పౌండరీక యజ్ఞం జేస్తోన్నవాడూ, ఆయన భార్యా, "మహానిష్ఠతో భక్తిప్రపత్తుల్తో" శాస్త్రోక్తంగా ఆ పందిరి మీది కెక్కుతారు. పందిరి కప్పుకి మధ్యభాగంలో వొహ రంధ్రం వుంటుంది. వేద మంత్రాల ఘోషతో యజ్ఞం సాగుతోండగా, హోమగుండంలోంచి వొచ్చే అగ్ని ధగద్ధగాయమానంగా జాజ్వలిస్తోండగా, యావత్ ప్రేక్షకులూ ఆ దృశ్యాన్ని నేత్రపర్వంగా తిలకిస్తోండగా, యీ భార్యా భర్తలిద్దరూ భక్తితో నిష్ఠతో దీక్షతో ఉత్సాహంతో సంభోగ కార్యానికిబహిరంగంగా ఉపక్రమిస్తారు. అందరియెదటా,వాళ్ళిద్దరూ ఆలు-మగల చీకటి ఆటను, పగటిపూటే-ఆ పందిరిమీదనే ఆడతారు. శాస్త్రోక్తంగా వారిద్దరూ సంగమిస్తూండగా, పందిరి కన్నంగుండా, కిందనున్న హోమాగ్నిలో రేతస్సు పడి ఆహుతి అవుతుంది. దానితో పౌండరీక యజ్ఞం సమాప్తమవుతుంది. ఈ రూపంగా స్త్రీ పురుషులు తమబలాన్ని (రేతస్సును) అగ్నిదేవునికి సమర్పిస్తారు. (ఎవరినైనా పరమ వ్యభిచారి అని పిలవవొలసి వొస్తే, "వాడు పచ్చి పౌండరీకం గాడురా" అని అంటారు. ఇది వైదిక పరిభాషకి చెందిన పచ్చి బూతుపదం.)

ద్రావిడ-ఆదిమవాసుల్ని "లింగపూజకు"లనీ, "శిశ్నదేవు" లనీ, వైదికార్యులు తమ రుగ్వేదంలో ఈసడించిన విషయంగూర్చి గతంలోనే ప్రస్తావించాను. ఆనాడు ఈ పూజగూర్చి ఎంతగా అసహ్యించుకొన్నా, ఈ శిశ్నపూజ మాత్రం, హిందూమతాన్ని చస్తే వొదల్లేదు. ఆనాడు సింధు ప్రజలు శివుని శిశ్న (లింగ)పూజ చేస్తే, అనంతరం వొచ్చిన బ్రాహ్మణ అధ్వర్యులు అశ్వ శిశ్న (గుర్రం లింగం) పూజ గావించారు. ఇందుకు ఎదురులేని నిదర్శనమే, శ్రీరామచంద్రుడు దగ్గర నుండి శుంగవంశపు రాజులవరకూ వున్న ప్రాచీన హిందూ చక్రవర్తులంతా అశ్వమేధ యాగం జేశారు. భరతవంశ మూల పురుషుడుగా పరిగణింపబడిన భరతుడు, 133 అశ్వమేధ యాగాలు జేశాడు; ఇంతకీ అశ్వమేధయాగమంటే ఏమిటి?

అశ్వమేధం

అశ్వమేధ యాగంలో సోమయాజిగారి భార్యయైన సోమిదమ్మ చేసే అశ్వ సేవ, అత్యంత జుగుప్సాకరమైనది. ప్రధానంగా యీ యాగాన్ని దేశదేశాల విజయ యాత్ర అనంతరం, నాటి చక్రవర్తులైన శ్రీరామ-ధర్మజ-పరీక్షిత్తులూ, సముద్ర గుప్తుడు లాంటి రారాజులూ చేశారు.

చక్రవర్తియొక్క పట్టపురాణి "అంబే అంబాల్యంబికే" అనే మంత్రాన్ని జపిస్తూ, చంపబడిన గుర్రాన్ని సమీపించి, "గణానాంత్వా" అనే మంత్రంతో ఆ అశ్వాన్ని అభిమంత్రణంచేసి, "ఉత్సక్థ్యోర్గుదం దేహి" అంటూ, ఆ గుర్రం లింగాన్ని తన యోనిలో పెట్టుకొని పండుకొంటుంది. అప్పుడు అధ్వర్యుడు (యజ్ఞం చేయించేవాడు) "సుభగే కాంపిలవాసిని" అనే మంత్రాన్ని చదువుతూ, పట్టబట్టలతో రాణినీ గుర్రాన్నీ కప్పుతాడు. ఈ యజ్ఞ కార్యక్రమాన్నే, శ్రీనాథ మహాకవి నారికేళ పాకంలో సంస్కృతం బిగువులో "యజమాన ప్రమదా వికస్వర భగన్యస్తాశ్వ దీర్ఘ స్మరధ్వజ దండంబగు నశ్వమేధ మఖతంత్రంబున్ నిరీక్షించుచున్" అని చెప్పాడు. అంటే-యజమాని భార్య గుర్రం లింగాన్ని పూర్తిగా వికసించిన తన యోనిలో పెట్టుకోవడం- అని అర్థం.

పండగ నాడూ పాత మొగుడేనా ?

దక్షిణ భారతంలో సంవత్సరాని కొకసారి కంచుకోత్సవం (రవికల పండగ) జరిగేది. ఈ పండగరోజున, స్త్రీలంతా గుడికి వొచ్చి పూజచేసిన తర్వాత, తాము తొడుక్కున్న రవికలు తీసి వొకచోట కుప్పగా వేస్తారు. తర్వాత మగాళ్ళు వొచ్చి తలా వొక రవికను తీసుకొంటారు. ఏ స్త్రీ రవిక- ఏ పురుషునికి దొరుకుతుందో, ఆ స్త్రీ- అతనితో తప్పక రమించాలి. ఏమాత్రం తప్పలేదు. రవికను పట్టినవాడే- ఆమె రమణుడు! చీకటి ఆట పూర్తియై, తెల్లవారిన తర్వాత మామూలుగా ఎవరి భర్తల దగ్గరికి వారు వెళ్ళిపోతారు. ఇలాంటి రవికల పండగలో వొక స్త్రీ రవిక, ఆమె భర్తకే దొరికింది. ఆమె మనస్సు చివుక్కుమని "పండగ నాడూ పాత మొగుడేనా?" అని అంది. ఇదే తెలుగులో సామెతగా నేటికీ మిగిలిపోయింది.

ఈ ఆచారాలూ, పూజలూ, పండగలూ, వొకనాటి సాముదాయక సంగమ కార్యాల ఛాయలు మినహా మరేమీ కాదు. వాటి మారిన రూపాలే - వల్లభాచార్య

భోగలాలస మఠాలూ, వామాచారుల పీఠాలూ, లింగబసివి - గరుడబసివి ముఠాల రూపంలో, నిన్నా మొన్నటివరకూ కొనవూపిరితో కొనసాగుతూ వొచ్చాయి. వేల ఏళ్ళనాటి దేవతలూ, పూజలూ, బహిరంగ సంగమాలూ అదృశ్య మయ్యాయి. అయినా ఆదేవతా పూజకోసం, దేవదాసీలూ- బసివిరాళ్ళూ-జోగిస్త్రీల-పేరిట కొందరిని వొక కులం రూపేణా కేటాయించడం మాత్రం మిగిలింది. ఆనాటి పంటదేవతల స్థానాన్ని హిందూదేవుళ్ళూ దేవతలూ (ప్రధానంగా రతీ మన్మధులు) ఆక్రమించారు. సామాజిక ఆచారంగా వున్న నాటి సాముదాయక జారత్వం, అనంతర దశలో వొక కులానికి మాత్రమే పడుపువృత్తి రూపంలో పరిమితమై పోయింది. నాటి సంఘంలో అందరు స్త్రీలూ దేవతకి అంకితమవగా, వారి స్థానాన్ని దేవదాసీలనే ప్రత్యేక కులానికి చెందిన స్త్రీలుమాత్రమే తదనంతరం ఆక్రమించారు. సింధు నాగరికత అవశేషమైన తేవడియా, పైదికార్య గణసమాజంనాటి గణికా, కాలక్రమేణా సమ్మిశ్రితమై వర్ణవ్యవస్థ ఉనికిలోకి వొచ్చిన తర్వాత దేవదాసీ కులంగా, హిందూ సమాజంలో వొక నిర్దిష్టరూపాన్ని సంతరించుకొంది. ఉత్తర భారతంలో "మురళి" అనీ, అరవ దేశంలో "తేవడియ" అనీ, తెలుగు ప్రాంతంలో వేశ్యయనీ ఈమెను పిలిచారు.

కుంభ పూజ

అత్యంత ప్రాచీనకాలంలో, స్త్రీ యోనిని కుండగా యెంచి కుంభపూజ చేసే వారనే విషయాన్ని గతంలో చూశాము. కుంభాన్ని స్త్రీ మర్మాంగంతో సమానమైనదాన్నిగా పోల్చడం కథాసరిత్సాగరంలో కన్పిస్తుంది. (70-112) నవరాత్ర ఉత్సవాల్లో (దేవీ నవరాత్రులు) మైథున కార్యానికి సంకేతమైన కుంభాన్ని ఘటస్థాపన చేయడం ఈ పోలికనే వివరిస్తుంది. పొలాలకి బలం కలగడానికి, ధాన్యపు గింజలుంచిన కుండను భూమిలో వుంచి, దానికి పూజ చేస్తారు.

ఈ సమయంలో అమ్మ-తల్లి (మహామాత) బొమ్మను రకరకాల ధాన్యపు విత్తనాలతో అలంకరిస్తారు. గ్రామసీమల్లో అమ్మ-తల్లికి జాతర చేసి, ఏటపోతులూ కోళ్ళూ గొర్రెలూ దున్నల్ని బలిగా యిస్తారు. ఈ దేవీ నవరాత్రుల సమయంలో, ప్రత్యేకంగా స్త్రీలు దేవిని పూజిస్తారు. బలి-దానం యివ్వడంతో ఈ ఉత్సవం సమాప్తమవుతుంది. దక్షిణ భారతంలో వరలక్ష్మి పూజ పేరిట దేవతకి పూజచేస్తారు. ఈ సమయంలో కుండకి పసుపూ కుంకం రాసి, దానిలో ధాన్యంగింజలు వేసి, దానికి పూజ చేస్తారు. ఈనాడు ఆంధ్ర ప్రాంతంలో బ్రాహ్మణ పురోహితులే యీ వ్రతాన్ని

చేయిస్తోన్నా, కొన్ని ప్రాంతాల్లో మాత్రం కుమ్మరులే యీ పూజ చేయించే సిసలైన పూజారులు.

బెంగుళూరు లోని "కరగ" తిఁణాల, ఈ కుంభపూజకి చెందిన అవశేషమే. ఈ జాతరను బెంగుళూరు లోని తిగల కులస్థులు ప్రతి ఏడూ చాలా వైభవంగా జరుపుతారు. గతంలో కుంభపూజ చేసేప్పుడు జంతుబలులు సమర్పించే ఆచారానికి బదులు, యిప్పుడు కోసిన నిమ్మకాయల్నీ, ఉడకబెట్టిన నవధాన్యాల్నీ అమ్మ-తల్లికి అర్పిస్తోన్నారు. చివర రోజున జరిగే ఉత్సవంలో, తిగల కులానికి చెందిన అర్చకుడు స్త్రీ దుస్తులు ధరించి తలపై కుంభాన్ని పెట్టుక ఊరేగుతాడు. (కుండపై కుండ చొప్పున మూడు కుండలు) ఉత్సవానంతరం కుంభాన్ని వొక నీటిమడుగులో విసిరి వేస్తారు. ఈ ఉత్సవం జరిగే అన్ని రోజుల్లోనూ, యీ అర్చకుని భార్య, పురుషుల కంటికి ఎట్టి పరిస్థితుల్లోనూ కన్పించగూడదు. ఈ అనార్య ఉత్సవం, గత శతాబ్దం న్నర కాలం నుండి బ్రాహ్మణమతంలో భాగంగా చేయబడి, ఈ దేవత-అమాంతం ద్రౌపదిగా మార్చివేయబడింది:

నేటికీ మన వెనకబడ్డ గ్రామాల్లో, ప్రత్యేకంగా తెలంగాణా గ్రామాల్లో, పాలకుండకీ పెరుగుకుండకీ పసుపురాసి కుంకం బొట్లు పెట్టడం చూస్తుంటాము. అలాగే-తరవాణీ-పుల్ల నీళ్ళు-పులీన్నళ్ళ కుండకి పసుపురాసి, కుంకం బొట్లు పెడతారు. (అంతేగాదు - వంటింట్లో గోడకి వొక మూల - పసుపు రాసి కుంకం బొట్లు పెట్టి దీపారాధన గూడా జేస్తారు.) ఈ విధంగా కుండలకి బొట్లు పెట్టి పూజ చేయడం, వొకనాడు మన గ్రామసీమల్లో వున్న ఆచారం. ఈ ప్రాచీన ఆచారానికి చెందిందే-పెళ్ళి సమయంలో ఉపయోగించే అరివేణీ కుండలు. ఈనాటికీ హిందువుల పెళ్ళిళ్ళలో రంగులు పూసిన కుండలు-అరివేణి కుండలు-వాడుతుంటారు. వీటిని కుమ్మరి వారి యింటి నించి, మంగళ వాయిద్యాలతో ముత్తయిదులు తీసుక వొస్తారు. వొక నాటి కుంభపూజకి యీ అరివేణీ కుండలు - అవశేషం మాత్రమే. (ఐరేని-అయిరేణి-అరివేణి)

వాస్తవానికి ప్రాచీన భారతీయ నాగరికతా - సంస్కృతులు బ్రతికివున్నవి వేద-ఉపనిషత్ గ్రంధాల్లోనూ, బౌద్ధ-జైన మత సిద్ధాంతాల్లో మాత్రమే కాదు. ఆ నాగరికత కొనవూపిరితో వున్నది-నేటి గ్రామసీమల్లోనే; ఇండియాలోని విభిన్న

ప్రాంతాలకి చెందిన నేటి గ్రామీణుల ఆచార వ్యవహారాల్లోనే – అనే విషయాన్ని పూర్తిగా గుర్తించిన నాడే, వాస్తవమైన ప్రాచీన చరిత్ర రచనకి అవసరమైన సమాచారం మనకు లభ్యమవుతుంది. అంతదాకా హళ్ళికి హళ్ళి–సున్నకి సున్నాయే!

బ్రాహ్మల యిళ్ళలో వివాహం జరిగేప్పుడు, నూత్న వధూవరులు ఉద (జల) కుంభాన్ని పట్టుకొని, అగ్నిహోత్రం చుట్టూ ప్రదక్షిణ జేయడం నేటికీ అనుసరింప బడుతోన్న ఆచారం. శవాన్ని మోసుక వెళ్ళేప్పుడు, చనిపోయినవాని కుమారుడు, నీటి కుండను పట్టుక శవం వెంట నడవడం ఈనాటికీ అనుసరింపబడుతోన్న ఆచారం.

హిందూ ఆలయాల్లోని దేవదాసీలు, ఉదయ–అస్తమయ–సమయాల్లో, దేవుడికి కుంభహారతి యివ్వడం జగమెరిగిన సత్యమే. అర్ధశతాబ్దం క్రితం వరకూ అనుసరింపబడిన ప్రాచీన ఆచారమే.




ఆధునిక పూర్ణకుంభం

నీటితో నింపబడిన కుంభానికి రెండు చేతులెత్తి నమస్కరిస్తే, విజయం తప్పక ప్రాప్తిస్తుందని, విధుర–పండిత జాతకకథలో చెప్పబడింది. అంచేతనే, ప్రముఖుల్ని ఆహ్వానించే సందర్భాల్లోనూ, ప్రధానమైన ఉత్సవ కార్యకలాపాల్లోనూ, పూర్ణకుంభాన్ని వినియోగించడం నేటికీ అనూచానంగా వొస్తోన్న ఆచారం.

"పూర్ణకుంభాన్ని ప్రతిష్ఠించడం చాలా తతంగంతో కూడుకొన్న ఆచారం. నలుచదరంగా వుండే మృణ్మయ (మట్టి) ఫలకంపై సర్వతోభద్ర మండలంగా వ్యవహరించే యంత్రాన్ని గీస్తారు. ఆ యంత్రం మధ్యలో అష్టదళ (ఎనిమిది దళాలున్న) పద్మాన్ని చిత్రిస్తారు. ఆ పద్మం స్త్రీ జననాంగానికి (యోనికి) గుర్తు.

ఆ ఫలకంపై పంచ ధాన్యాలను వుంచి, వాటిపై నీటితో నిండిన మట్టికుండను ప్రతిష్ఠిస్తారు. పెరుగు కలిపిన అన్నాన్ని ఆ పాత్రలో వేసి, దాని మూతికి ఎర్రని దారాన్ని కడతారు. తర్వాత కుండలో అయిదు రకాల ఆకులను వేసి, వాటిపై అన్న మున్న మట్టిఫలకాన్ని, వక్కను, ఆ ఫలకం మీద వున్న అన్నంపై ఆకుపచ్చగా వున్న ఏదో ఒక కాయను వుంచుతారు. సాధారణంగా కొబ్బరిబొండాన్ని, కాయకు

ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటారు. కొబ్బరిబొండానికి సింధూరం పూస్తారు. కుండ పైన సింధూరంతోనే బాలుని బొమ్మ గీస్తారు. అప్పుడది పూర్ణకుంభం అవుతుండి.''



సర్వతోభద్రమండలం



పూర్ణ కుంభం

పూర్ణకుంభం కూడా స్త్రీ రహస్యాంగానికే చిహ్నం. వృక్షాలు, ఫలాలు, ప్రకృతి ప్రత్యుత్పత్తికి నిదర్శనాలు. స్త్రీ మానవజాతిని ఎలా పెంపొందిస్తుందో, భూమి కూడా అలా పంటను సమృద్ధిగా పండించాలనే భావనకు, సర్వతోభద్ర మండలంపై వున్న పూర్ణకుంభం ప్రత్యక్ష సాక్ష్యం. ప్రకృతి ఎల్లవేళలా పచ్చ పచ్చగా వుండాలనే ఉద్దేశంతోనే, వారు ఆ పూర్ణకుంభాన్ని, స్త్రీ అవయవంతో పోల్చారు. మానవజాతి సంచారదశలో వుండగా, స్త్రీలే వ్యవసాయాన్ని కనుగొన్నారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసినవారు కూడా స్త్రీలే. వారు తమ చాతుర్యం వల్ల కాక, కేవలం ''అమ్మ'' దయవల్లనే ఆహారం సంపాయించ గలుగుతామని నమ్మేవారు. ''నేలతల్లి''ని సంతృప్తిపరిస్తే, పంటలు విస్తారంగా పండుతాయని అప్పటివారు విశ్వసించేవారు.''

''మార్కండేయ పురాణంలో దేవీ మహాత్మ్యాన్ని వివరించే అధ్యాయం ఉంది. అందులో ''దేవతలారా ! నేను సర్వప్రపంచాన్ని నా శరీరం నుంచి పుట్టి పెరిగిన శాకాల (కాయగూరలు) తో పోషిస్తాను. అలా అవి ఆత్మ దేహ సమువ్భవాలవటానికి

సకాల వర్షాలు దోహదం చేస్తాయి. ఆ తరవాత నేను భూమి మీద "శాకంబరి"గా ప్రసిద్ధి కెక్కుతాను" అని దేవి స్వయంగా చెప్పినట్లు ఉంటుంది.

శాకంబరి అంటే మూలికలను ధరించునది అని అర్థం. మూలికలు అంటే వేళ్ళు. అంటే ప్రకృతి తనలో ఉన్నదన్నమాట. దాన్నిబట్టి ఆ తరవాత స్త్రీ దేహం నుంచి వృక్షాలు, చెట్లు ఉద్భవిస్తాయనే నమ్మకం ప్రబలిపోయింది.

హరప్పా నాగరికతకు చెందిన అవశేషాలలో లభించిన ఫలకంమీద తలకిందులుగా ఉన్న స్త్రీ రహస్యాంగం లోంచి ఒక మొక్క ఉద్భవించినట్లున్న చిత్రం ఉంది. ఆ ఫలకం మీదనే స్త్రీని "శాకంబరి"గా నిర్ధారిస్తూ కొన్ని బొమ్మలున్నాయి. సింధులోయ నాగరికతకు సంబంధించిన మరి కొన్ని ఫలకాల ప్రకారం స్త్రీకి "అన్నద" (అన్నం ఇచ్చునది) అన్నపూర్ణ లాంటి పేరున్నట్లు తెలుస్తోంది.

క్రీస్తు పూర్వం 3000 సంవత్సరాల క్రితంనాటికే శక్తి (అమ్మ) కి ప్రతినిధులుగా గ్రామదేవతలు వెలిశారు. భారతీయ వ్యవసాయం అభివృద్ధి చెందే దశలో, మాతృస్వామ్యం బలంగా పాతుకొని ఉండటం వల్ల, పురుష దేవతలకు తక్కువ ప్రాముఖ్యం లభించింది. స్త్రీ దేవతలలో దుర్గ, కాళి, చండి వగైరాలు ఆయా సందర్భాలలో వెలిసిన శక్తులు. ఒక్కో పేరు మీద ఒక్కో సంఘటన సృష్టించి ఆయా లక్షణాలను ఆ దేవతామూర్తులకు అంటగట్టారు.

ప్రపంచ నాగరికతలన్నీ స్త్రీ పారమ్యాన్ని అంగీకరించాయి. ఆ విషయం ఆయా నాగరికతల తొలి రూపాలు మనకు విశదం చేస్తాయి. తమతమ నమ్మకాలకు గుర్తుగా ఆకారాలు (విగ్రహాలు, ప్రతిమలు) తెలియటంతో, విశ్వాసాలు వెర్రితలలు వేసి ద్విముఖులు, చతుర్భుజులు, అష్ట, దశ భుజులు, విచిత్ర లక్షణాలతో వింతవింత దేవతలు, దేవుళ్ళు రూపొందారు. వాటిలో ఒకటి దుర్గాదేవి.

ఆయా ప్రాంతాల వారి మేధాశక్తిని బట్టి దేవతలకు సింహం, శార్దూలం, వృషభం, వగైరాలు ప్రయాణ వాహనాలయ్యాయి. ప్రకృతి పట్ల వారికున్న భయభక్తుల మోతాదును బట్టి స్త్రీదేవతలు భయంకరంగానూ, సుకుమారంగానూ సర్వశక్తి సమన్వితంగాను సృష్టించబడ్డారు. అందుకే రకరకాల పూజావిధానాలు, అర్చనాక్రమంలో భేదాలు గోచరిస్తాయి. పంటకు అధిదేవతగా ప్రతిష్ఠురాలైన ప్రకృతి, శక్తిరూపం ధరించింది. ఆ శక్తినే మనం దుర్గ, కాళి, చండి, త్రిపుర, వాసవి వగైరా పేర్లతో వ్యవహరిస్తున్నాం. శాక్తేయంలో "దుర్గ"కు మూలరూపంగా

పూర్ణకుంభాన్ని, సర్వతోభద్రమండల మంత్రాన్ని ఉంచటంలోని అర్థం, దుర్గకూ ప్రకృతికీ అభేదమని తెలియచెప్పటమే ।''

(బుర్రా సుబ్రహ్మణ్యం-శాస్త్రేయంలో ప్రత్యక్షమయ్యే దుర్గాపూజ-ఈనాడు-19-10-80)

అమ్మతల్లి పూజ

గ్రామంలో మశూచి ఆటలమ్మ కలరా యిత్యాది అంటురోగాలు వొచ్చినప్పుడు, పోలేరమ్మ- అంకాళమ్మ- మరిడమ్మ- మారెమ్మ- జోగులమ్మ- ముత్యాలమ్మ- గోగులమ్మ యిత్యాది అమ్మలకి (101 అక్క-దేవతలకి) గ్రామప్రజలపై ఆగ్రహం కలిగిందనీ, ఆ కోపతాపాల్ని పోగొట్టడానికి బలులు యివ్వాలనే మూఢనమ్మకం ఆంధ్ర-తెలంగాణాల్లో కొన్ని వెనకబడ్డ ప్రాంతాలకి చెందిన గ్రామసీమల్లో నేటికీ కన్పించే ఆచారం. అత్యంత ప్రాచీనమైన మహామాత పూజకి, ఈ ఆచారం అవశేషం మాత్రమే.

అంటురోగాలు గ్రామంలో వ్యాపించినప్పుడు, ఊరి పొలిమేరలో వేపచెట్టు, రావిచెట్టు కింద, చిన్నచిన్న రాళ్ళ రూపంలోవున్న ఈ గ్రామ ''దేవతల''కి పసుపూ కుంకం రాసి, కోళ్ళూ గొర్రెలూ మేకలూ వొక్కొక్కసారి దున్నపోతులూ బలి యిస్తుంటారు. అంతేగాదు- గేదె యినితే, మొట్టమొదటి జున్నుపాలు ఈ అమ్మ-తల్లికి నైవేద్యంగా పెట్టిన తర్వాతనే, ఇంట్లోవారు జున్ను తింటారు.

ఈ దేవతల కొలుపుల్లో అత్యంత ప్రాచీనమైన కాలానికి చెందిన ద్రావిడ వాయిద్యాలు- పంబజోళ్ళు- జమలిక- డప్పులు- కొమ్ముబూరలు మొదలైన వాటిని ఉపయోగించడమూ, మాతంగి నాట్యం చేయడమూ నిన్న మొన్నటి వరకూ చూస్తూనే వున్నాము. అమ్మ-తల్లికి జాతరచేసే సమయంలో, చద్ది నైవేద్యమూ పొంగళ్ళూ పెట్టేవారు. గ్రామంలోని ఇళ్ళని కడిగి, గోడలకి సున్నం వేసి, గడపలకి పసుపు రాసి, గుమ్మాలకి వేపమండల తోరణాలు కట్టేవారు.

పైన పేర్కొన్న అమ్మలతోపాటు, తెలంగాణా ప్రాంతంలో మైసమ్మ—పోశమ్మ అనే అమ్మలు గూడా వున్నారు. ఈ అమ్మ-తల్లిపూజ తెలంగాణా గ్రామసీమల్లో నేటికీ కొనసాగింపబడుతోంది. పొలిమేరలో వుండేది- పోలేరమ్మ. దొడ్డికాపలా కాసేది- మైసమ్మ. హరిజనుల ప్రత్యేక దేవత- మారెమ్మ. చెరువు కట్ట తెగకుండా కాపలా గాసేందుకు, కట్ట మైసమ్మ గుడిని చెరువుకట్ట వొద్ద కడతారు.

చెరువుకట్ట వొద్ద రెండు రాళ్ళను పెట్టి, ఆ రాళ్ళకి పసుపూ కుంకం బొట్లు ఆడ్డంగా పెడతారు. ఈ రాళ్ళు వున్న స్థలమే– గుడి: పశువుల దొడ్డిలో వుండే పశువులకి రోగాలు రాకుండా వుండడానికి, దొడ్డి మైసమ్మను వుంచుతారు.

క్రీ. శ. 1300 ఏళ్ళనాటికి సైతం, ఈ మహామాత పూజ కొనసాగింపబడి నట్లు, బలమైన చారిత్రక ఆధారాలు కన్పిస్తోన్నాయి. కాకతీయ యుగంలో, సామాన్య ప్రజలతో బాటు నగరవాసులుగూడా కాకతమ్మ–ఏకవీరమ్మలను కొలిచారు. (కాక తమ్మకు సైదోడు ఏకవీర– యని శ్రీనాధుడు క్రీడాభిరామంలో అన్నాడు) ఈ ఏక వీరమ్మనే నేటి తెలంగాణా–రాయలసీమ ప్రాంతాల్లో, ఎల్లమ్మ అనే పేరిట వ్యవహ రిస్తోన్నారు. ఈ ఎల్లమ్మ– నగ్నదేవత. ఈ దేవత– నగ్నవిగ్రహం అలంపూరులో వున్నది. అష్టాదశ శక్తులలో (పద్దెనిమిది అమ్మ–తల్లుల్లో) వొకతెయైన జోగులమ్మ నగ్నవిగ్రహం గూడా అలంపూరులోనే వున్నది. ఈమె గొడ్రాళ్ళకి పిల్లల్ని యిచ్చే దేవతయని (సంతాన దేవతయని) స్థానికులు నేటికీ విశ్వసిస్తారు

అత్యంత ప్రాచీనకాలం నాటి మహామాత పూజకి చెందిందే– ఈ ఎల్లమ్మ అనేది నిర్వివాదం. అయితే యీమెను మన బ్రాహ్మణ పురోహితులు, పరశురాముని తల్లియైన రేణుకగా మార్చివేసి అమాంతం హిందూమతంలో కలిపివేశారు: బాలా త్రిపురసుందరీ–స్త్రీ– విగ్రహాన్ని (బాలాజి) తిరపతి వెంకన్న పురుష విగ్రహంగా మార్చివేసిన ఈ పురోహితవర్గ ఊసరవెల్లులు, దేవుళ్ళనే సృష్టించిన ఈ పురోహిత వర్గ పరాన్నభుక్కులు, దేవతలపేర్లు మార్చినందుకు ఏమాత్రం ఆశ్చర్యపడ నవ సరంలేదు: "ఈ ఎల్లమ్మ కథను రేణుక కథగా నేటికిని రాయలసీమ పల్లెలలోను, పాలమూరుజిల్లా లోను, బవసీంక్లు (మాదిగజాతివారు) జవనిక వాయించుచు కథగా రెండు దినాలు చెప్పుదురు. కాకతీయుల కాలము నాడును, బవనీలును మాదిగస్త్రీలును ఎల్లమ్మ కథను వీరావేశముతో చెప్పుచుండిరి." (సురవరం ప్రతాపరెడ్డి– ఆంధ్రుల సాంఘిక చరిత్ర– పేజి 51)

పెళ్ళి గాకుండా మగాడు చనిపోతే, ఆతడు "వీరుడు" అవుతాడనీ, పెళ్ళిగాని అమ్మాయి చనిపోతే "దేవత" అవుతుందనీ గ్రామప్రజలు ఆనాడు నమ్మేవారు. వీరునికి "వీరుల కొలుపులూ" దేవతలకి "దేవతా" కొలుపులూ, అట్టహాసంగా కొలిచేవారు. అత్యంత భయానకమైన పద్ధతిలో జాతర్లు చేసి, జంతు బలులిచ్చేవారు. యీ "వీర్ల" కొలుపుకి చెందిందే– "వీర్లపెట్టె." దీనిలో చిన్నచిన్న త్రిశూలాలూ

బల్లేలూ కత్తులూ యిత్యాది సాధన సామగ్రి వుంటుంది. ఈ పెట్టెను కొలుపుల తర్వాత జాగ్రత్తగా యింటిలోనే మసిలిపై భద్రపరిచేవారు.

సతీ సహగమనం ద్వారా చనిపోయిన భార్యలకి (లక్ష్మమ్మ - కామమ్మ - జాలమ్మ-నాంచారమ్మ యిత్యాదులు) ఊరి పొలిమేరవొద్ద చిన్నగుడి కట్టించకపోతే, దెయ్యాలై పీకుతారనే నమ్మకంవల్ల "పేరంటాళ్ళు" వెలిశారు. అప్పుడు, తరతరాల నుండీ వొస్తోన్న ఈ "అమ్మ-తల్లులూ", సతీసహగమనం ద్వారా బూడిదై పేరం టాళ్ళుగా వెలిసిన వారూ కలిసిపోవడం జరిగింది.

పుష్కర తీర్థాలు : జలదేవతల పూజ

పుష్కర తీర్థం-పవిత్ర యాత్రాస్థలంగా పరిగణింపబడే సాంప్రదాయం, అనంతర హిందూమతంలో అంతర్భాగంగా తయారైంది. ఇందుకు నిదర్శనమే, మన గోదావరి-కృష్ణ-పుష్కరాలు-కుంభమేళాలు. అంతేగాదు; ప్రతి దేవాలయం ఆవరణలో వొక కొలనుగూడా వుండడం ప్రత్యేకంగా గమనార్హం. ఈ జలదేవతల పూజ (the cult of water goddesses) నేటికీ మన దేశంలో అనేక ప్రాంతాల్లో జరపబడుతోంది. బహువచన రూపంలోనే ఈ దేవతలు పూజింపబడతారు. బావిదగ్గర గానీ, లేదా నీటిమడుగు వొద్దగానీ, లేక నది వొడ్డునగానీ, ఈ పూజ జరపబడుతుంది. ఈ స్థలాల్లో ఈ జలదేవతల్ని సూచించేందుకు, చిన్న చిన్న గుండ్రాళ్ళపై గానీ, రావి-వేప-చెట్ల దిగువభాగాన పసుపురాసి ఎర్రటికుంకం బొట్లు పెడతారు. ఈ జల దేవతల స్త్రీ ప్రతినిధుల్ని "తన్నీర్-అమ్మా" అనే పేరిట నేటికీ దక్షిణాదిలో పూజించడం జరుగుతోంది.

ముగింపు

ఆర్యుల రాకతోనే ప్రాచీన భారత నాగరికత ప్రారంభమైందనే అందమైన గాలిబుడగ, సింధు నాగరికత బయల్పడడంతో అమాంతం పగిలి బద్దలై పోయింది. మహోన్నతమైన సింధు నాగరికతా శిధిలాలపై, ఆర్య ఆటవిక జాతుల కిరాతక విజయం సంస్థాపించబడింది. ఈ నాగరికత విధ్వంసం గావడంతో, చారిత్రక అభి వృద్ధికి జెందిన క్రమ పరిణామం, కొన్నివేల ఏళ్ళ వెనక్కి మళ్ళింది.

సింధు నాగరికత ఆర్యులదా ?

సుప్రసిద్ధ పత్రికా సంపాదకుడూ, పండితుడైన శ్రీ నార్ల వెంకటేశ్వరరావు యీ అంశంగూర్చి యిలా వివరించాడు :

"భారతీయ నాగరికత "ఆర్యులభిక్ష" అనే దురభిప్రాయం ఒకప్పుడు బలంగా వుండేది. ఋగ్వేదకాలానికి పూర్వం ఇది అనాగరిక దేశమన్న దురభిప్రాయం మరింత బలంగా వుండేది. హరప్పన్ నాగరికత అవశేషాలు బయల్పడ్డంతో ఋగ్వేదకాలానికి అనేక శతాబ్దాలకు పూర్వమే ఇక్కడ ఒక గొప్ప నాగరికత పరిఢవిల్లినట్లు స్పష్టపడింది".

"హరప్పన్ నాగరికత వెలుగులోకివచ్చి, ఆర్యనాగరికత బండారాన్ని బయట పెట్టడం ఆర్యాభిమానులకు బాధ కలిగించింది. అందువల్ల హరప్పన్ నాగరికత నిర్మాతలు సయితం ఆర్యులన్న వాదాన్ని వారు లేవనెత్తారు. వారిలో కొందరేమో ఒక్కసారిగా కాక, దఫాలవారీగా ఆర్యులు ఇక్కడికి వలస వచ్చారని, తొలిదశలో ఇక్కడికి వచ్చినవారే హరప్పన్ నాగరికత నిర్మాతలని చెబుతున్నారు. మిగిలినవారు "హరప్పన్ నాగరికత నిర్మాతలు ఆర్యులు కాకపోవచ్చునని, వారి జ్ఞాతులైన అసురు"లని వాదిస్తున్నారు. ఈ అసురులు అసీరియానుంచి వచ్చినట్టు బెనర్జీ-శాస్త్రి ఎలుగెత్తి చాటగా, "కాదు, మధ్య ఆసియానుంచి", అని ద్వారకాప్రసాద్ మిశ్రా బల్లగుద్దుతున్నాడు. వీరుభయుల తాపత్రయం ఆర్యుల ఆధిక్యతను ఎలాగైనా నిలబెట్టాలనే! వీరే కాదు, మరి పెక్కుమందికూడా హరప్పన్ నాగరికత నిర్మాతలు ద్రావిడులన్న పాశ్చాత్య పురాతత్త్వ శాస్త్రవేత్తల సిద్ధాంతాన్ని ఖండిస్తున్నారు; కనీసం అది ఏదో ఒక అనార్యజాతి నిర్మాణమన్న ప్రతిపాదనను సయితం త్రోసిపుచ్చుతున్నారు".

"ఆర్యులెవరైనా, దాసులను ఆర్యులని ద్వారకాప్రసాద్ మిశ్రా అనబోడు, బెనర్జీ-శాస్త్రి అనబోడు, ఆర్యాభిమానాన్ని ప్రదర్శించే అన్యులైనా అనబోరు. ఇదే రీతిగా దస్యులు ఆర్యులని వారు అనబోరు. అయినప్పుడు ఋగ్వేదంలో పురాల ప్రస్తక్తి ఎక్కడ వచ్చినా, అవి దాసులవే ఎందుకు కావాలి? దస్యులవే ఎందుకు కావాలి? దుర్గాల ప్రస్తక్తి ఎక్కడ వచ్చినా, అవి తిరిగి వారివే ఎందుకు కావాలి? సిరిసంపదల ప్రస్తక్తి ఎక్కడ వచ్చినా, అవి సయితం దాసదస్యజనులకు చెందినవే ఎందుకు కావాలి? పిప్రు అనే దస్యునాయకునికి తొంభై తొమ్మిది పురాలు,

శంబర అనే దస్యునాయకునికి నూరు పురాలు వుండేవని ఋగ్వేదం చెబుతున్నది. వీరిద్దరితోపాటుగా ధుని, ఋష్ణ, చుమరి అనే దాసదస్యులకు ఎన్నెన్నో దుర్గాలు వుండేవని అది చెబుతున్నది. తన స్నానానికి నీరైనా కరువు కాగా, కువయ అనే దాసుని భార్యలు పాలలో ఓలలాడుతున్నారని కుత్సఅంగిరసుడు వాపోయినట్టు అది చెబుతున్నది. శంబరుని దుర్గాలు భాగ్యరాసులతో మూల్గుతున్నట్టు అది చెబుతున్నది. దీన్నిబట్టి హరప్పన్ నాగరికత దాసులుగా ఋగ్వేదం నిరసించిన, దస్యులుగా అది నిందించిన అనార్యజాతులలో ఏదో ఒకటి-లేదా, ఏవో కొన్ని-సృష్టించినట్టిదే అని విదితం కావడంలేదా?"

"హరప్పన్ నాగరికతకు సంబంధించిన "సీల్స్" (ముద్రలు) కొన్ని వందలు దొరికాయి. వాటిలో ఒక్కదానిపైనైనా ఇంద్రుడు లేడు. అగ్ని, వరుణాది దేవతలు లేరు; ఆర్యులవెంట వచ్చిన గుఱ్ఱం సయితం లేదు. కాగా, వాటిపై ద్రావిడులకు దేవుడైన శివుడు పశుపతిరూపంలో వున్నాడు. అన్య ద్రావిడ దేవతలున్నారు. ఈ కారణాలను బట్టికూడా హరప్పన్ నాగరికత ఆర్యేతరమైనదని తీర్మానించుకొనవలదా ?"

"ఆర్యుల కళ్ళకు అదే మహా వైభవోపేతమైనదిగా కనబడింది; కేవలం మాయాజాలంవలెనే అది వారికి తోచింది. అప్పటికి వారంతటి అనాగరికులు; తక్కిన విషయాలు విడిచి పుచ్చండి, పచ్చి ఇటుకలు చేయడమైనా అప్పటికి వారికి తెలియదు. కుదురుగా ఒకచోట నిలవక, ప్రాంతంనుంచి ప్రాంతానికి, దేశంనుంచి దేశానికి తమ ఆలమందల వెంట తరలివెడుతున్న కాలంలో బహుశా వారు చుట్టు గుడిసెలలో, పూరిపాకలలో కాలక్షేపం చేస్తూ వుండేవారు. అటు తర్వాతనైనా వారికి చేతనైన విద్య మట్టితో, కలపతో ఇళ్లు కట్టుకొనడమే. మహాభారత కాలం నాటికైనా వాస్తువిద్యలో వారు ప్రవీణులు కాలేదు. ఇందువల్లనే పాండవులు తమ ఇంద్రప్రస్థం నిర్మాణానికి మయుడనే దైత్యుని నియమించారు."

(సీత జోస్యం-73 నుండి 75వ పేజీ వరకు)

సింధు నాగరికతకు చెందిన అనేకానేక అంశాల్ని, అనంతర భారతీయ సంస్కృతి, తనలో లీనం చేసుకొన్నట్లు మనకెన్నో నిదర్శనాలు కన్పిస్తాయి.

మన బావులకీ, చెరువులకీ, మన పుష్కర తీర్థాలకీ స్నానఘట్టాలకీ, మన దేవాలయాలకీ మన దేవదాసీలకీ, మన భువనమోహన సుందరమైన శిల్పాలకీ, మన భవననిర్మాణ కౌశల్యానికీ, మన వ్యవసాయానికీ– చేతివృత్తులకీ, మన వర్తక వాణిజ్యాలకీ– నౌకా నిర్మాణానికీ, మన కలంకారీ అద్దకానికీ– మన చేనేత పరిశ్రమకీ, మన పురాణ గాథలకీ, మన నృత్య సంగీత సాహిత్యాలకీ, మన దేవుళ్ళకీ, వాళ్ళ పెళ్ళాల పుట్టుపూర్వోత్తరాలకీ, మని బానిస వ్యవస్థ మూలానికీ, వేయేల సమస్తానికీ సింధునాగరికతయే ప్రాతిపదిక. సింధుసంస్కృతియే మూలం: అంచేతనే, యీ నాగరికతను వెయ్యేవేల పార్శ్వాలనించి అధ్యయనం జేయాలి. దీన్ని లక్షలాది కోణాల నించి పరిశీలించి పరికించాలి. అప్పుడే వర్తమాన భారతీయ జీవితవిధానానికి జెందిన అనేక అంశాలు మనకు పూర్తిగా అవగతమవుతాయి.

పశుపాలకుల్లా, దేశదిమ్మరుల్లా, ఆటవికుల్లా, మన దేశంలోకి ప్రవేశించిన ఆర్యులు, మనకిచ్చింది బూడిద తప్ప మరేమీకాదంటే, దానిలో ఆవగింజంత అతిశయోక్తి సైతం లేదు. అంచేత, మన ప్రాచీన నాగరికతా సంస్కృతులకి బీజాలు వేసింది ద్రావిడులే. అనార్యులే. వారి మేధస్సే, మన సభ్యతా సంస్కృతుల్ని వేయివేల రీతులుగా మలిచి తీర్చిదిద్దింది. సింధు నాగరికతలోని అనేకానేక అంశాలు, నేటికీ భారతీయ సంస్కృతిలో సజీవంగా వుండడంవల్ల, సింధు ప్రజలే–ద్రావిడులే–అనార్యులే–ఈ మూల భారతీయ సంస్కృతికి దృఢమైన పునాదులు వేశారనేది చారిత్రక సత్యం:

అంచేత, ప్రాచీన ప్రపంచ నాగరికతలకు ఈజిప్టు - మెసపొటేమియాలు మూలమనీ, ఈ రెండు నాగరికతలతో సంబంధమున్న సింధు నాగరికత, ప్రాచీన భారత నాగరికతకి మూలకందమనీ, పునాదిరాయియనీ భావించడం చారిత్రక అసత్యం మాత్రం గాదు.

రిఫరెన్స్ గ్రంధాలు

An Advanced History of India–Three Authors

The Culture and Civilisation of Ancient India–D. D. Kosambi

Myth and Reality–D. D. Kosambi

The Indus Civilisation- R. E. M. Wheeler

New light on the most Ancient East - V. G. Childe

Society and History- Bagchi and company- Calcutta

Ancient History - F. P. Korovkin

ఋగ్వేద ఆర్యులు - రాహుల్ సాంకృత్యాయన్

మెసపొటేమియా సాహిత్య సంగ్రహం - కృష్ణచైతన్య

దేవాలయాలపై బూతు బొమ్మ లెందుకు - తాపీ ధర్మారావు

సీత జోస్యం (పీఠిక) - నార్ల వెంకటేశ్వరరావు

ఈ పుస్తకంలో 26వ పేజీ తర్వాత వున్న బొమ్మ, మొహెంజొదారోలో లభించిన నాట్యకత్తె నగ్నవిగ్రహమని పాఠకులు గమనించాలి.